


సత్యమేవ జయతే


సాక్షి

WWW.SAKSHI.COM

పేజీలు: 14 వెల: ₹ 6.50

సంపుటి: 15 సంచిక: 140

శనివారం 4-2-2023



అంబానీ వర్సెస్ అదానీ

డబ్ల్యూపీఎల్ తొలి మ్యాచ్‌లో ముంబైతో అహ్మదాబాద్ పోరు - 13లో



వారాంతాన భారీ లాభాలు

సెన్సెక్స్ 973 పాయింట్లు ప్లస్

17,850 స్థాయిపైకి నిఫ్టీ - 13లో

SIMULTANEOUSLY PRINTED AT BANGALORE | CHENNAI | DELHI | VIJAYAWADA | HYDERABAD | MUMBAI | ANANTAPUR | GUNTUR | KADAPA | KHAMMAM | KARIMNAGAR | KURNOOL | MAHABOOBNAGAR | MANGALAGIRI | NALGONDA | NELLORE | NIZAMABAD | ONGOLE | RAJAMAHENDRAVARAM | SRIKAKULAM | TADEPALLI GUDEM | TIRUPATHI | VISAKHAPATNAM | WARANGAL



రికార్డులు సమర్పించండి

బీబీసీ డాక్యుమెంటరీపై నిషేధానికి సంబంధించిన ఒరిజినల్ రికార్డులు సమర్పించాల్సిందిగా కేంద్రాన్ని సుప్రీంకోర్టు ఆదేశించింది.

వివరాలు 6లో ▸



ఎన్‌ఐఏకి బెదిరింపు మెయిల్

ముంబైలో తాలిబన్‌కు చెందిన ఉగ్రవాది దాడి చేయనున్నట్లు ఎన్‌ఐఏకు మెయిల్ అందినట్లు ముంబై పోలీసులు తెలిపారు.

వివరాలు 6లో ▸



అమెరికాపై చైనా నిఘా బెలూన్

తమ గగనతలంలో పెద్ద ఆకారంలో ఉన్న చైనాకు చెందిన నిఘా బెలూన్ తచ్చాడుతుండటంపై అమెరికా తీవ్రంగా స్పందించింది.

వివరాలు 6లో ▸



విమానం ఇంజిన్‌లో మంటలు

అబుధాబి నుంచి కోజికోడ్ (కాలికట్)కు బయలుదేరిన ఎయిరిండియా విమానం ఇంజిన్‌లో సాంకేతిక లోపం తలెత్తి మంటలు వచ్చాయి.

వివరాలు 6లో ▸

సువర్ణాధ్యాయం

విదేశీ విద్యా దీవెన పథకం ప్రారంభిస్తూ సీఎం వైఎస్ జగన్

- టాప్ 200 విదేశీ వర్సిటీల్లో సీట్లు తెచ్చుకున్న పేద విద్యార్థులకు బాసట
- ప్రతిభతో విదేశీ వర్సిటీల్లో సీటు తెచ్చుకుని, డబ్బు కట్టలేక వెనకడుగు వేయొద్దు
- అలాంటి వారిని చేయి పట్టుకుని నడిపించేందుకే ఈ పథకం
- రాష్ట్రంలో అన్నిటికంటే ఎక్కువగా విద్యపైనే పెద్ద పెట్టుబడి
- మానవ వనరులపై పెట్టుబడితో ప్రతి ఒక్కరి తలరాత మార్పు
- గాంధీ, నెహ్రూ, అంబేడ్కర్ లాంటి వాళ్లు పెద్ద పెద్ద వర్సిటీల నుంచి వచ్చారు
- బ్రిటన్ ప్రధాని రిషి సునాక్, అమెరికా ఉపాధ్యక్షురాలు కమలా హారిస్ కూడా..
- ఆ స్థాయిలో మీరూ కలలను నిజం చేయాలి.. దేశ, రాష్ట్ర ప్రతిష్టను పెంచాలి
- 213 మంది విద్యార్థుల ఖాతాల్లో రూ.19.95 కోట్లు జమ



జగనన్న విదేశీ విద్యా దీవెన చెక్కును ఇస్తున్న ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి

సాక్షి, అమరావతి: జగనన్న విదేశీ విద్యా దీవెన పథకం రాష్ట్ర చరిత్రలో సువర్ణాధ్యాయంగా నిలిచిపోతుందని ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి అన్నారు. ఈ పథకం కింద విదేశీ టాప్ యూనివర్సిటీల్లో చదువుతున్న పేద విద్యార్థులకు ప్రభుత్వం పూర్తిగా సహకారం అందిస్తుందని చెప్పారు. పెద్ద పెద్ద యూనివర్సిటీల నుంచి వచ్చిన గొప్ప వాళ్లను చూసి.. ఆ స్థాయిలో కలలు కని, వాటిని నిజం చేస్తూ దేశ, రాష్ట్ర ప్రతిష్టను పెంచాలని విద్యార్థులకు పిలుపునిచ్చారు. విద్య మీద పెట్టే ప్రతి పెట్టుబడి మానవ వనరుల మీద పెట్టినట్టేనని తెలిపారు. అందుకే రాష్ట్రంలో ఈ రంగానికి పెద్ద పీట వేశామని చెప్పారు. రాష్ట్రంలో ఎస్సీ, ఎస్టీ, బీసీ, మైనార్టీ, అగ్రవర్ణాలకు చెందిన పేద విద్యార్థులు ప్రతిభతో ప్రపంచంలోని టాప్ యూనివర్సిటీలలో

మిగతా 10వ పేజీలో ▶

జగనన్నకు చెబుదాం..

- సంతృప్త స్థాయిలో ప్రజా వినతుల పరిష్కారమే లక్ష్యంగా కొత్త కార్యక్రమం
- 'స్పందన'లో అత్యధిక అర్జీలు అందుకుంటున్న విభాగ అధిపతులతో సీఎం సమీక్ష
- అందిన అర్జీలపై ప్రతి వారం ఆడిట్, నివేదికలు

2 లో

న్యూస్‌రీల్

పోసాని బాధ్యతల స్వీకారం



ముఖ్యమంత్రి వైఎస్ జగన్ కోసం అవసరమైతే ప్రాణమిస్తానని, తాను బతికున్నంత కాలం జగన్ వెంటే ఉంటానని పోసాని కృష్ణమురళి అన్నారు. రాష్ట్ర చలనచిత్ర, టీవీ, నాటక రంగ అభివృద్ధి సంస్థ చైర్మన్‌గా శుక్రవారం ఆయన బాధ్యతలు స్వీకరించారు.

వివరాలు 10 ▸

మాటేస్తున్న.. ఈ-దొంగల ముఠా



పండుగలు, ప్రత్యేక రోజుల్లో ఈ-కామర్స్ వెబ్‌సైట్లు బిగ్ బిలియన్ డేస్, షాపింగ్ కార్నివాల్ అంటూ ఏదో ఒక పేరు పెట్టి స్పెషల్ ఆఫర్లతో వినియోగదారులను ఆకర్షిస్తున్నాయి. ఇదే అదనుగా సైబర్ దొంగల ముఠా వినియోగదారుల డేటా కొట్టేయడానికి కాచుకు కూర్చుంటోంది.

వివరాలు 5 ▸

ఇబ్బందికరంగా కేంద్రం తీరు



సుప్రీంకోర్టు న్యాయమూర్తులుగా గత డిసెంబర్లో కొలీజియం సిఫార్సు చేసిన ఐదు పేర్లను త్వరలో ఆమోదించనున్నట్లు కేంద్రం పేర్కొంది. కొలీజియం సిఫార్సులను కేంద్ర ప్రభుత్వం పెండింగ్‌లో పెడుతున్న వైనంపై సుప్రీం విచారణ జరిపింది. కేంద్రం తీరుపై ఆగ్రహం వ్యక్తం చేసింది.

వివరాలు 6 ▸

K. విశ్వనాథ్ అంతిమయాత్ర



కళాతపస్వికి కన్నీటి వీడ్కోలు

10 లో

- అంతిమయాత్రలో పెద్దసంఖ్యలో పాల్గొన్న అభిమానులు
- నివాళులర్పించిన ప్రముఖులు
- ఏపీ సర్కారు తరఫున మంత్రి చెల్లుబోయిన హాజరు

శ్రుతి లయలే జననీ జనకులు కాగా 11 లో

క్లరికల్ తప్పిదాలు సరిచేసేందుకు 4 ఆప్షన్లు

- రీ సర్వే ద్వారా భూహక్కు పత్రాలు జారీలో ఇబ్బందులు లేకుండా చర్యలు
- రికార్డులు పక్కాగా అప్డేట్ చేశాకే పత్రాలు జారీ



సాక్షి, అమరావతి: భూముల రీ సర్వే ప్రక్రియ తర్వాత భూ యజమానులకు జారీచేసే భూ హక్కు పత్రాల్లో ఎలాంటి తప్పుల్లేకుండా చూసేందుకు రాష్ట్ర రెవెన్యూ యంత్రాంగం చర్యలు తీసుకుంటోంది. తొలిదశలో సర్వే పూర్తయిన రెండు వేల గ్రామాల్లో జారీచేస్తున్న పత్రాల్లో కొన్నిచోట్ల క్లరికల్ తప్పులు దొర్లడంతో వాటిని సరిచేసేందుకు వెబ్‌ల్యాండ్‌లో కొత్తగా నాలుగు ఆప్షన్లు ఇచ్చారు. పట్టాదారు మృతిచెందడం, ల్యాండ్ పార్సిల్ నంబర్ సంబంధిత ఖాతాకు సరిపోకపోవడం, పాత సర్వే నెంబరు తప్పుపడడం, ఆర్‌ఓఆర్, షేప్ ఫైల్‌లో విస్తీర్ణం సరిపోకపోవడం వంటి

మిగతా 2వ పేజీలో ▶



ఇంధన పొదుపులో ఏపీనే లీడర్

- ఇంధన సామర్థ్య నిర్వహణలో అన్ని రాష్ట్రాలకు ఏపీ స్టేట్ ఎనర్జీ కన్జర్వేషన్ మిషన్ (ఏపీఎస్ఈసీఎం) లీడర్‌గా వ్యవహరిస్తోందని బ్యూరో ఆఫ్ ఎనర్జీ ఎఫిషియన్సీ (బీఈఈ) సెక్రటరీ రాకేష్ కే రాయ్ వెల్లడించారు. ఎనర్జీ ఎఫిషియన్సీలో మిగిలిన రాష్ట్రాలకు ఏపీని బ్రాండ్‌గా చూపిస్తున్నామని తెలిపారు.

- వివరాలు 5లో

అవినాష్‌రెడ్డి కాల్ రికార్డులో సంచలనం ఏముంది?

- వైఎస్సార్‌సీపీ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి సజ్జల రామకృష్ణారెడ్డి
- ఇందులో ఏదో కుట్ర కోణం ఉందని తప్పుడు ప్రచారం
- శివప్రసాద్ రెడ్డి ఫోన్ చేస్తేనే వెనక్కు వచ్చిన ఎంపీ
- ఈరోజు కూడా ముఖ్యమంత్రి వైఎస్ జగన్ వద్దే ఓఎస్డీ కృష్ణమోహన్‌రెడ్డి, నవీన్.. వైఎస్ జగన్ ఇంట్లో నవీన్ అటెండర్
- సమాచారం ఇచ్చేందుకు వారికి ఫోన్ చేయడం సర్వసాధారణం
- సీబీఐ వీరిని విచారిస్తే పచ్చ మీడియా దుష్ప్రచారం
- ఈ కేసు ద్వారా సీఎం జగన్‌మోహన్‌రెడ్డిపై బురద చల్లే కుట్ర



సాక్షి, అమరావతి: వైఎస్సార్‌సీపీ ఎంపీ అవినాష్‌రెడ్డి కాల్ రికార్డులో సంచలనం ఏమీ లేదని ఆ పార్టీ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి, రాష్ట్ర ప్రభుత్వ సలహాదారు (ప్రజా వ్యవహారాలు) సజ్జల రామకృష్ణారెడ్డి స్పష్టం చేశారు. ఈ విషయంపై నాలుగు రోజుల నుంచి పచ్చ మీడియాలో దుష్ప్రచారం చేస్తున్నారని, ఏదో జరిగిపోయిందంటూ

మిగతా 10వ పేజీలో ▶

'స్థానిక' ఉపఎన్నికల్లో వైఎస్సార్‌సీపీ విజయం

- ఎన్నికలు జరిగిన ఆరు ఎంపీపీలూ అధికార పార్టీకే
- ఐదు కో ఆప్షన్, 25 ఉప సర్పంచి పదవులు కూడా..
- 10 ఉపాధ్యక్ష స్థానాల్లో తొమ్మిది వైఎస్సార్‌సీపీకి..
- ఒక్క చోట స్వతంత్ర అభ్యర్థి
- ఫ్యాన్ ఖాతాలోనే దాచేపల్లి మున్సిపల్ చైర్మన్ పదవి
- రామకుప్పంలో ఎంపీపీ, ఉపాధ్యక్ష ఎన్నికలు రెండూ వాయిదా

2 లో



ట్యాపింగ్ కాదు.. ట్రాప్‌లో పడ్డారు

- కోటంరెడ్డిపై మంత్రులు మేరుగు, కాకాణి, కారుమూరి ధ్వజం
- చంద్రబాబు ఉచ్చులో ఇరుక్కుని కట్టుకథలు
- ఆయనో నమ్మకద్రోహి.. ఊసరవెల్లి
- నిజంగా ఆధారాలుంటే ఆలస్యమెందుకు?
- రికార్డింగ్ ప్రచారమని స్పష్టంగా తెలిసిపోయింది
- మన మంచిని కోరుకునే సజ్జలపై నిందలా?

- వివరాలు 10లో



ఖర్గే చాంబర్‌లో శుక్రవారం సమావేశమైన వివిధ పార్టీల నేతలు

'అదానీ'పై అదే రగడ

ఏకతాటిపైకి విపక్షాలు.. ఉభయసభల్లో ఆందోళన

సోమవారానికి పార్లమెంట్ వాయిదా

6 లో

అదానీ గ్రూప్‌పై వచ్చిన ఆరోపణలు, తద్వారా ప్రభుత్వ రంగ బ్యాంకుల షేర్ల పతనం కారణంగా తలెత్తిన పరిస్థితులపై పార్లమెంట్‌లో వెంటనే చర్చ ప్రారంభించాలని ప్రతిపక్షాలు డిమాండ్ చేశాయి. మిగతా సభా కార్యకలాపాలను పక్కనపెట్టి హిండెన్‌బర్గ్ నివేదికపై చర్చించాల్సిందేనంటూ ప్రతిపక్షాలన్నీ పట్టుబట్టడంతో వరుసగా రెండోరోజూ ఎలాంటి చర్చలు లేకుండానే ఉభయసభలు వాయిదా పడ్డాయి. అంతకుముందు కాంగ్రెస్ నేత మల్లికార్జున ఖర్గే చాంబర్‌లో విపక్ష నేతలు భేటీ అయ్యారు.

క్లుప్తంగా...

గవర్నర్ ముఖ్య కార్యదర్శిగా అనిల్‌కుమార్ సింఘాల్



సాక్షి, అమరావతి: దేవదాయ శాఖ ముఖ్య కార్యదర్శి అనిల్‌కుమార్ సింఘాల్‌ను రాష్ట్ర ప్రభుత్వం బదిలీ చేసి గవర్నర్ ముఖ్య కార్యదర్శిగా నియమించింది. ఈ మేరకు ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి జవహర్‌రెడ్డి శుక్రవారం ఉత్తర్వులు జారీ చేశారు. గవర్నర్ ప్రత్యేక ప్రధాన కార్యదర్శిగా పనిచేస్తున్న రాంప్రకాష్ సిసోడియాను సాధారణ పరిపాలన శాఖ (జీఏడీ)లో రిపోర్ట్ చేయాలని ఆ ఆదేశాల్లో పేర్కొన్నారు.

క్లరికల్ తప్పిదాలు సరిచేసేందుకు 4 ఆప్షన్లు

▶ మొదటి పేజీ తరువాయి

వాటి కారణంగా తప్పుగా నమోదైనట్లు తహసీల్దార్లు గుర్తించారు. దీంతో ఈ నాలుగు ఆప్షన్లు ప్రత్యేకంగా ఇచ్చి క్లరికల్ తప్పులను సరిదిద్దే అవకాశం కల్పించారు. ఈ తప్పులన్నీ సరిదిద్దిన తర్వాత ఆయా గ్రామాల్లో తుది ఆర్‌ఓఆర్‌ను అప్‌డేట్ చేయాలని భూ పరిపాలన ప్రధాన కమిషనర్ రెవెన్యూ యంత్రాంగానికి నిర్దేశించారు. ఏ జిల్లాల్లో ఎన్ని తప్పులు వచ్చాయి?ఎన్ని సరిదిద్దారనే అంశాలను కూడా కమిషనర్ సమీక్షించి ఆర్‌ఓఆర్ పక్కాగా రూపొందేలా చర్యలు తీసుకుంటున్నారు. తుది ఆర్‌ఓఆర్‌ను ఖరారు చేయడానికి ముందు పట్టాదారుల వ్యక్తిగత సమాచారం, ఫొటో వంటి వివరాలన్నీ మరోసారి పరిశీలించాలని తహసీల్దార్లకు ఆదేశాలిచ్చారు. ఇవన్నీ పూర్తయిన తర్వాత తుది ఆర్‌ఓఆర్ రూపొందించి భూ హక్కు పత్రాలు జారీచేయాలని స్పష్టంచేశారు. భూహక్కు పత్రాలను ఈనెల మొదటి వారంలోనే జారీచేయాలని నిర్దేశించారు.

జగనన్నకు చెబుదాం..

సంతృప్త స్థాయిలో ప్రజా వినతుల పరిష్కారమే లక్ష్యంగా కొత్త కార్యక్రమం

- 'స్పందన'లో అత్యధిక అర్జీలు అందుకుంటున్న విభాగాధిపతులతో సీఎం సమీక్ష
- ప్రతి వినతి పరిష్కారం అయ్యే వరకూ ట్రాకింగ్
- అందిన అర్జీలపై ప్రతి వారం ఆడిట్, నివేదికలు
- ట్రాకింగ్, పర్యవేక్షణపై ప్రతివారం సమీక్ష
- కాల్ సెంటర్ల అనుసంధానం, ఇప్పటికే ఉన్న పద్ధతులు బలోపేతం
- పోలీసులకు వచ్చే అర్జీలపై మండల స్థాయిలో సమన్వయ కమిటీ
- ఈ మెకానిజం అంతా సిద్ధం కాగానే అమలుకు శ్రీకారం



'స్పందన'లో అత్యధిక అర్జీలు అందుకుంటున్న విభాగాధిపతులతో సమీక్ష నిర్వహిస్తున్న సీఎం జగన్

> వివిధ ప్రభుత్వ విభాగాల్లో అర్జీలు, ఫిర్యాదుల స్వీకరణకు ఇప్పటికే ఉన్న కాల్ సెంటర్లను అనుసంధానం చేయాలి. వినతుల పరిష్కారం కోసం ఇప్పటి వరకు ఉన్న పద్ధతులను మరోసారి పరిశీలించి, వాటిని బలోపేతం చేయాలి. ఒక వినతిపై ప్రతి దశలోనూ పర్యవేక్షణ ఉండేలా మరింత శ్రద్ధ పెట్టాలి. 'స్పందన'కు అత్యంత సమర్థవంతమైన, మెరుగైన విధానమే 'జగనన్నకు చెబుదాం' కార్యక్రమం. - సీఎం వైఎస్ జగన్

సాక్షి, అమరావతి: ప్రజా వినతులను సంతృప్త స్థాయిలో పరిష్కరించడమే ప్రధాన లక్ష్యంగా 'జగనన్నకు చెబుదాం' కార్యక్రమాన్ని ప్రారంభిస్తున్నట్లు ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి ప్రకటించారు. ఇందుకు అధికారులంతా సన్నద్ధం కావాలని ఆదేశించారు. ఈ కార్యక్రమం సన్నాహకాల్లో భాగంగా స్పందన కార్యక్రమంలో అత్యధిక అర్జీలు అందుకుంటున్న ప్రభుత్వ విభాగ అధిపతులతో శుక్రవారం ఆయన తన క్యాంపు కార్యాలయంలో ఉన్నత స్థాయి సమీక్ష నిర్వహించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ.. ప్రతి ప్రభుత్వ విభాగాధిపతి ప్రతి వినతి పరిష్కారం అయ్యేంత వరకూ ట్రాక్ చేయాలని చెప్పారు. 'అందిన అర్జీలపై ప్రతి వారం ఆడిట్ చేయడంతో పాటు నివేదికలు తీసుకోవాలి. ట్రాకింగ్, పర్యవేక్షణ జరుగుతుందా? లేదా? అన్న దానిపై ప్రతివారం సమీక్ష చేయాలి' అని అన్నారు. సీఎంఓతో పాటు ప్రతి ప్రభుత్వ శాఖలో 'జగనన్నకు చెబుదాం' ప్రాజెక్ట్ మానిటరింగ్ విభాగాలు ఉండాలని చెప్పారు. తర్వాత జిల్లా, మండల స్థాయిలో, మున్సిపాలిటీలు, కార్పొరేషన్ల స్థాయిలో కూడా ఈ విభాగాలు ఏర్పాటు చేయాలన్నారు. మానిటరింగ్ యూనిట్లు సమర్థవంతంగా పనిచేస్తేనే ఈ కార్యక్రమం మంచి ఫలితాలిస్తుందని తెలిపారు. ఈ మెకానిజం అంతా సిద్ధం కాగానే ఈ కార్యక్రమాన్ని ప్రారంభిస్తామని స్పష్టం చేశారు. ఈ సమీక్షలో సీఎం జగన్ ఇంకా ఏమన్నారంటే..

సహనం, ఓపిక, పునఃపరిశీలన

- సంబంధిత విభాగంలో సరిగ్గా పని జరగలేదనే కారణంతోనే వినతులు, ఫిర్యాదులు వస్తాయి. ఇలాంటి సందర్భాల్లో వారిని సంతృప్తి పరిచేలా పరిష్కారం చూపడం అన్నది సవాల్‌తో కూడుకున్నది. సహనం, ఓపిక, పునఃపరిశీలన, విధానాల పునర్నిర్మాణాలతో ముందుకు సాగాలి.
- స్పందన డేటా ప్రకారం అత్యధికంగా ఫిర్యాదులు రెవెన్యూ, పంచాయతీరాజ్, మున్సిపల్, హోంశాఖ, ఆరోగ్యం–కుటుంబ సంక్షేమ శాఖల నుంచి వస్తున్నాయి. జగనన్నకు చెబుదాం ప్రారంభమయ్యాక కూడా ఇవే విభాగాల నుంచి వినతులు అధికంగా వచ్చే అవకాశాలు ఉన్నాయి. అందువల్ల ఈ శాఖలకు చెందిన విభాగాధిపతులు అర్జీల పరిష్కారంపై మరింత దృష్టి పెట్టాల్సి ఉంటుంది.

సిబ్బందికి ఓరియంటేషన్

- జగనన్నకు చెబుదాం కార్యక్రమంపై సిబ్బందికి ఓరియెంటేషన్ ఇవ్వాలి. మానిటరింగ్ యూనిట్ల ఏర్పాటుపై కూడా మార్గదర్శకాలు రూపొందించాలి. నిర్దేశిత సమయంలోగా వినతులు పరిష్కారం కావాలి. ఆ సమయంలోగా పరిష్కారం కావడం, పరిష్కారంలో నాణ్యత ఉండడం అన్నది చాలా ముఖ్యం. సమస్య పరిష్కారం అయ్యాక వినతులిచ్చిన వారి నుంచి లేఖ తీసుకోవాలి.
- ఏదైనా అర్జీని తిరస్కరించాల్సిన నేపథ్యంలో అత్యంత జాగ్రత్తగా వ్యవహరించాలి. తిరస్కరణకు గురైనా, జరిగిన ప్రక్రియపై అర్జీదారులు సంతృప్తి వ్యక్తం చేసేలా ఉండాలి. అవినీతికి సంబంధించిన అంశాలను చాలా గట్టిగా తీసుకోవాలి. తప్పు చేయడానికి భయపడే పరిస్థితి ఉండాలి.
- పోలీసులకు వచ్చే అర్జీల పరిష్కారానికి మండల స్థాయిలో సమన్వయ కమిటీ ఏర్పాటు చేయాలి. పోలీసులు, రెవెన్యూ, పంచాయతీ రాజ్, మున్సిపల్ అధికారులతో కూడిన మండల, మున్సిపల్ స్థాయి సమన్వయ కమిటీ వారంలో ఒక రోజు సమావేశమై అర్జీల పరిష్కారంపై దృష్టి పెట్టాలి. ప్రభుత్వ విభాగాధిపతులు త్వరలో కలెక్టర్లతో సమావేశం నిర్వహించి.. వారికి అవగాహన కల్పించాలి.
- ఈ సమావేశంలో ప్రభుత్వ సలహాదారు (ప్రజా వ్యవహారాలు) సజ్జల రామకృష్ణారెడ్డి, పురపాలక పట్టణాభివృద్ధి శాఖ స్పెషల్ సీఎస్ వై శ్రీలక్ష్మి, పంచాయతీరాజ్, గ్రామీణాభివృద్ధి శాఖ స్పెషల్ సీఎస్ బుడితి రాజశేఖర్, వైద్య ఆరోగ్య శాఖ ముఖ్య కార్యదర్శి ఎంటీ కృష్ణబాబు, హోం శాఖ ముఖ్య కార్యదర్శి హరీష్ కుమార్ గుప్తా, మున్సిపల్ అడ్మినిస్ట్రేషన్ కమిషనర్ ప్రవీణ్ కుమార్, సెర్ప్ సీఈఓ ఏఎండీ ఇంతియాజ్, ఇతర ఉన్నతాధికారులు హాజరయ్యారు.

'స్థానిక' ఉప ఎన్నికల్లో వైఎస్సార్‌సీపీ విజయం

సాక్షి, అమరావతి: రాష్ట్రవ్యాప్తంగా వివిధ కారణాలతో ఖాళీగా ఉన్న మండల పరిషత్ అధ్యక్ష (ఎంపీపీ), ఉపాధ్యక్ష, కో- ఆప్షన్ సభ్యుల పదవులకు శుక్రవారం జరిగిన ఉప ఎన్నికల్లో అధికార వైఎస్సార్‌సీపీ ఘన విజయం సాధించింది. ఏడు మండలాల్లో ఎంపీపీ పదవుల ఎన్నికల నిర్వహణకు రాష్ట్ర ఎన్నికల కమిషనర్ నోటిఫికేషన్ జారీ చేయగా చిత్తూరు జిల్లా రామకుప్పం మినహా మిగిలిన ఆరు మండలాల్లో పూర్తయ్యాయి. ఆరుకి ఆరు ఎంపీపీ స్థానాల్లో వైఎస్సార్‌సీపీ అభ్యర్థులు గెలిచినట్లు రాష్ట్ర ఎన్నికల కమిషన్ కార్యాలయం ప్రకటించింది. మరో 11 మండలాల్లో ఉపాధ్యక్ష పదవులకు ఉప ఎన్నికలు నిర్వహించగా రామకుప్పం మినహా మిగిలిన 10 మండలాల్లో పూర్తయ్యాయి. పదిలో తొమ్మిది చోట్ల వైఎస్సార్‌సీపీ అభ్యర్థులు గెలుపొందగా ఒక్క చోట స్వతంత్ర అభ్యర్థి విజయం సాధించారు. రామకుప్పం మండలంలో ఎంపీటీసీ సభ్యులు ప్రత్యేక సమావేశానికి హాజరు కాకపోవడంతో ఎంపీపీ, ఉపాధ్యక్ష ఎన్నికలు రెండూ వాయిదా పడినట్టు రాష్ట్ర ఎన్నికల కమిషనర్ కార్యాలయం ప్రకటించింది. ఇక ఆరు మండలాల్లో కో- ఆప్షన్ సభ్యుల ఎన్నికలు జరగగా ఐదు చోట్ల పూర్తయ్యాయి. ఐదు చోట్లా వైఎస్సార్ సీపీ సానుభూతిపరులే కో - ఆప్షన్ సభ్యులుగా ఎన్నికయ్యారు. చిత్తూరు మండలంలో కో- ఆప్షన్ సభ్యుడి పదవికి ఎవరూ నామినేషన్ దాఖలు చేయకపోవడంతో ఎన్నిక వాయిదా పడింది.

ఎంపీపీ ఉప ఎన్నికల ఫలితాలు ఇలా

జిల్లా	మండలం	గెలిచిన అభ్యర్థి	పార్టీ
బాపట్ల	సంతమాగులూరు	వై.యలమంద	వైఎస్సార్‌సీపీ
పల్నాడు	పిడుగురాళ్ల	అల్లు సత్యవతి	వైఎస్సార్‌సీపీ
కర్నూలు	ఆలేరు	జె.రంగమ్మ	వైఎస్సార్‌సీపీ
అనకాపల్లి	ఎస్.రాయవరం	కోన లోవలక్ష్మీ	వైఎస్సార్‌సీపీ
అనంతపురం	విడపనకల్లు	కరణం పుష్పావతి	వైఎస్సార్‌సీపీ
శ్రీసత్యసాయి	చెన్నేకొత్తపల్లి	మగ్గిగ అంజిలి	వైఎస్సార్‌సీపీ

దాచేపల్లి అధికార పార్టీదే

పల్నాడు జిల్లా దాచేపల్లి నగర పంచాయతీ చైర్మన్ పదవికి శుక్రవారం నిర్వహించిన ఉప ఎన్నికలో 10వ వార్డు నుంచి గెలుపొందిన వైఎస్సార్‌సీపీ సభ్యురాలు కె.సుబ్బమ్మ మున్సిపల్ చైర్మన్‌గా ఎన్నికైనట్టు రాష్ట్ర ఎన్నికల కమిషన్ కార్యాలయం తెలిపింది. రాష్ట్రవ్యాప్తంగా 29 గ్రామ పంచాయతీలకు సంబంధించి ఉప సర్పంచి ఎన్నికలు కూడా జరిగాయి. మొత్తం 25 పంచాయతీల్లో ఉప సర్పంచి ఎన్నికలు ప్రశాంతంగా పూర్తవగా సభ్యులు హాజరు కాని కారణంగా మూడు చోట్ల తిరిగి ప్రకటించే వరకు వాయిదా పడ్డాయి. ఒక్క చోట మాత్రం నిబంధనల ప్రకారం శనివారానికి వాయిదా వేస్తున్నట్లు స్థానిక ఎన్నికల అధికారి ప్రకటించారు.

ఎన్‌ఎస్‌ఎస్ ద్వారా రాష్ట్రానికి మరింత పేరు తేవాలి



తాడేపల్లిలోని సీఎం క్యాంపు కార్యాలయంలో ముఖ్యమంత్రి జగన్‌ను కలిసిన ఎన్‌ఎస్‌ఎస్ విద్యార్థులు

- జాతీయ అవార్డు గ్రహీతలతో సీఎం

సాక్షి, అమరావతి: రాబోయే రోజుల్లో ఎన్‌ఎస్‌ఎస్ (నేషనల్ సర్వీస్ స్కీమ్ – జాతీయ సేవా పథకం) ద్వారా రాష్ట్రానికి మరింత ఖ్యాతి వచ్చేలా కృషి చేయాలని సీఎం వైఎస్ జగన్ విద్యార్థులకు సూచించారు. న్యూఢిల్లీలో జరిగిన రిపబ్లిక్ డే పరేడ్‌లో పాల్గొని, జాతీయ స్థాయిలో అవార్డులు అందుకున్న ఎన్‌ఎస్‌ఎస్ విద్యార్థులు శుక్రవారం సీఎం క్యాంపు కార్యాలయంలో ఆయనను కలిశారు. ఈ సందర్భంగా జాతీయ స్థాయిలో ఏపీ పేరు ప్రఖ్యాతులు నిలబెట్టడంపై వారిని అభినందించారు. రానున్న రోజుల్లో మరింతగా రాణించాలని ఆకాంక్షించారు. ఏపీలో 36 యూనివర్సిటీల్లో 2,173 యూనిట్లలో జరుగుతున్న కార్యక్రమాలను ఎన్‌ఎస్‌ఎస్ స్టేట్ ఆఫీసర్ సీఎంకు వివరించారు. ప్రభుత్వ పథకాలపై ప్రజలకు అవగాహన కల్పిస్తున్నామని చెప్పారు. కాగా, 2019- 20, 2020 -21లకు గాను ఢిల్లీలో రాష్ట్రపతి ద్రౌపదిముర్ము చేతుల మీదుగా ఎన్‌ఎస్‌ఎస్ జాతీయ అవార్డులు అందుకున్న స్టేట్ ఆఫీసర్ పి.అశోక్ రెడ్డి, కె.జితేంద్ర గౌడ్, సీహెచ్.పార్థసారథి, సిరి దేవనపల్లి, డి.సాయి.. రిపబ్లిక్ డే పరేడ్‌లో పాల్గొన్న విద్యార్థులు వందన, భువనేశ్వరి, రమ్య, శ్రీ మహాలక్ష్మి, దేదీప్య, లక్ష్మణ్, గౌతమ్ దీపక్ రెడ్డి, బి.గోపి, రెడ్డి జిష్ణు, జె.వాసు, ఉన్నత విద్యా శాఖ ముఖ్య కార్యదర్శి జె.శ్యామలరావు, ఎన్‌ఎస్‌ఎస్ ఈటీఐ కోఆర్డినేటర్ రామచంద్రరావు సీఎంను కలిశారు.

అమృత'జలం'

సందుకో వాటర్ ప్లాంట్.. కూల్‌డ్రింక్ దుకాణాల్లోనూ వాటర్ ప్యాకెట్లు.. బ్రాండెడ్ కంపెనీ బాటిల్ కొని నీళ్లు తాగనిదే కొందరికి గొంతు తడారదు. ఎక్కడికెళ్లినా వాటర్ ట్యాంక్‌లను వెంట పెట్టుకుని వెళ్తున్న జనం కోకొల్లలు. 'స్వచ్ఛత' ముసుగులో నీటి వ్యాపారం 'కోట్లు' దాటుతోంది. ఇలాంటి ఈ రోజుల్లోనూ ఆ ఊరి జనానికి ఓ బావి నీరు అమృతంతో సమానం. ఊళ్లో వాటర్ ప్లాంట్‌లు ఉన్నా, ఓవర్‌హెడ్ ట్యాంకులు నిర్మించినా.. ఆ నీటితోనే గొంతు తడుపుకోవడం చూస్తే ఆ గ్రామానికి బావితో ఉన్న అనుబంధం ఇట్టే అర్థమవుతుంది.

మొలగవల్లిలో నాలుగు శతాబ్దాల బావి

- తరతరాలుగా పెనవేసుకున్న బంధం
- శుభకార్యాల సందర్భంగా గంగమ్మకు పూజలు
- ఇంటికో కుళాయి ఉన్నా తాగేందుకు బావి నీరే..
- ఇతర అవసరాలకే మినరల్ వాటర్
- ఇదే బావిలో మరో చేదుడు బావి

ఊరు: మొలగవల్లి
జనాభా: 10వేలు
ఎక్కడ: ఆలూరుకు 15కిలోమీటర్ల దూరం
కుళాయి కనెక్షన్లు: 7వేలు
మినరల్ వాటర్ ప్లాంట్‌లు: 2
ఓహెచ్‌ఆర్ ట్యాంకులు: 4



మినరల్ వాటర్ ప్లాంట్



వందేళ్ల క్రితం పెద్దబావిలో నిర్మించిన చేదుడు బావిలో పూడిక తీస్తున్న గ్రామస్తులు (ఫైల్)

ఆలూరు రూరల్: పట్టణాల సంగతి పక్కనపెడితే.. వాటర్‌ప్లాంట్ కనిపించని గ్రామం ఉండదంటే అతిశయోక్తి కాదు. పక్కనే వాగులు, వంకలు పారుతున్నా.. సెలయేళ్లు ఉరుకుతున్నా.. బావులు అందుబాటులో ఉన్నా.. ఇప్పుడు అందరి అడుగులు వాటర్‌ప్లాంట్ వద్దే ఆగుతున్నాయి. ఐఎస్‌ఐ మార్కు లేకపోయినా, మినరల్స్ ఏస్థాయిలో ఉంటున్నాయో తెలియకపోయినా.. ప్లాంట్ ముందు ఏర్పాటు చేసిన కుళాయి ముందు బిందెలు బారులు తీరుతున్నాయి. ఐదు, పది రూపాయలు.. మరికొన్ని చోట్ల 20 రూపాయలు వెచ్చించి కూడా కొనుగోలు చేస్తున్నారు. ప్రకృతి సహజసిద్ధంగా లభ్యమవుతున్న నీటిని కాదని.. కోరి మరీ రోగాలను కొంటున్నారు. అయితే మండలంలోని మొలగవల్లి గ్రామం ఇప్పటికీ బావి నీటితోనే దాహం తీర్చుకుంటోంది. మినరల్ వాటర్ ప్లాంట్‌లు ఈ గ్రామంలోకి అడుగుపెట్టినా.. తాగునీరు మాత్రం ప్రతి ఇంటికీ ఈ బావి నీరు ఉండాల్సిందే. ఒకటి కాదు.. రెండు కాదు.. ఏకంగా నాలుగు శతాబ్దాలుగా ఈ బావి ప్రతి ఇంటికి అమృతం అందిస్తోంది.



మొలగవల్లిలోని పెద్దబావి

ఆ బావి నీళ్లే మినరల్ వాటర్

గ్రామంలో రెండు రోజులకు ఒకసారి తాగునీటి సరఫరా ఉంది. నాలుగు ఓహెచ్‌ఆర్ ట్యాంకులు నిర్మించారు. 7వేల వరకు ఇంటింటి కొళాయి కనెక్షన్లు ఉన్నాయి. మినరల్ వాటర్ ప్లాంట్‌లు అందుబాటులో ఉన్నప్పటికీ గ్రామస్తులు తాగునీటికి మాత్రం ఆ బావి నీళ్లనే వినియోగిస్తున్నారు. రోజు ఈ నీటిని తాగుతున్న స్థానికులు ఏదైనా పని మీద ఇతర ప్రాంతాలకు వెళ్లి అక్కడి నీరు తాగితే ఒళ్లు నొప్పులు, అనారోగ్య సమస్యలు వస్తాయని చెబుతారు. ఇక ప్రధానంగా అన్నం, పప్పు వండటానికి ఈ నీళ్లు అయితే బాగా ఉడుకుతాయని, ఇతర ఏ నీళ్లు అయినా సరిగా ఉడకవని, తిన్నట్లుగా కూడా ఉండదంటారు.

పెద్దబాయి నీళ్లు అమృతంతో సమానం

నా వయసు 76ఏళ్లు. మా అవ్వతాతల కాలం నుంచి మాకు ఈ బాయి నీళ్లు అమృతంతో సమానం. బయటి నీళ్లు తాగితే కాళ్ల నొప్పులు, దగ్గు, పడిశం వస్తుంది. ఇంక వంట చేయనీక ఈ నీళ్లు అయితేనే బ్యాళ్లు, బియ్యం బాగా ఉడుకుతాయి. మా ఇళ్లలో ఏ శుభకార్యం జరిగినా గంగమ్మకు పూజలు చేయాల్సిందే.
– గౌరమ్మ, వృద్ధురాలు, మొలగవల్లి

బయటి నీళ్లు తాగితే అనారోగ్యం

గ్రామంలో వాటర్‌ప్లాంట్‌లు పెట్టినా, కుళాయిలు ఉన్నా మాకు ఈ బావి నీళ్లు తాగితేనే గొంతు తడారుతుంది. మినరల్ వాటర్ కన్నా ఈ నీళ్లు ఎంతో రుచిగా ఉంటాయి. బయటి ప్రాంతాలకు వెళ్లినప్పుడు అక్కడి నీళ్లు తాగితే ఒంట్లో ఏదో ఒక సమస్య వస్తుంది. గ్రామానికి సరఫరా అవుతున్న నీటిని ఇంటి అవసరాలకు వినియోగిస్తాం. – శ్రీరాములు, మొలగవల్లి


బావితో మాకు ఎంతో అనుబంధం

మా తాతల కాలం నుంచి ఈ బావితో మాకు అనుబంధం ఉంది. బయటి ప్రాంతాల్లో చిన్న వయస్సుకే మోకాళ్ల నొప్పులు, ఆ రోగం, ఈ రోగం అంటుంటారు. మాకు మాత్రం ఈ నీళ్లు తాగితే ఏ నొప్పులు ఉండవు. వ్యాపారం కోసం మినరల్ వాటర్‌ప్లాంట్‌లు ఏర్పాటు చేసినా మేము మాత్రం బావి దగ్గరకు పోయి నీళ్లు తెచ్చుకునేందుకే ఇష్టపడతాం.
– రామాంజినేయులు, మొలగవల్లి

పెద్దబావిలోనే.. చేదుడు బావి..

నాలుగు వందల ఏళ్ల క్రితం మొలగవల్లి గ్రామంలోని చెరువు పక్కన గ్రామస్తుల తాగునీటి అవసరాలకు ఓ పెద్ద బావి నిర్మించారు. దాదాపు రెండు వందల ఏళ్ల తర్వాత బావిలో నీరు ఇంకిపోవడంతో అప్పట్లో గ్రామస్తులు చిప్పలతో నీళ్లను తోడుకునే వారని వయసు మళ్లిన వాళ్లు చెబుతుంటారు. తాగునీటి ఇబ్బందుల దృష్ట్యా వందేళ్ల క్రితం పెద్ద బావిలోనే స్థానికులు మరో చేదుడు బావిని తవ్వుకున్నారు. చిన్న బావి నిర్మించుకున్న తర్వాత ఎనిమిదేళ్ల క్రితం నీటిని బయటికి తోడి పెద్దబావిలో పూడిక తొలగించారు. గ్రామ పంచాయతీ సిబ్బంది వారానికి ఒకసారి తాగునీటి బావిలో బ్లీచింగ్ పౌడర్ కలుపుతుంటారు. శుభకార్యాల వేళ గ్రామస్తులు పెద్దబావి వద్దకు వెళ్లి గంగమ్మకు ప్రత్యేక పూజలు నిర్వహిస్తారు.

బాబోయ్ పులి..



అటవీ ప్రాంతంలో సంచరిస్తున్న పులి (ట్రాప్ కెమేరాలో నిక్షిప్తమైన దృశ్యం)

పెద్ద పులుల సంచారంతో నల్లమల సమీప గ్రామాల ప్రజలు హడలిపోతున్నారు. రెండు వారాలుగా ఇవి జనారణ్యంలోకి వస్తుండడంతో ప్రజలు కంటిమీద కునుకు లేకుండా భయం గుప్పెట్లో బిక్కుబిక్కుమంటున్నారు. ఇప్పటి వరకూ వీటి దాడిలో మూగ జీవాలు బలయ్యాయి. అవి తమపై ఎక్కడ దాడిచేస్తాయోనని ప్రజలు హడలిపోతున్నారు. నీటి కోసం ఇవి అడవి నుంచి బయటకు వస్తున్నాయని తెలుస్తోంది. అటవీశాఖ అధికారులు సేకరిస్తున్న పాదముద్రల ఆధారంగా పులులు బయటకు వస్తున్నాయని స్పష్టమవుతోంది.

- 15 రోజులుగా నల్లమల సరిహద్దు గ్రామాల్లో పులుల సంచారం
- వణుకుతున్న ప్రజలు
- తరచూ దాడుల్లో మృత్యువాత పడుతున్న మూగజీవాలు
- నీటి కోసం బయటకు వస్తున్నాయంటున్న గ్రామస్తులు
- అటవీ ప్రాంతంలో నీటి నిల్వలు పెంచాలని అధికారులకు వినతి

పెద్దదోర్నాల: గిద్దలూరు, మార్కాపురం అటవీ డివిజన్ పరిధిలో పెద్ద పులుల సంచారంతో సరిహద్దు గ్రామాల ప్రజలు భయంతో వణికిపోతున్నారు. గిద్దలూరు అటవీ డివిజన్ పరిధి మాగుటూరు, లక్ష్మీపురం, వెలగలపాయ, శంకరాపురం, కాకర్ల తదితర గ్రామాల పరిధిలోనూ, మార్కాపురం అటవీ డివిజన్ పరిధిలోని యర్రగొండపాలెం మండలం కొలుకుల గ్రామం పరిధిలో పులి సంచరించినట్టు అధికారులు గుర్తించారు. గత నెల చివరి వారంలో అర్ధవీడు మండల పరిధిలోని మాగుటూరులో పెద్దపులులు దాడులు చేయడంతో రెండు ఎద్దులు మృతి చెందాయి. వెలగలపాయ కొండ సమీపంలో ఎద్దులను మేతకు తీసుకెళ్లగా ఓ ఎద్దుపై పెద్దపులి దాడి చేస్తున్న సమయంలో చూసిన రైతు కంపిలి బాలేశ్వరరావు కేకలు వేయడంతో పులి పారిపోయింది. నాలుగు రోజుల వ్యవధిలో పెద్దపులి రెండుసార్లు పశువులపై దాడికి పాల్పడటంతో గ్రామస్తులు భయాందోళనకు గురవుతున్నారు. గురువారం యర్రగొండపాలెం మండలం కొలుకుల సమీపంలోని చెరువు వద్ద కొద్ది రోజులుగా పెద్దపులి సంచరించినట్టు అధికారులు గుర్తించారు. పులుల సంచారాన్ని గుర్తించేందుకు అధికారులు ట్రాప్ కెమెరాలు అమర్చారు. పెద్దపులి దాడిచేసిన ఎద్దు మృతదేహం వద్దకు వచ్చి కళేబరాన్ని తింటుండటం కెమెరాలో నిక్షిప్తమైంది. దీంతో అటవీశాఖ అధికారులు అప్రమత్తమై మాగుటూరు పరిసర ప్రాంతాల్లోని రైతులు, ప్రజలను అప్రమత్తం చేశారు. నీటి కోసమే ఇవి బయటకు వస్తున్నాయని అధికారులు అభిప్రాయపడుతున్నారు. పులులు సంచరిస్తున్న ప్రాంతాల్లో ప్రత్యేక బీట్‌లు ఏర్పాటు చేస్తామని అధికారులు గ్రామస్తులకు చెబుతున్నారు.



శుక్రవారం అటవీ ప్రాంతంలో పులి పాద ముద్రలను పరిశీలిస్తున్న అధికారులు

రైతుపైనా దాడి..

ఇటీవల నల్లమల అభయారణ్యంలోని పాలుట్లలో తన పొలానికి వెళ్లి తిరిగి వస్తున్న రైతు బాలునాయక్‌పై పెద్దపులి దాడి చేసి తీవ్రంగా గాయపర్చింది. ఈ సంఘటన నల్లమల అటవీ ప్రాంతంలోని ఇసుర్రాయిగుట్ట వద్ద చోటు చేసుకుంది. దీని ప్రభావంతో ఆ ప్రాంతంలోనూ కలకలం రేగింది. గతంలో పెద్దపులులు మనుషుల మీద దాడి చేసిన సంఘటనలు ఎక్కడా చోటు చేసుకోలేదు. ఈ సంఘటనతో పాలుట్ల పరిసర ప్రాంతాలు సైతం పులి సంచారంతో హడలిపోతున్నాయి. అలాగే మండల పరిధిలోని పెద్దబొమ్మలాపురం గండి చెరువు ప్రాంతంలో ఓ రైతుకు సంబంధించిన ఎద్దును పులి హతమార్చింది. ఇలా వరుస సంఘటనలు ఆయా ప్రాంతాల్లోని రైతుల మనోధైర్యాన్ని దెబ్బ తీస్తున్నాయి. అటవీ ప్రాంతంలో నీటి లభ్యత సరిగా లేకపోవడంతో ఇవి జనావాలకు వస్తున్నాయని, ప్రజలపై, మూగజీవాలపై దాడులు చేస్తున్నాయని ప్రజలు ఆరోపిస్తున్నారు.

నీటి లభ్యత అంతంతే..

వన్యప్రాణుల దాహార్తి తీర్చేందుకు అటవీశాఖ చిన్నపాటి చెక్‌డ్యాంలు, నీటి తొట్టెలు, కుంటలు, సాసర్ పిట్స్‌లను నిర్మించాల్సి ఉంది. వీటి నిర్వహణ కోసం వేసవికాలంలో మొబైల్ ట్యాంకర్ల ద్వారా తాగునీటిని సరఫరా చేయాలి. అయితే ప్రస్తుతం చెక్‌డ్యాంలు, సాసర్ పిట్లలో నీరులేక పోవటంతో పాటు చాలా ప్రాంతాల్లో చెరువులు, నీటి కుంటల్లో నీరు లేక అవి చాలా చోట్ల నిరుపయోగంగా దర్శనమిస్తున్నాయి. దీంతో పాటు నల్లమలలో భూగర్భ జలాలు అడుగంటడం, నీళ్లు దొరక్క పోవటంతో వన్యప్రాణులు దాహాన్ని తట్టుకోలేక సమీప గ్రామాలకు వస్తున్నాయి. ఈక్రమంలో అవి జనావాసాల మధ్య సంచరించే సమయంలో వన్యప్రాణులు, పశువులపై దాడులకు తెగబడుతున్నాయి.

జనావాసాల వైపు రాకుండా చర్యలు తీసుకోవాలి:

వన్యప్రాణులను జనావాసాల వైపు రాకుండా చర్యలు తీసుకోవాలని పలు సరిహద్దు గ్రామాల ప్రజలు అధికారులను కోరుకుంటున్నారు. గిద్దలూరు డివిజన్ పరిధిలో గిద్దలూరు, తురిమెళ్ల, గుండ్లకమ్మ రేంజిలు, మార్కాపురం డివిజన్ పరిధిలో మార్కాపురం, యర్రగొండపాలెం, పెద్దదోర్నాల, కొర్రప్రోలు, నెక్కంటి, గంజివారిపల్లి, విజయపురి సౌత్ రేంజ్‌లు ఉన్నాయి. ఆయా రేంజిల పరిధిలో వన్యప్రాణుల దాహార్తిని తీర్చేందుకు సుమారు 400 సాసర్ పిట్లను ఏర్పాటు చేశారు. అటవీశాఖ ఉన్నతాధికారుల ఆదేశాల మేరకు మరో రెండు వారాల్లో వాటిల్లో నీటితో నింపేందుకు ప్రణాళికలు సిద్ధం చేస్తున్నారు. ఈలోగా సాసర్ పిట్లు నింపితే వన్యప్రాణులు జనావాసాల వైపు రాకుండా ఉంటాయని పలువురు పర్యావరణ పరిరక్షణ నిపుణులు సూచిస్తున్నారు. ముఖ్యంగా రేంజ్‌ల వారీగా పెద్దపులులు, చిరుత పులుల సంచారం ఎక్కువగా ఉన్న ప్రాంతాలను గుర్తించి నీటి నిల్వలను పెంచాల్సిన అవసరముందని వారు పేర్కొంటున్నారు.

పులుల సంచారం పెరిగింది

ప్రస్తుతం నల్లమలలో పులుల సంచారం పెరిగింది. నాగార్జునసాగర్–శ్రీశైలం పులుల అభయారణ్యంలో గతంలో కంటే ఇప్పుడు 73 వరకు పెద్దపులులు సంచరిస్తున్నాయి. అర్ధవీడు, కొలుకుల పరిసర ప్రాంతాల్లో ఎప్పటి నుంచో పులుల సంచారం ఉంది. అయితే కొన్ని ప్రాంతాల్లో నీటి కోసం పెద్దపులులు చెరువులు, కుంటల వద్దకు రావటం సహజంగానే జరుగుతుంది.
– విఘ్నేష్ అప్పావ్, ఫీల్డ్ డైరెక్టర్, మార్కాపురం



బంగాళాఖాతంలో వ్యూహాత్మక పోర్టు

చైనా దూకుడుకు దీటుగా నికోబార్ దీవుల్లో ట్రాన్షిప్‌మెంట్ పోర్టు

దేశ రక్షణ, వాణిజ్య ప్రయోజనాలే లక్ష్యం

- తూర్పు, పశ్చిమ దేశాల సముద్ర మార్గంలో వ్యూహాత్మక స్థావరం
- రూ.41 వేల కోట్లతో 'గలాటియా బే' వద్ద నిర్మించనున్న కేంద్ర ప్రభుత్వం
- ప్రస్తుతం సింగపూర్, కొలంబో పోర్టులపై ఆధారపడుతున్న భారత్

సాక్షి, అమరావతి: సువిశాల జలసాగరం మన దేశ వ్యూహాత్మక ప్రయోజనాలకు మరింత కీలకం కానుంది. దేశంలో తొలి అంతర్జాతీయ ట్రాన్షిప్‌మెంట్ పోర్టును బంగాళాఖాతంలోని నికోబార్ దీవుల్లో నిర్మించాలని కేంద్ర ప్రభుత్వం నిర్ణయించింది. అతి భారీ నౌకల ద్వారా సరుకు రవాణా కోసం విదేశాల్లోని ట్రాన్షిప్‌మెంట్ పోర్టులపై ఆధారపడుతున్న అనివార్యతకు ఇది ముగింపు పలకనుంది. దేశ భద్రత ప్రయోజనాలకు కీలక స్థావరంగా మార్చడంతోపాటు అంతర్జాతీయ నౌకా వాణిజ్యానికి ప్రధాన కేంద్రంగా నికోబార్ దీవుల్లోని 'గలాటియా బే' వద్ద అంతర్జాతీయ ట్రాన్షిప్‌మెంట్ పోర్టును నిర్మించి అభివృద్ధి చేయనున్నారు. తూర్పు, పశ్చిమ దేశాల సముద్ర మార్గానికి సమీపంలో నిర్మించనున్న ఈ పోర్టు అంతర్జాతీయ నౌకా రవాణాలో కీలకం కానుంది. అందుకు సన్నాహకంగా 2020లోనే కేంద్ర పాలిత ప్రాంతం అండమాన్, నికోబార్ రాజధాని పోర్టు బ్లెయిర్‌కు చెన్నై నుంచి సముద్రగర్భంలో 2,312 కి.మీ. ఆప్టికల్ ఫైబర్ కేబుల్ నిర్మాణ పనులను ప్రభుత్వం చేపట్టింది. ప్రస్తుతం ట్రాన్షిప్‌మెంట్ పోర్టు నిర్మాణానికి రూ.41వేల కోట్లతో టెండర్ల ప్రక్రియ చేపట్టింది.

ట్రాన్షిప్‌మెంట్ పోర్టు లేక ఆర్థిక భారం

అతి పొడవైన తీర ప్రాంతం ఉన్నప్పటికీ భారత్‌కు అంతర్జాతీయ ట్రాన్షిప్‌మెంట్ పోర్టు లేకపోవడం ప్రధాన అవరోధంగా మారింది. తూర్పు తీరం, పశ్చిమ తీరంలోని పోర్టుల్లో బెర్త్‌ల వద్ద గరిష్ట లోతు 8 మీటర్ల నుంచి 12 మీటర్లే ఉంది. దీంతో గరిష్టంగా 75 వేల టన్నుల కార్గో సామర్థ్యం కలిగిన కంటైనర్ నౌకలే ఈ పోర్టులకు వస్తున్నాయి. అంతర్జాతీయ లాజిస్టిక్స్ వ్యాపార ప్రమాణాల మేరకు 1.65 లక్షల టన్నుల నుంచి 1.80 లక్షల టన్నుల సామర్థ్యం ఉన్న కంటైనర్ నౌకల్లో సరుకు రవాణా జరుగుతోంది. అంత పెద్ద కంటైనర్లతో కూడిన నౌకలు రావాలంటే పోర్టుల్లోని బెర్త్‌ల వద్ద లోతు 12 మీటర్ల నుంచి 20 మీటర్ల వరకు ఉండాలి. అటువంటి పోర్టు లేకపోవడంతో వివిధ దేశాల నుంచి వస్తున్న భారీ షిప్‌లను భారత్‌కు సమీపంలో ఉన్న సింగపూర్, కొలంబో, క్లంగ్ (మలేషియా), దుబాయిలోని అంతర్జాతీయ షిప్‌మెంట్ పోర్టులకు తరలించి అక్కడ 75వేల టన్నుల కార్గో సామర్థ్యం ఉన్న కంటైనర్లలోకి మార్చి భారత్‌లోని పోర్టులకు రప్పించాల్సి వస్తోంది. భారత్ నుంచి 75 వేల టన్నులకు మించిన కార్గో రవాణా చేయాలంటే తొలుత చిన్న కంటైనర్లలో సమీప దేశాల్లోని అంతర్జాతీయ ట్రాన్షిప్‌మెంట్ పోర్టులకు తరలించి అక్కడ నుంచి భారీ కంటైనర్ ద్వారా గమ్యస్థానాలకు చేర్చాల్సి వస్తోంది. అందుకోసం హ్యాండ్లింగ్ చార్జీల కింద ఒక్కో కంటైనర్ యూనిట్ కోసం 250 అమెరికన్ డాలర్లు చెల్లించాల్సి వస్తోంది. భారత్ మొత్తం కార్గో రవాణాలో 25 శాతం నాలుగు విదేశీ ట్రాన్షిప్‌మెంట్ పోర్టులపై ఆధారపడాల్సి వస్తోంది. అందులో 40 శాతం కొలంబో పోర్టు ద్వారానే సాగుతుండటం గమనార్హం. దీంతో భారత్ ఏటా రూ.5వేల కోట్ల ఆదాయాన్ని కోల్పోతోంది.


చైనా గుప్పిట్లో కొలంబో పోర్టు

కొలంబో పోర్టుపై చైనా ఆధిపత్యం మన దేశ వ్యూహాత్మక ప్రయోజనాలకు విఘాతం కలిగిస్తోంది. శ్రీలంక ఆర్థిక ఇబ్బందులను అవకాశంగా చేసుకుని చైనా అధిక వడ్డీలకు అప్పులు ఇచ్చింది. కొలంబో పోర్టు పరిసరాల్లో మౌలిక వసతుల కల్పనపై చైనా భారీగా పెట్టుబడులు పెట్టింది. అందుకు ప్రతిగా కొలంబో పోర్టుపై చైనా నియంత్రణను అంగీకరించింది. ఒత్తిడికి లొంగి చైనా యుద్ధ నౌకలు కొలంబో పోర్టులో లంగరు వేసేందుకు శ్రీలంక సమ్మతించింది. దీనిపై భారత్ అభ్యంతరాలు వ్యక్తం చేసినప్పటికీ ఫలితం లేకపోయింది. ఈ నేపథ్యంలో కొలంబో పోర్టుపై ఆధారపడటం భారత్ భద్రతా ప్రయోజనాల దృష్ట్యా సరైంది కాదని రక్షణ శాఖ నిపుణులు స్పష్టం చేశారు.

వ్యూహాత్మకంగా కీలకం.. గలాటియా బే

వ్యూహాత్మక ప్రయోజనాల పరిరక్షణతోపాటు అంతర్జాతీయ నౌకా రవాణాలో కీలక వాటా కోసం నికోబార్‌లో ట్రాన్షిప్‌మెంట్ పోర్టు నిర్మించాలని భారత్ నిర్ణయించింది. అందుకే అటు హిందూ మహాసముద్రం ఇటు పసిఫిక్ మహాసముద్రానికి సమీపంలో బంగాళాఖాతంలో ఉన్న నికోబార్ దీవిలోని 'గలాటియా బే' వ్యూహాత్మక ప్రదేశంగా ఎంపిక చేసింది.

- అంతర్జాతీయంగా అత్యధికంగా నౌకలు రవాణా సాగే తూర్పు, పశ్చిమ దేశాలను అనుసంధానించే సముద్ర మార్గానికి సమీపంలో (కేవలం 8 నాటికల్ మైళ్ల దూరంలో) గలాటియా బే ఉంది. అంటే గంటకంటే తక్కువ సమయంలో ఆ పోర్టుకు చేరుకోవచ్చు. దీంతో సింగపూర్, కొలంబో, క్లంగ్ పోర్టుల కంటే నికోబార్ పోర్టు అంతర్జాతీయ వాణిజ్యాన్ని ఎక్కువగా ఆకర్షించే అవకాశాలున్నాయి.
- గలాటియా బే అంతర్జాతీయంగా ప్రసిద్ధి చెందిన మలక్కా జలసంధి ముఖద్వారానికి సమీపంలో ఉంది. హిందూ మహాసముద్రం, పసిఫిక్ మహా సముద్రాలను అనుసంధానించే మలక్కా జల సంధి ద్వారా ఏటా లక్ష నౌకలు రాకపోకలు సాగిస్తాయి. ప్రపంచంలో మొత్తం జల రవాణాలో 25 శాతం ఈ జలసంధి ద్వారానే సాగుతుంది.



- ఆస్ట్రేలియా, జపాన్, కొరియా సముద్ర మార్గంలో గలాటియా బే నోడల్ కేంద్రంగా ఉండటంతో ట్రాన్షిప్‌మెంట్ పోర్టుకు అనువైందని కేంద్ర ప్రభుత్వ జియోటెక్నికల్ నివేదిక-2016 పేర్కొంది.
- అంతర్జాతీయ కార్గో రవాణాలో అగ్రస్థానంలో ఉన్న సింగపూర్, దుబాయి ట్రాన్షిప్‌మెంట్ పోర్టులకు దీటుగా నికోబార్‌లో నిర్మించే పోర్టు అభివృద్ధి చెందుతుంది.
- బంగాళాఖాతం, హిందూ మహాసముద్రంలో భారత్ రక్షణ, వ్యూహాత్మక ప్రయోజనాలకు కీలకంగా నిలుస్తుంది.
- అక్కడ నిర్మించే పోర్టు బెర్త్‌ల వద్ద 18 మీటర్ల నుంచి 20 మీటర్ల లోతు ఉండేలా నిర్మించేందుకు అవకాశం ఉంది. ఆ దీవి వద్ద సముద్ర అడుగు భాగం పూర్తిగా గట్టి రాయితో ఉంది. దీంతో పెద్దగా డ్రెడ్జింగ్ (ఇసుక మేటలు తీయడం) చేయాల్సిన అవసరం ఉండదు. ఫలితంగా నిర్వహణ వ్యయం తగ్గుతుంది.

నేడు రెవెన్యూ శాఖ ప్రాంతీయ సదస్సు

హాజరుకానున్న 9 జిల్లాల కలెక్టర్లు, జేసీలు, ఉన్నతాధికారులు

సాక్షి, విశాఖపట్నం : రెవెన్యూ వ్యవహారాలకు సంబంధించిన అంశాలపై సమగ్ర అవగాహన కల్పించేందుకు రీజినల్ రెవెన్యూ కాన్ఫరెన్స్‌ను శనివారం నిర్వహించనున్నారు. రుషికొండలోని రాడిసన్ బ్లూ హోటల్‌లో నిర్వహించే సదస్సును రెవెన్యూ శాఖ మంత్రి ధర్మాన ప్రసాదరావు ప్రారంభిస్తారు. ఈ సదస్సులో సీసీఎల్‌ఏ, రెవెన్యూ శాఖ ముఖ్యకార్యదర్శి, సర్వే అండ్ సెటిల్‌మెంట్ డైరెక్టర్‌తోపాటు ఉత్తరాంధ్ర జిల్లాలైన శ్రీకాకుళం, విజయనగరం, పార్వతీపురం మన్యం, విశాఖపట్నం, అనకాపల్లి, అల్లూరి సీతారామరాజు జిల్లాలతోపాటు కాకినాడ, తూర్పు గోదావరి, డా.బీఆర్ అంబేడ్కర్ కోనసీమ జిల్లాల కలెక్టర్లు, జాయింట్ కలెక్టర్లు, డీఆర్వోలు, ఆర్డీవోలు, తహసీల్దార్లు, ఇతర అధికారులు హాజరుకానున్నారు. ఈ సందర్భంగా రెవెన్యూ శాఖలో పనిచేస్తున్న 45 ఏళ్ల పైబడిన ఉద్యోగుల కోసం ఆరోగ్య శిబిరం ఏర్పాటు చేస్తున్నారు.

ఎరువులు, పురుగు మందుల షాపుల్లో విజిలెన్స్ తనిఖీలు

సాక్షి, అమరావతి: రాష్ట్ర వ్యాప్తంగా ఎరువులు, పురుగు మందుల దుకాణాల్లో విజిలెన్స్-ఎన్‌ఫోర్స్‌మెంట్ అధికారులు రాష్ట్ర వ్యాప్తంగా శుక్రవారం తనిఖీలు నిర్వహించారు. 50 ఎరువుల దుకాణాలు, 24 పురుగు మందుల దుకాణాల్లో తనిఖీలు జరిపి పలు అక్రమాలు, నిబంధనల ఉల్లంఘనలను గుర్తించారు. రికార్డుల్లో చూపించని ఎరువులు, పురుగు మందులను జప్తు చేశారు. నాలుగు ఎరువుల దుకాణాలు, ఒక పురుగు మందుల దుకాణంపై కేసు నమోదు చేశారు.

ఏప్రిల్ 2 నుంచి జపాన్‌లో జి-20 సమ్మిట్ సన్నాహక సదస్సు

సాక్షి, అమరావతి: జపాన్‌లో ఏప్రిల్ 2 నుంచి 9వ తేదీ వరకు పారిశ్రామికవేత్తలతో గ్లోబల్ ఎకానమిక్ ఫోరం జి-20 సన్నాహక సదస్సు నిర్వహించనున్నారు. ఈ సదస్సుకు జి-20 సభ్యదేశాలకు చెందిన ప్రముఖ పారిశ్రామికవేత్తలను ఆహ్వానించి, సభ్యదేశాల మధ్య పారిశ్రామికంగా పరస్పర సహకారం, వ్యాపార ఒప్పందాలకు కృషి చేయనున్నారు. ఈ సదస్సుకు సంబంధించిన బ్రోచర్‌ను ఇటీవల ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి ఆవిష్కరించారు. ఢిల్లీలో జరిగిన ఈ కార్యక్రమంలో వైఎస్సార్ కాంగ్రెస్ పార్లమెంటరీ పార్టీ నేత వి.విజయసాయిరెడ్డి, రాష్ట్ర ఐటీ, పరిశ్రమల శాఖ మంత్రి గుడివాడ అమర్‌నాథ్, విదేశీ వ్యవహారాల శాఖ సంయుక్త కార్యదర్శి భావనా సక్సేనా పాల్గొన్నారు.

ఫోర్జరీ కేసులో కౌంటరు దాఖలు చేయండి

- అయ్యన్నపాత్రుడికి సుప్రీంకోర్టు ఆదేశం

సాక్షి, న్యూఢిల్లీ : ఫోర్జరీ కేసులో కౌంటరు దాఖలు చేయాలని టీడీపీ నేత చింతకాయల అయ్యన్నపాత్రుడికి సుప్రీంకోర్టు నోటీసులు జారీ చేసింది. బిల్డింగ్ ప్లాను విషయంలో చింతకాయల అయ్యన్నపాత్రుడు ఓ అధికారి సంతకం ఫోర్జరీ చేశారనే కేసులో హైకోర్టు ఆదేశాలను సవాల్ చేస్తూ రాష్ట్ర ప్రభుత్వం తరఫున ఈఈ మల్లికార్జునరావు దాఖలు చేసిన పిటిషన్‌ను శుక్రవారం జస్టిస్ ఎంఆర్ షా, జస్టిస్ సీటీ రవికుమార్‌తో కూడిన ధర్మాసనం విచారించింది. గత విచారణ సమయంలో జారీ చేసిన నోటీసులు రెండు రోజుల క్రితమే అందాయని అయ్యన్నపాత్రుడు తరఫు న్యాయవాది ధర్మాసనానికి తెలిపారు. దీంతో రెండు వారాల్లో కౌంటరు దాఖలు చేయాలని అయ్యన్నపాత్రుడికి ఆదేశాలు ఇచ్చిన ధర్మాసనం ఈ నెల 27వ తేదీకి విచారణను వాయిదా వేసింది.

క్లుప్తంగా...

మూడు రాజధానులకే ప్రజా మద్దతు

- 859వ రోజు రిలే దీక్షలో బహుజన నాయకులు



రిలే దీక్షలో పాల్గొన్న బహుజన నేతలు

తాడికొండ: మూడు రాజధానుల ఏర్పాటుకు రాష్ట్ర ప్రజలంతా సుముఖంగా ఉన్నారని బహుజన పరిరక్షణ సమితి నాయకులు అన్నారు. తుళ్లూరు మండలం తాళ్లాయపాలెం సీడ్ యాక్సిస్ రోడ్డు జంక్షన్‌లో మూడు రాజధానులకు మద్దతుగా బహుజన పరిరక్షణ సమితి ఆధ్వర్యంలో చేపట్టిన రిలే నిరాహార దీక్షలు శుక్రవారం నాటికి 859వ రోజుకు చేరాయి. పలువురు మాట్లాడుతూ రాజకీయంగా సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డిని ఎదుర్కోలేక రాష్ట్రంలో దుష్ప్రచారానికి తెరలేపిన బాబు ప్రజల మనస్సుల్లో స్థానం సంపాదించడం అసాధ్యమన్నారు. చంద్రబాబు నేడు తన రాజకీయ ఉనికి కోసమే అమరావతి ఉద్యమం నీరుగార్చి పుత్రుడు లోకేశ్, దత్త పుత్రుడు పవన్‌కళ్యాణ్‌ను రాష్ట్రంపైకి వదిలి రాజకీయ లబ్ధి కోసం పాకులాడుతున్నాడని మండిపడ్డారు. గత ప్రభుత్వం కంటే సీఎం వైఎస్ జగన్ మోహన్ రెడ్డి హయాంలోనే అమరావతి ప్రాంతంలో అత్యధికంగా అభివృద్ధి చెందిందనడంలో సందేహం లేదన్నారు. తాత్కాలిక నిర్మాణాలతో అమరావతిలో నిలువు దోపిడీ చేసి వాటాలు పంచుకున్న బాబు ఈ ప్రాంతాన్ని అడవిలా మార్చాడని విమర్శించారు. నాయకులు మాదిగాని గురునాథం, నూతక్కి జోషి, పెరికే వరప్రసాద్ బేతపూడి సాంబయ్య ఈపూరి ఆదాం, పులి దాసు తదితరులు పాల్గొన్నారు.

కారు బంపర్‌లో ఇరుక్కుపోయిన శునకం

70 కి.మీ. అలాగే ప్రయాణం

యశవంతపుర: ఓ శునకం కారు బంపర్‌లో ఇరుక్కుపోయి 70 కిలోమీటర్ల దూరం అలాగే ప్రయాణించింది. ఈ ఘటన దక్షిణ కన్నడ జిల్లా పుత్తూరులో జరిగింది. పుత్తూరు కబకకు చెందిన సుబ్రహ్మణ్య దంపతులు శుక్రవారం కారులో కుక్కే సుబ్రహ్మణ్య ఆలయానికి వెళ్లారు. స్వామివారిని దర్శించుకుని.. తిరుగు ప్రయాణంలో ఉండగా బళ్ప వద్ద కారు కుక్కను ఢీకొంది. సుబ్రహ్మణ్యం కిందకు దిగి చూడగా కుక్క కనిపించలేదు. రోడ్డు పక్కన పొదల్లోకి వెళ్లి ఉంటుందని భావించి ప్రయాణం కొనసాగించారు. ఇంటికి వెళ్లిన తర్వాత అరుపులు వినిపించగా కారు మొత్తం పరిశీలించారు. బంపర్ గ్రిల్ మధ్య కుక్క కనిపించింది. గ్యారేజ్‌కు తీసుకెళ్లి కుక్కను బయటకు తీయించారు. కుక్క సురక్షితంగా ఉండటంతో ఊపిరి పీల్చుకున్నారు.

సీబీఐ విచారణకు సీఎంవో ఓఎస్డీ హాజరు

కడప అర్బన్: మాజీ మంత్రి వైఎస్ వివేకానంద రెడ్డి హత్య కేసులో శుక్రవారం కడప సెంట్రల్ జైల్ గెస్ట్‌హౌస్‌లో సీబీఐ అధికారుల ఎదుట సీఎంవో ఓఎస్డీ కృష్ణమోహన్‌రెడ్డి ఉదయం 11.10 గంటలకు హాజరయ్యారు. విచారణ అనంతరం సాయంత్రం 5.30 గంటలకు తిరిగి వెళ్లారు. అలాగే సీఎంవో కార్యాలయంలో సహాయకుడిగా పనిచేస్తున్న నవీన్ కూడా ఉదయం 11.50 గంటలకు సీబీఐ ఎదుట విచారణకు హాజరై సాయంత్రం 5.30 గంటలకు తిరిగి వెళ్లారు.

ఆ భూములను స్వాధీనం చేసుకోవాలి

సీసీఎల్ఏను ఆదేశించిన లోకాయుక్త

కర్నూలు (సెంట్రల్): ఇంటిదొంగలపై రెవెన్యూ శాఖ అప్రమత్తంగా ఉండాలని లోకాయుక్త సూచించింది. ప్రభుత్వ భూములను తహసీల్దార్, మండల రెవెన్యూ ఇన్‌స్పెక్టర్లే అనధికారికంగా బినామీల పేర్లతో వెబ్‌ల్యాండ్‌లో మార్చి ఆక్రమించుకోవడం అన్యాయమని ఆవేదన వ్యక్తం చేసింది. ఈ భూములు తిరిగి ప్రభుత్వానికి చెందేలా చర్యలు తీసుకోవాలని సీసీఎల్ఏను ఆదేశించింది. ఈ మేరకు శుక్రవారం లోకాయుక్త జస్టిస్ పి.లక్ష్మణ్‌రెడ్డి ఆదేశాలు జారీచేశారు. 2014–19 సంవత్సరాల మధ్య ఎస్‌పీఎస్ఆర్ నెల్లూరు జిల్లా మర్రిపాడు మండలం ఇరియపాడు పంచాయతీలోని ఈర్లపాడు, ఇసుకపల్లి, రాజులపాడు గ్రామాల పరిధిలో దాదాపు 2,500 ఎకరాల ప్రభుత్వ భూమి ఉంది. అప్పట్లో మర్రిపాడు తహసీల్దార్‌గా పనిచేసిన ఎం.వి.కృష్ణారావు (ప్రస్తుతం ఉద్యోగ విరమణ చేశారు), ఎంఆర్ఐగా పనిచేసిన ఎన్.వి.వి.ఎస్.రవికుమార్ ప్రభుత్వ భూములను అక్రమంగా వెబ్‌ల్యాండ్‌లో మార్పులు చేసి బినామీ పేర్లతో మ్యుటేషన్ చేసినట్లు ఆరోపణలొచ్చాయి. దీనిపై ఇరియపాడు పంచాయతీ ప్రజలు లోకాయుక్తను ఆశ్రయించారు. 2016లోనే వెబ్‌ల్యాండ్‌లో మార్పులు, ధనవంతులకు భూములు కట్టబెట్టడంపై రాష్ట్ర ప్రభుత్వం సీబీసీఐడీ విచారణకు ఆదేశించింది. అక్రమాలు నిజమేనని తేలడంతో అప్పట్లోనే తహసీల్దార్, ఎంఆర్ఐలను పోలీసులు అరెస్టు చేసి జ్యుడిషియల్ రిమాండ్‌కు పంపారు. ఈ క్రమంలో ఇరియపాడు పంచాయతీ ప్రజల వినతిని విచారణను స్వీకరించిన లోకాయుక్త సీబీసీఐడీ పూర్తిస్థాయి విచారణ వివరాలను మూడునెలల్లో తమ ముందు ఉంచాలని అదనపు సీఐడీ అధికారిని లోకాయుక్త జస్టిస్ పి.లక్ష్మణ్ రెడ్డి ఆదేశించారు.

కర్ణాటక మద్యం తరలిస్తున్న టీడీపీ పెనుకొండ మండల కన్వీనర్ అరెస్ట్

- మరో ముగ్గురు కూడా...
- 30 మద్యం బాక్సులు, కారు, బైక్ స్వాధీనం



పోలీసులు అరెస్ట్ చేసిన టీడీపీ నేత సిద్ధయ్య, ఇతర నిందితులు, సీజ్ చేసిన మద్యం బాక్సులు


పెనుకొండ: శ్రీ సత్యసాయి జిల్లా పెనుకొండ మండల టీడీపీ కన్వీనర్ దూదేకుల సిద్ధయ్య కర్ణాటక మద్యం రవాణా చేస్తూ గురువారం రాత్రి పోలీసులకు దొరికాడు. పెనుకొండ పోలీస్ స్టేషన్‌లో శుక్రవారం డీఎస్పీ హుస్సేన్ పీరా ఈ కేసు వివరాలను వెల్లడించారు. శెట్టిపల్లికి చెందిన టీడీపీ మండల కన్వీనర్ దూదేకుల సిద్ధయ్య ఆధ్వర్యంలో దూదేకుల బాష (పెనుకొండ), బిల్లు ప్రశాంత్‌కుమార్ (ధర్మవరం), కృష్ణారెడ్డి (అనంతపురం జిల్లా గార్లదిన్నె మండలం కొప్పలకొండ) ముఠాగా ఏర్పడ్డారు. వీరు కర్ణాటక నుంచి మద్యం తీసుకువచ్చి వివిధ ప్రాంతాల్లో ఎక్కువ ధరకు విక్రయిస్తున్నారు. ఈ క్రమంలో గురువారం ప్రశాంత్‌కుమార్, కృష్ణారెడ్డి కర్ణాటకలోని గౌరిబిదనూరు ప్రాంతంలో పలు షాపుల నుంచి 30 కేసుల మద్యం కొనుగోలు చేసి కారులో పెనుకొండ వైపు బయలుదేరారు. వారికి సిద్ధయ్య, బాష ద్విచక్ర వాహనంపై ఎస్కార్ట్‌గా వస్తున్నారు. ఈ సమాచారం అందడంతో మరవపల్లి సమీపంలో సిద్ధయ్యతోపాటు మరో ముగ్గురిని కూడా పోలీసులు అరెస్ట్ చేశారు. మద్యం బాక్సులతోపాటు కారు, ద్విచక్ర వాహనం స్వాధీనం చేసుకున్నారు. నిందితులను కోర్టులో హాజరుపరిచారు.

విద్యార్థుల యూనిఫాంలో అసెంబ్లీకి ఎమ్మెల్యేలు

పుదుచ్చేరిలోని ప్రభుత్వ పాఠశాల విద్యార్థులకు యూనిఫాం, పుస్తకాలు, సైకిళ్ల పంపిణీ చేయకపోవడాన్ని నిరసిస్తూ వినూత్నంగా డీఎంకే ఎమ్మెల్యేలు విద్యార్థుల యూనిఫాం ధరించి సైకిల్‌పై పుదుచ్చేరి అసెంబ్లీ సమావేశాలకు శుక్రవారం హాజరయ్యారు. విద్యార్థుల సమస్యలపై గళమెత్తారు. వీరికి కాంగ్రెస్ సభ్యులు మద్దతుగా నిలిచారు. - సాక్షి, చెన్నై



క్యాన్సర్‌ను ఆదిలోనే అంతం చేద్దాం



జీవన శైలి, జన్యుపరమైన కారణాలతో ఏటా పెరుగుతున్న బాధితులు

- రాష్ట్రంలో ఏటా 70వేల క్యాన్సర్ కేసులు నమోదు
- 38 వేల మందికిపైగా మృతి
- రాష్ట్రంలో మరణాలకు మూడో ప్రధాన కారణం క్యాన్సర్
- వ్యాధిని ప్రాథమిక దశలో పసిగడితే నివారణ సాధ్యం
- నేడు అంతర్జాతీయ క్యాన్సర్ దినోత్సవం

సాక్షి, అమరావతి: క్యాన్సర్.. ప్రపంచాన్ని వణికిస్తున్న భయంకరమైన జబ్బు. ఏటా ప్రపంచవ్యాప్తంగా లక్షలాది మందిని పొట్టన పెట్టుకుంటున్న ఈ వ్యాధికి అవగాహనే సరైన మందు అంటున్నారు నిపుణులు. క్యాన్సర్‌ను ప్రాథమిక దశలో గుర్తించడం కూడా ఒకరకమైన చికిత్సేనని సూచిస్తున్నారు. తద్వారా ప్రాణాపాయం తప్పడంతో పాటు, పూర్తిగా వ్యాధి నివారణకు అవకాశాలు ఉంటాయని వివరిస్తున్నారు. నేడు ప్రపంచ క్యాన్సర్ దినోత్సవం సందర్భంగా ఈ వ్యాధి లక్షణాలు, తీసుకోవాల్సిన జాగ్రత్తలపై 'సాక్షి' ప్రత్యేక కథనం..

జీవనశైలి ప్రధాన కారణం

దేశంలో క్యాన్సర్ శరీరంలో రకరకాలుగా వ్యాపిస్తుంది. ట్యూమర్లు, బ్లడ్ క్యాన్సర్, ఊపిరితిత్తులు, నోరు, గర్భాశయ, రొమ్ము వంటి క్యాన్సర్‌లు ఎక్కువగా వ్యాప్తి చెందుతున్నాయి. వీటికి జీవనశైలి ప్రధాన కారణమని నిపుణులు చెబుతున్నారు. ధూమపానం, ఇతర పొగాకు ఉత్పత్తుల వినియోగం, మద్యపానం, ఆహార అలవాట్లు క్యాన్సర్‌కు దారితీస్తున్నాయి. ఏటేటా క్యాన్సర్ వ్యాధిగ్రస్తుల సంఖ్య పెరుగుతోంది. ఇండియన్ కౌన్సిల్ ఆఫ్ మెడికల్ రీసెర్చ్ (ఐసీఎంఆర్) ప్రకారం 2020లో దేశంలో నమోదైన క్యాన్సర్ కేసుల్లో 27% పొగాకు ఉత్పత్తులకు సంబంధించినవి ఉన్నాయి. మద్యం ప్రియులకు ఏడు రకాల క్యాన్సర్ గండాలున్నట్లు ఇటీవల డబ్ల్యూహెచ్‌వో హెచ్చరించింది. ఆలస్యంగా పెళ్లి చేసుకోవడం, 30 ఏళ్లు దాటిన తర్వాత గర్భం దాల్చడం, బిడ్డకు పాలివ్వకపోవడం వంటి కారణాలు మహిళల్లో రొమ్ము క్యాన్సర్‌కు కారణాలవుతున్నాయి. అదే విధంగా మర్మావయవాలు శుభ్రంగా ఉంచుకోకపోవడం, మైనర్‌గా ఉన్నప్పుడే పెళ్లి, పిల్లలు పుట్టడం గర్భాశయ ముఖద్వార క్యాన్సర్‌కు తావిస్తోంది.

రాష్ట్రంలో మరణాలకు మూడో ప్రధాన కారణం క్యాన్సర్

మన రాష్ట్రంలోనూ క్యాన్సర్ తీవ్రంగా ఉంది. రాష్ట్రంలో వ్యాధుల కారణంగా సంభవిస్తున్న మరణాలకు మూడో ప్రధాన కారణం క్యాన్సరే. మొత్తం మరణాల్లో 32 శాతం మరణాలకు గుండె సంబంధిత జబ్బులు, 10.8 శాతం క్రానిక్ రెస్పిరేటరీ, 9.6 శాతం క్యాన్సర్ మరణాలు ఉంటున్నాయి. రాష్ట్రంలో ఏటా 70 వేల కొత్త క్యాన్సర్ కేసులు నమోదవుతుండగా, 38 వేలకు పైగా మరణాలు నమోదవుతున్నాయి. వీటిలో 70 శాతం కేసులు మూడు, నాలుగు దశల్లో నిర్ధారణ అవుతున్నాయి. అప్పటికే వ్యాధి తీవ్రత పెరిగిపోవడంతో చికిత్స కష్టమవుతోంది. రాష్ట్రంలో క్యాన్సర్ వ్యాధి నియంత్రణ, నివారణపై రాష్ట్ర ప్రభుత్వం ప్రత్యేక దృష్టి పెట్టింది. ఇప్పటికే క్యాన్సర్‌ను నోటిఫైడ్ జబ్బుల జాబితాలో చేర్చింది. ప్రాథమిక దశలోనే క్యాన్సర్‌ను గుర్తించడానికి ఎన్‌సీడీ-సీడీ సర్వే చేస్తోంది. మరోవైపు క్యాన్సర్‌కు అధునాతన వైద్య విధానాలను అందుబాటులోకి తెస్తోంది. బోధనాస్పత్రుల్లో అధునాతన వైద్య పరికరాలను సమకూరుస్తున్నారు. ఇందుకోసం రూ.100 కోట్లకు పైగా ఖర్చు చేస్తోంది. క్యాన్సర్ రోగుల కోసం ప్రత్యేక సౌకర్యాలు కల్పిస్తోంది.

ఇవి గుర్తించాలి..

- నిత్యం అలసటగా ఉండటం. ఈ లక్షణం ఉండేవారిలో ఎక్కువగా పెద్ద పేగు, లుకేమియా క్యాన్సర్‌లు ఏర్పడే ప్రమాదం ఉంది
- ఏ కారణం లేకుండా ఒకే చోట నొప్పి రావడం, చికిత్స చేయించుకున్నా నొప్పి తగ్గకపోవడం.. దీనివల్ల పెద్ద పేగు, బ్రెయిన్ ట్యూమర్, పురీషనాళం, అండాశయ క్యాన్సర్లు ఏర్పడే ప్రమాదం ఉంది.
- శరీరంలో ఎక్కడైనా వాపు, గడ్డలు కనిపిస్తే వెంటనే వైద్యులను సంప్రదించాలి. మహిళల్లో రొమ్ముల వద్ద ఏర్పడే గడ్డలు రొమ్ము క్యాన్సర్‌ను సూచిస్తాయి.
- ఎక్కువసార్లు మూత్రం రావడం, మూత్రంలో రక్తం లేదా నొప్పి ఉంటే జాగ్రత్త పడాలి. పెద్ద పేగు క్యాన్సర్‌కు గురయ్యేవారిలో ఎక్కువగా ఈ లక్షణాలు కనిపిస్తాయి.

రాష్ట్రంలో కాంప్రహెన్సివ్ క్యాన్సర్ కేర్

రాష్ట్రంలో కాంప్రహెన్సివ్ క్యాన్సర్ కేర్ (సీసీసీ)ను ప్రభుత్వం అందుబాటులోకి తెస్తోంది. ఇందుకు రోడ్ మ్యాప్‌ను రూపొందించి, ఆ మేరకు చర్యలు కూడా ప్రారంభించింది. క్యాన్సర్ రోగులకు చికిత్స కోసం ఆరోగ్యశ్రీ ద్వారా ఏటా రూ.400 కోట్లు ఖర్చు చేస్తోంది. 'క్లోజ్ ద కేర్ గ్యాప్' నినాదంతో 2022 నుంచి 2024 వరకు వరుసగా మూడేళ్లు ప్రపంచ క్యాన్సర్ దినోత్సవాన్ని నిర్వహిస్తున్నారు. క్యాన్సర్ వ్యాధిని జయించడానికి సమాజంలోని అసమానతలను అధిగమించడంతో పాటు, వైద్య సదుపాయాలను మెరుగుపరచడం ఈ నినాదం ఉద్దేశం.

– డాక్టర్ శ్రీనివాసన్, ప్రత్యేకాధికారి క్యాన్సర్ కేర్

నివారణ మన చేతుల్లోనే

- తాజా కూరగాయలు, పళ్లు ఎక్కువగా తీసుకోవాలి
- ప్రాసెస్డ్ ఫుడ్, చక్కెర శాతం ఎక్కువగా ఉన్న ఆహారం తగ్గించాలి
- రోజూ వ్యాయామం చేయాలి
- వంశపారంపర్యంగా క్యాన్సర్ వచ్చే అవకాశాలున్న వాళ్లు మరింత అప్రమత్తంగా ఉండాలి
- శరీర బరువును అదుపులో ఉంచుకోవాలి
- ఏ అనారోగ్య లక్షణమైనా మూడు వారాలకు మించి తగ్గకపోతే వైద్యులను సంప్రదించాలి
- మద్యపానం, పొగతాగడం పూర్తిగా మానాలి

దేశంలో గడిచిన మూడేళ్లలో క్యాన్సర్ ప్రభావం ఇలా

సంవత్సరం	నమోదైన కేసులు	మరణాలు
2020	13,92,176	7,70,000
2021	14,26,447	7,89,000
2022	14,61,427	8,08,000

తెలంగాణ

13 వరకు తెలంగాణ బడ్జెట్ సమావేశాలు!

సాక్షి, హైదరాబాద్: తెలంగాణ రాష్ట్ర అసెంబ్లీ బడ్జెట్ సమావేశాలు ఈ నెల 13 వరకు కొనసాగే అవకాశాలు ఉన్నాయి. శుక్రవారం అసెంబ్లీ ఉభయ సభలను ఉద్దేశించి గవర్నర్ ప్రసంగించిన తర్వాత శనివారానికి వాయిదా పడ్డాయి. అనంతరం శాసనసభ, శాసన మండలి బిజినెస్ అడ్వైజరీ కమిటీ (బీఏసీ) సమావేశాలు జరిగాయి. స్పీకర్ పోచారం శ్రీనివాస్‌రెడ్డి అధ్యక్షతన జరిగిన భేటీలో మంత్రులు కేటీఆర్, వేముల ప్రశాంత్‌రెడ్డి, గంగుల కమలాకర్, హరీశ్‌రావు, ఎర్రబెల్లి దయాకర్‌రావు, కొప్పుల ఈశ్వర్, నిరంజన్‌రెడ్డి, ప్రభుత్వ చీఫ్ విప్ దాస్యం వినయ్‌భాస్కర్, కాంగ్రెస్ శాసనసభాపక్ష నేత మల్లు భట్టి విక్రమార్క, అసెంబ్లీ కార్యదర్శి నర్సింహాచార్యులు పాల్గొన్నారు. తాము ప్రతిపాదించిన అంశాలను చర్చించడం లేదనే కారణంతో ఎంఐఎం శాసనసభాపక్ష నేత అక్బరుద్దీన్ బీఏసీ సమావేశానికి దూరంగా ఉన్నారు. ఇక బీఏసీలో బీజేపీకి సమావేశానికి ఆహ్వానం అందలేదు. ఇక వీలైనన్ని ఎక్కువ రోజులు సమావేశాలు జరపాలని బీఏసీ భేటీలో భట్టి విక్రమార్క విజ్ఞప్తి చేశారు.

నేడు గవర్నర్ ప్రసంగానికి ధన్యవాదాలు

గవర్నర్ ప్రసంగానికి ధన్యవాదాలు తెలిపే తీర్మానంపై చర్చించేందుకు శాసన సభ, శాసన మండలి వేర్వేరుగా శనివారం ఉదయం 10 గంటలకు సమావేశం కానున్నాయి. ఈ నెల 5న ఆదివారం ఉభయ సభలకు విరామం ప్రకటించి.. సోమవారం 6వ తేదీన సమావేశాలు ప్రారంభిస్తారు. ఆ రోజున శాసనసభలో ఆర్థికమంత్రి హరీశ్‌రావు, శాసనమండలిలో మంత్రి వేముల ప్రశాంత్‌రెడ్డి బడ్జెట్‌ను సమర్పిస్తారు. 7న ఉభయ సభలకు విరామం ప్రకటించనుండగా.. 8న బడ్జెట్‌పై సాధారణ చర్చ జరుగుతుంది. 9, 10, 11 తేదీల్లో శాఖల వారీగా పద్దులపై శాసనసభలో చర్చ జరగనుండగా.. ఈ మూడు రోజులు శాసన మండలికి విరామం ప్రకటిస్తారు. ఈ నెల 12 లేదా 13న ఉభయ సభల్లో ద్రవ్య వినిమయ బిల్లుపై చర్చించిన తర్వాత నిరవధికంగా వాయిదా పడే అవకాశం ఉంది.

మినీ మేడారానికి భక్తుల తాకిడి

ఎస్ఎస్ తాడ్వాయి: ములుగు జిల్లా ఎస్ఎస్ తాడ్వాయి మండలం మేడారంలోని సమ్మక్క-సారలమ్మల మినీ మేడారం జాతరకు శుక్రవారం భక్తులు భారీగా తరలివచ్చారు. రాష్ట్రాలు, జిల్లాలు దాటొచ్చిన భక్తులు అమ్మవార్లను దర్శించుకుని ప్రత్యేక పూజలు చేశారు. పసుపు, కుంకుమ, సారె, ఎత్తు బంగారం (బెల్లం) సమర్పించి మొక్కులు తీర్చుకున్నారు. భక్తుల రాకతో మేడారం పరిసరాలన్నీ కిక్కిరిసిపోయాయి. ట్రాఫిక్‌కు ఇబ్బంది కలగకుండా పోలీసులు నియంత్రణ చర్యలు చేపట్టారు.

వైభవంగా సాకేత రామచంద్రుని వాహన సేవ

శంషాబాద్ రూరల్: 'సమతా కుంభ్' ఉత్సవాల్లో భాగంగా రెండోరోజు శుక్రవారం యాగశాలలో అగ్ని ప్రతిష్ఠ చేశారు. శ్రీ త్రిదండి చినజీయర్ స్వామి పర్యవేక్షణలో శ్రీరామనగరంలో ఉదయం ప్రత్యేక పూజల అనంతరం దివ్య సాకేతాలయం నుంచి స్ఫూర్తి కేంద్రం వరకు సాకేత రామచంద్రస్వామిని సూర్యప్రభ వాహనంపై ఊరేగించారు. గరుడ పటంతో ధ్వజారోహణం చేశారు. సంతానం కోరుకున్న భక్తులకు గరుడ ప్రసాదాన్ని అందజేశారు. యాగశాలలో అగ్ని ప్రతిష్ఠ అనంతరం 9 కుండాలతో యజ్ఞం చేపట్టారు. సాయంత్రం చినజీయర్ స్వామి భక్తులకు ప్రవచనం చేసి తీర్థ, ప్రసాదాలు అందజేశారు.

ఆత్మజ్ఞానం అనే ఖడ్గంతో నీ హృదయంలో ఉన్న అజ్ఞాన సంశయాన్ని ఛేదించు. నీలోని క్రమశిక్షణ శక్తులే నీకు మేల్కొలుపు.
– భగవద్గీత

సాక్షి

శనివారం, ఫిబ్రవరి, 4

దిగ్దర్శకుడు విశ్వనాథ్

'బలమైన కళ మన ఆత్మగత సుగుణాలను శక్తిమంతంగా, విజయవంతంగా తట్టిలేపుతుంది. ఈ ప్రపంచానికి విజ్ఞాన శాస్త్రం మేధ అయితే... కళ దాని ఆత్మ' అంటాడు విశ్వవిఖ్యాత రచయిత మక్సీమ్ గోర్కీ. అయిదున్నర దశాబ్దాలపైగా తన సృజనాత్మక శక్తితో వెండితెరపై అనేకానేక విలక్షణ దృశ్య కావ్యాలను సృష్టించి, ప్రేక్షకలోకాన్ని మంత్రముగ్ధుల్నిచేసి వారిలో ఉత్తమ సంస్కారాన్ని ప్రేరేపించిన కళాతపస్వి కాశీనాథుని విశ్వనాథ్ సినిమాను అక్షరాలా సమాజాన్ని ప్రభావితం చేయగల కళారూపంగా భావించారు. కనుకే అన్ని ఉత్తమ చిత్రాలు అందించగలిగారు. ఆ చిత్రాలన్నీ దివికేగిన ఆ మహనీయుణ్ణి అజరామరం చేసేవే. చలనచిత్ర చరిత్రలో ఆయనకు ప్రత్యేక స్థానాన్ని చ్చేవే. ఆంధ్రప్రదేశ్‌లోని గుంటూరు జిల్లాలో ఒక మారుమూల గ్రామంలో పుట్టిన కుర్రాడు వాహినీ సంస్థలో పనిచేస్తున్న తన తండ్రి ప్రభావంతో చలనచిత్ర రంగంవైపు దృష్టి సారించకుంటే వెండితెరపై తెలుగువారు ఎప్పటికీ గర్వించదగ్గ ఆణిముత్యాలు ఆవిష్కృతమయ్యేవి కాదు. వాహినీ స్టూడియోలో సౌండ్ ఇంజనీరింగ్ విభాగంలో పనిచేస్తూనే తన నిశిత పరిశీలనతో స్క్రీన్‌ప్లే రచనలో మెలకువలు గ్రహించి అంచెలంచెలుగా ఎదిగి దర్శకత్వం వహించే స్థాయికి చేరుకున్న సృజనకారుడు విశ్వనాథ్. 'మాలపిల్ల, మల్లీశ్వరి, మాయాబజార్' వంటి చిత్రాలు దర్శకులకు కీర్తిప్రతిష్ఠలు తెచ్చి వారిని ఉన్నత శిఖరాల్లో నిలిపితే మళ్లీ శంకరాభరణం చిత్రంతో విశ్వనాథ్‌కు అంతటి గౌరవం దక్కింది. శంకరాభరణం చిత్రానికి ముందు...ఆ మాటకొస్తే దర్శకత్వం వహించిన తొలి చిత్రం ఆత్మగౌరవం మొదలుకొని ఆయన చేతుల్లో రూపుదిద్దుకున్న చిత్రాలన్నీ ప్రశంసలందుకున్నవే. కాకపోతే శంకరాభరణం ఆయన ఆత్మ. తెలుగు చలనచిత్ర చరిత్రంటే శంకరాభరణం చిత్రానికి ముందూ, తర్వాతా అని అందరూ అనుకుంటున్నారంటే దాని వెనకున్న ఆయన కృషి అసామాన్యమైనది. ఒక సంగీత విద్వాంసుణ్ణి ప్రధానపాత్రగా మలిచిన శంకరాభరణం చిత్రం ఆయన నిర్మించుకున్న బలమైన దుర్గం. అనంతరకాలంలో దాన్ని దాటి ఆయన బయటకు రాలేకపోయారన్న విమర్శలు లేకపోలేదు. అయితే అవన్నీ కథాపరంగా వేటికవే విలక్షణమైనవి. వాటిలో అంతర్లీనంగా ఉండేసందేశాలూ భిన్నమైనవి. ఏ కులవృత్తయినా గౌరవప్రదమైనదని, దాని ముందు ఎంతటి సిరి సంపదలైనా వెలవెలబోతాయని చాటే 'స్వయంకృషి', ఎంతో ఎత్తు ఎదగటానికి ఆస్కారమున్న నృత్య కళాకారుడు జీవితంలో ఓడిపోయిన వైనాన్ని చూపే 'సాగరసంగమం', పెళ్లంటే ప్రేమంటే తెలియని అమాయక యువకుడికి నిస్సహాయ యువతితో ముడివేసిన 'స్వాతిముత్యం', కులాల అంతరాలను పెంచిపోషించే ఆచారాలను ప్రశ్నించే గుణమే అన్నిటికన్నా ప్రధానమైనదని చాటి చెప్పే 'సప్తపది', ఎంత ఎత్తుకు ఎదిగినా శిష్యుణ్ణి చూసి అసూయపడి, అతని ప్రాణాన్నే బలిగొన్న గురువు వైనాన్ని చూపిన 'స్వాతికిరణం'... ఇలా ఎన్నెన్నో విలక్షణ చిత్రాలు ఆయనవి.

ఏ తరాన్నయినా ప్రభావితం చేయగల, స్ఫూర్తినింపగల కథనాలతో విశ్వనాథ్ చిత్రాలు నిర్మించటం యాదృచ్ఛికం కాదు. సినిమా ఎంత పదునైన ఆయుధమో గ్రహించి, దాన్ని చాలా బాధ్యతాయుతంగా ఉపయోగించాలని తొలినాళ్లలోనే గ్రహించాడాయన. 'సమాజానికి మంచి చేయకపోయినా ఫర్వాలేదు...చెడు చేయకుండా జాగ్రత్త వహించటం నా కర్తవ్యమని భావిస్తాను' అని ఒక ఇంటర్వ్యూలో విశ్వనాథ్ చెప్పిన వైనాన్ని గుర్తించుకుంటే ఆయన ఔన్నత్యం అర్థమవుతుంది. ఈ క్రమంలో ఆయనకు దాదాసాహెబ్ ఫాల్కే అవార్డుతోసహా ఎన్నో పురస్కారాలు లభించాయి. ఎన్టీఆర్, అక్కినేని మొదలుకొని కృష్ణ, శోభన్‌బాబు, చిరంజీవి, వెంకటేష్, శ్రీకాంత్ వరకూ ఎందరో హీరోలతో ఆయన సినిమాలు రూపుదిద్దుకున్నాయి. వీరిలో అత్యధికులకు అప్పటికే ఉన్న ఇమేజ్‌కు భిన్నమైన పాత్రలిచ్చి, వారి అభిమానులతో సైతం ప్రశంసలు పొందటం సామాన్యమైన విషయం కాదు. అదే సమయంలో అంతక్రితం ఎవరికీ పరిచయం లేని సోమయాజులు వంటివారిని సైతం ప్రధాన పాత్రల్లో నటింపజేసి వారికి ఎనలేని కీర్తిప్రతిష్ఠలు తెచ్చిపెట్టారు. ఆరోజుల్లో ఎక్కడికెళ్లినా సోమయాజులుకు పాదాభివందనాలు ఎదురయ్యేవంటే శంకరశాస్త్రి పాత్ర ప్రజల్లో ఎంతటి బలమైన ముద్రవేసిందో తెలుస్తుంది. ఆయన నిర్మించిన చిత్రాలకు పనిచేసిన నటీనటులైనా, గీత రచయితలైనా ప్రేక్షకులకు ఎంత దగ్గరయ్యారంటే... తదనంతరం ఆ చిత్రాల పేర్లే వారి ఇంటిపేర్లుగా మారిపోయాయి. సిరివెన్నెల సీతారామశాస్త్రి, శుభలేఖ సుధాకర్, శంకరాభరణం రాజ్యలక్ష్మి తదితరులు ఇందుకు ఉదాహరణలు. ఇక నటుడు సోమయాజులకైతే శంకరాభరణంలోని శంకరశాస్త్రి పాత్ర పేరే అసలు పేరుగా స్థిరపడిపోయింది. సంగీత, సాహిత్యాలకు పెద్ద పీట వేసే నైజం కనుకే విశ్వనాథ్ చిత్రాల ద్వారా వేటూరి, సీతారామశాస్త్రి వంటి అపురూపమైన గీత రచయితలు పరిచయమయ్యారు. సుదీర్ఘకాలంపాటు చిత్ర పరిశ్రమలో దిగ్గజాలుగా వెలుగులీనారు. జాతీయ స్థాయిలో తెలుగువారికి తొలిసారి ఉత్తమ చిత్రంగా స్వర్ణకమలంతోపాటు మరో 3 అవార్డులు కట్టబెట్టిన చిత్రం శంకరాభరణం. ఇక ఆస్కార్‌కు భారత అధికారిక నామినేషన్‌గా వెళ్లిన తొలి తెలుగు చిత్రం స్వాతిముత్యం. 93 ఏళ్ల వయసులో కన్నుమూసే ముందురోజు కూడా ఆయన ఓ పాటను కుటుంబ సభ్యులకు చెప్పి రాయించారని విన్నప్పుడు విశ్వనాథ్ గొప్పతనం అర్థమవుతుంది. నిరంతర అధ్యయనం, నిశిత పరిశీలన ఉన్నవారి మెదడు ఎప్పటికీ సారవంతమైనదే. వారు ఎప్పటికీ సృజనకారులే. నిత్య యవ్వనులే. చిరంజీవులే. ఆయన స్మృతికి 'సాక్షి' వినమ్రంగా నివాళులర్పిస్తోంది.

అంబేడ్కర్ స్ఫూర్తి ప్రతిఫలించేదెప్పుడు!

విశ్లేషణ



డా॥ కత్తి పద్మారావు

సమానత్వం, స్వేచ్ఛ, న్యాయం, ప్రజాస్వామ్యం, మానవ హక్కులు వంటి వాటన్నింటినీ వాగ్దానం చేస్తున్న భారత రాజ్యాంగ నిర్దేశాలకు విలువే లేకుండా పోతోంది. అతి కొద్దిమందిగా ఉన్న అత్యధిక సంపన్నులను ఒక వైపు, అత్యధికులైన అతి పేదలను మరొక వైపు చూస్తున్నాం. ఈ విషయంగా మనం తప్పక బాబా సాహెబ్ అంబేడ్కర్ ఆలోచనలను మననం చేసుకోవలసిన అవసరం ఉంది. సామాజిక అసమానతల్ని తొలగించే క్రమంలోనే ఆర్థిక అసమానతలూ తొలగాలని అంబేడ్కర్ అన్నారు. అలాగే దేశంలోని ప్రజలందరూ ఆర్థిక, సాంఘిక, సాంస్కృతిక, రాజకీయ సాంకేతిక రంగాలన్నింటిలో సమానతను సాధించుకోవడమే రాజ్యాంగ లక్ష్యమని బాబాసాహెబ్ స్పష్టంగా ప్రకటించారు. ఆ మార్గంలో నడవడం మన పాలకుల ధర్మం.

భారతదేశాన్ని ఎందరో పరిపాలించారు. వారందరికీ భారతదేశం అర్థం కావాలని ఏమీ లేదు. ఆర్యులకు, యవనులకు, కుషానులకు, అరబ్బులకు, మొఘలులకు, బ్రిటిష్ వాళ్ళకు కూడా భారతదేశం అర్థం అయ్యిందని చెప్పలేం. వారంతా మూలవాసుల్ని అణచివేయడానికి ప్రయత్నించిన వారే. సామరస్యమూ, శాంతి, ప్రేమతో కూడిన మూలవాసుల భావనలను ధ్వంసం చేసే క్రమంలో వారంతా భారత చరిత్ర వక్రీకరణకు కారణం అయినవారే. ప్రస్తుత పాలకులు సైతం మన పూర్వ పాలకుల్లా నిజమైన సంస్కృతీ వికాసం మతవాదుల్లో ఉందనే నమ్ముతున్నారు. నిజానికి ఆ వికాసం హేతువాదులు, భౌతికవాదులు, అంబేడ్కర్ వాదులు, లౌకికవాదుల్లో వుంది. అసలు భారతదేశానికి మొదటి దర్శనం చార్వాక దర్శనం, రెండవ దర్శనం జైన దర్శనం, మూడు బౌద్ధ దర్శనం, నాలుగు సాంఖ్య దర్శనం. ఇవన్నీ నిరీశ్వర వాద దర్శనాలే. బౌద్ధ దర్శనం సాంఘిక సమానత్వానికి నిలువెత్తు సాక్ష్యంగా నిలబడింది. అది మూలవాసుల నుండి జనించింది. మానవాళి పట్ల దయార్ద్ర దృష్టితో మెలగడం కరుణ అనీ, సాటి వారి పట్ల సౌహార్ద్ర దృష్టిని కలిగి ఉండటమే మైత్రి అనీ, ఈ సౌశీల్య విధానాలు ప్రతి ఒక్కరూ శక్తివంచన లేకుండా పాటించాలనీ బుద్ధుడు ప్రబోధించాడు. వ్యక్తి నిర్మలత్వానికి కూడా ఆయన ప్రాధాన్యం ఇచ్చాడు. బుద్ధుని సిద్ధాంతాలు.. అప్పటి వరకు వైదిక సంస్కృతి ఆచరణలోకి తీసుకు వచ్చిన మూఢ నమ్మకాలను, యజ్ఞ యాగాదులను, వ్యక్తి స్వార్థాన్ని, దుష్ట ప్రవర్తనను ఖండించి నూత్న సామాజిక దృక్పథాన్ని కలిగించాయి. క్రీ.పూ. 6వ శతాబ్దం నుండే భారతదేశం బౌద్ధ సంస్కృతిలో నడిచింది.

భారత రాజ్యాంగంలో అంబేడ్కర్ ఈ బౌద్ధ సూత్రాలనే పొందుపరిచారు. ఆ ప్రకారం.. ఏ మతానికి చెందిన పాలకులైనా ఆ మతాన్ని వ్యక్తిగతంగానే ఉంచుకోవాలిగాని, దాన్ని రాజ్యం మీద రుద్దకూడదు. అయితే మతం, మతస్వేచ్ఛ గురించి చర్చించుకునే క్రమంలో మనం ప్రధానంగా గమనించాల్సింది ఏమిటంటే లౌకిక భావంతో వ్యవహరించాల్సిన ప్రభుత్వాలే మతతత్వాన్ని ప్రేరేపిస్తుండటం! మరోవైపు సుసంపన్నమైన దేశంగా పరిగణన పొందుతున్న మన నేలలో ఆకలి చావులతో మరణిస్తున్న వారి సంఖ్య పెరగడం ఆశ్చర్యం కలిగించే విషయం. ముఖ్యంగా అప్పుల పాలై ఆత్మహత్యలు చేసుకునే వారి సంఖ్య పెరుగుతోంది. కుల, మత, అసమానతలు నిరంతరం వృద్ధి చెందుతున్నాయనీ; అణచివేతలు, గృహహింస విపరీతంగా పెరిగిపోతున్నాయనీ సామాజిక సర్వేలు చెపుతున్నాయి. ఇదే సమయంలో కార్పొరేట్ పెట్టుబడిదారీ సామ్రాజ్యాన్ని కొన్ని శక్తులు యథేచ్ఛగా విస్తరించుకుంటూ వెళ్తున్నాయి. ప్రభుత్వ రంగ సంస్థలన్నిటినీ ప్రైవేటు వ్యక్తులకు అధీనం చేయడం వల్ల భారతదేశంలో దళిత బహుజన యువకులకు ఉద్యోగ వసతి గగన కుసుమం అయింది.



వ్యవసాయరంగం దారుణంగా దెబ్బతిన్నది. అయితే ఇది వ్యవసాయ ఉత్పత్తులు తగ్గడం మూలాన కాదు. వ్యవసాయ ఉత్పత్తి ధరలు విపరీతంగా పడిపోవడం వల్ల. దీంతో వ్యవసాయం గిట్టుబాటు కాకుండా పోయింది. రైతులు రుణగ్రస్థులయ్యారు. లక్షలాదిమంది జీవన వ్యవస్థలు కుంటుపడ్డాయి. గ్రామాల నుంచి వలసలు పెరిగాయి. ఈ సంక్షోభం నుండి రైతాంగాన్ని కాపాడటానికి బదులు పాలకులు వ్యవసాయ రంగం కార్పొరేటీకరణను ప్రోత్సహిస్తున్నారు. ప్రపంచ వాణిజ్య (డబ్ల్యూటీఓ) షరతులు కూడ మన దేశ రైతాంగానికి ప్రతికూలంగా ఉన్నాయి. అధికార పార్టీ తన సంఖ్యాబలంతో పార్లమెంటరీ కమిటీల పరిశీలనలు, పార్లమెంటరీ ప్రొసీజర్లు లేకుండానే చట్టాలకు దారి ఏర్పరుచుకుంటోంది. ముఖ్యమైన చట్టాలు ఎలాంటి చర్చ లేకుండా గందరగోళాల మధ్యనే ఆమోదం పొందుతున్నాయి. అందుకే పార్లమెంట్‌లో అంతర్గత నియంతృత్వం కొనసాగుతోందన్న విమర్శలు వస్తున్నాయి. పార్లమెంట్ పట్ల తన జవాబుదారీతనం నుండి ప్రభుత్వం తప్పుకుంటున్నది. నూట పదకొండుమంది ఎస్సీ, ఎస్టీ ఎంపీలు పార్లమెంట్‌లో సామాజిక న్యాయాన్ని సాధించటంలో నిరంతరం విఫలం అవుతున్నారు. మహిళా ఎంపీల హక్కుల పోరాట స్వరాలు నిష్ఫలం అవుతున్నాయి.

సమానత్వం, స్వేచ్ఛ, న్యాయం, ప్రజాస్వామ్యం, మానవ హక్కులు వంటి వాటన్నింటినీ వాగ్దానం చేస్తున్న భారత రాజ్యాంగ నిర్దేశాలకు విలువే లేకుండాపోతోంది. పేదలకు భూమి పంపకం లేదు. గిరిజనుల భూములకు రక్షణ లేదు. ఆదివాసుల జీవన ప్రమాణాలు, విద్యా వైద్య వసతులు నానాటికీ కుంటుపడుతున్నాయి. రక్తలేమితో బాధపడుతున్న స్త్రీల సంఖ్య పెరుగుతోంది. గర్భవతులకు, వితంతువులకు సంరక్షణ లేదు. ఆర్థిక సామాజిక, రాజకీయ అంతరాలు ఎక్కువవుతున్నాయి. అతి కొద్ది మందిగా ఉన్న అత్యధిక సంపన్నులు ఒకవైపు, అత్యధికులైన అతి పేదలు మరొక వైపు అన్నట్లుగా ఉంది. ఈ విషయంగా మనం తప్పక బాబా సాహెబ్ అంబేడ్కర్ ఆలోచనలను మననం చేసుకోవలసిన అవసరం ఉంది.

సామాజిక అసమానతల్ని తొలగించే క్రమంలోనే ఆర్థిక అసమానతలూ తొలగాలని చెబుతూ అంబేడ్కర్... శ్రామికవర్గం హక్కులు, ప్రాతినిధ్యం, సాధికారతల గురించి చాలా నిశితమైన వివరణల్ని 1943 సెప్టెంబర్ 6, 7 తేదీల్లో కొత్త ఢిల్లీలో జరిగిన కార్మిక సమ్మేళనంలో వ్యక్తపరిచారు. అందులోని చాలా అంశాల ఉల్లంఘన నేడు మనకు దృశ్యీకృతం అవుతోంది. పార్లమెంటరీ ప్రజాస్వామ్య వ్యవస్థ కింద అత్యధికుల అభీష్టం మేరకు శాసన, పాలనా విధానాలు అమలవుతున్నాయి.

ఎవరైతే సంఘానికి ఆర్థిక నిర్మాణాన్ని దేశ సామాజికత ఆధారంగా రూపకల్పన చేయదలిచారో... వారు ప్రాథమిక ఆవశ్యకతను విస్మరించకుండా తమ లక్ష్యాన్ని పూర్తిచేయాలని గుర్తుంచుకోవాలి. సంఘ ఆర్థిక నిర్మాణాన్ని రాజ్యాంగం నిర్దేశించాలన్న ప్రతిపాదన నిర్వివాదాంశం. ఆర్థిక నిర్మాణ విధానం ఎలా ఉండాలన్నదే మిగిలి ఉన్న ప్రశ్న. దానిని ఈ మూడు విధానాల నుండి ఎంపిక చేయాలి. 1. పెట్టుబడిదారీ విధానం, 2. సోషలిజం, 3. కమ్యూనిజం. మరి శ్రామికుల ఎంపిక ఎలా ఉండాలి? శ్రామికులు పెట్టుబడిదారీ విధానాన్ని ఎంపిక చేసుకోలేరు. ఆ విధంగా పెట్టుబడిదారీ విధానాన్ని ఎంపిక చేసుకుంటే శ్రామికులు వారి స్వేచ్ఛను కోల్పోతారు. అందుకే వారి భవితవ్యానికి ముఖ్యమైన ప్రాథమిక హక్కులు, స్వేచ్ఛ, సంతోషాలు పొందడంలో ప్రజాస్వామ్య దేశాలు అవలంబించవలసిన మార్గాలు ఏంటంటే... ప్రభుత్వ అధికారాన్ని రాజకీయ రంగంలో తక్కువగా జోక్యం చేసుకోనివ్వడం; చాలా శక్తిమంతమైన వ్యక్తుల ఆధిక్యతను అణచటానికి సాధారణ శాసనాధికారాన్ని మేల్కొల్పి, తక్కువ శక్తిమంతమైన ఆర్థికరంగంపై అసంబద్ధమైన ఇబ్బందులను విధించకుండా ఉండడం.

ఈ విధమైన అంబేడ్కర్ ఆలోచనలు రాను రాను భారతీయ సమాజాన్ని పునర్నిర్మించడానికి అత్యవసరం అవుతున్నాయి. ఆయన రాజ్యాంగ రచనకు ముందూ, వెనుకా అన్ని తరగతుల ప్రజల జీవన ప్రమాణాలను దర్శించారు. "భారతదేశానికి అనేక మతాలు వచ్చాయి, అనేక మతాలు ఇక్కడే ఆవిర్భవించాయి. అయితే ఏ మతాధిపత్యంలోకీ భారతదేశం వెళ్లకూడదు. భారతదేశం లౌకిక రాజ్యంగానే మనగలగాలి. భారతదేశంలో ప్రతీ పౌరుడు ఒకే సామాజిక, ఆర్థిక, రాజకీయ గౌరవాన్ని కలిగి ఉండాలి. అలా ఉన్నప్పుడే నేను రూపొందించిన రాజ్యాంగం అన్ని దిశలా ప్రతిఫలిస్తుంది" అని అంబేడ్కర్ భావించారు. రాజ్యాంగ రూపకల్పన కృషిలో అంబేడ్కర్ తన ఆరోగ్యాన్ని కూడా పణంగా పెట్టారు. భారతదేశంలోని ప్రజలందరూ ఆర్థిక, సాంఘిక, సాంస్కృతిక, రాజకీయ సాంకేతిక రంగాలన్నింటిలో సమానతను సాధించుకోవడమే ఈ రాజ్యాంగం లక్ష్యమని ఆయన ప్రకటించారు. ఆ మార్గంలో నడుద్దాం.

వ్యాసకర్త దళిత ఉద్యమ నేత । 98497 41695

సోషల్ మీడియా

సోషల్ నెట్ వర్కింగ్ వెబ్‌సైట్లు ఫేస్‌బుక్, ట్విట్టర్‌లలో సెలబ్రిటీల 'మనసులోని మాట'లు తాజాగా ఇలా...!

చిక్కిపోతోంది



వాస్తవంగా చూస్తే కనుక (ఇన్ రియల్ టెర్మ్స్) బడ్జెట్‌లో పిల్లల పోషకాహారానికి దక్కుతున్న ప్రాధాన్యం 2014–15 సంవత్సరం నుంచి క్రమంగా తగ్గుతూ వచ్చి ఇప్పుడు 40 శాతానికి పైగా పడిపోయింది. చూస్తూ ఉందాం... ఇంకా వీళ్లెంత కిందికి దించేస్తారో!

– రోడ్ స్కాలర్స్, ఎన్జీవో

గ్రేట్ ఇండియన్ సర్కస్



ఈ సర్కస్‌లో చాలా రింగ్‌లు ఉన్నాయి. రింగ్‌లో మళ్లీ రింగులు ఉన్నాయి. మన భారతీయ ప్రజలం వట్టి విదూషకులం. మరి రింగ్ మాస్టర్ ఎవరు? చెప్పండి ఎవరో? (అదానీ గ్రూప్ గురించి).

– విశాల్ దద్లానీ, సంగీతకారుడు

స్లోగన్ మార్చండి



'ఖర్చుపెట్టండి – నిర్మించండి – అభివృద్ధి చెందండి'... అన్ని పడవల్నీ ఆటుపోట్ల నుంచి ఒడ్డుకు చేర్చే నినాదం! అదే మనుషులు. అవే మాటలు! పని చేయని మంత్రాన్ని ప్రతి ఏడూ వినీ వినీ అలసట వస్తోంది.

– సునీత్ అరోరా, జర్నలిస్ట్

మీ మీదే నమ్మకం



మూడు దశాబ్దాలుగా ఇండియా ప్రపంచ స్థాయి స్టాక్ మార్కెట్‌ను నిర్మించుకుంటూ వస్తోంది. మధ్యతరగతికి ఎంతో సంపదను అందించింది. ఇప్పుడు ఈ వ్యవస్థ అనేక సందేహాలకు గురవుతున్నందుకు బాధగా ఉంది. రెగ్యులేటర్‌లు రాజకీయ ఒత్తిళ్లకు లోనవకుండా తమ పాత్రను పోషించినప్పుడే తిరిగి పరిస్థితి చక్కబడుతుంది.

– షోయబ్ డ్యానియేల్, పొలిటికల్ ఎడిటర్

వింగ్ మాస్టర్



పాకిస్తాన్ ముస్లిం లీగ్ తన యూత్ వింగ్ అధ్యక్షుడిగా 60 ఏళ్ల కెప్టెన్ సఫ్దర్‌ను నియమించింది. తర్వాత అతను యు–19 క్రికెట్ జట్టులో కనిపించినా ఆశ్చర్యం లేదు.

– ఇంతియాజ్ మహమూద్, ఫ్రీ థింకర్

ఆ నిధులకు చట్టబద్ధత

ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర ప్రభుత్వం ఎస్సీ, ఎస్టీ కాంపోనెంట్ నిధుల వినియోగానికి చట్టబద్ధతను మరో 20 ఏళ్ళ పాటు కల్పిస్తూ ఆర్డినెన్స్ తీసుకు రావడం హర్షణీయం. ఉపప్రణాళికా నిధులకు 2013లో కల్పించిన చట్టబద్ధత ముగిసినందున... అత్యవసర ప్రాతిపదికన ఆర్డినెన్స్ తీసుకురావడం ద్వారా చట్టం నిర్వీర్యం కాకుండా జాగ్రత్త పడినట్లయ్యింది. శాసన సభ సమావేశాల్లో అందుకు తగిన చట్టాన్ని ప్రవేశపెట్టి, ఆమోదం పొందేవరకూ ఈ ఆర్డినెన్స్ అమలులో ఉంటుంది. కేంద్రం బడ్జెట్ కేటాయింపుల్లో ప్రణాళిక, ఉపప్రణాళిక తరహా విభజనలకు మంగళం పాడినప్పటి నుండి వీటిని కాంపోనెంట్ నిధులుగా వ్యవహరిస్తున్నారు.

ఏ పేరుతో వ్యవ హరించినా బలహీన వర్గాలకు జనాభా దామాషా పద్ధతిలో కేటా యింపులు ఉండాలి. విడుదలైన నిధుల్ని దారి మళ్లించకుండా, మురిగి పోయి వెనక్కి పోయేలా కాకుండా ఈ చట్టబద్ధత కాపాడుతుంది. ఎస్సీ, ఎస్టీల... సంక్షేమానికీ, సమగ్ర అభివృద్ధికీ నిర్దేశించిన పథకాల ద్వారా ఖర్చు పెట్టేలా ప్రభుత్వాన్ని జవాబుదారీ చేస్తుంది. ఏ కారణంతో అయినా నిధులు ఖర్చు కాకపోతే తర్వాత సంవత్సరంలో కూడా అవి అందుబాటులోకి వస్తాయి. ఆయా వర్గాల అభివృద్ధికి ఎంతో కీలకమైన ఈ చట్టం పదేళ్లు కొనసాగేలా నిర్ణయం తీసుకున్న ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వానికి అభినందనలు.

– డా॥ డి.వి.జి. శంకర రావు, మాజీ ఎంపీ, పార్వతీపురం

పాత మోటర్లతోని ఫాయిద లేదు

అట్లుంటది



తెలిదేవర భానుమూర్తి

పొద్దు మీకింది. ఎప్పటి తీర్గనే ఆనంద్ బాగ్ చౌరస్త కాడ్కి బోయిన. గాడ రవి పాన్ డబ్బ ఉన్నది. పొద్దు మీకంగనే మా దోస్తులు గా పాన్ డబ్బ కాడ జమైతరు. సిగిలేట్లు దాగెటోల్లు సిగిలేట్లు దాగుతుంటరు. పాన్లు దినెటోల్లు పాన్లు దింటుంటరు. గీ సంగతి గా సంగతి అనకుంట అన్నిటి మీద నాత్రి తొమ్మిది గొట్టె దాంక ముచ్చట బెడుతుంటరు.

నేను బోక ముందు గాల్లు ఏం మాట్లాడిండ్రో నాకైతె ఎక్కలేదు. గని నేను బోయినంక గాల్లు గిట్ల ముచ్చట బెట్ట బెట్టిన్రు.

"తెలంగానలనే గాకుంట కద్మ రాస్టాలల్ల బీఆర్‌ఎస్ ఆఫీస్లు తెర్సెతందుకు కేసీఆర్ ఒక్క తీర్గ కోషిస్ జేస్తున్నడు" అని సత్నారి అన్నడు.

"ఒరిస్సా మాజీ ముక్యమంత్రి గిరిధర్ గమాంగ్ గీనడ్మనే బీఆర్‌ఎస్ల గల్సిండు. గాయిన దప్పు గొట్టుట్ల మషూర్. ఇక ముంగట గాయిన దేసంల కేసీఆర్ దప్పు గొడ్తడు" అని ఇస్తారి అన్నడు.

"గమాంగ్ అసువంటోల్ల గురించే బీఆర్‌ఎస్ ఒక్క తీర్గ లెంకుతున్నది. కేసీఆర్ అన్నయ్ అంటె అదే సై. దులా అంటె ఇదే సై అనేటి లీడర్లు గావాలె. గాయిన పాటనే పాడేటి చెంచగాల్లు గావాలె. గసువంటోల్ల గురించి కేసీఆర్ దుర్బిని దీస్కోని లెంకుతున్నడు."

"గాంది దేసంకు సతంత్రం దెచ్చిండు. గదే తీర్గ కేసీఆర్ తెలంగానకు సతంత్రం దెచ్చిండు. గాయిన జాతి పిత అయితె గీయిన తెలంగాన పిత. అశోకుడు చెట్లు బెట్టిచ్చిన తీర్గ కేసీఆర్ యాద్గిరి గుట్ట గుడి గట్టించెను. వాస్తు ప్రకారం సెక్రటేరియట్ గట్టిచ్చెను. పెద్ద అంబేద్కర్ బొమ్మ పెట్టిచ్చెను. గీ తీర్గ రాసిన పాటాలు పదో తరగతి చరిత్ర వయ్యిల ఉంటయట. కేసీఆర్ బొమ్మ బెట్టి దినాం గా దాన్కి పాలతోని అబిసేకం జేస్తరట. దేసమంతట కేసీఆర్ బజన సంగాలు బెడ్తరంట"

"ఎండల తిర్గకుంటె విటమిన్ డి తక్వ అయితది. విటమిన్ డి తక్వ అయితె పెయ్యి కరాబైతది. రోగాలొస్తయి. గదే తీర్గ జెనం నడ్మ లీడర్లు ఒర్గకుంటె గాల్ల పేరు కరాబైతది. గాల్లకు, గాల్ల పార్టిలకు ఓట్లు ఎవ్వరు ఎయ్యరు. గీ సంగతి ఎర్కయ్యే బట్కనే రాహుల్ గాంది కన్యాకుమారి కెల్లి కశ్మీర్ దాంక భారత్ జోడో పాదయాత్ర జేసిండు. పాదయాత్ర జెయ్యక ముందు గాయినను అందరు పప్పు అనెటోల్లు. గని గిప్పుడు నిప్పు అంటున్నరు. పప్పు లోకేశ్ గుడ్క యువ గళం అన్కుంట పాదయాత్ర షురువు జేసిండు. యువగళం టీడీపీకి సర్వ మంగళం అని కొందరంటున్నరు. తెలంగానల కాంగ్రెస్ లీడర్లు హాత్ సే హాత్ జోడో పాదయాత్రలు జేస్తమంటున్నరు. బీజేపీ తెలంగాన ప్రెసిడెంట్ బండి సంజయ్ పాదయాత్ర జేసిండు. గాయిన లెక్కనే అన్ని రాస్ట్రాల బీజేపీ లీడర్లు పాదయాత్రలు జెయ్యాలె. నేనైతే



గాలిమోటర్ల దిర్గుత అని 'అందర్కీ బాత్ల' ప్రతాని మోదీ అన్నడు"

"మోదీది దస్ కీ బాత్. నాది మన్ కీ బాత్. నా మనసుల ఉన్న మాటనే నేను మీదికి జెప్త. గిప్పుడు మా పార్టి బొంత పురుగసుంటిది గాదు. రంగు రంగుల సీతాకోక చిల్క. అబ్ కీ బార్ కిసాన్ సర్కార్. అంటె రైతే రాజు. రాజు అయ్యేటి రైతెవ్వడు? అని కొందరన్న అడుగుతరు. నేను యాడాదిల ఎక్వ దినాలు ఫాం హౌస్లనే ఉంటున్న. ఫాం హౌసంటె ఏంది. పొలంల ఇల్లు. గా ఇంట్లనే ఉండుకుంట నేను ఎవుసం జేస్తున్న. ఎవుసం జెయ్యబట్కె నేను రైతును. అంటె కిసాన్‌ను. అబ్ కీ బార్ కిసాన్ సర్కార్ అంటె అబ్ కీ బార్ కేసీఆర్ సర్కారని అర్తం"

"గాడెవడో మస్తు పైసలున్నోడు ముసలితనం రాకుంట ఉండెతంద్కు పదిమంది డాక్టర్లతోని ఇలాత్ జేయించుకుంటున్నడు. గందుకు దినాం కోట్ల రూపాయలు కర్సు జేస్తున్నడు. ఎలచ్చన్ల ఓడకుంట ఉండెతంద్కు లీడర్లు కోట్ల రూపాయలు కర్సు జేస్తున్నరు. ఎలచ్చన్లను దీసెయ్యాలె. జెనంకు ఓట్లేసే పని లేకుంట జెయ్యాలె. పోలింగ్ వొంతకు హరాజ్ బెట్టాలె. హరాజ్ల ఎక్వ పాట బాడి నోనికే ఎమ్మెల్యే కుర్సి ఇయ్యాలె. హరాజ్ల వొచ్చిన రూపాయలతోని కొత్త పద్కాలు బెట్టొచ్చు. హరాజ్ల వొచ్చిన రూపాయలను ఉన్న పద్కాల కోసం కర్సు జెయ్యొచ్చు" అని సిగిలేటు దాక్కుంట యాద్గిరి అన్నడు.

"యాదాడి కెల్లి దలిత బందును బంద్ బెట్టిండ్రు. సర్పంచులకు ఫండ్స్ ఇస్తలేరు. సర్కార్ జీతగాల్లకు పహిలి తారీఖ్‌కు జీతాలు బడ్త లేవు. గని కొత్త సెక్రెటేరియట్ల సిఎం పేషిని శాన్దార్ల గట్టిండ్రు. గది మయసబ లెక్క ఉన్నదంటున్నరు. లోపటి పరే షాని ఎవ్వలికి గండ్లబడదు. మీది షేర్వాని అందరికి గండ్ల బడ్తది. గందుకే షేర్వాని అసువంటి సీఎం పేషిని రాజ మందిరం లెక్క గట్టిండ్రని బీఆర్‌ఎస్ లీడర్లు అంటున్నరు" అని పాన్ దినుకుంట లచ్చినారి అన్నడు.

"పార్లమెంటుల ఆర్తిక మంత్రి నిర్మలా సీతారామన్ బడ్జెట్ స్పీచ్ గొట్టుకుంట రీప్లేసింగ్ ఓల్డ్ పొలిటికల్ అని నాల్కె కొరుక్కోని రీప్లేసింగ్ ఓల్డ్ పొల్యూటెడ్ వెహికల్స్ అని అన్నది. అంటె పొగ ఇడ్సేటి పాత మోటర్లను దీసెయ్యాలె అని అనబోయి తీసెయ్యాలె పాత రాజకీయ అని నడ్మల ఆపేసి గామె నాల్కె కొరుక్కున్నది. పాత రాజకీయ నాయకులను తీసెయ్యాలె అని గామె అనబోయినట్లు గొడ్తున్నది. పాత మోటర్లు ఇడ్సేటి పొగతోని గాలి కరాబైతది. కరాబైన గాలితోని రోగాలొస్తయి. ఆర్థిక మంత్రి తప్పితారి నిజమే జెప్ప బోయింది. పాత లీడర్లు పాత మోటర్ల అసుంటోల్లే గదా" అని లచ్చినారి.

నాత్రి తొమ్మిది గొట్టెదాంక ముచ్చట బెట్టి ఎవలింటికి గాల్లం బోయినం.

వ్యాసకర్త సీనియర్ జర్నలిస్ట్ । 99591 50491

ప్రశ్నించే ధైర్యాన్నిచ్చి...

భారతదేశ తాత్విక ఉద్యమాలలో భక్తి కవులదొక అధ్యాయం. ఆ కవులలో సంత్ రవిదాస్ ఒకరు. పద్నాలుగో శతాబ్దంలో హిందూ సమాజంలో కులం పేరుతో అసమానతలు, అంటరానితనం తీవ్రంగా ఉన్న రోజుల్లో తన భక్తిగీతాల ద్వారా భక్తి ఉద్యమానికి ఆయన పూనుకున్నారు. చర్మకారుల కుటుంబంలో పుట్టి సామాజిక తత్త్వవేత్తగా అనేకమందిని ఆకట్టుకున్న ప్రబోధకుడు ఆయన. అంబేడ్కర్ స్ఫూర్తి పొందిన భక్తి కవులలో కబీర్, సంత్ రవిదాస్‌లు ముఖ్యులు. కులం మానవత్వానికి అడ్డుగోడలు కడుతుందని ఆనాడే ఆయన హెచ్చరించారు. ఇటీవల ఆయన బంగారు విగ్రహాన్ని జలంధర్ నుంచి కాశీ వరకూ కొందరు మోసుకొచ్చారంటే... ఆయన ప్రభావమేమిటో అర్థం చేసుకోవచ్చు.

సంత్ రవిదాస్ క్రీ.శ. 1377లో కాశీవద్ద సీర్ గోవర్ధనపురం అనే గ్రామంలో, మాఘ పూర్ణిమ రోజున జన్మించారు. అంటరానివారి కోసం ఆధ్యాత్మిక రంగంలో ఆయన ఉద్యమించారు. సంత్ జీవితాంతం తన చర్మకార వృత్తిని అవలంబిస్తూనే అత్యంత నిరాడంబరంగా బతికారు. ఆయన శిష్యులలో కాశీమహారాజు, రాజస్థాన్‌కు చెందిన భక్త మీరాబాయి, ఆమె అత్త రాణీ ఝాలీదేవి వంటి కులీనులూ; పండితులూ, సామాన్యులూ... ఇలా అన్ని వర్గాలవారూ ఉన్నారు. చిత్తోడ్ రాజు రాణా సంగా, రాణి ఝాలీ దేవిల అభ్యర్థన మేరకు రవిదాస్ దంపతులు చిత్తోడ్ వెళ్లారు. వీరికి అక్కడ రాజమర్యాదలతో స్వాగతం లభించింది. మహారాజు వద్ద అతిథులుగా కొంతకాలం రవిదాస్ దంపతులు ఉన్నారు. చిత్తోడ్ కోటలోనే ఆయన తన 120వ ఏట భగవంతునిలో లీనమయ్యారని చెపుతారు.



'ఎక్కడైతే అందరికీ భోజనం లభిస్తుందో, ఎవరూ ఆకలితో నిద్రపోరో, ఎక్కడ ఎక్కువ తక్కువల అసమానతలు లేకుండా ప్రజలు జీవిస్తూ ఉంటారో... అలాంటి సమాజాన్నీ, అలాంటి పాలనా వ్యవస్థనూ' రవిదాస్ ఆశించారు. 'కులం గురించి ఎవరూ, ఎవర్నీ అడగకూడదు. బ్రాహ్మణుడు, క్షత్రియుడు, వైశ్యుడు, శూద్రుడు అందరూ మనిషి కులానికి చెందినవారే. మానవత్వమే పరమ ధర్మం' అని ఆయన బోధించారు. రవిదాస్ భక్తి ఉద్యమంలో కుల వ్యతిరేక పోరాట దృక్పథం ఉంది. మతాలూ, కులాలూ, దేవుళ్లూ... మానవత్వం తరువాతేనని ఆయన ప్రబోధించారు. రవిదాస్ తనను తాను చమర్‌గా పేర్కొంటూ... కులాలను దేవుడు సృష్టించలేదనీ, వాటిని మనిషే సృష్టించాడనీ స్పష్టంగా చెప్పారు. మనిషి పీల్చుతున్న శ్వాస బ్రాహ్మణుడిదైనా, చండాలునిదైనా ఒక్కటే అయినప్పుడు మనుషులలో ఎక్కువ తక్కువలు ఎందుకని ప్రశ్నించాడు.

ఆయన పదాలు బనారస్ దాటి ఉత్తరప్రదేశ్, పంజాబ్, గుజరాత్‌ల వరకూ ప్రవహించాయి. తన సాహిత్యం ద్వారా ఎవరినైనా ప్రశ్నించవచ్చనే ధైర్యాన్ని ప్రజలలో నింపారు. ఆ స్ఫూర్తితోనే ఇప్పటికీ కొనసాగుతున్న అసమానతలను రూపు మాపాలి.

– సాకి, కరీంనగర్ । మొబైల్: 99493 94688

(రేపు మాఘ పూర్ణిమ నాడు సంత్ రవిదాస్ జయంతి)

గ్రహం అనుగ్రహం

శ్రీ శుభకృత్ నామ సంవత్సరం, ఉత్తరాయణం, శిశిర ఋతువు, మాఘ మాసం, తిథి: శు.చతుర్దశి రా.9.04 వరకు, తదుపరి పౌర్ణమి, నక్షత్రం: పునర్వసు ఉ.9.22 వరకు, తదుపరి పుష్యమి, వర్జ్యం: సా.6.14 నుండి 7.58 వరకు, దుర్ముహూర్తం: ఉ.6.35 నుండి 8.06 వరకు, అమృతఘడియలు: ఉ.6.39 నుండి 8.24 వరకు; రాహుకాలం: ఉ.9.00 నుండి 10.30 వరకు, యమగండం: ప.1.30 నుండి 3.00 వరకు, సూర్యోదయం: 6.35, సూర్యాస్తమయం: 5.52.

క్లుప్తంగా...

డిసెంబర్ నాటికి తిరుమల మ్యూజియం సిద్ధం

- రూ. 50 కోట్లతో అత్యాధునిక లడ్డూల తయారీ యంత్రాలు
- టీటీడీ ఈవో ధర్మారెడ్డి వెల్లడి


ఈవో ధర్మారెడ్డి

తిరుమల: ప్రపంచంలోనే నంబర్‌వన్ స్థాయిలో నిర్మిస్తున్న తిరుమల మ్యూజియంను డిసెంబర్ నాటికి సిద్ధం చేస్తామని టీటీడీ ఈవో ధర్మారెడ్డి చెప్పారు. అలాగే లడ్డూ తయారీ కోసం రూ. 50 కోట్లు వెచ్చించి అత్యాధునిక సాంకేతిక పరిజ్ఞానంతో తయారు చేసిన యంత్రం కూడా డిసెంబర్ నాటికి అందుబాటులోకి వస్తాయని తెలిపారు. తిరుమల అన్నమయ్య భవనంలో శుక్రవారం డయల్ యువర్ ఈవో కార్యక్రమంలో, ఆ తరువాత మీడియాతో ఆయన మాట్లాడారు.

- బెంగళూరుకు చెందిన దాత మురళీకృష్ణ అందించిన రూ. 23 కోట్ల విరాళంతో తిరుమలలో ఆధునికంగా నిర్మించిన పరకామణి భవనం ఫిబ్రవరి 5న అందుబాటులోకి వస్తుంది.
- తిరుమల శ్రీవారి ఆలయ ఆనంద నిలయం బంగారు తాపడం పనులను ఆరు నెలల పాటు వాయిదా వేస్తున్నాం. త్వరలో మరో తేదీ నిర్ణయిస్తాం. నిర్దేశిత వ్యవధిలో ఆనందనిలయం బంగారు తాపడం పనులు పూర్తి చేసేందుకు వీలుగా గ్లోబల్ టెండర్లకు వెళుతున్నాం.
- యువతకు ధార్మిక అంశాలపై శిక్షణ ఇచ్చేందుకు ఫిబ్రవరి 5, 6 తేదీల్లో తిరుమల ఆస్థానమండపంలో యువ ధార్మికోత్సవం నిర్వహిస్తాం. దాదాపు 2 వేల మంది యువతీ యువకులు ఇందులో పాల్గొంటారు.
- జనవరి నెలలో శ్రీవారిని దర్శించుకున్న భక్తులు 20.78 లక్షలు, హుండీ ఆదాయం, కానుకలు రూ. 123.07 కోట్లు, విక్రయించిన శ్రీవారి లడ్డూల సంఖ్య 1.07 కోట్లు, అన్నప్రసాదం స్వీకరించిన భక్తులు 37.38 లక్షలు, తలనీలాలు సమర్పించిన భక్తుల సంఖ్య 7.51 లక్షలుగా ఉంది.

పారిశుధ్య కార్మికురాలి నిజాయితీ


రాజ్‌కుమార్ భార్య మేరీకి బ్రాస్‌లెట్ అందజేస్తున్న జయమ్మ

కడియం: కడియపులంక పంచాయతీలో పారిశుధ్య కార్మికురాలిగా పనిచేస్తున్న వేముల జయమ్మ తనకు దొరికిన విలువైన బంగారు వస్తువును సంబంధిత యజమానికి అప్పగించి నిజాయితీ చాటుకుంది. వివరాల్లోకి వెళితే.. కడియపులంకలో జరిగిన ఓ కార్యక్రమానికి శంఖవరం గ్రామానికి చెందిన పిల్లి రాజ్‌కుమార్ గురువారం వచ్చారు. ఆ సమయంలో ఆయన చేతికి ఉన్న బ్రాస్‌లెట్ పడిపోయింది. ఎంత వెదికినా దొరకలేదు. ఈ నేపథ్యంలో ఆ బ్రాస్‌లెట్ జయమ్మకు దొరకడంతో సర్పంచ్ మార్గాని అమ్మాణీ, ఉప సర్పంచ్ పాటంశెట్టి రాంజీ దృష్టికి తీసుకెళ్లింది. ఆ వస్తువు రాజ్‌కుమార్‌ది అని తేలడంతో అతడి భార్య మేరీకి అందజేశారు. జయమ్మను అభినందించి బహుమతి అందించారు.

అవసాన దశలో ఆసరాగా ఉండు కొడకా..

- మావోయిస్టు నేత తల్లి ఆవేదన


సీతమ్మకు వైద్య పరీక్షలు చేస్తున్న వైద్యులు. చిత్రంలో పోలీసులు

గూడెంకొత్తవీధి (అల్లూరి సీతారామరాజు జిల్లా): 'వయసులో ఉన్నప్పుడు ప్రజల కోసం పోరాటం చేసేందుకు మావోయిస్టు ఉద్యమంలోకి వెళ్లావు.. అవసాన దశలో ఆసరా లేక అవస్థలు పడుతున్నాను.. నువ్వు కూడా అనారోగ్యంతో బాధపడుతున్నావని తెలిసి ఎంతో కలత చెందుతున్నాను.. నా కోసమైన స్వచ్ఛందంగా లొంగిపోయి నన్ను చూసుకో నాయనా' అంటూ మావోయిస్టు అగ్రనేత కాకూరి పందన్న తల్లి సీతమ్మ ఆవేదన వ్యక్తం చేస్తోంది. మండలంలోని దుప్పులవాడ పంచాయతీ కొమ్ములవాడకు చెందిన పందన్న అలియాస్ జగన్ 25 ఏళ్ల కిందట మావోయిస్టు ఉద్యమంలో చేరారు. అప్పటి నుంచి తల్లి సీతమ్మ ఒంటరిగా జీవిస్తోంది. ఏ దిక్కూ లేని సీతమ్మ ఆపన్న హస్తం కోసం ఎదురుచూస్తోంది. గత బుధవారం మారుమూల ప్రాంతమైన గొర్రిలోవలో పోలీసులు వైద్య శిబిరం ఏర్పాటు చేశారు. పోలీసులు తిరుగు ప్రయాణంలో కొమ్ములవాడలో నివసిస్తున్న మావోయిస్టు నేత జగన్ తల్లి సీతమ్మను పోలీసులు, వైద్య సిబ్బంది యోగ క్షేమాలను అడిగి తెలుసుకున్నారు. ఆమెకు నిత్యావసర సరుకులు, నగదు, వంట సామగ్రి అందజేశారు.

మాటేస్తున్న.. ఈ-దొంగల ముఠా



ఈ-కామర్స్ సైట్లపై సైబర్ మోసగాళ్ల ప్రత్యేక దృష్టి

- కొనుగోలుదారులను, మోసం చేస్తున్న కేడీలు
- ప్రపంచ వ్యాప్తంగా పెరుగుతున్న ఈ-కామర్స్ వ్యాపారం
- అంతే వేగంగా పెరుగుతున్న మోసగాళ్ల దందా

సాక్షి, అమరావతి: పండుగలు, ప్రత్యేక రోజుల్లో ఈ-కామర్స్ వెబ్‌సైట్లు బిగ్ బిలియన్ డేస్, షాపింగ్ కార్నివాల్ అంటూ ఏదో ఒక పేరు పెట్టి స్పెషల్ ఆఫర్లతో వినియోగదారులను ఆకర్షిస్తున్నాయి. ఇదే అదనుగా సైబర్ దొంగల ముఠా వినియోగదారుల డేటా కొట్టేయడానికి కాచుకు కూర్చుంటోంది. హోమ్ క్రెడిట్ ఇండియా తాజా సర్వే ప్రకారం.. మన దేశంలో 50 శాతం పైగా ప్రజలు షాపింగ్ కోసం ఈఎంఐను అందించే కార్డులను ఇష్టపడుతున్నారు. 25 శాతం మంది క్రెడిట్ కార్డులను ఉపయోగిస్తున్నారు. 'ఇప్పుడు కొనుగోలు చేయండి, తర్వాత చెల్లించండి' అనే ప్రత్యేక ఆఫర్‌ను ఈ మధ్య కాలంలో దాదాపు అన్ని ఈ-కామర్స్ సంస్థలు అందిస్తున్నాయి. 10 శాతం మంది దీనిని వినియోగించుకుంటున్నారు. 50 శాతం మంది వాట్సాప్ చాట్ ద్వారా రుణ దరఖాస్తు చేసుకోవడానికి ఇష్టపడుతున్నారు. లోన్ అప్లికేషన్ ఫైల్ చేయడానికి చాట్‌బాట్‌లు, మొబైల్ బ్యాంకింగ్ కూడా ఎక్కువగా వాడుతున్నారు. ఈ క్రమంలో డెబిట్ కార్డ్, క్రెడిట్ కార్డ్ వివరాలను ఇంట్లోనే కూర్చొని డార్క్ వెబ్ ద్వారా సేకరించి, ఆన్‌లైన్‌లోనే డబ్బులు కొట్టేసే మార్గాన్ని దొంగలు ఎంచుకున్నారు. దీనికి ఈ-కామర్స్ సైట్లలో మనం ఇచ్చే బ్యాంకు ఖాతాల వివరాలను వాడుకుంటున్నారు. కాగా, గ్లోబల్ రిటైల్ ఈ-కామర్స్ 2020లో 26.4 శాతం పెరిగింది. సైబర్ నేరగాళ్లు కూడా ఈ పెరుగుదలను సద్వినియోగం చేసుకోవడానికి కొత్త మార్గాలను ఎంచుకుంటున్నారు.

నకిలీ సైట్లతో బోల్తా కొట్టిస్తున్నారు

సైబర్ దొంగలు రిటైల్ వెబ్‌సైట్‌లకు నకిలీ రూపాలు సృష్టించి, దుకాణదారులను, కస్టమర్లను దోచుకుంటున్నారు. ఆ సైట్ నిజమైనదిగా నమ్మేలా ఉంటుంది. వాటి ద్వారా ఓ నకిలీ ఆర్డర్ షిప్‌మెంట్‌ను కస్టమర్లకు మెయిల్‌గానీ, ఎస్ఎంఎస్ లింక్‌గానీ పంపుతారు. తెలియకో, అప్రమత్తంగా లేకో ఆ లింక్‌పై క్లిక్ చేస్తే.. అక్కడ కస్టమర్లు లాగిన్ అవడానికి ఇచ్చే వ్యక్తిగత, బ్యాంకు వివరాలు దొంగలకు వెళ్లిపోతాయి. వారు కస్టమర్ కార్డులను ఉపయోగించి రిటైల్ సైట్‌లో షాపింగ్ చేసేస్తారు. ఒక్కోసారి ఏదో వస్తువును ఆర్డర్ పెట్టామని చెప్పి, దానికి నగదు చెల్లించాలంటూ క్యూఆర్ కోడ్‌లను పంపుతారు. దానిని స్కాన్ చేస్తే చాలు మన బ్యాంకు వివరాలు వారి చేతుల్లోకి వెళ్లిపోయినట్టే. ఇలా కస్టమర్లనే కాదు ఈ-కామర్స్ నిర్వాహకులను కూడా మోసం చేస్తున్నారు. ఆర్డర్ పెట్టిన ప్యాకేజీ రాలేదని, ఆర్డర్ వచ్చిందిగానీ పెట్టె ఖాళీగా ఉందని, బాక్స్‌లో రిటైలర్ తప్పు వస్తువును పంపారని ఫిర్యాదు చేసి డబ్బులు కూడా కొట్టేస్తున్నారు. కాబట్టి ఆన్‌లైన్‌లో షాపింగ్ చేసేవారు అప్రమత్తంగా ఉండాల్సిందే. ఏడాదిగా సైబర్ నేరగాళ్లు ఈ-కామర్స్ సైట్లపై ప్రత్యేక శ్రద్ధపెట్టినట్టు సైబర్ క్రైమ్ విభాగం ఇప్పటికే గుర్తించింది. ఇలాంటి మోసాలు పెరగడం పట్ల ఇటు వినియోగదారులు, అటు ఈ-కామర్స్ సైట్ల నిర్వాహకులు కూడా ఆందోళన చెందుతున్నారు.

విద్యార్థినిని చంపిన నిందితుడికి జీవిత ఖైదు

బాధిత కుటుంబానికి రూ.7.50 లక్షల పరిహారం ఇవ్వాలని తీర్పు

పిఠాపురం : పదో తరగతి విద్యార్థినిపై కిరోసిన్ పోసి నిప్పంటించి తగులబెట్టేసిన నిందితుడికి జీవిత ఖైదు, రూ.2,250 జరిమానా విధిస్తూ కాకినాడ ప్రత్యేక పోక్సో కోర్టు న్యాయమూర్తి ఎల్.వెంకటేశ్వరరావు శుక్రవారం తీర్పు చెప్పారు. బాధిత బాలిక కుటుంబానికి రూ 7,50,000 పరిహారం ఇవ్వాలని తీర్పులో పేర్కొన్నారు. కాకినాడ జిల్లా పిఠాపురం సీఐ వైఆర్‌కే శ్రీనివాస్ కథనం ప్రకారం పిఠాపురానికి చెందిన కారు మెకానిక్ కీర్తి శంకర్‌బాబు చిన్న కుమార్తె రేవతి (17) స్థానిక బాధం మాధవరావు జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో పదో తరగతి చదువుతోంది.

పిఠాపురం కత్తులగూడెంకు చెందిన ముక్కుడుపల్లి నవీన్‌కుమార్ అనే యువకుడు ఆమెను ప్రేమిస్తున్నానంటూ వేధించేవాడు. ఈ విషయం రేవతి ఇంట్లో వాళ్లకు చెప్పడంతో ఆమె తండ్రి శంకర్‌బాబు యువకుడిని మందలించి పోలీసులకు ఫిర్యాదు చేస్తానని బెదిరించాడు. అయినప్పటికీ అతడి వేధింపులు ఆగకపోవడంతో శంకర్‌బాబు బాలిక చదువు మానిపించి అనపర్తికి చెందిన యువకుడితో వివాహం నిశ్చయించాడు. ఈ నేపథ్యంలో నిందితుడు నవీన్ 2013 డిసెంబర్ 18వ తేదీన ఇంట్లో ఒంటరిగా ఉన్న రేవతి వద్దకు వెళ్లి వీధి తలుపు గడియపెట్టి ఆమెను తనను పెళ్లి చేసుకోవాలని బలవంతం చేశాడు. ఆమె తిరగబడి కేకలు వేసేందుకు ప్రయత్నించగా ఆ ఇంట్లో ఉన్న కిరోసిన్ తీసి ఆమెపై పోసి నిప్పంటించాడు. ఇదే సమయంలో కాకినాడ నుంచి ఇంటికి చేరుకున్న బాలిక తండ్రి శంకర్‌బాబు ఆ యువకుడిని పట్టుకునేందుకు ప్రయత్నించగా తప్పించుకుని పరారయ్యాడు. ఆమెను ప్రథమ చికిత్స అనంతరం కాకినాడ ప్రభుత్వాస్పత్రికి తరలించగా చికిత్స పొందుతూ 2013 డిసెంబర్ 22న (ఆమెకు పెళ్లి జరగాల్సిన రోజునే) మృతి చెందింది. అప్పటి పిఠాపురం సీఐ ఎస్ రాంబాబు ఎస్ఐ లక్ష్మీనారాయణ బాధితురాలి తండ్రి ఫిర్యాదు మేరకు పోక్సో చట్టంపై కేసు నమోదు చేసి దర్యాప్తు నిర్వహించారు. వాదోపవాదాల అనంతరం నిందితుడిపై నేరం రుజువు కావడంతో నిందితుడుకి జీవిత ఖైదు, రూ 2,250 జరిమానా విధిస్తూ బాధిత బాలిక కుటుంబానికి రూ 7,50,000 పరిహారం ఇవ్వాలని న్యాయమూర్తి శుక్రవారం తీర్పు చెప్పారు.

భానుకోట క్షేత్రాన్ని ప్రారంభించడం నా అదృష్టం

ప్రభుత్వ సీఎస్ జవహర్‌రెడ్డి


భానుకోట క్షేత్ర శిలాఫలకాన్ని ఆవిష్కరిస్తున్న సీఎస్ జవహర్‌రెడ్డి, ఎంపీ వైఎస్ అవినాష్‌రెడ్డి

సింహాద్రిపురం: భానుకోట క్షేత్రాన్ని ప్రారంభించడం తన అదృష్టమని ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి డాక్టర్ జవహర్‌రెడ్డి అన్నారు. వైఎస్సార్ జిల్లా సింహాద్రిపురం మండలం అహోబిలాపురం గ్రామ సమీపంలో రూ.5 కోట్లు టీటీడీ నిధులతో పునఃనిర్మించిన శ్రీ భానుకోటేశ్వరస్వామి క్షేత్రం ఆలయ ప్రారంభోత్సవం శుక్రవారం వైభవంగా జరిగింది. ముఖ్య అతిథిగా పాల్గొన్న జవహర్‌రెడ్డి... కడప ఎంపీ వైఎస్ అవినాష్‌రెడ్డితో కలిసి ప్రత్యేక పూజలు, విగ్రహ పునఃప్రతిష్ట మహోత్సవంలో పాల్గొన్నారు. అనంతరం ఆయన మాట్లాడుతూ ఈ ప్రాంత వాసులకు సోమేశ్వరస్వామిపై అపారమైన నమ్మకం ఉందన్నారు. తాను ఈ ప్రాంత వాసిగా ఉంటూ ప్రభుత్వ చీఫ్ సెక్రటరీగా విధులు నిర్వహిస్తూ ఇంత గొప్ప కార్యక్రమంలో పాల్గొనడం అదృష్టంగా భావిస్తున్నానని పేర్కొన్నారు. వైఎస్ అవినాష్‌రెడ్డి మాట్లాడుతూ ప్రముఖ పుణ్యక్షేత్రమైన భానుకోట సోమేశ్వరస్వామి ఆలయాన్ని శివరాత్రి పండుగకు ముందే పునఃనిర్మించి భక్తులకు అందుబాటులోకి తెచ్చామని తెలిపారు. సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి ప్రత్యేక చొరవతో రూ.5కోట్లతో నూతన ఆలయాన్ని తీర్చిదిద్ది ప్రాంభించడం ఆనందంగా ఉందన్నారు. అనంతరం భానుకోట చరిత్ర, స్థలపురాణానికి సంబంధించిన విషయాలపై డాక్టర్ కె.రామాంజులరెడ్డి రూపొందించిన బ్రోచర్‌ను జవహర్‌రెడ్డి, వైఎస్ అవినాష్‌రెడ్డి ఆవిష్కరించారు. ఆలయ ప్రాంగణంలో మొక్కలు నాటారు. కలెక్టర్ విజయరామరాజు, దేవదాయ శాఖ కమిషనర్ హరిజవహర్‌లాల్ తదితరులు పాల్గొన్నారు.

నేతన్న నిజమైన నేస్తం సీఎం వైఎస్ జగన్

ఆప్కో చైర్మన్‌గా చిరంజీవి బాధ్యతలు


ఆప్కో నూతన చైర్మన్‌గా బాధ్యతలు స్వీకరిస్తున్న గంజి చిరంజీవి

సాక్షి, అమరావతి: రాష్ట్రంలో నేతన్నకు నిజమైన నేస్తం సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి అని, స్వాతంత్ర్య అనంతరం చేనేత కార్మికులకు నేతన్న నేస్తం ద్వారా అత్యధిక మొత్తం అందించిన సీఎం వైఎస్ జగన్‌కు చేనేత కార్మికులు రుణపడి ఉంటారని ఆప్కో నూతన చైర్మన్ గంజి చిరంజీవి అన్నారు. విజయవాడలోని ఆప్కో రాష్ట్ర ప్రధాన కార్యాలయంలో శుక్రవారం ఆయన బాధ్యతలు చేపట్టారు. ఆయన మీడియాతో మాట్లాడుతూ ముఖ్యమంత్రి జగన్ నేతన్నల అభ్యున్నతికి పాటుపడుతున్నారన్నారు. బీసీల అభ్యున్నతి కోసం కృషి చేసింది నాడు ఎన్టీఆర్, నేడు వైఎస్ జగన్ మాత్రమేనన్నారు. తమది బీసీల పార్టీ అని చెప్పుకునే చంద్రబాబు వాస్తవానికి బీసీలను దారుణంగా నయవంచన చేశారని ఆరోపించారు. సీఎం వైఎస్ జగన్ మార్గనిర్దేశంలో ఆప్కో అభివృద్ధికి కృషి చేస్తానని చిరంజీవి అన్నారు. ఎమ్మెల్సీలు పోతుల సునీత, మురుగుడు హనుమంతరావు, రాష్ట్ర ప్రణాళికా సంఘం చైర్మన్ మల్లాది విష్ణు, చేనేత జౌళి శాఖ కమిషనర్, ఆప్కో మేనేజింగ్ డైరెక్టర్ ఎంఎం నాయక్, దేవాంగ కార్పొరేషన్ చైర్మన్ బీరక సురేందర్, పద్మశాలి కార్పొరేషన్ చైర్‌పర్సన్ జింకా విజయలక్ష్మి తదితరులు మాట్లాడారు.

నేటి నుంచి 'జెండర్ రెస్పాన్సివ్ గవర్నెన్స్' సదస్సు

హాజరుకానున్న 10 రాష్ట్రాల మహిళా ఎమ్మెల్యేలు, ఎమ్మెల్సీలు

సాక్షి, విశాఖపట్నం: 'సాధికారత కలిగిన మహిళా నాయకత్వం – సాధికార ప్రజాస్వామ్యం' అనే అంశంపై విశాఖలో జెండర్ రెస్పాన్సివ్ గవర్నెన్స్ సదస్సు శనివారం ప్రారంభం కానుంది. జాతీయ మహిళా కమిషన్ ఆధ్వర్యంలో ఏపీ మహిళా కమిషన్ నిర్వహిస్తున్న ఈ సదస్సులో పాల్గొనేందుకు ఇప్పటికే ఆంధ్రప్రదేశ్‌తోపాటు కేరళ, తమిళనాడు, తెలంగాణ, కర్ణాటకసహా 10 రాష్ట్రాలకు చెందిన మహిళా మంత్రులు, ఎమ్మెల్యేలు, ఎమ్మెల్సీలు గురువారం సాయంత్రానికి విశాఖ చేరుకున్నారు. రుషికొండలోని రాడిసన్ బ్లూ హోటల్‌లో 6వ తేదీ వరకు మూడు రోజులపాటు నిర్వహించే ఈ సదస్సులో మహిళా సాధికారత, నాయకత్వం, ప్రజాస్వామ్యంలో మహిళా నేతల పాత్ర మొదలైన అంశాలపై చర్చించనున్నారు. ముస్సోరీలోని లాల్‌బహదూర్ శాస్త్రి నేషనల్ అకాడమీ ఆఫ్ అడ్మినిస్ట్రేషన్ ఆధ్వర్యంలో షీ ఈజ్ ఏ చేంజ్‌మేకర్ పేరుతో దేశవ్యాప్తంగా కెపాసిటీ బిల్డింగ్ ప్రోగ్రాం నిర్వహించారు. ఆ ప్రోగ్రాం ద్వారా ఎంపికైన మహిళా ఎమ్మెల్యేలతో 'జెండర్ రెస్పాన్సివ్ గవర్నెన్స్' పేరుతో సదస్సు నిర్వహిస్తున్నారు. ఇప్పటి వరకు దీనికి సంబంధించి మొదటి వర్క్‌షాప్ హిమాచల్ ప్రదేశ్‌లో, రెండో వర్క్‌షాప్ ఉదయ్ పూర్‌లో నిర్వహించారు. మూడో వర్క్ షాప్‌ని విశాఖలో నిర్వహిస్తున్నారు.

ప్యాకేజీ.. మింగేశారు

- ఎన్నికల సమయంలో నాన్ ఫిషర్‌మెన్ ప్యాకేజీ మంజూరు
- రూ.1.22 కోట్ల పేదల సొమ్ము టీడీపీ నేతల జేబుల్లోకి
- 300 మంది నగదును పక్కదారి పట్టించిన సోమిరెడ్డి అనుచరులు
- రికార్డుల్లో మాత్రం ప్యాకేజీ నిధుల పంపిణీ
- వైఎస్సార్‌సీపీ ప్రభుత్వంలో వచ్చాక ప్యాకేజీ కింద రూ.35 కోట్లు మంజూరు
- పారదర్శకంగా లబ్ధిదారులకు పంపిణీ

సాక్షి ప్రతినిధి, నెల్లూరు: రాష్ట్రానికే తలమానికంగా కృష్ణపట్నం పోర్టును 2008లో అప్పటి ముఖ్యమంత్రి వైఎస్ రాజశేఖరరెడ్డి ప్రారంభించారు. అప్పట్లో పోర్టు ఆధారిత పరిశ్రమల కోసం భూ సేకరణ చేశారు. దీంతో ఉపాధి కోల్పోయిన నిర్వాసితుల కోసం ఆర్అండ్ఆర్ ప్యాకేజీ ప్రకటించారు. మత్స్యకార కుటుంబాల తరలింపునకు, కొంత కాలం ఉపాధి కోసం ఒక్కొక్కరికి రూ.1.20 లక్షల చొప్పున రూ.32 కోట్లు అందించారు. వీరితో పాటు మత్స్యకారేతరులను గుర్తించి వారికి ప్యాకేజీ అందించాలని వైఎస్సార్ నిర్ణయించారు. అయితే వైఎస్సార్ అకాల మరణం నాన్ ఫిషర్‌మెన్ కుటుంబాల పాలిట శాపంగా మారింది. ఆ తర్వాత పాలన కొనసాగించిన కాంగ్రెస్ ప్రభుత్వం ప్యాకేజీని బుట్టదాఖలు చేసింది. 2014లో అధికారంలోకి వచ్చిన టీడీపీ ప్రభుత్వం ఒక్కొక్కరికి రూ.43 వేలకుపైగా ప్యాకేజీ అందిస్తామని కొంత కాలం మభ్యపెట్టింది. అయితే ఇందులో ఎస్సీ, ఎస్టీలకు మాత్రమే మూడు విడతల్లో ఇస్తానని చెప్పడంతో అప్పటి సీఎం చంద్రబాబు నిర్ణయాన్ని వ్యతిరేకిస్తూ ఏకమైన మత్స్యకారేతర కుటుంబాలు రోడ్డెక్కి ఆందోళనలు చేశాయి. అయినా ఫలితం లేకుండా పోయింది. ప్రతిపక్ష నేత హోదాలో ప్రజాసంకల్పయాత్ర చేసిన వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి మత్స్యకారేతర కుటుంబాల సమస్యను విన్నారు. అధికారంలోకి వచ్చాక ప్యాకేజీ విషయంలో న్యాయం చేస్తానని హామీ ఇచ్చారు. 2019 ఎన్నికల ముందు వరకూ తెల్లరేషన్ కార్డు కలిగిన ప్రతి మత్స్యకారేతర కుటుంబానికి ప్యాకేజీ అందిస్తానని భరోసా ఇచ్చారు.

ఎన్నికల ముందు హడావుడిగా..

టీడీపీ హయాంలో ఐదేళ్ల పాటు నాన్ ఫిషర్‌మెన్ ప్యాకేజీని పట్టించుకోని అప్పటి మంత్రి సోమిరెడ్డి చంద్రమోహన్‌రెడ్డి ఎన్నికల సమయంలో వారి ఓట్ల కోసం కేవలం ఎస్సీ, ఎస్టీల కోసం ప్రత్యేకంగా రూ.4.09 కోట్లు మంజూరు చేయించారు. హడావుడిగా 3, 550 కుటుంబాలకు ఒక్కొక్కరికి రూ.10,500 వంతున రూ.3.87 కోట్లు పంపిణీ చేయించారు. ఇంకా రూ.1.22 కోట్లు పంపిణీ చేయకుండా అప్పట్లో ఆ నగదు పంపిణీలో సోమిరెడ్డి అనుచరులు చేతివాటం ప్రదర్శించారు. చెక్కుల రూపంలో పంపిణీ జరగడంతో రెవెన్యూ అధికారులు మాత్రం లబ్ధిదారులకు పంపిణీ జరిగినట్లు చూపించారు. కానీ లబ్ధిదారుల పేరుతో టీడీపీ నేతలే బ్యాంకు కెళ్లి డ్రా చేసుకుని ఆరగించారు. మండలంలోని పంటపాళెం, పైనాపురం, నేలటూరు, ముత్తుకూరు, దొరవులపాళెం గ్రామాల్లో దాదాపు 300 మందికి సంబంధించిన నగదును టీడీపీ నేతలే దిగమింగారు.

కాకాణి చొరవతో 16,337 కుటుంబాలకు లబ్ధి

వైఎస్సార్‌సీపీ అధికారంలోకి వచ్చాక మంత్రి కాకాణి గోవర్ధన్‌రెడ్డి ప్రత్యేక చొరవ చూపించారు. ప్రజాసంకల్పయాత్రలో వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి ఇచ్చిన హామీ మేరకు పారదర్శకంగా 16,337 కుటుంబాలను లబ్ధిదారులను గుర్తించారు. ఒక్కొక్కరికి రూ.25 వేల వంతున రూ.35.75 కోట్లు కేటాయించి, లబ్ధిదారుల బ్యాంక్ ఖాతాల్లో నేరుగా నగదు జమ చేయించారు. టీడీపీ హయాంలో రూ.10,500 మాత్రమే లబ్ధి పొందిన వారికి సైతం మిగతా రూ.14,500 వంతున ప్యాకేజీ అందించారు.

నాకు ప్యాకేజీ ఇవ్వకుండానే..



నాకు నాన్‌ఫిషర్‌మెన్ ప్యాకేజీ కింద డబ్బులు పంపిణీ చేసినట్లు రికార్డుల్లో ఉంది. నాకు మాత్రం అందలేదు. నా పేరు మీద చెక్కురాసి తీసేసుకున్నారు. టీడీపీ నేతలే ఈ పని చేశారు. మా కడుపులు కొట్టి ఇలా ప్రవర్తించడం వాళ్లకే చెల్లింది. ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి ఎన్నికలకు ముందు ఇచ్చిన హామీ మేరకు ప్యాకేజీ మంజూరు చేశారు. మంత్రి కాకాణి గోవర్ధన్‌రెడ్డి మాత్రం ప్రతి ఒక్క కుటుంబానికి అందేలా చూశారు.

– కర్లపూడి సుబ్రహ్మణ్యం, ముత్తుకూరు

ఇంధన పొదుపులో ఏపీనే లీడర్

ఎనర్జీ ఎఫిషియన్సీలో మిగిలిన రాష్ట్రాలకు ఏపీ బ్రాండ్

- రాష్ట్రంలో 12 వేల ఎనర్జీ క్లబ్స్ ఏర్పాటుకు ప్రణాళికలు
- ప్రతి క్లబ్‌కి ఏటా రూ.10 వేల వరకు ప్రోత్సాహకాలు
- ఏపీలో ఇంధన పొదుపు ద్వారా ఏటా రూ.3500 కోట్లు ఆదా
- 'సాక్షి'తో బ్యూరో ఆఫ్ ఎనర్జీ ఎఫిషియన్సీ సెక్రటరీ ఆర్ కే రాయ్


బీఈఈ సెక్రటరీ రాకేష్ కే రాయ్

సాక్షి, విశాఖపట్నం : ఇంధన సామర్థ్య నిర్వహణలో అన్ని రాష్ట్రాలకు ఏపీ స్టేట్ ఎనర్జీ కన్జర్వేషన్ మిషన్(ఏపీఎస్ఈసీఎం) లీడర్‌గా వ్యవహరిస్తోందని బ్యూరో ఆఫ్ ఎనర్జీ ఎఫిషియన్సీ (బీఈఈ) సెక్రటరీ రాకేష్ కే రాయ్ వెల్లడించారు. ఎనర్జీ ఎఫిషియన్సీలో మిగిలిన రాష్ట్రాలకు ఏపీని బ్రాండ్‌గా చూపిస్తున్నామని తెలిపారు. ఇంధన పొదుపునకు ప్రత్యేకంగా స్టేట్ డిజిగ్నేటెడ్ ఏజెన్సీ (ఎస్‌డీఏ)లు ఏర్పాటు చేయడం శుభ పరిణామమని చెప్పారు. ఆయన గురువారం 'సాక్షి'తో మాట్లాడుతూ పలు అంశాలను వివరించారు. వాటిలో ప్రధానమైనవి..

ఏపీలో ఏటా రూ.3,500 కోట్లు ఆదా

ఇంధన సామర్థ్య చర్యల్ని పటిష్టంగా అమలు చేయడంలో ఏపీ ప్రభుత్వం ముందంజలో ఉంది. అన్ని రాష్ట్రాలకూ ఏపీఎస్ఈసీఎం ఆదర్శంగా నిలుస్తోంది. ఇందుకోసం ఏపీలో ప్రత్యేకంగా ఎనర్జీ కన్జర్వేషన్ మిషన్, స్టేట్ డిజిగ్నేటెడ్ ఏజెన్సీలు ఏర్పాటు చేయడం విశేషం. ఏపీ అనుసరిస్తున్న విధానాల్ని దేశంలోని అన్ని రాష్ట్రాల్లో అమలు చేయాలని నిర్ణయించాం. దేశంలో తొలిసారిగా రాష్ట్రపతి అవార్డుని ఏపీఎస్ఈసీఎం దక్కించుకోవడం ఇంధన పొదుపుపై ఏపీ విధానాలకు నిదర్శనం. ఇప్పటికే పవర్ ప్లాంట్స్, సిమెంట్, టెక్స్‌టైల్స్, డిస్ట్రిబ్యూషన్ సంస్థలు ఇలా.. రాష్ట్రంలోని మొత్తం 53 గుర్తింపు పొందిన భారీ పరిశ్రమలు బీఈఈ ప్రమాణాలకు అనుగుణంగా ఇంధన సామర్థ్య చర్యలను అమలు చేస్తున్నాయి. దీని ద్వారా 3,430 మిలి యన్ యూనిట్లు ఆదా చేస్తున్నాయి. దీని ద్వారా పెర్‌ఫార్మ్ అచీవ్ ట్రేడ్ (ప్యాట్) అమలులో ఏపీ ఇప్పటికే అద్భుతమైన పనితీరు కనబరుస్తోంది. ఏపీలోని పరిశ్రమల్లో ఇంధన పొదుపు ద్వారా ఏటా రూ.3,500 కోట్లు ఆదా అవుతోంది.

త్వరలో వలంటరీ కార్బన్ ట్రేడ్.

బీఈఈ అడ్మినిస్ట్రేటర్‌గా ఈ ఏడాది నుంచి వలంటరీ కార్బన్ ట్రేడింగ్ ఫ్రేమ్ వర్క్‌కు సిద్ధమవుతున్నాం. ఇంధన పొదుపు పాటించే ప్రతి పరిశ్రమకు కర్బన ఉద్గారాల నియంత్రణకు సంబంధించి బీఈఈ ఈ ట్రేడ్ ధ్రువపత్రం అందిస్తుంది. ఎందుకంటే గ్లోబల్ వార్మింగ్ మరో 1.5 డిగ్రీలు దాటితే మరింత కర్బన ఉద్గారాలకు దారితీసే ప్రమాదం ఉంది. ఇదే జరిగితే రుతుపవనాల రాకలో కూడా తీవ్రమైన మార్పులుంటాయి. దీనిని నియంత్రించడానికి భారత ప్రభుత్వం తీవ్రంగా ప్రయత్నిస్తోంది. దేశంలో 2030 నాటికి కర్బన ఉద్గారాలు 45 శాతం తగ్గించే లక్ష్యంతో రోషనీ అనే కార్యక్రమాన్ని బీఈఈ అమలు చేస్తోంది. ఇందులో భాగంగా ఇంధన సామర్థ్య సాంకేతికత సాయంతో విద్యుత్, ఇతర ఇంధన వనరుల వినియోగాన్ని తగ్గించేందుకు నిర్మాణాత్మక కార్యక్రమాలు అమలు చేస్తున్నాం. భవిష్యత్తులో కర్బన ఉద్గారాల నియంత్రణలో భారత్ దిక్సూచిగా మారబోతోంది.

ఏపీలో 12 వేల ఎనర్జీ క్లబ్‌లు ఏర్పాటు

ఇంధన పొదుపుపై ప్రజల్లో అవగాహన కల్పించేందుకు బీఈఈ విభిన్న కార్యక్రమాల్ని నిర్వహిస్తోంది. ఇందులో భాగంగా భవిష్యత్తు వారధులైన విద్యార్థుల్లో అవగాహన కల్పించేందుకు ప్రభుత్వ, ప్రైవేట్ విద్యాసంస్థలని భాగస్వామ్యం చేస్తూ దేశవ్యాప్తంగా లక్ష ఎనర్జీ క్లబ్‌లు ఏర్పాటు చేస్తున్నాం. ఏపీలో 12 వేల క్లబ్‌లు ఏర్పాటు చేస్తున్నాం. ప్రతి క్లబ్‌కు ఏటా రూ.10 వేలు నిధులు సమకూరుస్తాం. ఈ క్లబ్‌లు విద్యార్థుల్లో ఇంధన పొదుపుపై అవగాహన కల్పిస్తాయి.

మనం ఆదా చేసే విద్యుత్ శ్రీలంక సరఫరాతో సమానం

ఇంధన సామర్థ్యం విషయంలో భారత్.. మిగిలిన దేశాలతో పోలిస్తే.. అద్భుతంగా అడుగులు వేస్తోంది. భవిష్యత్తులో తలెత్తబోయే ప్రమాదాలను ముందే పసిగట్టిన ఏపీ ప్రభుత్వం, కేంద్ర ప్రభుత్వాలు.. ఆ దిశగా చర్యలు తీసుకుంటున్నాయి. దేశంలోని 13 రంగాలకు చెందిన పరిశ్రమలు ఇంధన సామర్థ్యాల్ని అమలు చేస్తుండటం వల్ల ఏటా రూ.48 వేల కోట్లు విద్యుత్ ఆదా అవుతోంది. ఇది శ్రీలంక వంటి దేశాలకు విద్యుత్ సరఫరాతో సమానం. ఇది మరింతగా పెరగాల్సిన అవసరం ఉంది.

ఏప్రిల్ నుంచి ఫోర్టిఫైడ్ రైస్ సరఫరా

ఆర్బీకేల పనితీరుతో రైతులు సంతోషం

- గోధుమపిండి సరఫరాపై ఈనాడుది కడుపుమంట
- మంత్రి కారుమూరి నాగేశ్వరరావు


అధికారులతో సమీక్ష నిర్వహిస్తున్న మంత్రి కారుమూరి నాగేశ్వరరావు

సాక్షి, విశాఖపట్నం : రాష్ట్రంలో వచ్చే ఏప్రిల్ నుంచి అన్ని జిల్లాల్లోనూ ఫోర్టిఫైడ్ రైస్‌ని సరఫరా చేయనున్నట్లు పౌరసరఫరాల శాఖ మంత్రి కారుమూరి నాగేశ్వరరావు ప్రకటించారు. ఇక్కడి జీవీఎంసీ ప్రధాన కార్యాలయంలో ఉత్తరాంధ్ర జిల్లాల పౌరసరఫరాల అధికారులతో మంత్రి శుక్రవారం సమీక్ష నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. రాష్ట్రంలోని ఏ ఒక్క రైతూ నష్టపోకుండా పండించిన పంటకు సరిపడా లాభాన్ని ఇంటికి తీసుకెళ్లాలన్న లక్ష్యంతో సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి నిరంతరం రైతుల గురించి ఆలోచిస్తున్నారన్నారు. ఇందులో భాగంగానే ప్రతీ రైతు నుంచి ధాన్యం కొనుగోలు చేయాలని అధికారులను ఆదేశించారు. ఆర్బీకే నెట్‌వర్క్ వ్యవస్థ సమర్థవంతంగా పనిచేస్తుండటం వల్ల రైతులు సంతోషంగా ఉన్నారన్నారు. చంద్రబాబు ఐదేళ్ల కాలంలో సేకరించిన ధాన్యం కంటే ఈ మూడున్నరేళ్ల జగన్ పాలనలోనే అధిక మొత్తంలో కొనుగోలు చేశామన్నారు.

రాగులు, జొన్నల సాగుకు ప్రోత్సాహం

మరోవైపు.. వలంటీర్లు నిర్వహించిన సర్వేలో చాలామంది ప్రజలు రాగులు, జొన్నలు కూడా పంపిణీ చేయాలని కోరారన్నారు. అందుకే వీటిని సాగుచేసేందుకు రైతులను ప్రోత్సహిస్తున్నామని, వాటినీ పౌర సరఫరాల శాఖ కొనుగోలు చేస్తూ రేషన్ దుకాణాల ద్వారా విక్రయించనున్నామని మంత్రి తెలిపారు. ఇక రేషన్ డిపోలు ఎత్తివేస్తున్నామనేది ఒక అపోహ మాత్రమేనని ఆయన స్పష్టంచేశారు. అలాగే, నాణ్యమైన గోధుమ పిండి సరఫరా చేస్తుంటే పొట్టు ఉందంటూ ఈనాడు పత్రిక కడుపు మంటతో వార్తలు రాస్తోందని కారుమూరి మండిపడ్డారు. ఈ సమీక్షలో సివిల్ సప్లైస్ కమిషనర్ అరుణ్‌కుమార్, ఏపీ సివిల్ సప్‌లైస్ కార్పొరేషన్ వీసీ ఎండీ వీరపాండ్యన్, పౌర సరఫరాల శాఖ డైరెక్టర్ ఎం. విజయ సునీతతోపాటు శ్రీకాకుళం, విజయనగరం, పార్వతీపురం మన్యం, అనకాపల్లి, విశాఖపట్నం, అల్లూరి జిల్లాల జాయింట్ కలెక్టర్లు, పౌరసరఫరాల శాఖ అధికారులు పాల్గొన్నారు.

క్లుప్తంగా...

ఎయిరిండియా విమానం ఇంజిన్‌లో మంటలు

న్యూఢిల్లీ: అబుదాబి నుంచి కేరళలోని కోజికోడ్ (కాలికట్)కు వెళ్తున్న ఎయిరిండియా విమానం ఇంజిన్‌లో సాంకేతిక లోపం తలెత్తింది. టేకాఫ్ అయిన కాసేపటికే ఇంజిన్‌లో మంటలు రావడంతో అధికారుల సూచనల మేరకు విమానాన్ని పైలట్ తిరిగి అబుదాబి విమానాశ్రయానికి తీసుకెళ్లినట్లు డీజీసీఏ తెలిపింది. మొత్తం 184 మంది ప్రయాణికులు సురక్షితంగా ఉన్నారని పేర్కొంది. శుక్రవారం ఉదయం చోటుచేసుకున్న ఈ ఘటనపై దర్యాప్తునకు ఆదేశించినట్లు డీజీసీఏ పేర్కొంది.

ఎంపీ ప్రణీత్ కౌర్‌ను బహిష్కరించిన కాంగ్రెస్

న్యూఢిల్లీ: పంజాబ్ మాజీ సీఎం అమరీందర్ సింగ్ భార్య, పటియాలా లోక్‌సభ ఎంపీ ప్రణీత్ కౌర్‌ను పార్టీ వ్యతిరేక కార్యకలాపాల ఆరోపణలపై కాంగ్రెస్ శుక్రవారం పార్టీ నుంచి సస్పెండ్ చేసింది. మూడు రోజుల్లోగా ఆమె నుంచి వివరణ కోరింది. కౌర్ బీజేపీకి సాయం చేస్తున్నారంటూ పీసీసీ చీఫ్‌తో పాటు పలువురు నేతల నుంచి ఫిర్యాదులందాయని ఏఐసీసీ క్రమశిక్షణ కమిటీ సభ్య కార్యదర్శి తారిఖ్ అన్వర్ తెలిపారు.

అమూల్ పాల ధర లీటర్‌కు రూ.2 పెంపు

ఆనంద్: అమూల్ పాల ధర లీటరుకు రూ.2 చొప్పున పెరిగింది. విక్రయ సంస్థ గుజరాత్ సహకార పాల మార్కెటింగ్ సమాఖ్య (జీసీఎంఎంఎఫ్) ఈ మేరకు పేర్కొంది. గుజరాత్ మినహా దేశంలోని మిగతా ప్రాంతాలకు పెరిగిన ధర వర్తిస్తుందని స్పష్టత నిచ్చింది. దాంతో శుక్రవారం నుంచి లీటరు తాజా మిల్క్ ప్యాకెట్ ధర రూ.54కు, అమూల్ గోల్డ్ ప్యాకెట్ ధర రూ.66కు చేరింది. లీటరు ఆవు పాల ధర రూ.56కు, అమూల్ ఏ2 గేదె పాల ప్యాకెట్ ధర రూ.70కి పెరిగినట్లు పేర్కొంది.

ముంబైలో ఉగ్రదాడి అంటూ ఎన్‌ఐఏకి బెదిరింపు మెయిల్

ముంబై: తాలిబన్ ఉగ్రవాది ముంబైపై దాడి చేయనున్నట్లు జాతీయ దర్యాప్తు సంస్థ(ఎన్‌ఐఏ)కు శుక్రవారం మెయిల్ అందింది. దాంతో ముంబై పోలీసులను, మహారాష్ట్ర ఉగ్రవాద వ్యతిరేక దళం (ఏటీఎస్)ను ఎన్‌ఐఏ అధికారులు అప్రమత్తం చేశారు. బెదిరింపు ఇ-మెయిల్‌లో సీఐఏ అని మాత్రమే ఉందని, ఇంటర్నెట్ ప్రొటోకాల్ అడ్రస్ పాకిస్తాన్‌కు చెందనదిగా తేలిందని అధికారులు తెలిపారు. గత నెలలోనూ ఎన్‌ఐఏకు ఇలాంటి బెదిరింపు మెయిలే అందిందన్నారు. ఇది ఆకతాయిల పని కావచ్చని పోలీసులు అనుమానిస్తున్నారు. కాగా, సీఐఏ అమెరికాకు చెందిన నిఘా సంస్థ సెంట్రల్ ఇంటెలిజెన్స్ ఏజెన్సీ.

డొక్కు బండ్లు తుక్కుకే..

దేశవ్యాప్తంగా 4.50 కోట్లకు పైగా పాత వాహనాలు ● దశల వారీగా అన్నీ తొలగింపు



పర్యావరణ పరిరక్షణలో భాగంగా కర్బన ఉద్గారాల తగ్గింపుపై కేంద్ర ప్రభుత్వం ప్రత్యేకంగా దృష్టి సారించింది. కర్బన ఉద్గారాల విషయంలో 'కాలం చెల్లిన వాహనాల' వాటా గణనీయంగానే ఉంది. దేశంలో 4.50 కోట్లకు పైగా పాత వాహనాలు రోడ్లపై తిరుగుతున్నాయి. కాలుష్యానికి కారణమవుతున్న డొక్కు వాహనాలను రోడ్లపైకి అనుమతించరాదని నిపుణులు తేల్చిచెబుతున్నారు. 2021–22 బడ్జెట్‌లో 'వెహికల్ స్క్రాపింగ్ పాలసీ'ని కేంద్ర ప్రభుత్వం ప్రకటించింది. కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు, రవాణా సంస్థలు, ప్రభుత్వ రంగ సంస్థలకు చెందిన 9 లక్షలకు పైగా డొక్కు వాహనాలను ఈ ఏడాది ఏప్రిల్ 1వ తేదీ నుంచి తుక్కు(స్క్రాప్)గా మార్చేయాలని కేంద్ర రోడ్డు రవాణా, హైవేల శాఖ మంత్రి నితిన్ గడ్కరీ ఇటీవలే ఆదేశాలు జారీ చేశారు. ప్రభుత్వానికి చెందిన పాత వాహనాలను, పాత అంబులెన్స్‌లను తుక్కుగా మార్చడానికి, వాటి స్థానంలో కొత్తవి కొనుగోలు చేయడానికి అదనంగా నిధులు సమకూరుస్తామని 2023–24 బడ్జెట్ ప్రసంగంలో కేంద్ర ఆర్థిక శాఖ మంత్రి నిర్మలా సీతారామన్ హామీ ఇచ్చారు. ఈ నేపథ్యంలో పాత వాహనాలను తుక్కుగా మార్చేందుకు అందుబాటులో ఉన్న విధానం ఏమిటో తెలుసుకుందాం..

పాత వాహనాలు అంటే?

- రవాణా వాహనం(సీవీ) రిజిస్ట్రేషన్ గడువు సాధారణంగా 15 సంవత్సరాలు ఉంటుంది. ఈ తర్వాత ఫిట్‌నెస్ సర్టిఫికెట్ తీసుకోవడంలో విఫలమైతే స్క్రాపింగ్ పాలసీ ప్రకారం ఆ వాహనం రిజిస్ట్రేషన్ రద్దవుతుంది. అప్పుడు దాన్ని తుక్కుగా మార్చేయాల్సిందే.
- ప్యాసింజర్ వాహనాల(పీవీ) రిజిస్ట్రేషన్ గడువు 20 ఏళ్లు. గడువు ముగిశాక వెహికల్ అన్‌ఫిట్ అని తేలినా లేక రిజిస్ట్రేషన్ సర్టిఫికెట్‌ను రెన్యువల్ చేసుకోవడంలో విఫలమైనా రిజిస్ట్రేషన్ రద్దవుతుంది. వెహికల్‌ను స్క్రాప్‌గా మార్చాలి.
- 20 ఏళ్లు దాటిన హెవీ కమర్షియల్ వాహనాలకు(హెచ్‌సీవీ) ఈ ఏడాది ఏప్రిల్ 1 నుంచి ఆటోమేటెడ్ టెస్టింగ్ స్టేషన్లలో ఫిట్‌నెట్ పరీక్షలు నిర్వహిస్తారు.
- ఇతర కమర్షియల్ వాహనాలకు, వ్యక్తిగత, ప్రైవేట్ వాహనాలకు జూన్ 1 నుంచి పరీక్షలు నిర్వహిస్తారు. ఈ టెస్టులో ఫెయిలైన వాహనాలను ఎండ్–ఆఫ్–లైఫ్ వెహికల్(ఈఎల్‌వీ)గా పరిగణిస్తారు.
- ఫిట్‌నెస్ పరీక్షలో నెగ్గిన వాహనాలపై 10 శాతం నుంచి 15 శాతం దాకా గ్రీన్ ట్యాక్స్ విధిస్తారు.
- రిజిస్ట్రేషన్ అయిన తేదీ నుంచి 15 ఏళ్లు దాటిన కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాల, మున్సిపల్ కార్పొరేషన్ల, రాష్ట్ర రవాణా సంస్థల, ప్రభుత్వ రంగ సంస్థల, స్వయం ప్రతిపత్తి కలిగిన సంస్థలకు చెందిన అన్ని వాహనాల రిజిస్ట్రేషన్‌ను రద్దు చేసి, తుక్కుగా మార్చాలని స్క్రాపింగ్ పాలసీ నిర్దేశిస్తోంది.
- ప్రస్తుతం దేశవ్యాప్తంగా 4.50 కోట్లకు పైగా పాత వాహనాలు రోడ్లపై తిరుగుతున్నట్లు కేంద్ర ప్రభుత్వం గుర్తించింది. వాస్తవానికి వీటన్నింటినీ తుక్కుగా మార్చాలి.
- ప్రతి నగరంలో కనీసం ఒక స్క్రాపింగ్ కేంద్రం ఏర్పాటు చేయాలని ప్రభుత్వం నిర్ణయించింది.

వాహనదారులకు ప్రోత్సాహకాలు

- కాలం చెల్లిన వాహనాన్ని తుక్కుగా మార్చేందుకు ముందుకొచ్చిన వాహనదారులకు ప్రభుత్వం పలు ప్రోత్సాహకాలు ఇస్తుంది. ఇందుకోసం ఏం చేయాలంటే..
- తొలుత ఏదైనా రిజిస్టర్డ్ స్క్రాపింగ్ కేంద్రానికి వాహనాన్ని తరలించి, తుక్కుగా మార్చాల్సి ఉంటుంది.
- ఆ వాహనం స్క్రాప్ విలువ ఎంత అనేది స్క్రాపింగ్ కేంద్రంలో నిర్ధారిస్తారు. సాధారణంగా కొత్త వాహనం ఎక్స్–షోరూమ్ ధరలో ఇది 4–6 శాతం ఉంటుంది. ఆ విలువ చెల్లిస్తారు. స్క్రాపింగ్ సర్టిఫికెట్ అందజేస్తారు.
- స్క్రాపింగ్ సర్టిఫికెట్ ఉన్న వాహనదారులు కొత్త వ్యక్తిగత వాహనం కొనుగోలు చేస్తే 25 శాతం వరకూ రోడ్డు ట్యాక్స్ రిబేట్, వాణిజ్య వాహనం కొంటే 15 శాతం వరకూ రోడ్డు ట్యాక్స్ రిబేట్ ఇవ్వాలని రాష్ట్ర ప్రభుత్వాలకు కేంద్రం సూచించింది. స్క్రాపింగ్ సర్టిఫికెట్ ఉన్న వాహనదారులకు కొత్త వాహనం విలువలో 5 శాతం డిస్కౌంట్ ఇవ్వాలని వాహనాల తయారీ సంస్థలను కోరింది.
- పాత వాహనాన్ని తుక్కుగా మార్చి, కొత్తది కొనుగోలు చేస్తే రిజిస్ట్రేషన్ ఫీజులోనూ మినహాయింపు ఇస్తారు.

– సాక్షి, నేషనల్ డెస్క్

స్క్రాప్ రంగంలో కొత్తగా 35,000 ఉద్యోగాలు!

పాత వాహనాలను తుక్కుగా మార్చేయడం ఇప్పటికే ఒక పరిశ్రమగా మారింది. కానీ, ప్రస్తుతం అసంఘటితంగానే ఉంది. రానున్న రోజుల్లో సంఘటితంగా మారుతుందని, ఈ రంగంలో అదనంగా రూ.10,000 కోట్ల పెట్టుబడులు వస్తాయని, కొత్తగా 35,000 మందికి ఉద్యోగాలు లభిస్తాయని కేంద్ర రోడ్డు రవాణా, హైవేల శాఖ అంచనా వేస్తోంది.

ప్రత్యామ్నాయాలు ఏమిటి?

పెట్రోల్, డీజిల్ వంటి శిలాజ ఇంధనాలతో నడిచే వాహనాలను దశల వారీగా తగ్గించాలని ప్రభుత్వం నిర్ణయానికొచ్చింది. ప్రత్యామ్నాయ వాహనాలు క్రమంగా అందుబాటులోకి వస్తున్నాయి. విద్యుత్‌తో నడిచే (ఎలక్ట్రిక్) వాహనాల సంఖ్యను పెంచడమే లక్ష్యంగా కేంద్ర బడ్జెట్‌లో పలు రాయితీలు ప్రకటించారు. రాబోయే రోజుల్లో వీటి ధరలు భారీగా తగ్గనున్నాయి. సమీప భవిష్యత్తులో ఇథనాల్, మిథనాల్, బయో–సీఎన్‌జీ, బయో–ఎల్ఎన్‌జీ వాహనాలు విరివిగా అందుబాటులోకి వచ్చే అవకాశాలు ఉన్నాయి.

ఎన్నెన్నో ప్రయోజనాలు

కాలం తీరిన వాహనాలను తుక్కుగా మార్చడం ప్రధానంగా పర్యావరణానికి మేలు చేయనుంది. కాలుష్య ఉద్గారాలు భారీగా తగ్గుతాయి. ఆధునిక వాహనాలతో ఉద్గారాల బెడద తక్కువే.	పర్యావరణహిత, సురక్షితమైన, సాంకేతికంగా ఆధునిక వాహనాల వైపు వాహనదారులను నడిపించాలన్నది ప్రభుత్వ ఆలోచన.	పాత వాహనాల స్థానంలో కొత్తవి కొంటే వాహన తయారీ రంగం పుంజుకుంటుంది. ఈ రంగంలో నూతన పెట్టుబడులు, ఉద్యోగాలు వస్తాయి.
		కొత్త వాహనాలతో యజమానులకు నిర్వహణ భారం తగ్గిపోతుంది. చమురును ఆదా చేయొచ్చు, తద్వారా ఖర్చు తగ్గించుకోవచ్చు.

స్క్రాప్ చేసిన వెహికల్స్ నుంచి ఎన్నో ముడిసరుకులు లభిస్తాయి. ఆటోమొబైల్, స్టీల్, ఎలక్ట్రానిక్స్ పరిశ్రమలకు తక్కువ ధరకే ఈ ముడిసరుకులు లభ్యమవుతాయి.

అమెరికా అణుస్థావరంపై చైనా బెలూన్

ఇరుదేశాల మధ్య ఉద్రిక్తతలు ● బ్లింకెన్ చైనా పర్యటన వాయిదా



వాషింగ్టన్/బీజింగ్: చైనాకు చెందిన నిఘా బెలూన్ అమెరికా గగనతలంపై, అదీ అణు స్థావరం వద్ద తచ్చాడటం కలకలం రేపింది. దీనిపై అమెరికా తీవ్రంగా స్పందించింది. విదేశాంగ మంత్రి ఆంటోనీ బ్లింకెన్ చైనా పర్యటనను వాయిదా వేసుకున్నారు. మూడు బస్సుల పరిమాణంలో ఉన్న ఈ బెలూన్ కొన్ని రోజులుగా తమ గగనతలంలో అగుపిస్తోందని, అది గురువారం మోంటానాలో ప్రత్యక్షమైందని పెంటగాన్ పేర్కొంది. అది అత్యంత ఎత్తులో ఎగురుతున్నందున వాణిజ్య విమానాల రాకపోకలకు అంతరాయమేమీ లేదని తెలిపింది. ఈ నేపథ్యంలో సున్నిత సమాచారం లీకవకుండా జాగ్రత్తలు తీసుకున్నట్లు వివరించింది. బెలూన్‌ను కూల్చేస్తే దాని శకలాల వల్ల ప్రజలకు హాని కలగవచ్చని ఆర్మీ భావిస్తోంది. అన్ని అంశాలను అధ్యక్షుడు బైడెన్‌కు వివరించినట్లు పెంటగాన్ ప్రకటించింది. అమెరికాలోని మూడు భూగర్భ అణు క్షిపణి కేంద్రాల్లో ఒకటి మోంటానాలోనే ఉంది. దాంతో ఈ పరిణామం రెండు దేశాల మధ్య ఉద్రిక్తతలకు మరింత ఆజ్యం పోసినట్లయింది. చైనాతో చర్చల నిమిత్తం శుక్రవారం రాత్రి బయల్దేరాల్సిన విదేశాంగ మంత్రి బ్లింకెన్ పర్యటన వాయిదా పడింది. వాతావరణ పరిశోధన కోసం ప్రయోగించిన బెలూన్ దారి తప్పి అమెరికా గగనతలంలోకి ప్రవేశించిందని చైనా పేర్కొంది. ఈ అనుకోని పరిణామానికి చింతిస్తున్నట్టు చెప్పింది. ఈ వివరణతో అమెరికా సంతృప్తి చెందలేదు. ''మా గగనతలంలోకి చైనా బెలూన్ రావడం మా సార్వభౌమత్వాన్ని, అంతర్జాతీయ చట్టాలను ఉల్లంఘించడమే. చైనా చర్య ఆమోదయోగ్యం కాదు. ఈ సమయంలో బ్లింకెన్ పర్యటన సరికాదని భావిస్తున్నాం'' అని అమెరికా అధికారి ఒకరన్నారు. పరిస్థితులు అనుకూలించాక బ్లింకెన్ చైనా పర్యటన ఉంటుందన్నారు.

అమెరికా హౌస్ విదేశీ వ్యవహారాల కమిటీ నుంచి

ఇల్హాన్ ఒమర్ తొలగింపు



వాషింగ్టన్: 'కశ్మీర్‌పై అమెరికా మరింత శ్రద్ధ పెట్టాలి' అని వ్యాఖ్యానించి భారత్ ఆగ్రహానికి గురైన అమెరికా ప్రతినిధుల సభ సభ్యురాలు ఇల్హాన్ ఒమర్‌కు షాక్ తగిలింది. శక్తిమంతమైన హౌస్ విదేశీ వ్యవహారాల కమిటీ నుంచి ఆమెను తొలగించారు. డెమొక్రటిక్ సభ్యురాలైన ఒమర్ తీరుపై రిపబ్లికన్ సభ్యులు చాలా రోజులుగా మండి పడుతున్నారు. ఇజ్రాయెల్, యూదులకు వ్యతిరేకంగా ఇష్టారాజ్యంగా ప్రకటనలు చేసిన ఆమె విదేశీ వ్యవహారాల కమిటీలో ఉండడానికి అర్హురాలు కాదని వారు వాదిస్తూ వచ్చారు. ఓటింగ్ నిర్వహించగా కమిటీ నుంచి ఆమె తొలగింపుకు అనుకూలంగా 218 ఓట్లు, వ్యతిరేకంగా 211 ఓట్లు వచ్చాయి. కమిటీలో లేనంత మాత్రాన తన గళాన్ని ఎవరూ అణచివేయలేరని, తాను మరింతగా రాటుదేలుతానని ఒమర్ వ్యాఖ్యానించారు. ఆమె గతంలో పాకిస్తాన్ ఆక్రమిత కశ్మీర్(పీఓకే)లో పర్యటించారు. అప్పటి పాకిస్తాన్ ప్రధానమంత్రి ఇమ్రాన్ ఖాన్‌తో సమావేశమయ్యారు.




బిల్‌గేట్స్ రోటీ!

సెలబ్రిటీ చెఫ్ ఈటన్ బెర్నాథ్‌తో కలిసి తాను తయారు చేసిన రోటీతో ఫొటోకు పోజిస్తున్న ప్రపంచ కుబేరుడు బిల్ గేట్స్. ఈ వీడియోకు 75 వేల వ్యూస్ వచ్చాయి! ఇటీవలి భారత్‌లో పర్యటనలో తాను రోటీ తయారీ మెలకువలు నేర్చుకున్నట్టు ఈటన్ ట్వీట్ చేయడం తెలిసిందే.

ఇబ్బందికరంగా కేంద్రం తీరు

కొలీజియం సిఫార్సుల పెండింగ్‌పై సుప్రీం

- హైకోర్టు జడ్జీల బదిలీలెందుకు తొక్కిపట్టారు?
- చేతులు ముడుచుకు కూచోవాలనుకుంటున్నారా?
- మూడో శక్తి మాతో ఆటలాడటాన్ని సహించబోం
- కఠినమైన నిర్ణయాలు తీసుకుంటాం: ధర్మాసనం
- సుప్రీం జడ్జిలుగా ఐదు పేర్లకు త్వరలో ఆమోదం: ఏజీ



న్యూఢిల్లీ: సుప్రీంకోర్టు న్యాయమూర్తులుగా గత డిసెంబర్లో కొలీజియం సిఫార్సు చేసిన ఐదు పేర్లను త్వరలో ఆమోదించనున్నట్టు కేంద్రం పేర్కొంది. రాజస్తాన్, పట్నా, మణిపూర్ హైకోర్టుల ప్రధాన న్యాయమూర్తులు జస్టిస్ పంకజ్ మిత్తల్, జస్టిస్ సంజయ్‌కరోల్, జస్టిస్ పి.వి.సంజయ్ కుమార్‌తో పాటు పట్నా హైకోర్టు న్యాయమూర్తి జస్టిస్ అహ్సనుద్దీన్ అమానుల్లా, అలహాబాద్ హైకోర్టు న్యాయమూర్తి జస్టిస్ మనోజ్ మిశ్రా వీరిలో ఉన్నారు. కొలీజియం సిఫార్సులను కేంద్రం పెండింగ్‌లో పెడుతున్న వైనంపై విచారణ జరుపుతున్న జస్టిస్ ఎస్.కె.కౌల్, జస్టిస్ ఏఎస్ ఓకా ధర్మాసనానికి అటార్నీ జనరల్ ఆర్.వెంకటరమణి శుక్రవారం ఈ మేరకు సమాచారమిచ్చారు. ''ఆ ఐదు సిఫార్సులు గత డిసెంబర్ 13న చేసినవి. ఇప్పుడు ఫిబ్రవరి వచ్చింది'' అని ధర్మాసనం గుర్తు చేయగా, ఆదివారానికల్లా నియామక ఉత్తర్వులు రావచ్చని బదులిచ్చారు.

కోర్టులపై దాడి పరిపాటైంది: జస్టిస్ కౌల్

కొలీజియం సిఫార్సులను తొక్కిపడుతున్న తీరుపై ధర్మాసనం ఈ సందర్భంగా తీవ్ర ఆగ్రహం వ్యక్తం చేసింది. హైకోర్టు న్యాయమూర్తుల నియామకం, బదిలీల సిఫార్సు సంగతేమిటని ప్రశ్నించింది. అందుకు ఇంకాస్త సమయం పడుతుందని ఏజీ చెప్పగా మండిపడింది. ''ఇది చాలా చాలా సీరియస్ అంశం. ఈ విషయంలో కేంద్రం వైఖరి మమ్మల్ని ఎంతగానో ఇబ్బంది పెడుతోంది. బదిలీ సిఫార్సులను కూడా పెండింగ్‌లో పెడితే మేమింకేం చేయాలని మీరు ఆశిస్తున్నట్టు? మీరు ఉత్తర్వులిచ్చే దాకా సదరు న్యాయమూర్తులు చేతులు ముడుచుకుని కూర్చోవాలా? మీరదే కోరుకుంటున్నారా?'' అంటూ తీవ్ర స్వరంతో ప్రశ్నించింది. ''ఈ విషయంలో మేం ఒక వైఖరికి వచ్చి అతి కఠినమైన నిర్ణయాలు తీసుకునేలా చేస్తున్నారు. అది అంతిమంగా అందరికీ చాలా అసౌకర్యంగా ఉంటుంది'' అంటూ ఏజీని హెచ్చరించింది. ''హైకోర్టు న్యాయమూర్తుల బదిలీల్లో జాప్యాన్ని అస్సలు అనుమతించేది లేదు. ఎందుకంటే ఈ విషయంలో కేంద్రం పాత్ర అతి స్వల్పం. ఈ విషయమై ఎవరో మూడో శక్తి మాతో ఆటలాడటాన్ని ఎట్టి పరిస్థితుల్లోనూ అనుమతించబోం. మీ జాప్యం వల్ల న్యాయ, పాలనపరమైన విధులకు విఘాతం కలగడం అస్సలు ఆమోదనీయం కాదు'' అంటూ మండిపడింది. ''హైకోర్టు ప్రధాన న్యాయమూర్తి పదవికి ఒక న్యాయమూర్తి పేరును కొలీజియం సిఫార్సు చేస్తే ఇప్పటిదాకా ఏ నిర్ణయమూ తీసుకోలేదు. మరో 19 రోజుల్లో ఆయన రిటైరవుతున్నారు. సీజే అవకుండానే రిటైరవాలని మీరు ఆశిస్తున్నట్టా?'' అని నిలదీసింది. ఇది తమ దృష్టిలో ఉందని, అవసరమైన చర్యలు తీసుకుంటామని ఏజీ బదులిచ్చినా సంతృప్తి చెందలేదు. ''కొలీజియం సిఫార్సులను ఒక్కోసారి రాత్రికి రాత్రే ఆమోదిస్తున్నారు. మరికొన్నిసార్లు విపరీతంగా జాప్యం చేస్తున్నారు'' అంటూ తీవ్రంగా తప్పుబట్టింది. కొలీజియం పునరుద్ఘాటించిన పేర్లనూ పెండింగ్‌లో పెడుతున్నారని న్యాయవాది ప్రశాంత్ భూషణ్ ధర్మాసనం దృష్టికి తీసుకెళ్లారు. కోర్టులపై బయట తీవ్ర దాడికి పాల్పడుతున్నారని మరో న్యాయవాది ఆరోపించగా వీటికి అలవాటు పడిపోయామని జస్టిస్ కౌల్ ఆవేదన వెలిబుచ్చారు. విచారణను ఫిబ్రవరి 13కు వాయిదా వేశారు.

కొలీజియం విషయమై కేంద్రానికి, న్యాయ వ్యవస్థకు మధ్య తీవ్ర ఘర్షణ వాతావరణం నెలకొనడం తెలిసిందే. కొలీజియం సిఫార్సులను కేంద్రం పెండింగ్‌లో పెట్టడం దాన్ని మరింత పెంచింది. తాజాగా అలహాబాద్, గుజరాత్ హైకోర్టుల ప్రధాన న్యాయమూర్తుల పేర్లను సుప్రీంకోర్టు న్యాయమూర్తులుగా సీజేఐ జస్టిస్ డి.వై.చంద్రచూడ్ సారథ్యంలోని కొలీజియం జనవరి 31న సిఫార్సు చేసింది. సుప్రీంకోర్టులో 34 మంది న్యాయమూర్తులకు గాను ప్రస్తుతం 27 మందే ఉన్నారు.

వెనుకబడిన తరగతులకు ప్రాధాన్యం

మహిళా సాధికారత కోసం కృషి చేస్తున్నాం: మోదీ



గువాహటి: దేశాభివృద్ధి కోసం ప్రభుత్వం తపిస్తోందని, అణగారిన, వెనుకబడిన వర్గాల సంక్షేమానికి ప్రాధాన్యమిస్తున్నామని ప్రధాని నరేంద్ర మోదీ ఉద్ఘాటించారు. అస్సాం రాష్ట్రం బార్పేట జిల్లాలో శుక్రవారం 'కృష్ణగురు ఏక్ నామ్ అఖండ్ కీర్తన్' కార్యక్రమంలో ఆయన వర్చువల్‌గా ప్రసంగించారు. ''మహిళల ఆదాయం పెరిగితే సాధికారత సాధ్యం. మహిళా సమ్మాన్ సేవింగ్ సర్టిఫికెట్‌తో వారికి కొత్త అవకాశాలు అందుబాటులోకి వస్తాయి. అనుసంధానం, అభివృద్ధి విషయంలో ఈశాన్య రాష్ట్రాలు దశాబ్దాలుగా నిర్లక్ష్యానికి గురయ్యాయి. ఈ ప్రాంతంపై ఎనిమిదేళ్లుగా ప్రత్యేకంగా దృష్టి పెట్టాం. ఈశాన్య ప్రజల సంప్రదాయ నైపుణ్యాలకు అంతర్జాతీయంగా గుర్తింపు లభిస్తోంది. వారి ఉత్పత్తులను ప్రదర్శించుకోవడానికి యూనిటీ మాల్ ఏర్పాట్లు చేస్తాం'' అన్నారు.

'బీబీసీ' రికార్డులు సమర్పించండి: సుప్రీం

న్యూఢిల్లీ: బీబీసీ డాక్యుమెంటరీపై నిషేధానికి సంబంధించిన ఒరిజినల్ రికార్డులు సమర్పించాల్సిందిగా కేంద్రాన్ని సుప్రీంకోర్టు ఆదేశించింది. మూడు వారాల్లోగా కౌంటర్ అఫిడవిట్, అనంతరం రెండు వారాల్లోగా రిజాయిండర్ దాఖలు చేయాలని పేర్కొంటూ కేంద్రానికి, సంబంధిత పక్షాలకు నోటీసులు జారీ చేసింది. గుజరాత్ అల్లర్లకు ప్రధాని మోదీయే బాధ్యుడన్న సదరు వివాదాస్పద డాక్యుమెంటరీని నిషేధించడాన్ని సవాలు చేస్తూ జర్నలిస్టు ఎన్.రామ్, తృణమూల్ ఎంపీ మహువా మొయిత్రా, లాయర్లు ప్రశాంత్‌భూషణ్, ఎంఎల్ శర్మ తదితరులు సుప్రీంకోర్టులో పిటిషన్లు దాఖలు చేయడం తెలిసిందే. వాటిపై న్యాయమూర్తులు జస్టిస్ సంజీవ్ ఖన్నా, జస్టిస్ ఎంఎం సుందరేశ్‌లతో కూడిన ధర్మాసనం శుక్రవారం విచారణ జరిపింది. దీనిపై హైకోర్టును ఎందుకు ఆశ్రయించలేదని పిటిషనర్లను ప్రశ్నించింది. విచారణ ఏప్రిల్‌కు వాయిదా వేసింది.

నిమిషానికి 2.25 లక్షల టికెట్లు: రైల్వే మంత్రి

న్యూఢిల్లీ: రైల్వే టికెట్ రిజర్వేషన్ సామర్థ్యాన్ని ప్రస్తుతమున్న నిమిషానికి 25 వేల నుంచి 2.25 లక్షల టికెట్లకు పెంచేందుకు కృషి చేస్తున్నట్టు రైల్వే మంత్రి అశ్వినీ వైష్ణవ్ చెప్పారు. ఎంక్వైరీ విభాగం నిమిషానికి 40 వేల కాల్స్ తీసుకుంటుండగా, ఈ సామర్థ్యాన్ని 4 లక్షలకు పెంచుతామని శుక్రవారం మీడియాకు తెలిపారు. 2022–23లో కొత్తగా 4,500 కిలోమీటర్ల రైల్వే లైన్ (రోజుకు 12 కి.మీ.) వేయాలన్న లక్ష్యాన్ని సాధించాం. ఈ ఏడాది 7,000 కి.మీ. రైలు మార్గం నిర్మించనున్నాం'' అన్నారు.

పారిస్ ఒలంపిక్స్‌ను బహిష్కరించాలి: పోలండ్

వార్సా: 2024 పారిస్ ఒలంపిక్స్‌లో రష్యా, బెలారస్‌ల ప్రాతినిధ్యాన్ని అంగీకరిస్తే తీవ్ర పరిణామాలుంటాయని పోలండ్ హెచ్చరించింది. రష్యా, బెలారస్‌లు ఒలంపిక్స్ పాల్గొనే పక్షంలో పోలండ్, లిథువేనియా, ఎస్టోనియా, లాట్వియా దేశాలు ఆ క్రీడలను బహిష్కరిస్తాయని పోలండ్ మంత్రి కమిల్ చెప్పారు. ఆ రెండు దేశాల క్రీడాకారులకు అవకాశమివ్వాలన్న అంతర్జాతీయ ఒలంపిక్ కమిటీ నిర్ణయాన్ని ఖండించారు. ఈ నెల 10న జరిగే ఐఓసీ భేటీలో ఈయూ, యూకే, అమెరికా, కెనడాలతోపాటు ఉక్రెయిన్‌పై రష్యా ఆక్రమణను వ్యతిరేకించే 40 దేశాలు గ్రూపుగా ఏర్పడాలన్నారు. ఈ 40 దేశాలు గనుక బహిష్కరిస్తే ఒలంపిక్స్ నిర్వహణకు అర్థమే లేకుండా పోతుందని చెప్పారు. రష్యా పాల్గొంటే తాము ఒలంపిక్స్‌ను బహిష్కరిస్తామని ఉక్రెయిన్ ఇప్పటికే స్పష్టం చేసింది.

పేలుడు కేసు నిందితుడికి ఎంఏ గోల్డ్‌మెడల్

గువాహటి: బాంబు పేలుడు ఘటనలో నిందితుడిగా జైలులో ఉన్న మాజీ విద్యార్థి ఒకరికి అస్సాం గవర్నర్ బంగారు పతకం అందజేశారు. 2019లో గువాహటిలో తీవ్రవాద సంస్థ ఉల్ఫా జరిపిన బాంబు పేలుడు ఘటనలో నిందితుల్లో ఒకరైన సంజీవ్ తాలూక్‌దార్ (29) ప్రస్తుతం జైలులో ఉన్నాడు. జైల్లోంచే ఓపెన్ యూనివర్సిటీ నుంచి సోషియాలజీలో ఎంఏ పూర్తి చేశాడు. అంతేగాక అత్యధికంగా 71% మార్కులు సాధించాడు! గురువారం జరిగిన స్నాతకోత్సవంలో గవర్నర్ జగ్దీశ్ ముఖి చేతుల మీదుగా బంగారు పతకం అందుకున్నాడు.

బాబీ.. ఓ కురు వృద్ధ శునకం!

గిన్నిస్ వరల్డ్ రికార్డు సొంతం



లిస్బన్: పోర్చుగల్ వాసికి చెందిన బాబీ అనే కుక్క ప్రపంచంలోనే అత్యంత వృద్ధ శునకంగా గిన్నిస్ రికార్డుల్లోకి ఎక్కింది. రఫీరో డో అలెంటెజో జాతికి చెందిన ఈ కుక్క వయసు ఫిబ్రవరి 1 నాటికి 30 ఏళ్ల 226 రోజులు. ఆస్ట్రేలియాకు చెందిన బ్లూవై అనే కుక్క 29 ఏళ్ల 5 నెలలు జీవించి 1939లో చనిపోయింది. ఈ రికార్డును బాబీ తుడిచిపెట్టింది. పోర్చుగల్ ప్రభుత్వ పెట్ డేటాబేస్ ప్రకారం దాని వయస్సును నిర్ధారించారు. ఈ జాతి కుక్కల సరాసరి ఆయుర్దాయం 12–14 ఏళ్లు. బాబీ యజమానులు పోర్చుగల్‌లోని కాంకెయిరోస్ గ్రామానికి చెందిన కోస్టా కుటుంబం. ఈ కుటుంబంలోని లియోనెల్ కోస్టా అనే కుర్రాడికి 8 ఏళ్లుండగా బాబీ పుట్టింది. ఇంట్లో చాలా పెంపుడు కుక్కలుండటంతో కొన్నింటిని వదిలి పెట్టినా ఇది మాత్రం తప్పించుకుంది. ''ఇంట్లో వాళ్లు తినేది ఏం పెట్టినా బాబీ తినేది. అనారోగ్య సమస్యల్లేకుండా హుషారుగా ప్రశాంతంగా ఉండేది. అదే దాని ఆయుష్షును పెంచి ఉంటుంది' అంటారు కోస్టా. వయో భారంతో బాబీ ఇప్పుడు చురుగ్గా నడవలేకపోతోందట! చూపు కూడా తగ్గిందని కోస్టా చెప్పారు.




మలేసియా రాజధాని కౌలాలంపూర్‌లోని కౌలాలంపూర్ టవర్ పైనుంచి దూకుతున్న బేస్ జంపర్స్ జంట

'అదానీ'పై అదే రగడ

పార్లమెంట్ ఉభయ సభల్లో విపక్షాల ఆందోళన

- హిండెన్‌బర్గ్ నివేదికపై చర్చించాలని పట్టు
- ఉభయ సభలూ సోమవారానికి వాయిదా

సాక్షి, న్యూఢిల్లీ: అదానీ గ్రూప్‌పై వచ్చిన ఆరోపణలు, తద్వారా ప్రభుత్వ రంగ బ్యాంకుల షేర్ల పతనం కారణంగా తలెత్తిన పరిస్థితులపై పార్లమెంట్‌లో వెంటనే చర్చ ప్రారంభించాలని ప్రతిపక్షాలు డిమాండ్ చేశాయి. ఏకతాటిపైకి వచ్చిన విపక్ష సభ్యుల ఆందోళనతో శుక్రవారం లోక్‌సభ, రాజ్యసభ స్తంభించాయి. మిగతా సభా కార్యకలాపాలను పక్కనపెట్టి హిండెన్‌బర్గ్ నివేదికపై చర్చించాల్సిందేనంటూ ప్రతిపక్షాలన్నీ పట్టుబట్టడంతో వరుసగా రెండోరోజు కూడా ఎలాంటి చర్చలు లేకుండానే ఉభయ సభలు సోమవారానికి వాయిదా పడ్డాయి. శుక్రవారం సమావేశాలకు ముందే తీసుకున్న సంయుక్త నిర్ణయం 15 పార్టీలు వాయిదా తీర్మానాలిచ్చాయి. లోక్‌సభ ఆరంభమై ప్రశ్నోత్తరాలను ప్రారంభించిన వెంటనే విపక్ష ఎంపీలు హిండెన్‌బర్గ్ నివేదికపై చర్చకు పట్టుబడుతూ ఆందోళనకు దిగారు. బిగ్గరగా నినాదాలు చేస్తూ వెల్‌లోకి దూసుకురావడంతో స్పీకర్ ఓం బిర్లా సభను మధ్యాహ్నం 2 గంటలకు వాయిదా వేశారు. సభ పునఃప్రారంభమైన తర్వాత విపక్ష ఎంపీలు ఆందోళన కొనసాగించారు. దీంతో సభ సోమవారానికి వాయిదా పడింది. రాజ్యసభలోనూ ఇదే పరిస్థితి నెలకొనడంతో సభను సోమవారానికి వాయిదా వేశారు.



విచారణ జరిపించాల్సిందే...

అదానీ గ్రూప్ పట్ల వచ్చిన ఆరోపణలపై జాయింట్ పార్లమెంటరీ కమిటీ(జేపీసీ) లేదా సుప్రీంకోర్టు నియమించిన ప్యానెల్‌తో విచారణ జరిపించాలని విపక్షాలు పునరుద్ఘాటించాయి. అత్యంత కీలకమైన ఈ అంశంపై చర్చకు అంగీకరించకపోవడం ఏమిటని కాంగ్రెస్ నేత మల్లికార్జున ఖర్గే ప్రశ్నించారు. సమగ్ర విచారణ జరిపించాలని డిమాండ్ చేశారు.

చర్చించే దాకా పట్టు!

పార్లమెంటు బడ్జెట్ సమావేశాల్లో మోదీ సర్కారుపై దాడిని మరింత తీవ్రతరం చేయాలని విపక్షాలు నిర్ణయించాయి. ఇందుకు అనుసరించాల్సిన వ్యూహంపై చర్చించేందుకు రాజ్యసభలో విపక్ష నేత, కాంగ్రెస్ అధ్యక్షుడు మల్లికార్జున ఖర్గే చాంబర్లో 16 ప్రతిపక్ష పార్టీలు శుక్రవారం ఉదయం సమావేశమయ్యాయి. ఈ భేటీలో కాంగ్రెస్, డీఎంకే, సమాజ్‌వాదీ, ఆప్, బీఆర్ఎస్, శివసేన, ఆర్జేడీ, జేడీ(యూ), సీపీఎం, సీపీఐ, ఎన్సీపీ, నేషనల్ కాన్ఫరెన్స్, ఐయూఎంఎల్, కేరళ కాంగ్రెస్ (జోస్ మణి), కేరళ కాంగ్రెస్ (థామస్), ఆరెస్పీ ఇందులో ఉన్నాయి. అదానీ గ్రూప్ స్టాక్ మార్కెట్ అవకతవకలపై సభలో చర్చ జరిగేదాకా పట్టుబట్టాల్సిందేనని పార్టీలన్నీ ఏకగ్రీవంగా నిర్ణయించాయి. దాంతోపాటు అదానీ గ్రూప్ అవకతవకలపై సుప్రీంకోర్టు పర్యవేక్షణలో సంయుక్త పార్లమెంటరీ సంఘంతో దర్యాప్తుకు కేంద్రం అంగీకరించేదాకా ఉభయ సభల్లోనూ ఆందోళనలు కొనసాగుతాయని స్పష్టం చేశాయి. అదానీ అవకతవకలపై స్వతంత్ర దర్యాప్తు జరగాల్సిందే. అప్పుడు మాత్రమే వాటిలో ప్రభుత్వ రంగ సంస్థలైన ఎల్ఐసీ, ఎస్బీఐ పెట్టుబడులకు భద్రత'' అని భేటీ అనంతరం కాంగ్రెస్ నేత జైరాం రమేశ్ మీడియాతో అన్నారు. అదానీ గ్రూప్‌లో పెట్టుబడులు పెట్టేలా ప్రధాని మోదీయే వాటిపై ఒత్తిడి తెచ్చారని ఆరోపించారు. అదానీ గ్రూప్ పెద్ద ఎత్తున ఆర్థిక, అకౌంటింగ్ అవకతవకలకు పాల్పడిందంటూ న్యూయార్క్‌కు చెందిన షార్ట్ సెల్లర్ సంస్థ హిండెన్‌బర్గ్ చేసిన ఆరోపణల దెబ్బకు గ్రూప్ విలువ చూస్తుండగానే ఏకంగా 100 బిలియన్ డాలర్ల మేరకు పడిపోయింది.

సాక్షి 24|7 కర్ణాటక

KARNATAKA

శనివారం । 4 । ఫిబ్రవరి । 2023



కళాకృతులు భళా
బెంగళూరులోని చిత్రకళా పరిషత్‌లో శుక్రవారం హస్తకళా మేళాను ప్రారంభించి అలంకరణ వస్తువులను వీక్షిస్తున్న సినీ నటి కవితాగౌడ

న్యూస్‌రీల్

6న ప్రధాని నరేంద్రమోదీ తుమకూరు రాక

- హెలికాప్టర్ తయారీ కేంద్రాన్ని ప్రారంభించనున్న మోదీ



హెలికాప్టర్ తయారీ కేంద్రం

తుమకూరు : ప్రధాని నరేంద్రమోదీ మరోమారు కర్ణాటకకు విచ్చేయనున్నారు. తుమకూరు జిల్లా గుబ్బి తాలూకా బిదరహళ్లి కావల్‌లో హెచ్‌ఏఎల్ ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన హెలికాప్టర్ తయారీ యూనిట్‌ను ఈనెల 6న ప్రధాని ప్రారంభించనున్నట్లు తుమకూరు కలెక్టర్ వై.ఎస్. పాటిల్ తెలిపారు. హెలికాప్టర్ల తయారీ కేంద్రానికి 615 ఎకరాల భూమిని కేటాయించగా 2016 జనవరిలో ప్రధాని శంకుస్థాపన చేశారు. ప్రధాని రాక సందర్భంగా 6వ తేదీన ఉదయం నుంచి సాయంత్రం వరకు జాతీయ రహదారి 206లో వాహనాలను దారి మళ్లిస్తున్నట్లు తెలిపారు.

అమిత్‌షాతో రమేశ్ జార్కిహోళి భేటీ

శివాజీనగర: సీడీ కేసుకు సంబంధించి మాజీ మంత్రి రమేశ్ జార్కిహోళి కేంద్ర హోం మంత్రి అమిత్ షాతో భేటీ అయినట్లు సమాచారం. ఢిల్లీ వెళ్లిన రమేశ్ గురువారం రాత్రి, శుక్రవారం ఉదయం రెండుసార్లు అమిత్ షాను కలిసి సీడీ కేసు వివరించి కేసును సీబీఐకి అప్పగించాలని విన్నవించారు. కేపీసీసీ అధ్యక్షుడు డీ.కే.శివకుమార్ వద్ద బీజేపీ నాయకులతో పాటు 100కు పైగా సీడీ ఉన్నాయని, ఇలానే రాజకీయ నాయకులను నియంత్రిస్తున్నారని, ఇటువంటి వాటికి చెక్ పెట్టాలంటే కేసును సీబీఐకి అప్పగించాలని కోరినట్లు సమాచారం. మరింత సమాచారం సేకరించి చర్యలు తీసుకుంటామని హామీ ఇచ్చినట్లు తెలిసింది.

నటుడు కిచ్చ సుదీప్, డీకేశి భేటీ ?

- కాంగ్రెస్‌లో చేరుతున్నట్లు జోరుగా ప్రచారం

శివాజీనగర: నటుడు కిచ్చా సుదీప్ కాంగ్రెస్‌లో చేరుతారనే ప్రచారం జోరందుకుంది. కేపీసీసీ అధ్యక్షుడు డీకే శివకుమార్, కిచ్చ సుదీప్ భేటీ కావడం అంత్యంత ప్రాధాన్యత సంతరించుకుంది. కాంగ్రెస్, బీజేపీతో పాటు పలు రాజకీయ నేతలతో సత్సంబంధాలు ఉన్న సుదీప్‌ను కాంగ్రెస్‌లోకి తీసుకురావడానికి ప్రయత్నాలు జోరుగా సాగుతున్నాయి.

ఎన్నికల ప్రచారానికి సుదీప్‌కు ఆహ్వానం: శాసనసభ ఎన్నికల నేపథ్యంలో ఎన్నికల ప్రచార సభలకు రావాలని నటుడు సుదీప్‌కు డీ.కే.శివకుమార్ ఆహ్వానించారని పార్టీ ఉన్నత వర్గాలు తెలిపాయి. రాష్ట్రంలో పలు శాసనసభ నియోజకవర్గాల్లో వాల్మీకి సామాజిక ఓట్లు నిర్ణయాత్మకంగా ఉండటంతో సుదీప్‌ను ఆహ్వానించటం ద్వారా ఆ వర్గం ఓట్లు పొందాలనే కసరత్తు మొదలైంది.

ఢీకొట్టి ఉడాయించడమే!

- హిట్ అండ్ రన్ కేసుల్లో దేశంలోనే బెంగళూరు మొదటి స్థానం
- నాలుగు సంవత్సరాల్లో 4,235 ఘటనలు



బనశంకరి: ప్రమాదాలకు కారణమై వాహనదారులు తమ వాహనాలను ఘటన స్థలంలో నిలపకుండా ఉడాయిస్తున్న ఘటనల్లో దేశంలోనే బెంగళూరు నగరం మొదటి స్థానంలో నిలిచింది. గత నాలుగేళ్లలో 4,235 హిట్ అండ్ రన్ ఘటనలు చోటు చేసుకొని ప్రమాదాలకు హాట్‌స్పాట్‌గా పేరు పొందింది. ఈ నాలుగేళ్లలో 854 మరణాలు సంభవించగా 3,381మంది క్షతగాత్రులుగా మారారు.

ఎందుకు పారిపోతున్నారంటే...

తమ తప్పిదాలతో ప్రమాదాలు జరిగినట్లు తెలిసినా వాహనదారులు, డ్రైవర్లు ఘటన స్థలం నుంచి ఉడాయిస్తున్నారు. పట్టుబడితే కేసుల్లో చిక్కుకుంటామనే భయంతో పాటు బాధితులు దాడులు చేస్తారనే భయం, వాహనాల రిపేరీ కోసం పట్టుబట్టడం, కోర్టుకేసులు, గాయపడిన వారికి చికిత్స వ్యయం భరించాలనే కారణంతో పారిపోతున్నారని ట్రాఫిక్ పోలీసులు తెలిపారు.

ప్రమాదాలకు ఇవే కారణాలు

హిట్ అండ్ రన్ కేసుల్లో 60 శాతం ఘటనలు అతి వేగం కారణంగా జరిగాయి. కృష్ణరాజపురం, చిక్కజాల, పీణ్యా, యలహంక, ఎలక్ట్రానిక్‌సిటీ ప్రాంతాల్లో నమోదైన 70 శాతం కేసుల్లో అతివేగంతో వాహనాలు నడపడం వల్లనే ప్రమాదాలకు ప్రధాన కారణమని తెలిసింది. విజయనగర, మల్లేశ్వరం, బాణసవాడి ప్రాంతాల్లో సంభవించిన హిట్ అండ్ రన్ కేసుల్లో చాలా వరకు మద్యం సేవించి వాహనాలు నడపడం, మొబైల్‌లో మాట్లాడుతూ డ్రైవింగ్, రోడ్డు నిబంధనల ఉల్లంఘనలు ప్రమాదాలకు కారణమని తేల్చారు.

ఇటీవల ఘటనలు

- గత నెల 24 తేదీన హెచ్ఎస్ఆర్‌లేఔట్ దొడ్డకన్నళ్లి వద్ద టెక్కీ, మరో వ్యక్తి కాలినడకన వెళ్తుండగా గుర్తుతెలియని వాహనం ఢీకొంది. టెక్కీ దుర్మరణం చెందాడు. వాహనదారుడు ఉడాయించాడు.
- జనవరి 7న కేఆర్.పురం ఆర్‌టీఓ కార్యాలయం ముందు వాయువేగంగా వచ్చిన కారు ఆటోను ఢీకొట్టగా ఇద్దరు మృతి చెందారు. డ్రైవర్ పారిపోయేందుకు యత్నించాడు.
- జనవరి 20న రాజాజీనగరలో బైకును ఫార్చునర్ కారు ఢీకొంది. కిందపడిపోయిన బైకులోని వ్యక్తి కారును అడ్డుకోవడానికి ప్రయత్నించగా స్థానికులపై వాహనాన్ని ఎక్కించడానికి ప్రయత్నించిన దృశ్యాలు సీసీ టీవీలో నమోదయ్యాయి.
- జనవరి 17న మాగడిరోడ్డు టోల్‌గేట్ వద్ద నిలబడి ఉన్న కారును బైక్ ఢీకొంది. డ్రైవర్ కారుదిగి ప్రశ్నించగా బైకిస్టు తప్పించుకుని ప్రయత్నం చేశాడు. కారు డ్రైవరు బైకును పట్టుకున్నప్పటికీ కిలోమీటరు మేర ఈడ్చుకెళ్లిన ఘటన వైరల్‌గా మారింది.

రోడ్డు నిబంధనలు పాటించాలి

చాలా వరకు హిట్ అండ్ రన్ కేసుల్లో సాంకేతిక పరిజ్ఞానం సాయంతో నిందితుల ఆచూకీ కనిపెట్టాం. ప్రతి ఒక్కరూ ట్రాఫిక్ నిబంధనలు పాటిస్తే రోడ్డు ప్రమాదాలను నియంత్రించవచ్చు. రోడ్డు ప్రమాదానికి కారణమైతే పారిపోవడానికి బదులు గాయపడిన వారి ప్రాణాలు కాపాడాలి. సమీపంలోని ఆసుపత్రికి చేర్పించాలి. ప్రమాదం గురించి పోలీసులకు సమాచారం అందించాలి.

–కులదీప్‌కుమార్ ఆర్.జైన్, డీసీపీ, పశ్చిమ ట్రాఫిక్ విభాగం

కుటుంబం సామూహిక ఆత్మహత్యాయత్నం

- ఒకరి మృతి
- అప్పులు తీర్చలేక విషం తాగిన వైనం
- రామనగర తాలూకాలో ఘోరం



యశవంతపుర: అప్పులు తీర్చే మార్గం కనిపించక ఒకే కుటుంబానికి చెందిన ఏడుగురు ఆత్మహత్యకు యత్నించిన ఘటన గురువారం సాయంత్రం రామనగర తాలూకా దొడ్డమణ్ణగుడ్డె గ్రామంలో చోటు చేసుకుంది. వీరిలో మంగళమ్మ (28) మృతి చెందగా భర్త రాజు (30), అత్త సొల్లాపురదమ్మ (48), పిల్లలు ఆకాశ్ (9), కృష్ణ (13), మంగళమ్మ చెల్లెలు సవితా (24), సవితా కూతురు దర్శిని (4) ప్రాణాప్రాయ స్థితిలో మండ్యలో చికిత్స పొందుతున్నారు.

ప్రాణం మీదికి తెచ్చిన అప్పులు

కుంబళగోడు సుబ్బరాయనపాళ్యలో రాజు కూలీ పని చేస్తూ జీవిస్తున్నాడు. కుటుంబ అవసరాలకు కోసం రూ.10 లక్షల వరకు అప్పులు చేసి సొంతూరు మణ్ణగుడ్డె వదిలి అత్తింటిలో ఉంటున్నాడు. అయినా కూడా అప్పుల వాళ్లు రోజు వచ్చి అడుగుతుండటంతో పాటు అవమానంగా మాట్లాడేవారు. దీంతో గురువారం సుబ్బరాయపాళ్యలోని మామ సమాధి వద్దకు అందరూ వెళ్లారు. చక్కెర, అరటి పండులో ఎలుకల మందు కలుపుకుని తిన్నారు. కొద్ది సేపటి తరువాత రాజు భార్య మంగళమ్మ తీవ్ర అస్వస్థతకు గురైంది. అందరూ కలిసి ఊరిలోకి వెళ్లి జరిగిన విషయాన్ని చెప్పటంతో గ్రామస్థులు వారిని రామనగర జిల్లా ఆస్పత్రికి తరలించారు. చికిత్స పొందుతూ మంగళమ్మ మృతి చెందారు. మెరుగైన చికిత్స కోసం ఇతరులను మండ్యకు తరలించారు. పోలీసులు కేసు దర్యాప్తు చేస్తున్నారు.

ఉద్యోగాల పేరుతో యువతులకు వల

బనశంకరి: ఉద్యోగాలు ఇప్పిస్తామని ఆశ పెట్టి యువతులపై లైంగికదాడులకు పాల్పడుతున్న ఏపీకి చెందిన దిలీప్‌ప్రసాద్(27) అనే టెక్కీని నగర ఆగ్నేయ విభాగం సీఈఎస్ పోలీసులు అరెస్ట్ చేశారు. నగర పోలీస్ కమిషనర్ సీహెచ్. ప్రతాప్‌రెడ్డి శుక్రవారం వివరాలు వెల్లడించాడు. నిందితుడు కోరమంగలలో నివాసం ఉంటూ సాఫ్ట్‌వేర్ కంపెనీలో పని చేస్తున్నాడు. ఇన్‌స్టాగ్రామ్‌లో ఐదుకు పైగా నకిలీ అకౌంట్లు సృష్టించి యువతులు, మహిళలతో చాటింగ్ చేసేవాడు. ప్రముఖ కంపెనీలో పనిచేస్తున్నానని, ఉద్యోగాలు ఇప్పిస్తానని నమ్మించేవాడు. ఆశతో వచ్చిన యువతులను హోటల్‌లో దింపేవాడు. లైంగికంగా సహకరిస్తే మంచి కంపెనీలో ఉద్యోగాలు ఇప్పిస్తానని చెప్పేవాడు. యువతులపై లైంగికదాడికి పాల్పడి రహస్యంగా వీడియో తీసుకునేవాడు. ఇలా పదిమందిని వంచించాడు. బాధితుల ఫిర్యాదు మేరకు నిందితుడిపై ఐటీ యాక్ట్ ప్రకారం సీఈఎస్‌పోలీసులు కేసు నమోదుచేసుకుని వంచకుడిని శుక్రవారం అరెస్ట్‌చేశారు. నిందితుడు రెండున్నర సంవత్సరాలుగా యువతులపై లైంగిక దాడులకు పాల్పడుతున్నట్లు అతని ఫోన్‌లోని వీడియోల ద్వారా వెలుగు చూసింది.



దిలీప్ ప్రసాద్

మొబైల్ చూడొద్దని మందలించారని...

- బహుళ అంతస్తుల భవనం పైనుంచి దూకి బాలిక ఆత్మహత్య



చిన్నారి నవ్య ఓజా దూకిన అపార్ట్‌మెంట్



చిన్నారి నవ్య ఓజా మృతదేహం

సాక్షి బెంగళూరు: మొబైల్ చూడొద్దని తల్లిదండ్రులు హెచ్చరించినందుకు బాలిక మనస్తాపానికి గురై పదో అంతస్తు నుంచి దూకి ఆత్మహత్య చేసుకుంది. వివరాలు.. బెంగళూరు ఈశాన్య విభాగం బాగలూరు పోలీసు స్టేషన్ పరిధిలోని కణ్ణూరులోని అపార్ట్‌మెంట్‌లో రవికుమార్ ఓజా అనే వ్యక్తి నివాసం ఉంటున్నాడు. ఈయన కుమార్తె నవ్య ఓజా (13) ఏడో తరగతి చదువుతోంది. నవ్య ఎక్కువగా మొబైల్ చూస్తుండడంతో చదువుపై దృష్టి సారించాలని తల్లిదండ్రులు గురువారం రాత్రి పది గంటల సమయంలో మందలించారు. పది నిమిషాల అనంతరం బాలిక అపార్టుమెంట్‌పైకి వెళ్లి కిందకి దూకి ఆత్మహత్య చేసుకుంది. బాగలూరు పోలీసులు కేసు నమోదు చేశారు.

బీఆర్‌టీ అరణ్యంలో అరుదైన కీటకం



మైసూరు : జీవ వైవిధ్యతకు నెలవైన చామరాజనగర జిల్లా యళందూరు తాలూకా బిళిగిరిరంగనాథ స్వామి దేవాలయ సమీపంలోని అరణ్యంలో అడవి జిరిగ అనే జాతికి చెందిన కడజ అనే కీటకం కనిపించింది. దక్షిణ భారత దేశంలో తొలిసారిగా ఈ కీటకం కనిపించినట్లు కీటకశాస్త్ర నిపుణులు తెలిపారు. ఈ కీటకాలు ఎక్కువగా దేశ ఈశాన్య ప్రదేశాల్లో కనిపిస్తాయని తెలిపారు.

యోగి వేమన భవన నిర్మాణానికి సహకారం

- కేఆర్‌పీపీ సంస్థాపక అధ్యక్షుడు గాలి జనార్ధనరెడ్డి



యోగి వేమన ఆశ్రమ భవన నిర్మాణ భూమి పూజలో గాలి జనార్ధనరెడ్డి, ఎమ్మెల్యే కే.జే.జార్జ్ తదితరులు

శివాజీనగర: బెంగళూరు నగరంలోని దొడ్డ బాణసవాడిలో యోగి వేమన ట్రస్టు తలపెట్టిన యోగి వేమన ఆశ్రమ భవన నిర్మాణం త్వరగా పూర్తయ్యేందుకు పూర్తి సహాయ సహకారాలు అందిస్తానని కేఆర్‌పీపీ సంస్థాపక అధ్యక్షుడు గాలి జనార్ధనరెడ్డి భరోసా నిచ్చారు. శుక్రవారం జరిగిన యోగి వేమన ఆశ్రమ భూమిపూజ కార్యక్రమంలో ఆయన పాల్గొని మాట్లాడారు. రెడ్డి సామాజిక వర్గం ఆత్మాభిమానంతో ముందుకు సాగుతూ సామాజిక, రాజకీయ రంగాల్లో తనదైనముద్ర వేసుకుందన్నారు. కేఆర్‌పీపీ పార్టీ ఉత్తర కర్ణాటకలో బలపడుతోందని, 2028 నాటికి బీబీఎంపీ ఎన్నికల్లోనూ పోటీ చేస్తామన్నారు. ఎమ్మెల్యే కే.జే.జార్జ్ మాట్లాడుతూ రెడ్డి సామాజిక వర్గంలో వెనుకబడిన పేద పిల్లల విద్యాభ్యాసానికి, ప్రజా సంక్షేమానికి సహాయపడేందుకు ఆశ్రమం నెలకొల్పటం అభినందనీయమన్నారు. చీఫ్‌విప్, బొమ్మనహళ్లి ఎమ్మెల్యే సతీశ్‌రెడ్డి యోగి వేమన ఆశ్రమ నిర్మాణానికి రూ.5 లక్షల విరాళం ప్రకటించారు. రెడ్డి సామాజిక వర్గం ఐక్యతతో ఉండాలన్నారు. మాజీ ఎమ్మెల్యే, బీఎంటీసీ అధ్యక్షుడు ఎన్.ఎస్.నందీశ్‌రెడ్డి, బీబీఎంపీ మాజీ ప్రతిపక్ష నాయకుడు పద్మనాభరెడ్డి, విజన్ కాలేజీ డైరెక్టర్ ఇడుమకంటి లక్ష్మీరెడ్డి, యోగి వేమన సాహితీవేత్త మో.ము.అంజనప్పరెడ్డి, రాష్ట్ర రైతు మోర్చా కోశాధికారి జీ.లల్లేశ్‌రెడ్డి, శ్రీ యోగి వేమన ఆశ్రమ ట్రస్ట్ అధ్యక్షుడు ఎం.శంకర్, కార్యదర్శి ఏ.జయరామరెడ్డి పాల్గొన్నారు.

ప్రభుత్వ వైద్యులు ప్రైవేటు ప్రాక్టీస్ వద్దు

- నివేదిక అందజేసిన రాష్ట్ర పరిపాలనా సంస్కరణల కమిషన్

శివాజీనగర: కేంద్ర ప్రభుత్వ నియమాల ప్రకారం ప్రభుత్వ వైద్యుల ప్రైవేట్ వృత్తి చేపట్టరాదని, ప్రభుత్వ ఆసుపత్రుల్లో సాయంత్రం కూడా ఓపీ ఏర్పాటు చేయాలని సిఫార్సులు చేస్తూ రాష్ట్ర పరిపాలనా సంస్కరణల కమిషన్ ప్రభుత్వానికి సమర్పించింది. రేస్ కోర్స్ రోడ్డులోని సీఎం నివాసంలో ముఖ్యమంత్రి బసవరాజ బొమ్మైను రాష్ట్ర పరిపాలనా సంస్కరణల కమిషన్ అధ్యక్షుడు టీ.ఎం.విజయభాస్కర్ కలిసి నాలుగు, ఐదో నివేదికలను సమర్పించారు. 3630 సిఫార్సులు చేశారు. 100 పడకల తాలూకా ఆసుపత్రుల్లో బీఎస్సీ నర్సింగ్ కోర్సు, ప్యారా మెడికల్ కోర్స్‌లు ప్రారంభించేందుకు నివేదికలో సలహా ఇచ్చారు.

ప్రధాన అంశాలు:

- ఎంబీబీఎస్ సీటు పొందే గ్రామీణ విద్యార్థులకు గ్రామీణ కోటా కింద 15 శాతం సీట్లు రిజర్వు చేయటం, ప్రభుత్వ వైద్య విద్యా కాలేజీల్లో 5 నుంచి10 శాతం ఎన్ఆర్ఐ కోటా సృష్టించవచ్చు.
- మాతా శిశు మరణాలను తగ్గించేందుకు అదనంగా కోడిగుడ్ల పంపిణీ
- మహిళా, శిశు అభివృద్ధి డైరెక్టరేట్‌ను విభజించి రెండు ప్రత్యేక డైరెక్టరేట్ల ఏర్పాటు
- పబ్లిక్ సర్వీస్ కమిషన్ అధ్యక్షుడితో పాటు సభ్యుల సంఖ్యను 14 నుండి 8కి తగ్గించాలి
- బీబీఎంపీలో 30 మంది కేఏఎస్ అధికారుల నియామకం
- రూ.5 లక్షల కంటే తక్కువ లావాదేవీలు కలిగిన సంఘాలు ఐదేళ్లకొకమారు లెక్కపత్రాలు సమర్పించేందుకు చార్టర్డ్ అకౌంటెంట్ నుంచి ధ్రువీకరణ పత్రం అవసరం ఉండదు
- ఉద్యోగ సేవల శాఖను నైపుణ్య మిషన్‌లో విలీనం చేయటం

ట్రాఫిక్‌లో చిక్కుకున్న అంబులెన్స్

- సకాలంలో వైద్యం అందక చిన్నారి మృతి



యశవంతపుర: బెంగళూరులో ఘోరం చోటు చేసుకుంది. అంబులెన్స్ ట్రాఫిక్‌లో చిక్కుకుపోవడంతో సకాలంలో వైద్యం అందక ఏడాదిన్నర వయసున్న చిన్నారి చనిపోయింది. తుమకూరు జిల్లా తిపటూరు కైమారం వద్ద గురువారం బొలెరో వాహనం, బైక్ ఢీకొన్నాయి. బైక్‌లో వెళ్తున్న హాసన్‌కు చెందిన దంపతులు అహ్మద్, రుక్సానా, వారి ఏడాదిన్నర చిన్నారి గాయపడ్డారు. దంపతులను తిపటూరు ఆస్పత్రికి తరలించారు. చిన్నారిని హాసన్‌లోని హిమ్స్‌కు తరలించారు. చిన్నారి పరిస్థితి విషమంగా ఉండటంతో బెంగళూరు నిమ్హాన్స్‌కు తరలించాలని వైద్యులు నిర్ణయించారు. అదే రోజు జీరో ట్రాఫిక్ మధ్య బెంగళూరుకు తరలిస్తుండగా బెంగళూరు శివారులో నెలమంగల వద్దకు చేరుకున్నాక కోరగుంటపాళ్య వద్ద 20 నిమిషాల పాటు ట్రాఫిక్ స్తంభించింది. దీంతో ఆస్పత్రికి చేరుకునేందుకు ఆలస్యమైంది. వైద్యులు చిన్నారిని పరిశీలించగా అప్పటికే మృతి చెందినట్లు నిర్ధారించారు. 20 నిమిషాలు ముందు వచ్చి ఉంటే చిన్నారిని బతికించేందుకు ప్రయత్నం చేసేవారమని వైద్యులు తెలిపారు. కాగా ట్రాఫిక్‌ను సరిచేయడంలో, అంబులెన్స్‌కు దారి ఇచ్చేలా చేయడంలో ట్రాఫిక్ పోలీసులు నిర్లక్ష్యం చేశారని చిన్నారి బంధువులు మండిపడ్డారు.

క్లుప్తంగా

వ్యక్తిత్వ వికాసంతో క్రమశిక్షణ



జ్యోతి వెలిగిస్తున్న అధికారి తిప్పారెడ్డి

రాయచూరు రూరల్: విద్యార్థుల్లో క్రమశిక్షణకు వ్యక్తిత్వ వికాసం దోహదమని ప్రముఖ విద్యావేత్త రమేష్ బల్లిద్ వెల్లడించారు. ఆయన గురువారం సురపుర గరుడాద్రి కళామందిర్‌లో వెనుక బడిన వర్గాల శాఖ ఆధ్వర్యంలో వ్యక్తిత్వ వికాసం విజ్ఞానం అనే అంశంపై మాట్లాడారు. జ్ఞానం, నాయకత్వ లక్షణం, చైతన్యం, ఆత్మవిశ్వాసం, ఇంగ్లిష్ అంశాలపై చర్చాగోష్టులు జరిగాయి. కార్యక్రమంలో సూర్యోదయ వాకింగ్ క్లబ్ అధ్యక్షుడు బసవరాజ్, సుడాన్ అధ్యక్షుడు ప్రకాష్ సజ్జన్, గరుడాద్రి కళామందిర్ అధ్యక్షుడు ముకుంద నాయక్, తహసీల్దార్ సుబ్బన్న జమఖండి, గోనాళ్, సాంఘిక సంక్షేమ శాఖ తాలూకా అధికారి తిప్పారెడ్డి తదితరులున్నారు.

అంగన్‌వాడీ కార్యకర్తల విజయం

రాయచూరు రూరల్: రాష్ట్రంలో అంగన్ వాడీ కార్యకర్తల సమస్యలపై సర్కార్ స్పందించిందని, ఇది అంగన్‌వాడీ కార్యకర్తల విజయమని ఆ సంఘం జిల్లా అధ్యక్షురాలు పద్మ పేర్కొన్నారు. శుక్రవారం పాత్రికేయుల భవనంలో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆమె మాట్లాడారు. అంగన్‌వాడీ కార్యకర్తలకు గ్రాచ్యుటీ, పదోన్నతి తదితర అంశాలపై ప్రభుత్వం ఆమోదం తెలిపిందన్నారు. బెంగళూరులో 10 రోజుల పాటు చేపట్టిన ఆందోళన సమయంలో అంగన్ వాడీ కార్యకర్తలపై బనాయించిన కేసులను ఉపసంహరించుకోవాలని ఆమె కోరారు. సమావేశంలో వరలక్ష్మి, రంగమ్మ, అన్వర్, శరణ బసవలున్నారు.

అభివృద్ధి పనులకు భూమిపూజ



పాల్గొన్న ఎమ్మెల్యే సోమశేఖర్‌రెడ్డి

సాక్షి,బళ్లారి: నగరంలోని 18వ వార్డులో అభివృద్ధి పనులకు ఎమ్మెల్యే గాలి సోమశేఖర్‌రెడ్డి భూమిపూజ చేశారు. శుక్రవారం ఆయన మాజీ మేయర్ బసవరాజు, అధికారులతో కలిసి రూ.12 లక్షలతో ఈరణ్ణ దేవస్థానం అభివృద్ధి పనులకు భూమిపూజ చేసిన అనంతరం మాట్లాడారు. నగరంలో అభివృద్ధి పనులను దశలవారీగా పూర్తి చేస్తున్నామన్నారు. ఆలయాల జీర్ణోద్ధరణకు నిధుల కొరత లేదన్నారు.

నేడు పాత్రికేయ సమ్మేళనం

రాయచూరు రూరల్: విజయపురలో శనివారం నుంచి రెండు రోజుల పాటు రాష్ట్ర స్థాయి 37వ పాత్రికేయుల సమ్మేళనం నిర్వహిస్తున్నట్లు వర్కింగ్ జర్నలిస్టుల సంఘం రాష్ట్రాధ్యక్షుడు శివానంద తగడూరు పేర్కొన్నారు. ఆయన శుక్రవారం ఈ మేరకు పాత్రికేయులకు ఓ ప్రకటన విడుదల చేశారు. ఈనెల 4, 5 తేదీల్లో విజయపుర కందగల్ హనుమంతరాయ రంగ మందిరంలో ముఖ్యమంత్రి బసవరాజ్ బొమ్మై సమ్మేళనాన్ని ప్రారంభిస్తారన్నారు. సమావేశంలో రాష్ట్ర జౌళి శాఖా మంత్రి శంకర్ పాటిల్ మునేనకొప్ప, మంత్రులు గోవింద కారజోళ, ఎంపీ, ఎమ్మెల్యేలు, ఎమ్మెల్సీలు, జిల్లాధికారి, జెడ్పీ సీఈఓ, జిల్లా ఎస్పీ, పాత్రికేయులు పాల్గొంటారని తెలిపారు.

ఎన్నికల ఏర్పాట్లపై సమీక్ష



ఈవీఎంను సమీక్షిస్తున్న ఏడీసీ అనురాధ

హొసపేటె: రానున్న అసెంబ్లీ ఎన్నికలను దృష్టిలో పెట్టుకొని అధికారులు ఎన్నికలకు సంబంధించి ముందస్తుగా అన్ని చర్యలు చేపట్టాలని విజయనగర అదనపు జిల్లాధికారి అనురాధ తెలిపారు. శుక్రవారం స్థానిక జిల్లాధికారి కార్యాలయ సభాంగణంలో అధికారులకు ఏర్పాటు చేసిన సమీక్షా సమావేశంలో ఆమె మాట్లాడారు. ఏ క్షణంలోనైనా రాష్ట్రంలో ఎన్నికలు ప్రకటించే అవకాశం ఉన్నందున ముఖ్యంగా ఈవీఎం యంత్రాలను సిద్ధం చేసుకోవాలని సూచించారు. అదే విధంగా జిల్లా వ్యాప్తంగా ప్రతి తాలూకాలో ఈవీఎం యంత్రాల్లో ఓటింగ్ చేయడంపై సెక్టార్ అధికారులు ఓటర్లకు అవగాహన కల్పించాలన్నారు. అసిస్టెంట్ కమిషనర్లు సిద్దరామేశ్వర, ప్రకాష్, జెడ్పీ సహాయక కార్యదర్శి తిమ్మప్ప, ప్రజాపనుల శాఖాధికారి రవీంద్ర పాల్గొన్నారు.

ఉత్తమ విద్యార్థినులకు సత్కారం

కంప్లి: ఎట్టి పరిస్థితిలోను విద్యను నిర్లక్ష్యం చేయరాదని మునిసిపల్ అధ్యక్షురాలు శాంతల తెలిపారు. శుక్రవారం పట్టణంలోని ఎస్‌జీవీఎస్ఎస్ బాలికల ప్రభుత్వ పాఠశాలలో ఏర్పాటు చేసిన సాంస్కృతిక కార్యక్రమాలను ఆమె ప్రారంభించి మాట్లాడారు. ఎస్ఎస్ఎల్‌సీలో అత్యధిక మార్కులు పొందిన విద్యార్థినులు వైశాలి, మంగళ, పవిత్ర, పద్మ, దుర్గమ్మ, సరస్వతి, భూమికలను, ప్రస్తుత సంవత్సరపు ఆదర్శ విద్యార్థినులు శ్రావణి, సంజన, సంగీతలను సత్కరించారు. కార్యక్రమంలో కౌన్సిలర్ హేమవతి పూర్ణిచంద్ర, ఈసీఓ జీ.వీరేష్, ప్రిన్సిపాల్ మహ్మద్ షఫీ, ఉప ప్రిన్సిపాల్, ఎస్‌డీఎంసీ అధ్యక్షులు మర్దాన్‌అలీ, ఉపాధ్యాయ సంఘం, కార్యదర్శి సీ.రమేష్, ఉపాధ్యాయ బృందం పాల్గొన్నారు.

కన్నడ సంస్కృతి శాఖలో అవినీతి మేట

- డబ్బుల వసూలుతో ప్రదర్శనలకు అవకాశం కల్పిస్తున్న వైనం
- ఒక్కొక్క కళాకారుని నుంచి రూ.10 వేలు ఇవ్వాలని డిమాండ్
- కళాకారులతో ఫోన్‌లో సంభాషణ సోషల్ మీడియాలో వైరల్



ఫోన్‌లో మాట్లాడిన శాఖ అధికారి సిద్ధలింగేశ రంగణ్ణనవర్(ఫైల్), కన్నడ సంస్కృతి శాఖ కార్యాలయం

సాక్షి,బళ్లారి: కళలను, నాటకాలను, సంగీతకారులను, జానపద నాటకాలు చేస్తున్న కళాకారులను ప్రోత్సహించే సదుద్దేశంతో ఏర్పాటు చేసిన కన్నడ సంస్కృతి శాఖలో పని చేస్తున్న అధికారులు కళాకారుల నుంచి లంచాలు తీసుకుని వారికి అవకాశాలు కల్పిస్తున్నట్లుగా మాట్లాడిన సంభాషణ ఆడియో శుక్రవారం సోషల్ మీడియాలో వైరల్ అయింది. నగరంలోని అనంతపురం రోడ్డులోని జిల్లా కన్నడ సంస్కృతి శాఖ ఏడీ సిద్ధలింగేశ రంగణ్ణనవర్ మహిళా సిబ్బంది ద్వారా ఫోన్‌లో కళాకారులతో నేరుగా డబ్బులు ఇవ్వాలని కోరడం చర్చనీయాంశమైంది.

కళాకారుల్లో ఆందోళన

జిల్లాలో కళాకారులను ప్రోత్సహించాల్సిన అధికారులే లంచాలు ఇవ్వాలని అడగడంపై కళాకారులు ఆందోళన చెందుతున్నారు. రాష్ట్ర స్థాయి అధికారులకు కూడా మామూళ్లు ఇవ్వకపోతే అవకాశాలు రావనేలా పేర్కొనడంతో ఆ అధికారి అవినీతికి పరాకాష్టకు చేరింది. ఆ శాఖ అధికారి అవినీతి, అక్రమాల గురించి ఫోన్‌లో మాట్లాడిన తీరు సోషల్ మీడియాలో వైరల్ కావడంతో కళాకారులతో పాటు కళాభిమానులు తీవ్రంగా మండిపడుతున్నారు. పూట గడవని కళాకారులు అప్పుడప్పుడు అవకాశాలు వస్తే చేసిన నాటకాలు, నృత్యాల ద్వారా ఒక్కొక్కరికీ రూ.10 వేల నుంచి రూ.20 వేల ప్రోత్సాహధనం ఇస్తున్నారు. ఆ డబ్బులు సంపాదించేందుకు కళాకారులు నెలల తరబడి కష్టపడాల్సి ఉంటుంది. పేద కళాకారులతో కూడా కక్కుర్తితో డబ్బులు ఇస్తేనే నాటకాల్లో ప్రదర్శన చేసేందుకు అవకాశం కల్పిస్తుండటం గమనార్హం.

నేను ఎవరినీ డబ్బు అడగలేదు

ఈ సందర్భంగా కన్నడ సంస్కృతి శాఖ అధికారి సిద్ధలింగేశ రంగణ్ణనవర్ మాట్లాడుతూ తాను ఎవరి వద్ద డబ్బులు అడగలేదని, సమగ్ర తనిఖీ చేసిన తర్వాత నిజానిజాలు బయటకు వస్తాయని చెప్పారు. అయితే ఫోన్‌లో మాట్లాడిన వీరేష్ దళవాయి అనే కళాకారుడు మాత్రం తనను డబ్బులు అడిగిన మాట నిజమని, ఫోన్‌లో మాట్లాడిన మాటలు రికార్డింగ్‌లో ఉన్నాయని, విచారణ చేస్తే అధికారుల అవినీతి నిర్ధారణ అవుతుందన్నారు. చిన్న కళాకారులతోనే డబ్బులు ఇస్తేనే నాటకాల్లో ప్రదర్శించేందుకు అవకాశం కల్పిస్తామనడం సిగ్గుచేటని ఆగ్రహం వ్యక్తం చేశారు. ఇటీవల జరిగిన బళ్లారి ఉత్సవంలో ప్రదర్శన చేసిన కళాకారుల నుంచి కూడా డబ్బులు వసూలు చేసి ఉంటారనే చర్చ సాగుతోంది. అధికారులే ఇలా డబ్బులు తీసుకుని కళాకారులకు అవకాశాలు కల్పిస్తుండటంతో ఇక నిజమైన ప్రతిభావంతులకు చోటు దక్కే అవకాశాలు ఉండవనే భయాందోళన కళాకారుల్లో నెలకొంది.

యథేచ్ఛగా ఫుట్‌పాత్‌ల ఆక్రమణ

- వాహన రాకపోకలకు తీవ్ర అంతరాయం
- పాదచారులకు ప్రాణ సంకటంగా మారిన వైనం



ఫుట్‌పాత్‌పై వెలసిన దుకాణాలు

రాయచూరు రూరల్: నగరంలో ఎక్కడపడితే అక్కడ ఫుట్‌పాత్‌లను ఆక్రమించుకోవడంతో పాదచారులకు ప్రాణ సంకటంగా మారింది. అయినా దీనిపై జిల్లాధికార యంత్రాంగం, నగరసభ పాలక మండలి, జిల్లా పోలీస్ యంత్రాంగం మౌనంగా ఉంది. నగరంలోని అంబేడ్కర్ సర్కిల్ నుంచి రైల్వే స్టేషన్, బస్టాండ్, నగరసభ, తహసీల్దార్, విద్యాశాఖాధికారి కార్యాలయాలు, జైలు రోడ్డు, ఏక్ మినార్, సూపర్ మార్కెట్, తీన్ కందీల్, షరాఫ్ బజార్, నేతాజీ నగర్, పటేల్ రోడ్డు, ఆర్టీఓ సర్కిల్, జహీరాబాద్, హరిహర రోడ్లు, చంద్రమౌళేశ్వర సర్కిళ్లలో దుకాణాలు, హోటళ్లు, తినుబండారాల బండ్లు, పండ్లు, బ్రెడ్ విక్రయించే తోపుడుబండ్లు రోడ్లలో ట్రాఫిక్‌కు అంతరాయంగా నిలపడంతో రవాణాకు అడ్డంకిగా మారింది. ఫుట్‌పాత్‌లపై దుకాణాలు నిర్మించుకొని వాటి యజమానులు విక్రయాలు చేస్తుండడంతో ప్రజలు, పాదచారులు నడవడానికి, వాహనాల రాకపోకలకు ఇబ్బందిగా తయారైంది. పాదచారులు రోడ్లలో నడవాలంటే ప్రాణాలను అరచేతిలో పెట్టుకొని నడవాల్సి వస్తోంది. రాత్రి వేళ ప్రజలు అధికంగా షాపింగ్ చేయడానికి బజారులోకి వస్తుంటారు. పళ్ల అమ్మేవారు తోపుడుబండ్లను రోడ్డులో అడ్డంగా ఉంచుతారు. దీంతో కి.మీ దూరం దాటడానికి అరగంట సేపు ట్రాఫిక్‌లో చిక్కుకోవాల్సిన పరిస్థితిని కల్పిస్తున్నారు. ఇప్పటికైనా అధికారులు స్పందించి ఆక్రమించిన ఫుట్‌పాత్‌లపై ఏర్పాటు చేసుకున్న దుకాణాలు, హోటళ్లను తొలగించి సుగమ ట్రాఫిక్‌నకు చర్యలు తీసుకోవాల్సిన అవసరం ఎంతైనా ఉంది.

ఆరోగ్య చికిత్సా శిబిరం



శిబిరాన్ని ప్రారంభిస్తున్న అతిథులు

బళ్లారిఅర్బన్: 20వ వార్డు పటేల్‌నగర్ శ్రీలక్ష్మీ వెంకటేశ్వర దేవస్థానం ఆవరణలో బాలాజీ యువక సంఘం ఆధ్వర్యంలో ఈనెల 7 వరకు ఆరోగ్య చికిత్సా శిబిరాన్ని ఏర్పాటు చేసినట్లు సంఘం అధ్యక్షులు జీఎస్.రాజేష్ తెలిపారు. శుక్రవారం శిబిరాన్ని కాంగ్రెస్ నాయకుడు కాంఢ్ర సతీష్, కేఆర్‌పీపీ నాయకురాలు హంపీ రమణ, దేవస్థాన అధ్యక్షుడు కే.సోమప్ప, వైద్యులు ప్రారంభించారు. శిబిరంలో సుమారు 70 మందికి పైగా చికిత్స పొందారని, బరువు, షుగర్, తలనొప్పి, కీళ్లనొప్పులు, గ్యాస్ సమస్యలు, బీపీ, మోకాళ్ల నొప్పులు తదితరాలకు చికిత్స అందిస్తున్నట్లు వైద్యులు, థెరపిస్టులు సీపీ చౌదరి, రజత్‌శర్మ తెలిపారు. శిబిరాన్ని వినియోగించుకోవాలని వారు కోరారు.

బెథల్ విద్యా సంస్థల వార్షికోత్సవం



ప్రారంభిస్తున్న అతిథులు, అధికారులు

గంగావతి రూరల్: నగరంలోని ప్రముఖ బెథల్ గ్రూప్ ఆఫ్ ఇన్‌స్టిట్యూట్స్ 43వ వార్షికోత్సవ వేడుకలను శుక్రవారం నిర్వహించారు. పలు సాంస్కృతిక నృత్యప్రదర్శనలతో విద్యార్థులు అలరించారు. పలువురు ప్రసంగీకులు మాట్లాడుతూ ఈ విద్యాసంస్థల సాధనలను కొనియాడారు. అంతకు ముందు కర్ణాటక బిషప్ జాన్ ముళ్లూర్ ప్రార్థనతో కార్యక్రమాన్ని ప్రారంభించారు. బీఈఓ సోమశేఖర్‌గౌడ, తహసీల్దార్ నాగరాజ్, విద్యార్థులతో పాటు తల్లిదండ్రులు, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

దోమల బెడదను అరికట్టరూ

సిరుగుప్ప: నగరంలో దోమలు బెడద ఎక్కువైందని, వీటి వల్ల అంటువ్యాధులు నగరవాసులకు ప్రబలే ప్రమాదమున్నందున అధికారులు ముందు జాగ్రత చర్యలు చేపట్టాలని తాలూకా భీమ్ ఆర్మీ సంఘం పదాధికారులు శుక్రవారం నగరసభ కమిషనర్ ప్రేమ్ చార్లెస్‌కు వినతిపత్రాన్ని సమర్పించారు. ఈసందర్భంగా అధ్యక్షులు కొడ్లె ధర్మరాజ్, ఉపాధ్యక్షులు మంజునాథ, కార్యదర్శి పార్థనాగబౌద్ధ, కోశాధికారి అలీ సమీర్, మహాబాషా, ఖాసిం పాల్గొన్నారు.

ఎన్నికల కోడ్ అమలు వద్దు



తహసీల్దార్‌కు వినతిపత్రం అందిస్తున్న దృశ్యం

సిరుగుప్ప: ఏప్రిల్ 15 వరకు ఎన్నికల కమిషన్ రాష్ట్రంలో ఎన్నికల కోడ్‌ను అమలు చేయరాదని తాలూకా భీమ్ ఆర్మీ సంఘం నాయకులు రాష్ట్ర ఎన్నికల కమిషన్‌కు స్థానిక తహసీల్దార్ ద్వారా మనవి పత్రాన్ని సమర్పించారు. మార్చి, ఏప్రిల్ నెలల్లో ఎన్నికల నియమావళి ప్రకారం రాష్ట్రంలో ఎన్నికల కోడ్ నిబంధనలను జారీ చేసే ఉద్దేశం ఉందనే వార్తలు వినవస్తున్నట్లు తెలిపారు. ఏప్రిల్ నెలలో అంబేడ్కర్ జయంతి, ఎస్ఎస్ఎల్‌సీ పబ్లిక్ పరీక్షలు మార్చి 31 నుండి ఏప్రిల్ 15 వరకు జరుగుతున్నందున విద్యార్థుల అభ్యాసం, వారి భవిష్యత్తుపై దుష్పరిణామం చూపుతుందన్నారు. అందువల్ల ఎన్నికల నియమావళిని ప్రకటించ కూడదని కోరారు. ఈ సందర్భంగా సంఘం అధ్యక్షులు కొడ్లె ధర్మరాజ్, మంజునాథ, పార్థనాగబౌద్ధ, ఆలీసమీర్, ఖాసిం, మహబూబ్‌బాషా తదితరులు పాల్గొన్నారు.

జేడీఎస్ వల్లే అధికారం దూరం

- కేపీసీసీ అధ్యక్షుడు డీకే శివకుమార్



పాల్గొన్న కాంగ్రెస్ అతిరథ మహారథులు

శ్రీనివాసపురం : గతంలో జేడీఎస్‌కు ప్రభుత్వాన్ని నడపడం చేతకాలేదని, అందుకే అధికారం కోల్పోవాల్సి వచ్చిందని కేపీసీసీ అధ్యక్షుడు డీకే శివకుమార్ ఆరోపించారు. ఆయన శుక్రవారం ముళబాగిలు పట్టణంలో ఏర్పాటు చేసిన కాంగ్రెస్ ప్రజాధ్వని కార్యక్రమంలో పాల్గొని మాట్లాడారు. మతతత్వ బీజేపీకి అధికారం దక్కకూడదని కాంగ్రెస్ హైకమాండ్ జేడీఎస్‌కు మద్దతు తెలిపి కుమారస్వామిని సీఎంని చేస్తే చివరకు ప్రజలకు సరైన పాలన అందించలేక పోయారన్నారు. రైతులు ఎంతో కష్టపడి పండిస్తున్న పంటలకు ప్రభుత్వం నుంచి ఎలాంటి మద్దతుధర అందడం లేదన్నారు. బీజేపీ హయాంలో లంచం ఇవ్వనిదే ఏ పనీ జరగడం లేదు. అవినీతి అక్రమాలు పరాకాష్టకు చేరుకున్నాయన్నారు. ఇలాంటి ప్రభుత్వాన్ని సాగనంపాల్సిన బాధ్యత ప్రజలపై ఉందన్నారు. ప్రభుత్వాన్ని నడిపే సత్తా కేవలం కాంగ్రెస్ పార్టీకే ఉందనే విషయం ప్రజలకు అర్థమైందన్నారు. వచ్చే ఎన్నికల్లో బీజేపీ, జేడీఎస్‌లకు తగిన గుణపాఠం చెబుతారన్నారు. ఈ సందర్భంగా మాజీ ఎమ్మెల్యే కొత్తూరు మంజునాథ్, ఎమ్మెల్యే నాగేష్, ఎమ్మెల్సీ అనిల్‌కుమార్, జిల్లా కాంగ్రెస్ అధ్యక్షుడు లక్ష్మీనారాయణ తదితరులు పాల్గొన్నారు.

దేవాంగులు సంఘటితం కావాలి



మాట్లాడుతున్న ఎమ్మెల్యే గణేష్

కంప్లి: దేవాంగ సముదాయం సంఘటితం కావాలని హంపీ హేమకూట గాయత్రి పీఠాధ్యక్షులు దయానందపురి మహాస్వామి తెలిపారు. శుక్రవారం నెంబర్ 10 ముద్దాపుర గ్రామంలో దేవాంగ సమాజపు శ్రీరామలింగ చౌడేశ్వరి ఆలయం నూతన గోపురం, కలశారోహణ కార్యక్రమాల్లో ఆయన మాట్లాడారు. చౌడేశ్వరి సముదాయ భవనానికి రూ.5 లక్షలు విరాళం ఇచ్చానని, తిరిగి అధికారంలో వస్తే మరో రూ.20 లక్షలు విరాళం అందిస్తానని ఎమ్మెల్యే గణేష్ ప్రకటించారు. కార్యక్రమంలో 51 మందికి ఉపనయనం, కలశారోహణ, హోమం తదితరాలు జరిగాయి. కార్యక్రమంలో దేవాంగ సమాజ రాష్ట్ర అధ్యక్షులు రవీంద్ర కల్బుర్గి, కంప్లి దేవాంగ మఠం గురుబృందం, బుక్కసాగర విశ్వారాధ్య శివాచార్యులు, సుళేకల్ బృహన్మఠం భువనేశ్వరయ్య తాత, ముద్దాపుర దేవాంగ సమాజ అధ్యక్షులు కే.కుమారస్వామి, ప్రముఖులు కట్టి దుర్గప్ప, నాగరాజ్, కే.కాళప్ప, బీ.నారాయణప్ప, అగళి పంపాపతి, ఉపాధ్యాయులు ఈరప్ప సొరటూరు, గ్రామస్తులు తదితరులు పాల్గొన్నారు.

విద్యుత్ నియంత్రిక ప్రారంభం



ప్రారంభిస్తున్న ఎమ్మెల్యే సోమలింగప్ప

సిరుగుప్ప: తాలూకాలోని తెక్కలకోట విద్యుత్ సబ్‌స్టేషన్‌లో తెక్కలకోట పట్టణం, తాలూకాలోని వివిధ గ్రామాలకు ప్రత్యేకించి నూతన విద్యుత్ ట్రాన్స్‌ఫార్మర్‌ను మీట నొక్కి ఎమ్మెల్యే సోమలింగప్ప శుక్రవారం ప్రారంభించారు. అనంతరం ఆయన మాట్లాడుతూ పట్టణ వాసులు, రైతులు ఈ విద్యుత్ నియంత్రికను సద్వినియోగపరచుకోవాలని కోరారు. ఈసందర్భంగా ఏఈఈ నవీన్‌కుమార్, గ్రామ ప్రముఖులు తిమ్మప్ప, ద్యామణ్ణ, కుమారప్ప, పరసణ్ణ, సిద్దనగౌడ, లక్ష్మీనారాయణ, కృష్ణ, శాబాది వీరేశప్ప, విజయ చిరంజీవి తదితరులు పాల్గొన్నారు.

బెళగావి విజయలక్ష్మికి డాక్టరేట్



డాక్టరేట్ స్వీకరిస్తున్న విజయలక్ష్మి

రాయచూరు రూరల్: బెళగావికి చెందిన సమాజ సేవకురాలు విజయలక్ష్మి డాక్టరేట్‌ను అందుకున్నారు. గత 22 ఏళ్లుగా సమాజసేవ, నృత్యం, పేదల అభ్యున్నతి, మహిళా సబలీకరణ కు ఆమె చేసిన సేవలకు గుర్తింపుగా గత నెల 30న తమిళనాడులోని హోసూరులో జరిగిన కార్యక్రమంలో ఏషియన్ వైదిక్ రిసెర్చ్ యూనివర్సిటీ నుంచి ఆమె గౌరవ డాక్టరేట్‌ను స్వీకరించారు.

కలికా హబ్బ జాతాకు శ్రీకారం



జాతాను ప్రారంభిస్తున్న లలిత తదితరులు

రాయచూరు రూరల్: నగరంలోని జవహర్‌నగర్ ప్రభుత్వ ఉన్నత పాఠశాలలో శుక్రవారం విద్యార్థులతో కలికా హబ్బ జాతా నిర్వహించారు. కార్యక్రమాన్ని నగరసభ అధ్యక్షురాలు లలిత ప్రారంభించారు. నగరసభ ఉపాధ్యక్షురాలు నరసమ్మ, సభ్యులు సరోజమ్మ, నాగరాజ్, హరీష్, రవీంద్ర, జిల్లా విద్యాశాఖాధికారులు వృషబేంద్రయ్య, చంద్రశేఖర్ భండారి, మనోహర్, వీరేష్, మురళీధర్, నారాయణలున్నారు.

విద్యార్థులు అన్ని రంగాల్లో రాణించాలి

హొసపేటె: విద్యార్థులు చదువుతో పాటు అన్ని రంగాల్లో ముందుండాలని బీఈఓ చెన్నబసప్ప తెలిపారు. శుక్రవారం తాలూకాలోని పాపినాయకనహళ్లి క్లస్టర్ పరిధిలోని పాఠశాలల విద్యార్థులకు పాపినాయకనహళ్లి పాఠశాలలో ఏర్పాటు చేసిన కలికా హబ్బను ఆయన ప్రారంభించి మాట్లాడారు. ఈ కార్యక్రమం విద్యార్థుల్లోని ప్రతిభను గుర్తించేందుకు దోహద పడుతుందన్నారు. అనంతరం విద్యార్థులు ప్రదర్శించిన కోలాట, కంసాళె, డోలుకుణిత, లేజీ డ్యాన్స్, కుంభమేళ, గుర్రపు వేషధారణ తదితర ప్రదర్శనలు ఎంతో ఆకట్టుకున్నాయి. విద్యాశాఖ సంయోజనాధికారి మల్లేశప్ప, ముఖ్యోపాధ్యాయుడు రామచంద్ర తదితరులు పాల్గొన్నారు.

వృషభానికి రైతు అంత్యక్రియలు

హుబ్లీ: తాలూకాలోని ఉమచగికి చెందిన రామణ్ణ సుంకద అనే రైతు నెల రోజుల క్రితం రూ.3.50 లక్షలు విలువ చేసే జోడెద్దులను కొన్నారు. వాటిలో ఓ ఎద్దు(వృషభం) శుక్రవారం మృతి చెందింది. దీంతో ఎంతో ప్రేమగా పెంచుకుంటున్న ఎద్దు ఆకస్మికంగా మృతి చెందడంతో ఆ రైతు దాని కళేబరాన్ని గ్రామంలో ఊరేగించిన అనంతరం శాస్త్రోక్తంగా అంత్యక్రియలు నెరవేర్చారు.

హజ్రత్ సయ్యద్ షా బడేసాబ్ ఖాద్రి దర్గాలో ఉరుసు



దర్గాలో ప్రార్థనలు చేస్తున్న భక్తులు

కంప్లి: తాను ఏటా ఈ ఉరుసులో పాల్గొని ప్రార్థనలు చేస్తున్నానని, అదే విధంగా ఈ ఏడాది కూడా దర్శించుకున్నానని మాజీ ఎమ్మెల్యే సురేష్ బాబు తెలిపారు. శుక్రవారం పట్టణ శివారులోని జోగి కాలువ వద్ద గల హజ్రత్ సయ్యద్ షా బడేసాబ్ ఖాద్రి దర్గాలో 235వ సంవత్సరపు ఉరుసును ప్రారంభించి దర్గాలోని సమాధులపై పూలమాలలు వేసి మాట్లాడారు. పీఠాధిపతి సయ్యద్‌షా ప్రార్థనలు జరిపారు. ఉరుసులో చుట్టుపక్కల గ్రామాల నుంచి భక్తులు పెద్ద ఎత్తున పాల్గొని ముడుపులు చెల్లించారు. కార్యక్రమంలో ఎమ్మెల్యే గణేష్, సర్వ సముదాయ భక్తులు పాల్గొన్నారు.

మొసలి దాడితో బాలుడికి గాయం

రాయచూరు రూరల్: తాలూకాలోని కొర్తకుంద వద్ద కృష్ణా నదిలో ఓ మొసలి బాలుడిపై దాడి చేయడంతో తీవ్రంగా గాయపడిన ఘటన శుక్రవారం ఆలస్యంగా వెలుగు చూసింది. పోతుగల్ నివాసి శంకర్ కుటుంబంతో కలిసి తిమ్మప్ప జాతరకు వెళ్లిన పవన్(9) అనే బాలుడు కృష్ణా నదిలో స్నానానికి వెళ్లగా బాలుడిపై ఆకస్మికంగా మొసలి దాడి చేయడంతో అతని కుడి చేతికి బలమైన గాయమైంది. బాలుడిని చికిత్స నిమిత్తం రాయచూరు ప్రభుత్వ వైద్య కళాశాల ఆస్పత్రిలో చేర్పించారు.

ముగ్గురు విటుల అరెస్ట్

హుబ్లీ: హుబ్లీలోని హొసూరు సర్కిల్ వద్ద ఓ లాడ్జిలో వేశ్యావాటిక నిర్వహిస్తున్న ఆరోపణలపై ముగ్గురిని విద్యానగర్ పోలీసులు అరెస్ట్ చేశారు. గణేష్, రవి, అల్లాబక్షి అనే నిందితులు మహిళలను తీసుకొచ్చి వ్యభిచార రొంపిలోకి దించుతున్నట్లు అందిన సమాచారం మేరకు పోలీసులు వారి ఆట కట్టించారు. అరెస్ట్ చేసిన ముగ్గురిని జుడిషియల్ కస్టడీకి అప్పగించారు.

కుసుగల్‌లో చోరీ

తాలూకాలోని కుసుగల్ గ్రామంలోని కిల్లే వీధిలో రెహమాన్ బాషా ఇంట్లో చోరీ జరిగింది. దుండగులు ఇంటి తలుపులకు వేసిన తాళాన్ని పగలకొట్టి రూ.80 వేలు విలువ చేసి 20 గ్రాముల బంగారు ఆభరణాలు, రూ.50 వేల నగదును చోరీ చేసినట్లు హుబ్లీ గ్రామీణ పోలీసులు తెలిపారు.

కోలారు వార్తలు...

అభివృద్ధిలో కోలారు జిల్లా ముందంజ



కార్యక్రమాన్ని ప్రారంభిస్తున్న ఎంపీ తదితరులు

కేజీఎఫ్ : రాష్ట్రంలో ఎక్కువ అభివృద్ధి చెందిన జిల్లా కోలారు అని ఎంపీ ఎస్ మునిస్వామి తెలిపారు. శుక్రవారం బంగారుపేట పురసభ కార్యాలయ ప్రాంగణంలో ముఖ్యమంత్రి అమృత నగరోత్థాన పథకం కింద వివిధ అభివృద్ధి కార్యక్రమాలను ఆయన ప్రారంభించి మాట్లాడారు. తాలూకాలో రోడ్ల అభివృద్ధి, సముదాయ భవనాలు, గ్రంథాలయాల నిర్మాణం తదితరాలను పూర్తి చేస్తామన్నారు. ప్రతి గ్రామంలో ఇంటింటికీ తాగునీరు, మరుగుదొడ్లు, ఇందిరా ఆవాస్ పథకం ద్వారా పేదలకు ఇళ్ల నిర్మాణాలు చేపట్టామన్నారు. కలెక్టర్ వెంకటరాజ మాట్లాడుతూ బంగారుపేట నగరాభివృద్ధికి రూ.4.54 కోట్ల వ్యయంతో అభివృద్ధి కార్యక్రమాలు ప్రారంభమయ్యాయన్నారు. సీసీఎంఎస్ ద్వారా అన్ని రోడ్లకు విద్యుత్ దీపాలను అమర్చుతారన్నారు. కార్యక్రమంలో ఎమ్మెల్సీ టి నారాయణస్వామి, మామిడి అభివృద్ధి మండలి అధ్యక్షుడు ఎం కె వాసుదేవ్, మాజీ ఎమ్మెల్యే ఎం నారాయణస్వామి, వెంకటమునియప్ప, బంగారుపేట పురసభ సభ్యుడు చంద్రారెడ్డి, తహసీల్దార్ దయానంద్ పాల్గొన్నారు.

నేటి ‘ప్రజాధ్వని’కి ఏర్పాట్ల పరిశీలన



ఏర్పాట్లను పరిశీలిస్తున్న ఎమ్మెల్యే నంజేగౌడ

మాలూరు : పట్టణంలోని కాంగ్రెస్ కార్యాలయ ప్రాంగణంలో శనివారం నిర్వహించనున్న ప్రజాధ్వని యాత్ర ఏర్పాట్లను ఎమ్మెల్యే కేవై నంజేగౌడ శుక్రవారం పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఈ కార్యక్రమంలో సుమారు 20 వేల మంది వరకు పాల్గొంటున్నారన్నారు. రాష్ట్రంలో అవినీతిమయమైన బీజేపీ ప్రభుత్వాన్ని గద్దె దించడానికి రాష్ట్ర వ్యాప్తంగా కాంగ్రెస్ ప్రజాధ్వని యాత్రను చేపట్టిందన్నారు. ఇప్పటికే అన్ని జిల్లాల్లో సిద్దరామయ్య, డీకే శివకుమార్‌లు సంయుక్తంగా ప్రజా ధ్వని యాత్రలో పాల్గొన్నారన్నారు. మాలూరులో నిర్వహిస్తున్న ప్రజాధ్వని కార్యక్రమానికి రాష్ట్ర స్థాయి నాయకులు హాజరవుతున్నారన్నారు. పెద్ద సంఖ్యలో కార్యకర్తలు హాజరై కార్యక్రమాన్ని విజయవంతం చేయాలన్నారు. ఈ సందర్భంగా బ్లాక్ కాంగ్రెస్ అధ్యక్షుడు ఎంజీ మధుసూధన్, ఎం వీ విజయనరసింహ, స్థాయి సమితి అధ్యక్షుడు జాకీర్‌ఖాన్ తదితరులు పాల్గొన్నారు.

విద్యా ప్రగతికి శ్రమించాలి

కోలారు : తాలూకాలో విద్యా ప్రగతికి ప్రధానోపాధ్యాయులు శాయశక్తులా శ్రమించాలని బీఈఓ కన్నయ్య సూచించారు. శుక్రవారం తన కార్యాలయంలో నూతనంగా తాలూకా ప్రధానోపాధ్యాయుల సంఘానికి ఎన్నికైన పదాధికారులను అభినందించి ఆయన మాట్లాడారు. తాలూకాలో ఉపాధ్యాయుల సమస్యలపై స్పందించేందుకు సదా సిద్ధమన్నారు. సంఘం నూతన అధ్యక్షుడు బీఎం నారాయణస్వామి మాట్లాడుతూ తాలూకాలోని ప్రభుత్వ పాఠశాలల్లో విద్యా ప్రగతికి హెచ్ఎంలు ప్రముఖ పాత్ర పోషించాలన్నారు. సమస్యలు వచ్చినప్పుడు పరస్పరం చర్చించుకుని పరిష్కరించుకోవాలన్నారు. ఈ సందర్భంగా జిల్లా ప్రధాన కార్యదర్శి బి.శ్రీనివాస్, ఉపాధ్యక్షుడు ఎల్.శ్రీనివాస్, తాలూకా గౌరవ అధ్యక్షుడు ఎస్.నారాయణస్వామి తదితరులు పాల్గొన్నారు.

సవితా జయంతి ఆచరణకు సూచన

కోలారు : సవితా మహర్షి జయంతిని అర్థవంతంగా నిర్వహించాలని డిప్యూటీ కలెక్టర్ హెచ్.రమేష్ పేర్కొన్నారు. శుక్రవారం నగరంలోని కలెక్టరేట్‌లో ఆయన విలేకరులతో మాట్లాడారు. సవితా సముదాయ ప్రముఖులందరికీ ఆహ్వానం పలకాలని ఆదేశించారు. ఎలాంటి గందరగోళానికి తావు లేకుండా జయంతిని నిర్వహించాలని కన్నడ, సంస్కృతీ శాఖ అసిస్టెంట్ డైరెక్టర్‌కు సూచించారు. సమావేశంలో ఆ శాఖ అసిస్టెంట్ డైరెక్టర్ శ్రీనివాస్‌రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

11, 12 తేదీల్లో సీనియర్ సిటిజన్ల క్రీడాపోటీలు



మాట్లాడుతున్న రంగనాథ్

కోలారు : ఈ నెల 11, 12 తేదీల్లో 41వ రాష్ట్ర సీనియర్ సిటిజన్ల క్రీడా పోటీలను నిర్వహిస్తున్నట్లు కర్ణాటక అథ్లెటిక్స్ అసోసియేషన్ అధ్యక్షుడు రంగనాథ్ తెలిపారు. శుక్రవారం నగరంలోని పాత్రికేయుల భవనంలో విలేకరులతో మాట్లాడారు. 11న ఉదయం 8 గంటలకు స్వాతంత్ర్య అమృత మహోత్సవ జాతాను నిర్వహిస్తారన్నారు. అనంతరం క్రీడా పోటీలను ప్రారంభిస్తారన్నారు. 30 ఏళ్లకు పైబడిన పురుషులు, మహిళలు క్రీడా పోటీల్లో పాల్గొనవచ్చన్నారు. రాష్ట్ర పోటీల్లో విజేతలను జాతీయ పోటీలకు ఎంపిక చేస్తారన్నారు. ఆసక్తిగలవారు ఈ నెల 5వ తేదీలోగా తమ పేర్లను రిజిస్టర్ చేయించుకోవాలన్నారు. జిల్లా వెటరన్స్ అథ్లెటిక్స్ అసోసియేషన్ అధ్యక్షుడు వి.సదాశివరెడ్డి, ఉపాధ్యక్షుడు కె.జయదేవ్, కోశాధికారి కె.రోహన్ కుమార్ పాల్గొన్నారు.

జిల్లా సమగ్రాభివృద్ధి కోసం ధర్నా



కార్యాలయం ముందు ధర్నా చేస్తున్న దృశ్యం

శ్రీనివాసపురం : జిల్లా సమగ్ర అభివృద్ధి కోసం శుక్రవారం తాలూకా జనపర వేదిక కార్యకర్తలు తహసీల్దార్ కార్యాలయం ముందు ధర్నా నిర్వహించారు. ఈ సందర్భంగా వేదిక కార్యదర్శి పాతకోట నవీన్ కుమార్ మాట్లాడుతూ కేసీ వ్యాలీ నీటిని మూడు దశల్లో శుద్ధీకరించిన తర్వాతే జిల్లా చెరువులకు వదలాలని, చెరువుల సమగ్ర అభివృద్ధికి ప్రాధాన్యత నివ్వాలని డిమాండ్ చేశారు. అనంతరం తహసీల్దార్ శిరీన్‌తాజ్‌కు వినతిపత్రం సమర్పించారు. ధర్నాలో జనపర వేదిక గౌరవాధ్యక్షుడు డాక్టర్ వైవీ వెంకటాచల, అధ్యక్షుడు పీసీ నారాయణస్వామి, కార్యాధ్యక్షుడు రామాంజనేయ, వీరప్ప రెడ్డి, నీలటూరు చిన్నప్పరెడ్డి తదితరులు పాల్గొన్నారు.

క్లుప్తంగా

బోనులో చిక్కిన చిరుత

మైసూరు: గత కొన్ని రోజులుగా మైసూరు సమీపంలోని ఇలవాల, మైదనహళ్లి గ్రామాల ప్రజలకు కంటిమీద కునుకు లేకుండా చేస్తున్న చిరుత ఎట్టకేలకు బోనులో చిక్కింది. చిరుత గ్రామాల్లోకి వచ్చి మేకలు, కుక్కలను బలి తీసుకుంటోంది. దీంతో రెండు గ్రామాల ప్రజలు భయభ్రాంతులకు లోనయ్యారు. గురువారం రాత్రి చిరుత ఆహారం కోసం వచ్చి బోనులో చిక్కింది. దీంతో గ్రామస్తులు ఊపిరి పీల్చుకున్నారు. అటవీ అధికారులు చిరుతను తరలించారు.

సహజీవనం చేస్తూ ఇద్దరి ఆత్మహత్య



సూరయ్యరాజు, మహబూబ్ మృతదేహాలు

కృష్ణరాజపురం : సహజీవనం చేస్తున్న ఇద్దరు ఆత్మహత్యకు పాల్పడిన ఘటన బెంగళూరు గ్రామీణ జిల్లా హొసకోటె తాలూకా కొరలూరులో జరిగింది. ధార్వాడకు చెందిన సురయ్యరాజు(25) అనే మహిళకు భర్త, ఇద్దరు పిల్లలు ఉన్నారు. అయితే ఆమె భర్తను వదలి పిల్లలతో కలిసి కొరలూరుకు వచ్చింది. మహబూబ్(35)తో సహజీవనం చేస్తూ హొసకోటెలో గార పనిచేస్తూ జీవిస్తున్నారు. నాలుగు నెలలుగా ఆర్థిక ఇబ్బందులు ఎదుర్కొంటున్నట్లు సమాచారం. ఈ క్రమంలో పిల్లలను బయటకు పంపి చీరతో ఆత్మహత్య చేసుకున్నారు. తిరుమలశెట్టిహళ్లి పోలీసులు కేసు దర్యాప్తు చేపట్టారు.

మాట తప్పిన ప్రధాని మోదీ



మాట్లాడుతున్న నేతలు

తుమకూరు: తప్పుడు ప్రచారాలతో ప్రధాని మోదీ కాలం వెళ్లదీస్తున్నారని భారత కమ్యూనిస్టు పార్టీ జిల్లా కార్యదర్శి గిరీశ్ ఆగ్రహం వ్యక్తం చేశారు. శుక్రవారం ఆయన విలేకరుల సమావేశంలో మాట్లాడుతూ... ఈనెల 6న హెచ్ఏఎల్ యూనిట్ ప్రారంభమవుతుందని, తప్పుడు హామీ ఇచ్చారని, మరోవైపు ఫుడ్ పార్కు తుమకూరుకు రానేలేదని, ఇలా తప్పుడు హామీలు, ప్రచారంతో నిరుద్యోగులను మోసం చేస్తున్నారని మండిపడ్డారు. 2014లో మొదటిసారిగా అధికారంలోకి వచ్చిన ప్రధాని మోదీ తుమకూరుకు వచ్చి 10 వేల మందికి ఉద్యోగ అవకాశాలు కల్పించే కంపెనీలు నెలకొల్పుతామని హామీ ఇచ్చినప్పటికి ఒక్క ఉద్యోగం కూడా రాలేదని అన్నారు. ఫుడ్ పార్కు కోసం కేటాయించిన 110 ఎకరాల భూమిని రూ. 100 కోట్ల సబ్సిడీతో విక్రయించారని అన్నారు.

లేఔట్‌లో సేవా కార్యక్రమాలు



లింబావళిని సన్మానిస్తున్న దృశ్యం

కృష్ణరాజపురం: మాజీ మంత్రి అరవింద లింబావళి పుట్టిన రోజు వేడుకలను శుక్రవారం నగరంలోని మహదేవపురతో పాటు ఎఇసీఎస్ లేఔట్‌లో పలు సేవా కార్యక్రమాలు నిర్వహించారు. స్థానిక బీజేపీ నాయకుడు జయదేవ ఆధ్వర్యంలో రక్తదాన శిబిరం, అశ్వత్థ నగరలో ఉన్న శక్తి కేంద్రంలో ప్రభుత్వ పాఠశాలలో ఆంగనవాడీ కేంద్రం ఇతర అభివృద్ధి పనులకు ఎమ్మెల్యే భూమిపూజ చేశారు. అనంతరం స్థానికంగా ఉంటున్న మహిళలకు చీరలు పంపిణీ చేశారు. చిన్నప్పనహళ్లి, ఎల్ఎస్‌పుర, చుట్టు పక్కల ప్రాంతాల్లో పలు సేవా కార్యక్రమాలు నిర్వహించారు.

అవయవ దానానికి అంగీకారం

యశవంతపుర: బెంగళూరుకు చెందిన ఎన్‌యూ ఆస్పత్రి ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన ఓ కార్యక్రమంలో 150 మంది అవయవదానం చేయడానికి ముందుకు వచ్చారు. వీరంతా దివంగత పునీత్ రాజ్‌కుమారును ఆదర్శంగా తీసుకుని అవయ దానం చేస్తామని ప్రతిజ్ఞ చేశారు. ప్రతి ఒక్కరూ ఇదే స్ఫూర్తితో ముందుకు రావాలని ఆస్పత్రి డైరెక్టర్ డాక్టర్ దిలీప్‌రంగరాజన్ కోరారు.

రుణం ఇప్పిస్తామని టోకరా

మైసూరు: ఫైనాన్స్‌లో రుణం ఇప్పిస్తామని చెప్పి నమ్మించి సైబర్ మోసగాళ్లు రూ.8.28 లక్షలకు టోపీ పెట్టారు. మైసూరులోని గోకులంలో నివాసం ఉంటున్న మమతకు సైబర్ వంచకులు ఫోన్ చేసి, ప్రైవేటు సంస్థల నుంచి భారీగా రుణాలు మంజూరు చేయిస్తామని నమ్మబలికారు. ముందుగా కొంత డిపాజిట్ చేయాలని చెప్పి విడతల వారీగా రూ. 8.28 లక్షలు ఆమె నుంచి జమ చేయించుకున్నారు. అనంతరం ఫోన్ స్విచ్ఛాఫ్ చేశారు. బాధితురాలు పోలీసులకు ఫిర్యాదు చేశారు.

హొసకోటెలో వీధి కుక్కల బెడద

కృష్ణరాజపురం: హొసకోటె పట్టణంలో వీధి కుక్కల బెడద పెరిగిపోయింది. రోడ్లపై గుంపులుగా తిరుగుతూ పట్టణ వాసులను భయభ్రాంతులకు గురిచేస్తున్నాయి. అంతే కాకుండా మాంసం వ్యర్థాలను ఎక్కడ పడితే అక్కడే వేయడంతో వాటి కోసం కొట్లాడుతూ రోడ్డును పోయేవారిని కరుస్తున్నాయి. వెంటనే నగర సభ అధికారులు శునకాలను నియంత్రించాలని అన్నారు.

ఎన్నికల్లో ఫుల్ జోష్..

ఆ తర్వాత నిల్..

- ఎలక్షన్లలో కనపడి ఆ తర్వాత మాయమవుతున్న పార్టీలు
- ఇప్పటివరకు బరిలో మొత్తం 180 పార్టీలు



సాక్షి బెంగళూరు: ఎన్నికలు, రాజకీయ పార్టీల అంశం గుర్తుకు వస్తే కర్ణాటకలో కేవలం మూడు ప్రధాన పార్టీల పేర్లు మాత్రమే గుర్తుకు వస్తాయి. అయితే కర్ణాటకలో ఎన్నికలు వచ్చిన ప్రతీసారి పదుల సంఖ్యలో పార్టీలు పుట్టుకొస్తున్నాయి. ఎన్నికలు ముగిసిన తర్వాత మళ్లీ వాటి ఊసే వినపడదు. గత ఐదు సార్వత్రిక ఎన్నికలను పరిశీలిస్తే కర్ణాటకలో మొత్తం 180 పార్టీలు తమ అదృష్టాన్ని పరీక్షించుకున్నాయి. కాగా, మరో రెండు, మూడు నెలల్లో రాష్ట్రంలో ఎన్నికలు రానున్న నేపథ్యంలో మళ్లీ ఎన్ని కొత్త పార్టీలు పుట్టుకొచ్చే అవకాశాలు కనిపిస్తున్నాయి.

ఎన్నికల సంఘం అధికారిక లెక్కల ప్రకారం 2018 సార్వత్రిక ఎన్నికల్లో మొత్తం 83 పార్టీలు పోటీ చేశాయి. ఈ 83 పార్టీల్లో ఆరు జాతీయ పార్టీలు, ఒక రాష్ట్ర పార్టీ, ఇతర రాష్ట్రాల్లోని స్టేట్ పార్టీలు అరు అయితే ఇక రిజిస్టర్ కాని పార్టీలు 69 బరిలో నిలిచాయి. బీజేపీ, బీఎస్పీ, సీపీఐ, సీపీఎం, కాంగ్రెస్, ఎన్‌సీపీలు జాతీయ పార్టీలు కాగా, జేడీఎస్ రాష్ట్ర పార్టీగా 2018 ఎన్నికల్లో పోటీ చేశాయి. అలాగే ఆప్, అన్నాడీఎంకే, ఆల్ ఇండియా ఫార్వర్డ్ బ్లాక్, జేడీయూ, శివసేన, సమాజవాది వంటి ఇతర రాష్ట్రాల్లోని స్టేట్ పార్టీలు తమ అభ్యర్థులను కర్ణాటక ఎన్నికల్లో నిలిపాయి.

2018 ఎన్నికల్లో పోలైన మొత్తం 3,66,27,978 ఓట్లలో జాతీయ పార్టీలు, జేడీఎస్ పార్టీలు 93.18 శాతం ఓట్లను సాధించాయి. మిగిలిన 6.82 శాతం ఓట్లను మిగిలిన పార్టీలు, స్వతంత్ర అభ్యర్థులు సాధించాయి. 2013 ఎన్నికల్లో మొత్తం 59 పార్టీలు పోటీ చేశాయి. అందులో 78.56 శాతం జాతీయ పార్టీలు, జేడీఎస్ అభ్యర్థులు, స్వతంత్ర అభ్యర్థులు 7.38 శాతం ఓట్లను సాధించారు.

ఏడాదుల వారీగా ఎన్నికల్లో పోటీ చేసిన పార్టీలు

ఏడాది	పార్టీలు
2018	83
2013	59
2008	31
1999	22
1994	22
1989	20

కాగా, రాష్ట్రంలో కీలక సీట్లు, ఓట్లను కాంగ్రెస్, బీజేపీ, జేడీఎస్ పార్టీలే దక్కించుకుంటున్నాయి.

ఇలా పలు పార్టీలు ఎన్నికలు వచ్చే సరికి తమ తమ అభ్యర్థులను పోటీలో నిలిపి అదృష్టాన్ని పరీక్షించుకోవడం ఆ తర్వాత తిరిగి కర్ణాటక నుంచి వెళ్లిపోవడం పరిపాటిగా మారిపోయింది. బీజేపీ, కాంగ్రెస్, జేడీఎస్ పార్టీలు ప్రధానంగా ఇక్కడ పోటీ పడుతున్నాయి. మిగిలిన బీఎస్పీ, సమాజ్‌వాదీ పార్టీలు ఉత్తర ప్రదేశ్‌లో ప్రభావవంతంగా పనిచేస్తున్నాయి. ఆ పార్టీలు ఇక్కడ కూడా ఎన్నికల సమయంలో అభ్యర్థులను నిలుపుతున్నాయి. ఇక సీపీఐ, సీపీఎంతో పాటు పొరుగు రాష్ట్రాల్లో ప్రధాన పార్టీలు అయిన శివసేన, ఎన్‌సీపీ, అన్నాడీఎంకే, డీఎంకే, ఆర్‌పీఐ వంటివి కూడా తాము కూడా ఉన్నామంటూ అక్కడక్కడ పోటీ చేస్తూ వస్తున్నాయి.

ఘనంగా సోమనాయకి అమ్మవారి విగ్రహ ప్రతిష్టాపన



దీపాలతో ఊరేగింపుగా వస్తున్న మహిళలు

మండ్య: మండ్య తాలూకా హులివాన గ్రామంలో శ్రీ సోమనహళ్లి అమ్మ, శ్రీ కోటి మారమ్మ విగ్రహ ప్రతిష్టాపన మహోత్సవం ఘనంగా నిర్వహించారు. మహిళలు దీపాలతో ఊరేగింపుగా వచ్చి మడిసేవ, హారతి సమర్పించారు. ఈ సందర్భంగా గురువారం రాత్రి నుంచే సోమనాయకి అమ్మవారి ట్రస్టు అధ్యక్షుడు ఎస్. నంజయ్య ఆధ్వర్యంలో దేవాలయంలో వివిధ ధార్మిక పూజలు నిర్వహించారు.

క్రీడలతో ఉత్తమ ఆరోగ్యం



క్రీడాకారులను పరిచయం చేసుకుంటున్న కలెక్టర్ నాగరాజు, కేవీ నాగరాజు

చిక్కబళ్లాపురం: క్రీడలతో ఉత్తమ ఆరోగ్యం లభ్యమవుతుందని రాష్ట్ర ఖాదీ, గ్రామోద్యోగ మండలి అధ్యక్షుడు కేవీ నాగరాజు అన్నారు. నగరంలోని సర్ ఎం విశ్వేశ్వరయ్య క్రీడా మైదానంలో ప్రభుత్వ ఉద్యోగులకు శుక్రవారం ఏర్పాటు చేసిన క్రీడా పోటీలను ఆయన ప్రారంభించి మాట్లాడారు. క్రీడలతోపాటు నిత్యం వ్యాయామం తప్పనిసరిగా చేసుకోవాలన్నారు. జిల్లా కలెక్టర్ నాగరాజు మాట్లాడుతూ క్రీడల్లో ప్రతిభ చాటి రాష్ట్రస్థాయిలో రాణించాలన్నారు. అనంతరం హైజంప్, లాంగ్‌జంప్, క్రికెట్, త్రోబాల్ తదితర అంశాల్లో పోటీలు నిర్వహించారు.

పిల్లల చదువుపై దృష్టి సారించాలి

శివమొగ్గ: తల్లిదండ్రులు ఎన్ని పనుల్లో ఉన్నా కూడా పిల్లల చదువు విషయంలో తప్పకుండా దృష్టి సారించాలని శివమొగ్గ జిల్లా కన్నడ సాహిత్య సమ్మేళన అధ్యక్షుడు లక్ష్మణ్ కోడసే అన్నారు. శుక్రవారం శివమొగ్గ నగరంలోని గోపాలగౌడ లేఔట్ బాలాజీ ఎన్‌క్లేవ్‌లో ఈడిగర సంఘం ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన సన్మానం స్వీకరించి మాట్లాడారు. తాను 52 పుస్తకాలను రచించానని, శివమొగ్గ జిల్లా కన్నడ సాహిత్య పరిషత్ అధ్యక్షుడిగా నియామకం చేయడం సంతోషంగా ఉందన్నారు.

ట్రాఫిక్ జరిమానా బకాయిలపై భారీ రాయితీ

- 11లోగా చెల్లిస్తే 50 శాతం డిస్కౌంట్



ద్విచక్ర వాహనదారుడి పెండింగ్ ఉన్న జరిమానాను ప్రదర్శిస్తున్న ట్రాఫిక్ అధికారి

బనశంకరి: ఈనెల 11 లోపు ట్రాఫిక్ బకాయి జరిమానాలు చెల్లిస్తే 50 శాతం రాయితీ ఇస్తామని ప్రకటించడంతో జరిమానా చెల్లింపులు జోరందుకున్నాయి. బకాయిల చెల్లింపులు కర్ణాటక వన్ వెబ్‌సైట్‌లో వివరాలు తెలుసుకుని చెల్లించవచ్చని బెంగళూరు నగర ట్రాఫిక్ విభాగం జాయింట్ కమిషనర్ ఎంఎన్ అనుచేత్ తెలిపారు. పేటీఎం ద్వారా చెల్లించి రశీదు తీసుకోవచ్చన్నారు. గత కొన్ని నెలలుగా జరిమానాలు వసూలు కావడం లేదు. దాదాపు రెండు కోట్లకు పైగా కేసుల్లో జరిమానాల బకాయిలు ఉన్నాయి. ప్రజలు అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని ఎంఎన్ అనుచేత్ విజ్ఞప్తి చేశారు.

యువతిపై అత్యాచారం

- బేకరీ యజమానిపై కేసు

మైసూరు: మైసూరు నగరంలో ఓ యువతిపై అత్యాచారం చేసిన ఘటనకు సంబంధించి బేకరీ యజమానిపై పోలీసులు కేసు నమోదు చేశారు. నగరంలోని రాయల్ వారియర్ బేకరీ యజమాని మనోజ్‌పై కేసు నమోదైంది. వివరాలు... మనోజ్ మహారాజ కళాశాలలో చదువుతున్న సమయంలో ఓ యువతిని ప్రేమిస్తున్నాడు. పెళ్లి కూడా చేసుకుంటానని నమ్మించాడు. ఈ క్రమంలో పలుమార్లు ఇంటికి తీసుకెళ్లి బలవంతంగా అత్యాచారం చేసి, బయటకు చెబితే చంపేస్తానని బెదిరించాడని బాధితురాలి తల్లిదండ్రులు పోలీసులకు ఫిర్యాదు చేశారు.

ఇద్దరు కానిస్టేబుళ్ల సస్పెండ్

బనశంకరి: గతనెల 8న అర్ధరాత్రి దంపతుల నుంచి డబ్బులు వసూలు చేసిన ఇద్దరు కానిస్టేబుళ్లను సస్పెండ్ చేశామని నగర సీపీ ప్రతాప్ రెడ్డి తెలిపారు. డిసెంబరు 8 తేదీ అర్ధరాత్రి నగరంలో హొయ్సళ వాహనంలో ఉన్న ఇద్దరు పోలీసులు టెక్కీ దంపతులను బెదిరించి డబ్బులు వసూలు చేశారు. విచారణ చేసి రుజువు కావడంతో వారిని సస్పెండ్ చేశామన్నారు.

బాలిక ఆత్మహత్య

యశవంతపుర: ప్రేమ వ్యవహారంలో ఓ బాలిక పురుగుల మందు తాగి ఆత్మహత్య చేసుకున్న ఘటన హాసన జిల్లా సకలేశపుర తాలూకా యసళూరు గ్రామంలో జరిగింది. బాలిక ఇటీవల మరో స్నేహితుడితో కలిసి బైకుపై జాలీ రైడ్ చేసింది. దీనిని లోకేశ్ ప్రశ్నించి గొడవ పడేవాడు. దీంతో అవమానం భరించలేక బాలిక బుధవారం పురుగుల మందు తాగింది. హాసన ఆస్పత్రిలో చికిత్స పొందుతూ శుక్రవారం ఉదయం మృతి చెందింది. ఘటనకు సంబంధించి బాలిక తల్లిదండ్రులిచ్చిన ఫిర్యాదు ఆధారంగా లోకేశ్‌పై పోలీసులు కేసు నమోదు చేశారు.

మోదీ తిష్ట వేసినా బీజేపీకి అధికారం కల్ల

- మాజీ ముఖ్యమంత్రి సిద్ధరామయ్య

సాక్షి,బళ్లారి: ప్రధాని నరేంద్ర మోదీ ఎన్నికలు ముగిసే వరకు కర్ణాటకలో తిష్ట వేసి ఊరూరా ప్రచారం చేసినా బీజేపీ గెలిచే అవకాశం లేదని మాజీ సీఎం సిద్ధరామయ్య పేర్కొన్నారు. ఆయన శుక్రవారం బీదర్ జిల్లా బసవకళ్యాణ నుంచి ప్రజాధ్వని యాత్రను ప్రారంభించిన తర్వాత విలేకరులతో మాట్లాడారు. రాష్ట్రంలో అవినీతి తాండవిస్తోందన్నారు. 40 శాతం కమీషన్‌పై కాంట్రాక్టర్ల సంఘం ప్రధానమంత్రి లేఖ రాసినా అవినీతిని అరికట్టలేకపోయారన్నారు. అలాంటి పార్టీకి మళ్లీ రాష్ట్రంలో అధికారం అప్పగించేందుకు జనం సిద్ధంగా లేరన్నారు. అబద్ధాలు చెప్పి కేంద్రంలో బీజేపీని అధికారంలోకి తెచ్చారన్నారు. ఎవరి ఖాతాలోకి ఎంత డబ్బులు వేశారో ప్రధాని సమాధానం చెప్పాలన్నారు. రాష్ట్రంలో కాంగ్రెస్ పార్టీ అధికారంలో ఉన్నప్పుడు తన ఐదేళ్ల పాలనలో ఎంతో రాష్ట్రాభివృద్ధి చేశానని గుర్తు చేశారు.

విజయపురలో నేడు ప్రజాధ్వని



ఏర్పాట్లను పరిశీలిస్తున్న దృశ్యం

విజయపుర (బెంగళూరు గ్రామీణ): విజయపుర పట్టణంలోని పీయూ కళాశాల మైదానంలో శనివారం జరిగే ప్రజాధ్వని భారీ బహిరంగ సభకు కాంగ్రెస్ పార్టీ నేతలు ఏర్పాట్లు పూర్తి చేశారు. ప్రజాధ్వని కార్యక్రమానికి కేపీసీసీ చీఫ్ డికే శివకుమార్, మాజీ సీఎం సిద్దు తదితర నేతలు హాజరవుతారు.

హోసూరు వార్తలు..

అన్నాదురైకు ఘన నివాళి



అన్నాదురై విగ్రహానికి నివాళులర్పిస్తున్న మేయర్ తదితరులు

హోసూరు: డీఎంకే పార్టీ వ్యవస్థాపకుడు, తమిళనాడు మాజీ ముఖ్యమంత్రి దివంగత అన్నాదురై వర్ధంతి హోసూరు పట్టణంలో డీఎంకే, అన్నాడీఎంకే పార్టీ నాయకులు నిర్వహించారు. పట్టణంలోని తాలూకా కార్యాలయం వద్ద మేయర్ ఎస్.ఏ.సత్య అధ్యక్షతన వర్ధంతి జరిగింది. అన్నా విగ్రహానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. ఈ సందర్భంగా అన్నాదురై రాష్ట్రానికి చేసిన సేవలను కొనియాడారు. కార్యక్రమంలో డెప్యూటీ మేయర్ ఆనందయ్య, వేపనపల్లి మాజీ ఎమ్మెల్యే మురుగన్, డీఎంకే కార్పొరేటర్లు, డీఎంకే నాయకులు పెద్ద ఎత్తున పాల్గొన్నారు. కెలమంగలం, డెంకణీకోట, బాగలూరు, బేరికె, సూళగిరి, అంచెట్టి తదితర ప్రాంతాల్లో డీఎంకే నాయకులు అన్నాదురై చిత్రపటానికి నివాళులర్పించారు.

హోసూరులో బీజేపీ రాష్ట్ర నేత

హోసూరు: హోసూరు ప్రాంతంలో రైతులు సాగు చేస్తున్న పూల తోటలను బీజేపీ వ్యవసాయ విభాగ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి పూండి వెంకటేష్ పరిశీలించారు. క్రిష్ణగిరి జిల్లాలో పూలసాగుకు అనుకూలమైన శీతోష్ణస్థితి ఉండడంతో పెద్ద ఎత్తున రైతులు ఎక్కువ విస్తీర్ణంలో పూలసాగును చేపడుతున్నారు. హోసూరు సమీపంలోని బాగలూరు ప్రాంతంలో రైతులు ఆరు బయట, గ్రీన్ షెడ్లలో సాగు చేస్తున్న పూల తోటలను పరిశీలించి వారిని అభినందించారు. కార్యక్రమంలో వ్యవసాయ విభాగం రాష్ట్ర ఉపాధ్యక్షుడు గోవింద రెడ్డి, జయశంకర్, గోవిందరాజ్, మునిరాజ్ తదితరులు ఆయన వెంట ఉన్నారు.

ఉద్యోగాల పేరుతో వంచన

- ముగ్గురు ఏపీవాసులు, తెలంగాణవాసి అరెస్ట్



పట్టుబడిన నిందితులు

యశవంతపుర: ఐటీ ఉద్యోగాల పేరుతో యువతను వంచిస్తున్న ముఠా బెంగళూరులోని కొడిగేహళ్లి పోలీసులకు పట్టుబడింది. ఏపీలోని కృష్ణాజిల్లాకు చెందిన మల్లు శివశంకర్‌రెడ్డి అలియాస్ గోపిచంద్, గుంజ మంగరావ్, సికింద్రాబాద్ ఇబ్రహీం పట్టణానికి చెందిన షేఖ్ శహబాషి, ఎన్‌టీఆర్ జిల్లాకు చెందిన మహేశ్‌ను అరెస్ట్ చేశారు. వీరి ఖాతాల్లో ఉన్న రూ.5.95 లక్షలను సీజ్ చేశారు. బెంగళూరు ఈశాన్య డీసీపీ అనూప్ శెట్టి శుక్రవారం వివరాలు వెల్లడించారు.

నకిలీ పత్రాలతో ఉద్యోగం

ముఠా నాయకుడు మల్లు శివశంకర్‌రెడ్డి నకిలీ పత్రాలతో బెంగళూరు మాన్యతా టెక్‌పార్క్‌లో ఉద్యోగంలో చేరాడు. సర్టిఫికెట్లు నకిలీవని తేలడంతో ఉద్యోగం నుంచి తొలగించారు. అనంతరం మిగతా ముగ్గురితో జత కట్టి ముఠాగా ఏర్పడి వంచనలకు తెరతీశారు. తమకు కన్సల్టెన్సీ ఉందని, ఐటీ ఉద్యోగాలు ఇప్పిస్తామని సామాజిక మాధ్యమాల్లో ప్రకటనలు చేశారు. సంప్రదించిన వారినుంచి లక్షలు వసూలు చేసేవారు.

పట్టుబడింది ఇలా...

ఉద్యోగం కోసం ఏపీకి చెందిన ప్రదీప్ అనే యువకుడు సంప్రదించగా విడతల వారీగా రూ.6 లక్షలు తమ ఖాతాకు బదిలీ చేయించుకున్నారు. ఉద్యోగం వచ్చిందని చెప్పి ఈనెల 11న బెంగళూరుకు రప్పించారు. కంపెనీ మేనేజర్ వద్దకు తీసుకెళ్తామని చెప్పి కారులో ఎక్కించుకుని మార్గం మధ్యలో ప్రదీప్ నుంచి రూ.30 వేలు ఫోన్ పే చేయించుకున్నారు. అనంతరం అతని ఫోన్ లాక్కొని చితకబాది యలహంక సమీపంలోని వదిలేశారు. బాధితుడు పోలీసులకు ఫిర్యాదు చేయటంతో నిందితులను అరెస్ట్ చేశారు.

కనుల పండువగా బ్రహ్మోత్సవాలు



ప్రత్యేక అలంకరణలో ఆలయం



విశేష అలంకరణలో వసంతవల్లభుడి మూలవిరాట్

- 7న వసంత వల్లభుడి బ్రహ్మ రథోత్సవం

బనశంకరి: బెంగళూరు నగరంలోని కనకపురరోడ్డు కోణణకుంటెక్రాస్ వసంతపురలో వెలసిన వసంతవల్లభరాయస్వామి బ్రహ్మోత్సవాలు కన్నుల పండువగా సాగుతున్నాయి. వసంతవల్లభుడి బ్రహ్మోత్సవాలు గత నెల 31 నుంచి ప్రారంభం కాగా ఈనెల 15 తేదీ వరకు అత్యంత వైభవంగా నిర్వహిస్తామని ఆలయ కార్యనిర్వహణాధికారి కేకే. రుక్మిణి, అకౌంటెంట్ ఎస్.మహేశ్, అర్చకులు వీఆర్.రఘురామబట్టర్ తెలిపారు. ఈ నెల 7 తేదీన వసంతవల్లభరాయస్వామి బ్రహ్మరథోత్సవం నిర్వహిస్తామని పేర్కొన్నారు.

1200 ఏళ్లనాటి ఆలయం

బెంగళూరు నగరంలోని కనకపురరోడ్డు కోణణకుంటెక్రాస్ వసంతపురలో వెలసిన వసంతవల్లభరాయస్వామికి పురాణ చరిత్ర ఉంది. సుమారు 1,200 ఏళ్ల కిందట వసంతవల్లభరాయస్వామి ఆలయాన్ని నిర్మించారని, కాలక్రమేణా ఆలయ రూపురేఖలు మారుతూ వచ్చాయని చెబుతారు. అఖిలాండకోటి బ్రహ్మాండనాయకుడు, ఏడుకొండలవాడు వేంకటేశ్వరస్వామి తిరుపతి వద్ద నారాయణవనంలో వివాహం చేసుకున్న అనంతరం వసంతాలు ఆడటానికి ఇక్కడికొచ్చారని, కనుక ఈ ప్రాంతానికి వసంతపుర అని పేరు వచ్చిందిన ప్రతీతి. 1,200 ఏళ్ల కిందట ఆయన విగ్రహం కనిపించిందని స్వామివారి కోరిక మేరకు మాండవ్య మహర్షి ఈ దివ్యక్షేత్రంలో ఆ విగ్రహాన్ని ప్రతిష్టించినట్లు స్థల పురాణం చెబుతుంది.

కోరిన కోర్కెలు తీరుతాయని..

స్వయంభు వల్లభరాయుడు తిరుపతి వెంకటేశ్వర స్వామి లాగే మహిమాన్వితుడని భక్తులు, స్థానికులు అపారనమ్మకం. ఆయన కరుణా కటాక్ష వీక్షణాలుంటే తమకు కంకణ, సంతాన భాగ్యాలు, ఆయురారోగ్య, ఐశ్వర్యాలు, కీర్తిసంపదలు సమకూరుతాయని గట్టిగా నమ్ముతారు. స్వామివారి దర్శనం కోసం బెంగళూరు నగరంతో పాటు రాష్ట్రంలోని పలుప్రాంతాలనుంచి పెద్ద ఎత్తున భక్తులు విచ్చేసి వల్లభరాయుడిని దర్శించుకుని మొక్కులు తీర్చుకుంటారు. తిరుమలకు వెళ్లి శ్రీవారిని దర్శించుకోలేని వారు ఈ స్వయంభు వల్లభరాయుడిని దర్శించుకుంటే సర్వపాపాల నుంచి విముక్తి కలుగుతుందని భక్తులు ప్రగాఢంగా విశ్వసిస్తారు.

ఆలయానికి ఇలా చేరుకోవచ్చు..

వసంతవల్లభ రాయస్వామి ఆలయానికి వెళ్లేవారు సిటీ మార్కెట్ నుంచి 210 డి, 210 ఈ, మెజస్టిక్ నుంచి 210 ఇ, 210 ఆర్, కెంగేరి, ఎలక్ట్రానిక్‌సిటీ నుంచి 378 నెంబరు సౌకర్యం కలదు.

ఘనంగా చండికా హోమం



విజయపుర(బెంగళూరు గ్రామీణ): విజయపుర సమీపంలోని కోరమంగల గ్రామంలో వెలసిన శ్రీమునేశ్వరస్వామి, మహేశ్వరమ్మ, మారమ్మ ఆలయాల కుంభాభిషేక మహోత్సవం, శ్రీ లక్ష్మి వెంకటరమణ స్వామి కళ్యాణోత్సవం, చండికా హోమం ఘనంగా నిర్వహించారు. మూడు రోజులుగా వివిధ ధార్మిక కార్యక్రమాలు కొనసాగుతున్నాయి.

ఘనంగా మహాలక్ష్మి దేవి ఆలయ కుంభాభిషేకం





విశేష అలంకరణలో మహాలక్ష్మీ మూలవిరాట్, కుంభాభిషేకం నిర్వహిస్తున్న వేదపండితులు

కెలమంగలం: కెలమంగలం సమీపంలోని బోడిచిపల్లి పంచాయతీ మోక్షాపురి గ్రామంలో నూతనంగా నిర్మించిన సరస్వతి, మహాలక్ష్మిదేవి ఆలయ కుంభాభిషేకం శుక్రవారం ఘనంగా జరిగింది. వేకువజామున గణపతి హోమంతో కార్యక్రమాలు ప్రారంభించారు. విగ్రహ ప్రతిష్టాపన, ప్రాణ ప్రతిష్ట, అభిషేకాలు నిర్వహించారు. మహిళలు పాలకుండలతో ఆలయానికి చేరుకొని అభిషేకాలు నిర్వహించారు. అనంతరం వేదపండితుల మంత్రోచ్ఛారణల మధ్య పవిత్ర జలాలతో మహా కుంభాభిషేకోత్సవం జరిగింది. పెద్ద సంఖ్యలో భక్తులు హాజరయ్యారు.

మాజీ సైనికోద్యోగులకు సహాయ నిధి అందజేత



లబ్ధిదారులకు సహాయ నిధిని అందజేస్తున్న డీఆర్‌వో రాజేశ్వరి

హోసూరు: క్రిష్ణగిరి కలెక్టరేట్‌లో శుక్రవారం జరిగిన మాజీ సైనికోద్యోగుల ఫిర్యాదుల స్వీకరణ కార్యక్రమంలో 9 మంది మాజీ సైనికోద్యోగులకు విద్యా సహాయ నిధిని డీఆర్‌వో రాజేశ్వరి అందజేశారు. డీఆర్‌వో అధ్యక్షతన జరిగిన ఫిర్యాదుల స్వీకరణ కార్యక్రమంలో వివిధ సమస్యలకు సంబంధించి 16 ఫిర్యాదులను అందజేశారు. ఫిర్యాదులను స్వీకరించిన డీఆర్‌వో వెంటనే పరిశీలించి పరిష్కరించాలని ఆదేశాలు జారీ చేశారు. ఈ సందర్భంగా 9 మంది మాజీ సైనికోద్యోగులకు రూ.1.85 లక్షల విద్యా సహాయనిధిని అందజేశారు. కార్యక్రమంలో అధికారులు కర్నల్ వేలు, దాక్షాయిని, మహేంద్రన్, గురునాథన్, వేడియప్పన్, ప్రభాకర్, రమేష్‌కుమార్ తదితరులు పాల్గొన్నారు.

ఆరు నెలల క్రితం అదృశ్యం

- అపార్టుమెంట్ వెనుకభాగంలో అస్థిపంజరంగా లభ్యం
- నేపాలీ మహిళ విషాదాంతం



నేపాలీ మహిళ పుష్పదామి (ఫైల్)

బనశంకరి: ఆరు నెలల క్రితం అదృశ్యమైన నేపాలీ మహిళ నిర్జన ప్రాంతంలో అస్థిపంజరంగా కనిపించింది. హుళిమావు పోలీస్‌స్టేషన్ పరిధిలోని అక్షయ నగర అపార్టుమెంట్ వెనుకభాగంలో పొదల మధ్య చెట్టుకు వేలాడుతున్న స్థితిలో ఉన్న అస్థి పంజరం నేపాలీకి చెందిన పుష్పదామి (22)గా పోలీసులు గుర్తించారు.

భర్తతో గొడవ పడి...

నేపాల్‌కు చెందిన పుష్పాదామి, భర్త అమర్‌దామి అక్షయనగరలో నివాసం ఉంటున్నారు. భర్త మద్యానికి బానిస. దీంతో అతన్ని భరించలేక నేపాల్‌కు వెళ్లాలని నిర్ణయించుకుంది. ఇదే విషయంపై ఇద్దరి మధ్య గొడవలు తలెత్తాయి. గత ఏడాది జులై 8న భర్తపై కోపంతో ఇంటి నుంచి పుష్పదామి బయటకు వెళ్లి తిరిగి రాలేదు. భార్య కనిపించకపోవడంతో భర్త పోలీసులకు ఫిర్యాదు చేశాడు. పోలీసులు పలు ప్రాంతాల్లో గాలించినప్పటికీ ఆమె ఆచూకీ లభించలేదు. ఈ ఘటనపై ఆగ్నేయ విభాగ డీసీపీ సీకే.బాబా శుక్రవారం విలేకరులతో మాట్లాడుతూ... ఉరి వేసుకున్న స్థితిలో గురువారం ఉదయం 9.30 గంటల సమయంలో హుళిమావు పరిధిలోని అపార్టుమెంట్ వెనుక భాగంలోని పొదల్లో మనిషి తలపుర్రె,అస్థి పంజరం లభ్యమైంది. అస్థిపంజరం పైన పాదరక్షలు, మెడలో ఉన్న నెక్లెస్, ఇతర వస్తువులు అక్కడ పక్కనే లభించాయి. అక్కడ ఎక్కువగా సంచారం లేకపోవడం నిర్జీన ప్రదేశం కావడంతో ఆ వస్తువులు ఎవరూ తీసుకోలేదు. ఆమె ఆత్మహత్యకు పాల్పడినట్లు తెలిసిందని సీకే బాబా తెలిపారు. వీరికి ఒక కుమారుడు ఉన్నాడు.

ఆలయాలు ప్రశాంతతకు నిలయాలు

గౌరిబిదనూరు: ఆలయాలు ప్రశాంతతకు నిలయాలని, గ్రామ ప్రజల్లో ఐక్యతను పెంచుతాయని ఎమ్మెల్యే శివశంకరరెడ్డి అన్నారు. తాలూకాలోని హోసూరు గ్రామంలో నూతనంగా నిర్మించిన అయ్యప్ప స్వామి ఆలయంలో శుక్రవారం జరిగిన అయ్యప్ప, వినాయకుడు, సుబ్రహ్మణ్య స్వామి విగ్రహ ప్రతిష్టాపన, పూజా కార్యక్రమాల్లో ఆయన తన సతీమణితో కలిసి పాల్గొన్నారు. ప్రతి ఒక్కరూ ఆధ్యాత్మికత వైపు దృష్టి పెట్టాలన్నారు. అనంతరం ఆలయానికి ఎమ్మెల్యే నిధుల నుంచి రూ.లక్ష ఇస్తామని ప్రకటించారు. ప్రధాన అర్చకులు రమేశ్ శాస్త్రి బృందం ధార్మిక కార్యక్రమాలు నిర్వహించింది. అయ్యప్పభక్తుల సంఘం అధ్యక్షుడు నాగేశ్, మంజునాథ్, తా.పం మాజీ అధ్యక్షుడు లోకేశ్ తదితరులు పాల్గొన్నారు.

97.43శాతం మందికి పింఛన్ల పంపిణీ

సాక్షి, అమరావతి: ఫిబ్రవరి నెలకు సంబంధించి శుక్రవారం సాయంత్రం వరకు రాష్ట్ర వ్యాప్తంగా 97.43 శాతం మందికి పింఛన్ల పంపిణీ పూర్తయినట్లు సెర్ప్ అధికారులు వెల్లడించారు. ఈ నెలకు గానూ ప్రభుత్వం మొత్తం 63.87 లక్షల మందికి సామాజిక పింఛన్ల పంపిణీకి కోసం రూ.1,759.99 కోట్లు విడుదల చేసింది. శుక్రవారం సాయంత్రం వరకు 62,23,106 మందికి రూ.1,714.60 కోట్లు పంపిణీ పూర్తయిందని, ఆది, సోమవారాల్లో కూడా వలంటీర్లు లబ్ధిదారుల ఇళ్ల వద్దకు వెళ్లి పంపిణీ చేస్తారని అధికారులు తెలిపారు.


ఏలూరు నగరంలోని తంగెళ్లమూడిలో ఎస్‌కే అఫ్జల్‌కు దివ్యాంగుల పింఛన్ అందిస్తున్న వలంటీర్ ఎస్‌కే నాగూర్


ఒంగోలు 17వ డివిజన్ అంబేద్కర్‌కాలనీలో వృద్ధుడు ఆర్.కోటయ్యకు పింఛన్ అందజేస్తున్న వలంటీర్ మహేష్


కాకినాడ జీజీహెచ్‌లో చికిత్స పొందుతున్న వద్దీ బంగారమ్మకు పింఛను అందజేస్తున్న చింతలూరు వలంటీర్ ఆశాజ్యోతి


గుంటూరు పోలేరమ్మ సెంటర్‌కి చెందిన వీరయ్యకు దివ్యాంగ పింఛన్ అందజేస్తున్న వార్డు వలంటీరు దుర్గ

బహుముఖ ప్రజ్ఞాశాలి విశ్వనాథ్: ప్రధాని మోదీ

సాక్షి, న్యూఢిల్లీ/హైదరాబాద్: ప్రముఖ దర్శకుడు కె.విశ్వనాథ్ మృతిపై ప్రధాని నరేంద్ర మోదీ విచారం వ్యక్తం చేశారు. 'సినీ ప్రపంచంలో కె.విశ్వనాథ్ ఒక దిగ్గజం. సృజనాత్మక దర్శకుడిగా, బహుముఖ ప్రజ్ఞాశాలిగా సినీలోకంలో తనకంటూ ప్రత్యేక స్థానాన్ని ఏర్పరుచుకున్నారు. వివిధ ఇతివృత్తాలతో తీసిన అతని సినిమాలు దశాబ్దాలుగా ప్రేక్షకుల్ని అలరించాయి' అని ట్విట్టర్‌లో పేర్కొన్నారు.

తెలుగువారి గుండెల్లో శాశ్వతంగా నిలిచిపోతారు: జగన్

సాక్షి, అమరావతి: సినీ దర్శక దిగ్గజం కె. విశ్వనాథ్ తెలుగు వారి గుండెల్లో కళాతపస్విగా శాశ్వతంగా నిలిచిపోతారని సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి కొనియాడారు. ఈ మేరకు శుక్రవారం ట్వీట్ చేశారు. 'విశ్వనాథ్ గారి మరణం తీవ్ర విచారానికి గురిచేసింది. తెలుగు సంస్కృతికి, భారతీయ కళలకు నిలువుటద్దం విశ్వనాథ్ గారు. ఆయన దర్శకత్వంలో రూపుదిద్దుకున్న చిత్రాలు తెలుగు సినీ రంగానికి అసమాన గౌరవాన్ని తెచ్చాయి' అని పేర్కొన్నారు.

విశ్వనాథ్ మృతి బాధాకరం: స్వరూపా

సింహాచలం: కె.విశ్వనాథ్ శివైక్యం చెందడం బాధాకరమని విశాఖ శారదాపీఠాధిపతి స్వరూపానందేంద్ర సరస్వతి అన్నారు. సినీప్రేమికుల్లో చాలామందికి తెలియని గొప్ప ఆధ్యాత్మికవేత్త విశ్వనాథ్‌లో ఉన్నారని పేర్కొన్నారు.

కళాతపస్వికి కన్నీటి వీడ్కోలు

నివాళులర్పించిన రాజకీయ, సినీప్రముఖులు

సాక్షి, హైదరాబాద్/సాక్షి, అమరావతి : ప్రముఖ దర్శకుడు కాశీనాథుని విశ్వనాథ్ (92)కు అశేష అభిమానగణం కన్నీటి వీడ్కోలు పలికింది. ఆయన అంత్యక్రియలు శుక్రవారం మధ్యాహ్నం పంజగుట్ట హిందూ శ్మశాన వాటికలో సంప్రదాయబద్ధంగా జరిగాయి. కొన్ని రోజులుగా అనారోగ్యంతో బాధపడుతున్న ఆయన గురువారం రాత్రి అపోలో ఆస్పత్రిలో తుదిశ్వాస విడిచిన సంగతి తెలిసిందే. విశ్వనాథ్ పార్థివదేహాన్ని ఆస్పత్రి నుంచి గురువారం రాత్రి ఒంటి గంటకు ఫిలింనగర్‌లోని ఆయన స్వగృహానికి తరలించారు. రాత్రి నుంచే విశ్వనాథ్ భౌతికకాయాన్ని సందర్శించేందుకు సినీ, రాజకీయ ప్రముఖులతోపాటు అభిమానులు భారీగా విచ్చేయడంతో పరిసర ప్రాంతాలు కిటకిటలాడాయి. ఆయన నివాసం నుంచి పంజగుట్ట శ్మశాన వాటిక వరకు శుక్రవారం అంతిమయాత్ర సాగింది. కళాతపస్విని కడసారి చూసేందుకు అభిమానులు పెద్దసంఖ్యలో అంతిమయాత్రలో పాల్గొన్నారు. అనంతరం శ్మశాన వాటికలో ఆయన అంత్యక్రియలు నిర్వహించారు.

కన్నీరుమున్నీరైన చంద్రమోహన్

విశ్వనాథ్ భౌతికకాయాన్ని శుక్రవారం మాజీ ఉపరాష్ట్రపతి వెంకయ్యనాయుడు, ఎంపీ సంతోష్‌కుమార్, సినీ ప్రముఖులు మెగాస్టార్ చిరంజీవి, వెంకటేష్, పవన్‌కళ్యాణ్, శరత్‌కుమార్, రాధిక, రాజశేఖర్, జీవిత, కోట శ్రీనివాసరావు, బ్రహ్మానందం, కె. రాఘవేంద్రరావు, త్రివిక్రమ్ శ్రీనివాస్, రాజమౌళి, అల్లు అరవింద్, బోయపాటి శ్రీను, శేఖర్ కమ్ముల, ఆదిశేషగిరిరావు, దగ్గుబాటి సురేష్‌బాబు తదితరులు సందర్శించి నివాళులర్పించారు. విశ్వనాథ్ కుటుంబసభ్యులను పరామర్శించి ప్రగాఢ సానుభూతి తెలిపారు. విశ్వనాథ్ దర్శకత్వంలో సిరిసిరిమువ్వ సినిమాలో హీరోగా నటించిన చంద్రమోహన్ కన్నీరుమున్నీరయ్యారు. విశ్వనాథ్ భౌతికకాయాన్ని చూడటంతోనే ఆయన విలపిస్తూ అక్కడే కుప్పకూలిపోయారు. ఆయనతో తనకున్న అనుబంధాన్ని గుర్తుచేసుకున్నారు.

విశ్వనాథ్ మృతి బాధాకరం : మంత్రి తలసాని

కళాతపస్వి విశ్వనాథ్ మృతి బాధాకరమని సినిమాటోగ్రఫీ శాఖ మంత్రి తలసాని శ్రీనివాస్‌యాదవ్ అన్నారు. తలసాని ఆయన నివాసానికి వెళ్లి పార్థివదేహానికి పూలమాల వేసి నివాళులర్పించారు. కుటుంబసభ్యులకు తన ప్రగాఢ సానుభూతిని తెలిపారు. మన సంస్కృతి సంప్రదాయాలు, కళల విశిష్టతను చాటేలా అనేక చిత్రాలు నిర్మించిన గొప్ప దర్శకులంటూ కొనియాడారు.


భర్త భౌతికకాయం వద్ద విలపిస్తున్న విశ్వనాథ్ భార్య

రాష్ట్ర ప్రభుత్వం తరపున..

విశ్వనాథ్ అంతిమయాత్ర, అంత్యక్రియల్లో ఏపీ ప్రభుత్వం తరపున బీసీ సంక్షేమ, సమాచార, సినిమాటోగ్రఫీ మంత్రి చెల్లుబోయిన వేణుగోపాలకృష్ణ పాల్గొన్నారు. ఆయన విశ్వనాథ్ పార్థివదేహానికి నివాళులర్పించారు. భారతీయ సంస్కృతి సంప్రదాయాలను, సంగీత సాహిత్యాలను సృజనాత్మక శైలిలో ప్రేక్షకులకు అందించిన కళాతపస్వి మరణించడం సినీ పరిశ్రమకు తీరని లోటని చెప్పారు. దాదా సాహెబ్ ఫాల్కే అవార్డుతో పాటు, రఘుపతి వెంకయ్య పురస్కారం, పద్మశ్రీ వంటి అత్యున్నతమైన అవార్డులను విశ్వనాథ్ అందుకోవడం అందరికీ గర్వకారణమన్నారు.

ట్యాపింగ్ కాదు.. ట్రాప్‌లో పడ్డారు

సాక్షి, అమరావతి, సాక్షి, విశాఖపట్నం, నెల్లూరు (సెంట్రల్): నెల్లూరు రూరల్ ఎమ్మెల్యే కోటంరెడ్డి శ్రీధర్‌రెడ్డి ఆరోపిస్తున్నట్లుగా ఎక్కడా ఫోన్ ట్యాపింగ్ జరగలేదని, రికార్డింగ్ చేసుకుని సోషల్ మీడియాలో ప్రచారం చేసుకున్నట్లు స్పష్టంగా తెలిసిపోయిందని మంత్రులు పేర్కొన్నారు. టీడీపీ అధ్యక్షుడు చంద్రబాబు ఉచ్చులో ఇరుక్కున్న కోటంరెడ్డి ప్రభుత్వంపై బురద చల్లే ప్రయత్నాలు చేస్తున్నారని ధ్వజమెత్తారు. నమ్మక ద్రోహానికి పాల్పడి ఊసరవెల్లిలా వ్యవహరిస్తున్నారని మండిపడ్డారు. కోటంరెడ్డి చెబుతున్నట్లుగా అది ఫోన్ ట్యాపింగ్ కాదని.. మ్యాన్ ట్యాపింగ్ అని వ్యాఖ్యానించారు. లోకేశ్ యువగళం ఫెయిల్ కావడంతో చంద్రబాబు కొత్త కుట్రలకు తెరతీసి కోటంరెడ్డిని పావుగా వాడుకుంటున్నారని చెప్పారు. కోటంరెడ్డి పార్టీ మారతాడంటే మునిగిపోయే పార్టీలోకి ఎందుకు వస్తున్నారో అంతుబట్టక టీడీపీ వాళ్లే నవ్వుకుంటున్నారని చెప్పారు. ఉమ్మడి నెల్లూరు జిల్లాలో ఈసారి పదికి పది సీట్లు సాధిస్తామన్నారు. కనీసం వార్డు మెంబర్‌గా కూడా గెలవలేని నారా లోకేశ్ లాంటి వ్యక్తులు చేసే విమర్శలకు స్పందించి తమ స్థాయిని దిగజార్చుకోలేమని వ్యాఖ్యానించారు. శుక్రవారం తాడేపల్లి, నెల్లూరు, విశాఖలో మంత్రులు మేరుగు నాగార్జున, కాకాణి గోవర్ధన్‌రెడ్డి, కారుమూరి నాగేశ్వరరావు విలేకరులతో మాట్లాడారు.

ఆయనో జీరో..



'ఫోన్ ట్యాపింగ్ చేయలేదు, జరగలేదు. అది కోటంరెడ్డికి కూడా తెలుసు. ఆరోపణలు కాకుండా ఆధారాలుంటే బయట పెట్టాలి. ముఖ్యమంత్రి జగన్ లేకుంటే కోటంరెడ్డి జీరో. అంబేద్కర్ ఆలోచన విధానాలు ఆంధ్రప్రదేశ్‌లో విరాజిల్లుతున్నాయి. జగనన్న విదేశీ విద్యా దీవెన పథకం అత్యంత పారదర్శకంగా అమలు జరుగుతోంది. పథకం కింద ఇప్పటివరకు ఈ ఏడాది 213 మంది ఎంపికయ్యారు'

– మేరుగు నాగార్జున, సాంఘిక సంక్షేమ శాఖ మంత్రి

నిందలు సిగ్గుచేటు



'ఫోన్ ట్యాపింగ్‌పై కోర్టుకెళతా.. కేంద్రానికి లేఖ రాస్తా.. కేంద్ర హోం మంత్రి అమిత్‌షాను కలుస్తానని చెబుతున్న కోటంరెడ్డి ఎందుకు ఆలస్యం చేస్తున్నారు? వాస్తవాలు తెలుస్తాయని భయపడే ఆయన కోర్టుకు వెళ్లడం లేదు. వైఎస్ జగన్ పార్టీ టికెట్లు ఇవ్వకుంటే మనమంతా జీరోలమనే విషయాన్ని మర్చిపోవద్దు. రాజకీయంగా విభేదించినప్పటికీ ఎమ్మెల్యేగా రెండుసార్లు టికెట్ ఇచ్చి గౌరవించిన పార్టీపై నిందలు మోపడం ఆత్మహత్యా సదృశ్యమే. మన బాగు కోసం కృషి చేస్తూ ఏవైనా చిన్న పొరపాట్లుంటే సరి చేసుకోవాలని సూచించే ప్రభుత్వ సలహాదారు సజ్జల రామకృష్ణారెడ్డిపై నిందలు వేయడం సిగ్గుచేటు'

– కాకాణి గోవర్ధన్‌రెడ్డి, వ్యవసాయశాఖ మంత్రి

ముందే సిద్ధమై ఆరోపణలు



'కొందరు ఏదో ఒక వంకతో పార్టీని వీడాలని ముందుగానే నిర్ణయించుకుని ట్యాపింగ్ ఆరోపణలు చేస్తున్నారు. వంక లేనోళ్లు డొంక పట్టుకుని వేలాడినట్లుగా వ్యవహరిస్తున్నారు. టికెట్ గ్యారెంటీ లేకపోవడంతో అవాకులు చవాకులు పేలుతున్నారు. గెలుపు గుర్రాలకే టికెట్ అనేది సీఎం జగన్ విధానం. పాదయాత్ర చేస్తున్న లోకేశ్ తొలుత ఆయన తండ్రి చంద్రబాబును నిలదీయాలి. మూడుసార్లు సీఎంగా ఉన్నా సాధ్యం కాని అభివృద్ధి కేవలం మూడున్నరేళ్లలో సీఎం జగన్ ప్రభుత్వానికి ఎలా సాధ్యమైందో ప్రశ్నించాలి'

– కారుమూరి వెంకట నాగేశ్వరరావు, పౌర సరఫరాల శాఖ మంత్రి

త్వరలో వందే భారత్ మెట్రోలు

కేంద్ర రైల్వే శాఖ మంత్రి అశ్విని వైష్ణవ్

సాక్షి, న్యూఢిల్లీ : దేశ వ్యాప్తంగా వందే భారత్ రైళ్ల తరహాలో 50 నుంచి 70 కి.మీ దూరంలో ఉన్న రెండు నగరాలు ఒకటే అనే విధంగా ఉండేలా వాటిని కలుపుతూ హైస్పీడ్ వందే భారత్ మెట్రో ప్రాజెక్టును త్వరలో పట్టా లెక్కించనున్నట్లు కేంద్ర రైల్వే శాఖ మంత్రి అశ్విని వైష్ణవ్ తెలిపారు. కేంద్ర బడ్జెట్‌లో ఆంధ్రప్రదేశ్‌లోని రైల్వే అభివృద్ధికి రూ.8,406 కోట్లు కేటాయించామని చెప్పారు. శుక్రవారం ఆయన ఢిల్లీలోఆంధ్రప్రదేశ్‌లో రైల్వే ప్రాజెక్టుల అభివృద్ధిలో అవసరమైన చోట భూసేకరణ ప్రక్రియకు రాష్ట్ర ప్రభుత్వ సహకారం బాగుందని తెలిపారు. విశాఖ రైల్వేజోన్‌కు సంబంధించి జోనల్ హెడ్‌క్వార్టర్ నిర్మాణం, డిజైన్‌లను ఇటీవల స్వయంగా పరిశీలించానని చెప్పారు. డిజైన్ ఫైనలైజ్ అయిన వెంటనే నిర్మాణం మొదలు పెడతామన్నారు. హైదరాబాద్-వైజాగ్ వందే భారత్ రైలు పూర్తి ఆక్యుపెన్సీతో విజయవంతంగా నడుస్తోందన్నారు.

ఎఫ్‌డీసీ చైర్మన్‌గా 'పోసాని' బాధ్యతల స్వీకారం

- సినిమా పరిశ్రమకు మంచి చేయకపోయినా చెడు మాత్రం చేయను
- జగన్ కోసం ప్రాణమిస్తా..

సాక్షి, అమరావతి: ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి కోసం అవసరమైతే ప్రాణమిస్తానని, తాను బతికున్నంతకాలం జగన్ వెంటే ఉంటానని ప్రముఖ సినీ రచయిత, నటుడు పోసాని కృష్ణమురళి అన్నారు. రాష్ట్ర చలనచిత్ర, టీవీ, నాటక రంగ అభివృద్ధి సంస్థ చైర్మన్‌గా శుక్రవారం ఆయన విజయవాడలో బాధ్యతలు స్వీకరించారు. రాష్ట్రంలో ఈ రంగం అభివృద్ధికి శక్తివంచన లేకుండా కృషిచేస్తానని, సినీ పరిశ్రమకు మంచి చేయకపోయినా చెడుగానీ, మోసంగానీ చేయబోనని ఆయన స్పష్టంచేశారు. చలనచిత్ర అభివృద్ధికి రాష్ట్ర ప్రభుత్వం అన్ని విధాలా సహకరిస్తోందని, ముఖ్యంగా ఈ పరిశ్రమను విశాఖలో అభివృద్ధి చేయాలనే సీఎం జగన్ ఆలోచనలకు అనుగుణంగా తాను పనిచేస్తానన్నారు. కరోనా సమయంలో తన కుటుంబం మొత్తం ఆసుపత్రిలో ఉంటే జగన్ సతీమణి వైఎస్ భారతమ్మ తమకు అండగా నిలిచారని పోసాని తెలిపారు. రానున్న 2024 ఎన్నికల్లో వైఎస్సార్‌సీపీకి 175 స్థానాలు కచ్చితంగా వస్తాయన్నారు. ఇక చంద్రబాబులా జగన్ వెన్నుపోటు పొడిచి పదవులు, పార్టీనీ లాక్కోలేదని అలాంటి వ్యక్తి సైకో ఎలా అవుతారని పోసాని ప్రశ్నించారు.


ప్రసంగిస్తున్న పోసాని కృష్ణమురళి


సినీ పరిశ్రమకు త్వరలోనే అనుమతులు : పేర్ని

మరోవైపు.. విశాఖలో సినీ పరిశ్రమకు రాష్ట్ర ప్రభుత్వం 100 ఎకరాలు కేటాయించిందని, ప్రభుత్వం త్వరలోనే ఇందుకు అవసరమైన అనుమతులిస్తుందని మాజీమంత్రి పేర్ని నాని తెలిపారు. హీరోలందరూ సినిమా షూటింగులను ఒక్క షెడ్యూల్ అయినా ఏపీలో తీయాలని కోరానని, గోపీచంద్ ఒక్కరే ఒక షెడ్యూల్ షూటింగ్ తీసారని మాజీ ఎఫ్‌డీసీ చైర్మన్ అంబికా కృష్ణ అన్నారు. చంద్రబాబు హయాంలో నంది అవార్డుల ప్రదానం చేయాలని ఎన్నిసార్లు అడిగినా ఇవ్వలేదన్నారు. ఫిల్మ్ ఇండస్ట్రీకి చెందిన వ్యక్తి చైర్మన్‌గా రావడం శుభపరిణామమని సినీ నిర్మాత కళ్యాణ్ అన్నారు. సినిమా ఇండస్ట్రీని వచ్చే ఆరునెలల్లో విశాఖకు తీసుకువెళ్తారనే నమ్మకం తనకుందన్నారు. ఇక గురువారం కన్నుమూసిన కళాతపస్వి కె. విశ్వనాథ్, సీనియర్ డైరెక్టర్ సాగర్ చిత్రపటాలతో పాటు దివంగత వైఎస్ రాజశేఖరరెడ్డి చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు.

కోటంరెడ్డి శ్రీధర్‌రెడ్డిపై కిడ్నాప్ యత్నం కేసు

నెల్లూరు (క్రైమ్): తనతో పాటు పార్టీ మారలేదన్న అక్కసుతో ఓ కార్పొరేటర్‌ను నెల్లూరు రూరల్ ఎమ్మెల్యే కోటంరెడ్డి శ్రీధర్‌రెడ్డి తన అనుచరులతో కలిసి కిడ్నాప్‌నకు యత్నించిన ఘటనపై కేసు నమోదైంది. పోలీసుల సమాచారం ప్రకారం.. శ్రీధర్‌రెడ్డి పడారుపల్లికి చెందిన నెల్లూరు నగరం 22వ డివిజన్ కార్పొరేటర్ మూలే విజయభాస్కర్ రెడ్డికి శుక్రవారం ఫోన్ చేసి వైఎస్సార్‌సీపీని వీడి తనతో రావాలని కోరారు. అందుకు విజయభాస్కర్ రెడ్డి నిరాకరించడంతో ఎమ్మెల్యే తన అనుచరుడు మిద్దె మురళీకృష్ణ యాదవ్, కారు డ్రైవర్ అంకయ్యతో కలిసి కార్పొరేటర్ ఇంటికి వెళ్లి అంతు చూస్తానంటూ బెదిరించారు. కార్పొరేటర్‌ను బలవంతంగా కారులో ఎక్కించేందుకు యత్నించగా ఆయన ప్రతిఘటించారు. వారినుంచి తప్పించుకుని వేదాయపాలెం పోలీసుస్టేషన్‌కు చేరుకుని పోలీసులకు ఫిర్యాదు చేశారు. కార్పొరేటర్ ఫిర్యాదు మేరకు ఎమ్మెల్యే, ఆయన అనుచరుడు, కారు డ్రైవర్‌పై కిడ్నాప్‌యత్నం కేసు నమోదు చేసినట్లు వేదాయపాలెం ఇన్‌స్పెక్టర్ కె.నరసింహారావు తెలిపారు.

సువర్ణాధ్యాయం



ల్యాప్‌టాప్‌లో బటన్ నొక్కి జగనన్న విదేశీ విద్యాదీవెన లబ్ధిదారుల ఖాతాల్లో నగదు జమచేస్తున్న సీఎం వైఎస్ జగన్. వీడియో కాన్ఫరెన్స్ ద్వారా ఆయా వర్సిటీల నుంచి విద్యార్థులు

> ప్రతిభతో విదేశీ వర్సిటీల్లో సీట్లు తెచ్చుకున్నప్పటికీ, ఆర్థిక స్తోమత లేక ఆ చదువులకు దూరం కాకూడదనే సంకల్పంతో పేద విద్యార్థులను చేయి పట్టుకుని నడిపించేందుకే రాష్ట్ర ప్రభుత్వం ఈ పథకానికి శ్రీకారం చుట్టింది. మహాత్మాగాంధీ, జవహర్‌లాల్ నెహ్రూ, రాజ్యాంగ నిర్మాత అంబేద్కర్ లాంటి గొప్ప నాయకులు గొప్ప, గొప్ప యూనివర్సిటీల నుంచి వచ్చిన వాళ్లే. నేటి ప్రపంచంలో మెరుగైన స్థానాల్లో ఉన్న ఇండస్ట్రీ లీడర్స్.. మైక్రోసాఫ్ట్ సీఈఓ సత్య నాదెళ్ల, ఐబీఎం సీఈఓ అరవింద కృష్ణ, అడోబ్ సీఈఓ శంతను నారాయణ్, గూగుల్ సీఈవో సుందర్ పిచాయ్, చానల్ సీఈఓ లీనా నాయర్ మొదలు.. బ్రిటీష్ ప్రధాని రిషి సునక్, అమెరికా వైస్ ప్రెసిడెంట్ కమలా హారిస్ వరకు ఎంతో మంది ఉన్నారు. మీరు కూడా ఆ స్థాయిలో కలలను నిజం చేయాలి. అలాంటి లక్ష్యాలను నిర్దేశించుకోవాలి. అందుకోసం అద్భుతమైన వేదికను మీకందిస్తున్నాం. ఆ స్థాయిలోకి మీరు కూడా వెళ్లి దేశ, రాష్ట్ర ప్రతిష్టను పెంచాలి.
>
> – సీఎం వైఎస్ జగన్

▶ మొదటి పేజీ తరువాయి

ఉన్నత విద్యా కోర్సులు అభ్యసించేందుకు అవసరమైన ఆర్థిక సాయం అందించడమే లక్ష్యంగా చేపట్టిన జగనన్న విదేశీ విద్యా దీవెన పథకం అమలుకు శుక్రవారం ఆయన శ్రీకారం చుట్టారు. ఇందులో భాగంగా ఈ ఏడాది టాప్ 200 విదేశీ విశ్వవిద్యాలయాల్లో అడ్మిషన్లు పొందిన 213 మంది విద్యార్థులకు మొదటి విడత సాయంగా రూ.19.95 కోట్లను తన క్యాంప్ కార్యాలయంలో కంప్యూటర్‌లో బటన్ నొక్కి విద్యార్థుల ఖాతాల్లో జమ చేశారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ.. ఈ పథకంలో భాగస్తులైన ప్రతి చెల్లెమ్మ, తమ్ముడు ఉన్నత స్థానంలోకి వెళ్లాలని ఆకాంక్షించారు. ప్రభుత్వం మీపై పెడుతున్న పెట్టుబడితో రేపు మీరు మెరుగైన స్థానానికి వెళ్లినప్పుడు రాష్ట్రాన్ని గుర్తు పెట్టుకోవాలన్నారు. అప్పుడే ప్రపంచ స్థాయిలో మన దేశ, రాష్ట్ర ప్రతిష్ట పెరుగుతుందని చెప్పారు. ఈ కార్యక్రమంలో సీఎం జగన్ ఇంకా ఏమన్నారంటే..

సామాన్యులకు అండగా..

- రూ.1.16 కోట్ల ఫీజుతో కార్నిగీ మిలన్ యూనివర్సిటీ, రూ.కోటి ఫీజుతో యూనివర్సిటీ ఆఫ్ సదరన్ కాలిఫోర్నియా, మాస్టర్స్ ఇన్ హెల్త్ ఇన్‌ఫర్మేటిక్స్, బోస్టన్ యూనివర్సిటీ, రూ.97 లక్షల ఫీజు, రూ.88.70 లక్షల ఫీజుతో హార్వర్డ్ యూనివర్సిటీ.. వీటన్నింటిలో ప్రతిభతో సీటు తెచ్చుకున్నప్పటికీ పేదలు, సామాన్యులు డబ్బులు కట్టలేని పరిస్థితి. ఈ యూనివర్సిటీలో చదవగలమా అన్న పరిస్థితి.
- తల్లిదండ్రుల మీద భారం పెట్టలేక ఎందుకు ఇంత పెద్ద యూనివర్సిటీకి వెళ్లడం.. మనకు స్తోమత లేదు కదా.. అని వెనుకడుగు వేస్తారు. ఇకపై ఆలా పెట్టుబడి పెట్టలేక వెనుకడుగు వేసే పరిస్థితి ఉండకూడదని రాష్ట్ర ప్రభుత్వం మొట్టమొదటి సారిగా మీకు అండగా, తోడుగా నిలిచి అడుగులు వేస్తోంది. రాష్ట్ర ప్రభుత్వం విద్యా రంగం మీద పెట్టుబడి పెట్టే ప్రతి రూపాయి వల్ల ఎన్నో కుటుంబాల తలరాతలు మారడమే కాకుండా ప్రతి ఒక్కరి తలరాత మార్చే గొప్ప పరిస్థితి వస్తుంది.

గత ప్రభుత్వ స్కీం వైట్ వాష్

- విదేశాల్లో చదివించే విషయమై గత ప్రభుత్వంలో ఉన్న స్కీం ఎలా అమలు జరిగేదో చూశాం. అదొక వైట్ వాష్ కార్యక్రమం. కేవలం రూ.10–15 లక్షలకు పరిమితమైన కార్యక్రమం. దీనివల్ల ప్రయోజనం అరకొరే. దీనివల్ల వారికి మంచి జరగదు. కేవలం నీరుగార్చే కార్యక్రమం తప్ప మరో ప్రయోజనం లేదు. 2016–17కు సంబంధించిన బకాయిలను కూడా పిల్లలకు చెల్లించలేదు. దాదాపు రూ.300 కోట్ల బకాయిలు ఇవ్వకపోవడంతో దాదాపు పథకాన్ని ఆపేసే పరిస్థితులు వచ్చాయి. అలాంటి పరిస్థితులు మార్చాలనే ఉద్దేశంతో కొత్త ఆలోచనతో ఇవాళ ఈ పథకాన్ని ప్రారంభిస్తున్నాం.
- ఒకవైపు మన రాష్ట్రంలో స్కూళ్లు, కాలేజీల రూపురేఖలను మారుస్తూ విద్యా ప్రమాణాలను పెంచుతున్నాం. మరోవైపు పిల్లలు చదువుకునేలా అడుగులు వేయిస్తున్నాం. దీంతో పాటు పెద్ద యూనివర్సిటీల్లో మన పిల్లలకు సీట్లు వస్తే.. వారికి తోడుగా నిలవాలన్న ఆలోచనలో నుంచే విదేశీ విద్యాదీవెన పథకం వచ్చింది.

పారదర్శకంగా ఎంపిక

- పారదర్శకంగా టాప్ లిస్ట్‌ను ఎంపిక చేశాం. టాప్ 100 కాలేజీలు అయితే గరిష్ఠంగా రూ.1.25 కోట్ల వరకు సపోర్ట్ చేస్తామని చెప్పాం. టాప్ 100 – 200 వరకు ఉన్న కాలేజీలకు అయితే గరిష్ఠంగా రూ.75 లక్షల వరకు చెల్లిస్తామని చెప్పాం. టాప్ 100 కాలేజీల జాబితాలో 100 శాతం ట్యూషన్ ఫీజు చెల్లిస్తామని గతంలో చెప్పాం. అందుకు అనుగుణంగానే రూ.1.60 కోట్ల ఫీజు కూడా కవర్ చేస్తున్నాం.
- 100 నుంచి 200 వరకు క్యూఎస్ ర్యాంకులు పొందిన వాళ్లలో ఎస్సీ, ఎస్టీ, బీసీ, మైనార్టీ విద్యార్థులకు 100 శాతంతో రూ.75 లక్షల వరకు ఇచ్చాం. ఇవన్నీ పారదర్శకంగా చేపడుతున్నాం. తల్లిదండ్రుల మీద భారం తగ్గేలా మీ కాళ్ల మీద మీరు నిలబడే పరిస్థితి వచ్చేలా అడుగులు వేస్తున్నాం. నాలుగు వాయిదాల్లో ఇస్తున్నాం.
- ఐ–94 వచ్చిన వెంటనే మొదటి వాయిదా ఇస్తాం. మొదటి సెమిస్టర్ ఫలితాల తర్వాత రెండో ఇన్‌స్టాల్‌మెంట్ ఇస్తాం. రెండో సెమిస్టర్ తర్వాత మూడో ఇన్‌స్టాల్‌మెంట్, విజయవంతంగా నాలుగో సెమిస్టర్ పూర్తి చేసి మార్క్స్‌షీట్ అప్‌లోడ్ చేసిన తర్వాత ఫైనల్ చెల్లింపు చేస్తాం. రూ.8 లక్షల వరకు ఆదాయం ఉన్న ఏ కుటుంబానికి అయినా ఈ పథకం వర్తింపజేసే దిశగా అడుగులు వేశాం. రెండు సీజన్లలోనూ వచ్చే అడ్మిషన్లను ప్రోత్సహిస్తూ.. వాళ్లను కూడా ఈ జాబితాలో యాడ్ చేసున్నాం.
- ఇప్పటి వరకు ఈ ఏడాది 213 మంది పారదర్శకంగా ఎంపికయ్యారు. వీరిలో ఎస్సీలు 30 మంది, మైనార్టీలు 35, బీసీలు 35, ఈబీసీలు 67 మంది, కాపులు 46 మంది ఉన్నారు. ఎవరికైనా మంచి ప్రతిభ ఉంటే వారందరికీ మంచి జరగాలని ఈ పథకం పెట్టాం. ఆర్థికంగా దిగువన ఉన్న ఎస్సీ, ఎస్టీ, బీసీ, మైనార్టీలకు గరిష్ఠంగా రూ.1.25 కోట్ల సీలింగ్ పెట్టాం. మిగిలిన వాళ్లకు కూడా టాప్ 100 కాలేజీల జాబితాలో రూ.1 కోటి వరకు సీలింగ్ పెట్టాం. 100–200 కాలేజీల జాబితాలో ఎస్సీ, ఎస్టీ, బీసీ, మైనార్టీలకు రూ.75 లక్షలు, మిగిలిన వాళ్లకు రూ.50 లక్షల వరకు పెట్టాం.

ఏ అవసరం ఉన్నా సిద్ధంగా ఉన్నాం

- ముఖ్యమంత్రి కార్యాలయంలో(సీఎంవోలో) మీకు ఒక ఐఏఎస్ అధికారిని కేటాయిస్తున్నాం. మీకు ఆ అధికారి నంబర్ ఇస్తాం. మీకు ఏ సమస్య ఉన్నా ఒక్క ఫోన్ కాల్ చేసి.. వెంటనే సహాయం తీసుకోవచ్చు. ప్రతి విషయంలో మీకు తోడుగా ఉంటాం. తద్వారా మీరు ఉన్నత స్థాయికి చేరుకోవడానికి చేదోడుగా ఉంటాం. మీ కుటుంబతో పాటు రాష్ట్రానికి కూడా గర్వకారణంగా నిలబడాలి. ఆల్ ది వెరీ బెస్ట్ టు యూ.
- ఈ కార్యక్రమంలో ఉప ముఖ్యమంత్రి (మైనార్టీ సంక్షేమం) షేక్ అంజాద్ బాషా, సాంఘిక సంక్షేమ శాఖ మంత్రి మేరుగ నాగార్జున, బీసీ సంక్షేమం, సాంఘిక సంక్షేమ శాఖ ముఖ్య కార్యదర్శి బి జయలక్ష్మి, మైనార్టీ సంక్షేమ శాఖ కార్యదర్శి ఎఎండి ఇంతియాజ్, ఏపీ ఉన్నత విద్యా మండలి చైర్మన్ ప్రొఫెసర్ కె హేమచంద్రారెడ్డి, కాపు వెల్ఫేర్ అండ్ డెవలప్‌మెంట్ కార్పొరేషన్ ఎండీ జి రేఖారాణి, ఇతర ఉన్నతాధికారులు పాల్గొన్నారు.

అవినాష్‌రెడ్డి కాల్ రికార్డులో సంచలనం ఏముంది?

▶ మొదటి పేజీ తరువాయి

హడావుడి చేస్తున్నారని మండిపడ్డారు. శుక్రవారం ఆయన తాడేపల్లిలోని సీఎం క్యాంపు కార్యాలయం వద్ద మీడియాతో మాట్లాడారు. మాజీ మంత్రి వైఎస్ వివేకానందరెడ్డి మరణించిన అంశాన్ని వైఎస్సార్‌సీపీ అధ్యక్షుడు వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డికి తెలియజేసేందుకు, ఆయన ఇంట్లో పనిచేసే (అటెండర్) నవీన్‌కు ఎంపీ వైఎస్ అవినాష్ రెడ్డి ఫోన్ చేశారని తెలిపారు. ఇందులో తప్పేముందని ప్రశ్నించారు. వైఎస్ వివేకా హత్య కేసులో నవీన్, ఓఎస్డీ కృష్ణమోహన్‌రెడ్డిలను సీబీఐ విచారించడంపై పచ్చ మీడియా దుష్ప్రచారం చేస్తుండటం దారుణం అని ధ్వజమెత్తారు. సజ్జల ఇంకా ఏమన్నారంటే..

ఇందులో కొత్త కోణం ఏముంది?

- వైఎస్ జగన్‌కు సమాచారమిచ్చేందుకు ఫోన్ చేయడం తప్పా? వైఎస్ అవినాష్‌రెడ్డి ఫోన్‌ను ఆ రోజే పోలీసులు చెక్ చేశారు. వైఎస్ జగన్‌తో మాట్లాడేందుకే అవినాష్‌రెడ్డి నవీన్‌కు ఫోన్ చేశారు. ఈ విషయంపై ఎల్లోమీడియా రాద్ధాంతం చేయడం ఎంత వరకు సబబు? ఇందులో సంచలనం ఏముంది? విచారణకు పిలిస్తే నవీన్, ఓఎస్డీ కృష్ణమోహన్‌రెడ్డిలు హాజరయ్యారు. దీంట్లో కొత్త కోణం ఏముంది?
- వైఎస్ అవినాష్‌రెడ్డి జమ్మలమడుగుకు వెళ్తుండగా వివేకానందరెడ్డి బావమరిది శివప్రసాద్‌రెడ్డి ఫోన్ చేస్తే ఆయన వెనుతిరిగివచ్చాడు. ఒకవేళ ఈయన ఫోన్ చేయకపోతే అవినాష్‌రెడ్డి వెనక్కి వచ్చేవారు కాదేమో? ఇందులో ఆయన హస్తం ఉందని ఒక కేస్ బిల్డ్ చేసి, దాన్ని బేస్ చేసుకొని ఇన్నేళ్ల తర్వాత విచారణకు పిలిచినప్పుడు దానికి ముందు, వెనుక కొత్త కోణం ఉందంటూ ప్రచారం చేస్తున్నారు.
- ఇందులో ఫ్యామిలీతో సహా అందరూ ఉన్నట్లు ప్రచారం చేయడం రాజకీయం కాక మరేమవుతుంది? టీడీపీ, చంద్రబాబు చేసే నీచ రాజకీయంలో ఇదొక పార్ట్. రానున్న రోజుల్లో ఇంకా ఎన్ని డ్రామాలు చేస్తారో చూడాలి.

లెటర్ విషయం ఎందుకు దాచిపెట్టారు?

- వివేకానందరెడ్డి మరణించిన వార్త తొలుత వెళ్లింది ఆయన అల్లుడు, ఇంకో బావమరిదికే. అక్కడ ఓ లెటర్ ఉందని, ఆయన మృతిపై అనుమానాలు ఉన్నాయని ఎందుకు దాచిపెట్టారు? అప్పుడే వివేకా అల్లుడు రాజశేఖరరెడ్డి పోలీసులకు ఫోన్ చేసి ఉండవచ్చు కదా? లెటర్ దొరికిందట.. జాగ్రత్తగా ఉండమని శివప్రసాద్‌రెడ్డి చెప్పాలి కదా? ఎందుకు చెప్పలేదు? అసలు ప్రశ్న అక్కడ వేయాలి. ఆయన ఫోన్ చేస్తే అవినాష్‌రెడ్డి వెళ్లారు. దానిపై కథలు కథలు అల్లుతున్నారు.
- మొత్తంగా వైఎస్ జగన్ వద్దకు తీసుకువచ్చేందుకు నవీన్‌కు ఫోన్ చేశారని, కృష్ణమోహన్‌రెడ్డికి ఫోన్ చేశారని లింకులు కలిపే దుర్బుద్ధితో రాజకీయాలు చేస్తున్నారు. ఇందులో ఎవరెవరు సూత్రధారులు ఉన్నారో ప్రజలకు తెలుసు. ఈ కేసు నిలబడదు. ఈ అంశంపై మేం ప్రతిసారి వివరణ ఇవ్వాల్సి వస్తోంది. వైఎస్ జగన్‌పై అక్రమ కేసులు పెట్టినప్పుడు ఆ రోజు సీబీఐ ధోరణి ఎలా ఉందో చూశాం. విచారణకు ఎవరిని పిలవాలో కూడా ఎల్లో మీడియాలో ముందే వచ్చేది. విచారణ చేసే సమయంలో ఏం జరుగుతుందో కూడా కథలు, కథలుగా వచ్చేవి.

కుట్ర పూరితంగా సీఎంపై బురద

- ఇప్పుడు కూడా సీబీఐకి, ఎల్లో మీడియాకు, చంద్రబాబుకు అవే లింకులు ఉన్నాయి. అందుకే దుష్ప్రచారం చేస్తున్నారు. లేనిదాన్నిలాగి కుట్ర పూరితంగా బురద చల్లుతున్నారు. ఈ కేసును అడ్డుపెట్టుకుని 2024 ఎన్నికల్లో జగన్ క్యారెక్టర్‌పై బురద చల్లడానికి కుదురుతుందేమో.. ప్రజల్లో అనుమానాలు తీసుకురావడానికి కుదురుతుందేమో అనే దుర్బుద్ధితో కుట్రలు చేస్తున్నారు.
- ఆకాశంపై ఉమ్మితే వారి ముఖాలపైనే పడుతుంది. గతంలో ఇంతకంటే పెద్దవే చెప్పారు. వాళ్ల ధోరణి, కుట్ర బుద్ధి తెలుసు కాబట్టి ప్రజలు విశ్వసించలేదు. చంద్రబాబు, బీజేపీలోని స్లీపర్ సెల్స్‌పైనే అనుమానాలు ఉన్నాయి.
- ఎల్లో మీడియానే చంద్రబాబుకు అజెండా ఫిక్స్ చేస్తుంటే ఆయన నటిస్తున్నారు. వ్యవస్థను ప్రభావితం చేయడంలో సిద్ధహస్తుడైన చంద్రబాబు ఏవైనా చేయగలరు. అందుకే ఇవాళ్టికీ ఆయనపై ఉన్న కేసుల నుంచి తప్పించుకుంటూ రాజకీయాలు చేస్తున్నారు.

పాశ్చాత్య సంగీతపు పెనుతుఫానుకు
రెపరెపలాడిన శాస్త్రీయ సంగీతానికి
అరచేతులు అడ్డుపెట్టిన ఆ మహా దర్శకుడు
తరలి వెళ్లిపోయాడు.
మావి చిగురు తినగానే పలికే కోయిలను
కోయిల గొంతు వినగానే తొడిగే మావిచిగురును
చూపిన కళాహృదయుడు తన శకాన్ని ముగించాడు.
తెలుగు ముగ్గు తెలుగు సిగ్గు
తెలుగు కట్టు తెలుగు బొట్టు తెలిసిన
తెలుగింటి వనితలు అతను లేక మరి తెరపైకి రారు.
ఒక కీర్తన, తిల్లానా, జావళి, జానపదం
గుండె ఝల్లుమనేలా గజ్జె ఘల్లుమనిపించడం
మళ్లీ చూడగలమా అతడు చూపినట్టుగా!
ఆకలేసినవాడు అమ్మా అని ఎలా అంటాడో
దెబ్బ తగిలినవాడు అమ్మా అని ఎలా అంటాడో
తెలియడం చేతనే భావాల లోతును మనసుకు తాకించాడు.
నరుడి బతుకు నటనే కావచ్చు.
కాని అతణ్ణి తీసుకెళ్లిపోవాలనే ఈశ్వరుడి ఘటన మాత్రం
రస హృదయుడైన తెలుగు ప్రేక్షకుడికి బాధాకరం. క్లేశమయం.



సినిమాకు ఆభరణం

శ్రుతి లయలే జననీ జనకులు కాగా

■ టికెట్లకూ సంతకానికీ లింకు

మద్రాసులో ఒక గవర్నమెంట్ ఆఫీసు.

ఎవరిదో ఫైల్‌ను ఎవరో ఆఫీసరు సంతకం పెట్టాలి. ఎంతకీ పెట్టడు.

'ఎంత కావాలో చెప్పమనండీ' అన్నాడు బాధితుడు.

ప్యూన్ పక్కకు తీసుకెళ్లి చెప్పాడు 'ఆయన డబ్బు తీసుకోడు. స్ట్రిక్టు. శంకరాభరణం టికెట్లు సంపాదించి ఇవ్వగలిగితే ఇవ్వు. పనైపోతుంది'

అప్పటికి నాలుగు వారాలుగా శంకరాభరణం మద్రాసులో తండోపతండాల జనంతో కిటకిటలాడుతోంది.

ఆ టికెట్లు దొరికేవి కావు. ఆ ఫైల్ సంతకం జరిగేదీ లేదు.

■ చంద్రమోహన్‌కు ఆ ప్రాప్తం లేదు

ప్రాప్తం కూడా ఒక మంచిమాటే.

శంకరాభరణంలో నటించినందుకు నిర్మాత ఏడిద నాగేశ్వర రావు నటుడు చంద్రమోహన్‌కు 50 వేలు రెమ్యూనరేషన్ ఇవ్వాలి. సినిమా బిజినెస్ అయితే ఇస్తాడు. బిజినెస్ కాదు. షోల మీద షోలు పడుతున్నాయి. డిస్ట్రిబ్యూటర్లు చూస్తున్నారు. బాగుంది అంటున్నారు. ఎవరూ కొనడం లేదు. ఈ సినిమా రిలీజైతే తప్ప గడ్డం తీయను అని కె.విశ్వనాథ్ గడ్డం పెంచుతున్నాడు. గడ్డం పెరుగుతున్నది తప్ప సినిమా రిలీజ్ కావడం లేదు. ఈలోపు ఏడిదకు ఒక ఆలోచన వచ్చింది. చంద్రమోహన్‌ను పిలిచి 'నీ రెమ్యూనరేషన్ బదులు తమిళనాడు రైట్స్ ఇస్తాను తీసుకో' అన్నాడు. చంద్రమోహన్ అగ్గిమీద గుగ్గిలం అయ్యాడు. 'రిలీజ్ కాని సినిమా నాకు అంటగడతావా. నా డబ్బు నాకు ఇవ్వు' అన్నాడు. కొన్ని రోజులకు తమిళ నటి మనోరమ, తమిళనటుడు సౌందరరాజన్‌తో శంకరాభరణం ప్రివ్యూ చూసింది. సినిమా అయ్యాక ఉద్వేగంతో విశ్వనాథ్ కాళ్ల మీద పడబోయింది. 'ఈ సినిమా ఒక్కరు చూడకపోయినా పర్వాలేదు. నేను కొంటాను' అంది.

కొన్నది. చంద్రమోహన్‌కు ప్రాప్తం లేదు.

■ తపస్సు అలా మొదలైంది

1955లో సత్యజిత్ రే 'పథేర్ పాంచాలి' తీశాడు. భారతదేశంలో పార్లల్ సినిమాకు అంకురార్పణ చేశాడు. సత్యజిత్ రేకు గొప్ప పేరు, ఖ్యాతి దక్కాయి. కాని అది బెంగాలి వాళ్లకు చెల్లింది. హిందీలో కాని, సౌత్‌లో కాని సినిమా వ్యాపార కళ. వ్యాపారం ఎక్కువ, కళ తక్కువ అనుకునే సినిమాలు తీశారు. వినోదం చూపి డబ్బు సంపాదించడమే లక్ష్యం. ఆలోచన, అనుభూతి కృత్రిమ స్థాయి వరకే అంగీకారం. వాస్తవిక వాదంతో సినిమాలు తీసి చేతులు కాల్చుకోవడానికి ఎవరూ సిద్ధంగా లేరు. అందువల్ల సత్యజిత్ రే వేసిన అడుగు పదేళ్ల పాటు బెంగాల్ దాటలేదు. కాని 1973లో ఎం.ఎస్.సత్యు తీసిన 'గరం హవా' వచ్చింది. అభిరుచి ఉన్న ప్రేక్షకులు ఆ సినిమాకు జేజేలు పలికారు. శ్యాం బెనగళ్ ఆ మరుసటి సంవత్సరమే 'అంకుర్' తీశాడు. ఇంకోవైపు తమిళంలో కె.బాలచందర్, తెలుగులో దాసరి నారాయణరావు మిడిల్ క్లాస్ డ్రామాను గట్టిగా పట్టుకున్నారు. 1976లో బాలచందర్ 'అంతులేని కథ' వచ్చింది. అదే సంవత్సరం దాసరి 'ఓ మనిషి తిరిగి చూడు' లాంటి ప్రయోగాత్మక సినిమా తీశారు. అంత వరకు 'శారద', 'జీవన జ్యోతి' వంటి స్త్రీ కథాంశాలపై దృష్టి పెట్టిన కె.విశ్వనాథ్ అంతకు కాస్త అటు ఇటుగా దారి వెతుక్కునే క్రమంలో పడ్డారు. అదే సమయంలో దేశ సంస్కృతిలో వస్తున్న మార్పును చూసి మొత్తుకునే దర్శకులు కూడా వచ్చారు. 1971 లో దేవ్ ఆనంద్ హిప్పీల వేలంవెర్రిని 'హరే రామా హరే కృష్ణ'గా తీశాడు. తెలుగునాట చూస్తే వర్తమానంలో సాంస్కృతిక అకాడెమీలు నామ్ కే వాస్తేగా మారాయి. తెలుగువాడైన మంగళంపల్లి బాలమురళీకృష్ణ మద్రాసులో అస్తిత్వం పొందాల్సి వచ్చింది. వీటన్నింటి ప్రత్యక్ష, పరోక్ష ప్రభావం కె.విశ్వనాథ్ మీద ఉంది. 1976 నాటికి తీసిన 'సిరి సిరి మువ్వ' ఆయనకు దారి చూపింది. 1980లో తీసిన 'శంకరాభరణం' ఏ పునాది మీద తాను సినిమా తీయాలో, ఏ సంస్కృతి పట్ల తనకు అనురక్తి ఉందో, ఏ ప్రాభవాల కోసం తన గుండె కొట్టుకులాడుతుందో ఆయన తెలుసుకున్నారు.

ఇంతవరకూ చేసింది సినిమా రూపకల్పన. ఇక మీదట చేయాల్సింది తపస్సు.

■ ఆ ముగ్గుర్ని నమ్ముకునే...

'శంకరాభరణం' ముహూర్తం రోజున కె.వి.మహదేవన్, పుహళేంది, వేటూరి సుందర రామమూర్తిలను పిలిచి కొత్త బట్టలు పెట్టి 'మిమ్మల్ని నమ్ముకునే ఈ సినిమా తీస్తున్నాను' అన్నాడు విశ్వనాథ్. నిజమే. అంతకు మించి నమ్మకోవడానికి సినిమాలో హీరో లేడు. హీరోయినూ లేదు. శంకరశాస్త్రి పాత్రను వేస్తున్నది నాటకాలు వేసుకునే గవర్నమెంట్ ఆఫీసరు జె.వి.సోమయాజులు. తులసి పాత్రను వేస్తున్నది వేంప్‌గా ముద్రపడిన మంజుభార్గవి. చంద్రమోహన్‌ది సపోర్టింగ్ రోల్. ఎవరిని చూసి ఈ సినిమా కొనాలి? ఎవరిని చూసి ఈ సినిమా ఆడాలి? పై ముగ్గురినే. కె.వి.మహదేవన్, పుహళేంది, వేటూరి సుందరరామమూర్తి... వీరు విశ్వనాథ్ అంచనాని వమ్ము చేయలేదు. 'అద్వైత సిద్ధికి అమరత్వ లబ్ధికి గానమే సోపానము' అని వేటూరి రాస్తే రిక్షా లాగే కార్మికుడు కూడా శాస్త్రీయ సంగీతం ఆస్వాదించేలా కె.వి.మహదేవన్, పుహళేంది పాటలు చేశారు. శాస్త్రీయ సంగీతం పాడాలంటే శాస్త్రీయ సంగీతం తెలిసిన ఏ మంగళంపల్లో కావాలి. కాని స..ప..స..లు నేర్వలేదని చెప్పుకునే బాలసుబ్రహ్మణ్యంతో పాడించారు. భారతీయ కళలు మరపున పడవచ్చు, మసి బారవచ్చు కాని వాటి తేజస్సు జాజ్వల్యమైనది... వాటి ఆధారంగా ఏర్పడిన పరంపరలు, వ్యక్తిత్వాలు, అహంభావాలు ఎవరికీ తల వంచనివి.. ఎవరు ఏం చేసినా అవి ఒక తరం నుంచి మరో తరానికి ఏదో ఒక మూల కొనసాగుతూనే ఉంటాయి... అని 'శంకరాభరణం'లో కె.విశ్వనాథ్ చెప్పారు. మరి జనం చూస్తారా?

■ మొదట ఖాళీ... ఆ తర్వాత కిటకిట

1980 ఫిబ్రవరి 2.

అతి కష్టమ్మీద అతి కొద్ది థియేటర్లలో 'శంకరాభరణం' రిలీజ్ అయ్యింది. నేల, బెంచి, కుర్చీ... ఖాళీ. ఒక దిక్కూ మొక్కూ లేని అమ్మాయి కోసం ఒక మహా విద్వాంసుడు నిలబడ్డాడు. అయిన వారు అతణ్ణి వెలి వేశారు. ఈ కథేదో కొత్తగా ఉందే అనుకున్నారు కొందరు. కాలగమనంలో చితికిపోయిన ఒక గొప్ప కళాకారుడు తన అభిజాత్యం కోల్పోకుండా పోరాడుతున్నాడే... ఇదీ బాగుందనుకున్నారు మరి కొందరు. 'మెరిసే మెరుపులు ఉరిమే ఉరుములు సిరిసిరి మువ్వలు కాబోలు' శివుని ఎదుట నర్తిస్తున్న ఈ నిష్కళంకుడు ఇంతకు ముందు ఏ కథలోనూ కనిపించలేదే. మొదట కుర్చీ నిండింది. తర్వాత బెంచీ నిండింది. తర్వాత నేల కిటకిటలాడింది. ఆ తర్వాతదంతా చరిత్ర.

'ఎంటర్ ది డ్రాగన్' వచ్చి దేశంలో కరాటే స్కూల్స్ తెరిచింది.


'శంకరాభరణం' వచ్చి తెలుగునాట సంగీత పాఠాలను, నృత్యపాఠశాలలను పునరుద్ధరించింది.

■ దొరకునా ఇటువంటి సేవ!

'శంకరాభరణం'లో శంకరాభరణ రాగమే లేదు అని విమర్శించాడు మంగళంపల్లి. కె.విశ్వనాథ్ భావధార పట్ల ఇలాంటివే కొన్ని అభ్యంతరాలు కొందరికి ఉండవచ్చు. కాని సినిమాను ఒక కళగా, దృశ్య శ్రవణ మాధ్యమంగా, రసస్పందన కలిగించే స్థాయిలో తెలుగు ప్రేక్షకులకు చూపిన వాడు కె.విశ్వనాథ్. సినిమాను తపస్సుగా భావించాడు. నిర్వాణ సోపానంగా కూడా.

నీ పద రాజీవముల చేరు
నిర్వాణ సోపానమధిరోహణము చేయు త్రోవ
దొరకునా ఇటువంటి సేవ

బాలూ అలిగితే నటుడయ్యాడు



కె.విశ్వనాథ్ ప్రాథమికంగా నటుడు. కాని దాసరి లాగా విశ్వనాథ్ తన సినిమాల్లో పాత్రలు చేయలేదు. బాలూ వల్ల చేయాల్సి వచ్చింది. 'శుభ సంకల్పం' సినిమాకు ఎస్.పి.బాలసుబ్రహ్మణ్యం నిర్మాత. గొల్లపూడి, విశ్వనాథ్ కలిసి స్క్రిప్ట్ తయారు చేశారు. కమల హాసన్ హీరో. హీరోయిన్‌గా ఆమని. స్క్రిప్ట్ రాసేటప్పుడే ఫలానా పాత్రకు ఫలానా అని రఫ్‌గా భావిస్తూ రాసుకున్నారు– ఒక్క రాయుడు పాత్రకు తప్ప. అది సినిమాలో కమలహాసన్‌కు యజమాని పాత్ర. సరే... స్క్రిప్ట్‌ను బాలూకు చదివి వినిపించే రోజు వచ్చింది. విశ్వనాథ్ స్వయంగా చదివి వినిపిస్తూ ఒక సన్నివేశంలో రాయుడు ఎలా ఆవేదన చెందుతాడో గాద్గదికంగా చదివి వినిపించారు. బాలూకు ఆ పాత్రలో విశ్వనాథే కనిపించారు. గొల్లపూడికి చెప్తే ఆయన కూడా వత్తాసు పలికాడు. అదే ప్రస్తావన విశ్వనాథ్ దగ్గర తెస్తే 'నేనేమిటి... నటించడం ఏమిటి' అని తిరస్కరించారు. నటించాల్సిందే అని బాలు పట్టుపట్టాడు. నటించను అని విశ్వనాథ్ గట్టిగా చెప్పేశారు. బాలు అలిగి స్క్రిప్ట్ ఫైల్ విసిరి కొట్టి అలా అయితే సినిమానే చేయను అని వెళ్లిపోయాడు. చివరకు విశ్వనాథ్ బాలు కోరికను మన్నించారు. 'శుభ సంకల్పం' విడుదల తర్వాత హఠాత్తుగా తెలుగు వెండితెరకు మరో కేరెక్టర్ ఆర్టిస్టు దొరికినట్టయ్యింది.



సతీమణి జయలక్ష్మితో విశ్వనాథ్



చిరంజీవితో కె.విశ్వనాథ్ కుటుంబ సభ్యులు

శుభలేఖ

పంద్దొమ్మిదేళ్లకే విశ్వనాథ్‌కి పెళ్లయింది. రెండు పెళ్లి చూపులకు వెళ్లారు. ఒకటి ఆయన మేనమామ తెచ్చిన పెళ్లి సంబంధం. అప్పటికే చెన్నైలో ఉంటున్న విశ్వనాథ్ ఆ సంబంధం కోసం తెనాలి వెళ్లారు. కానీ కుదర్లేదు. ఆ తర్వాత రెండో పెళ్లి సంబంధం కోసం చెన్నై వెళ్లి, అక్కడ జయలక్ష్మిని చూశారాయన. ఆ సంబంధం ఖాయం అయింది. అప్పటికి జయలక్ష్మికి 14 సంవత్సరాలు. చిన్న వయసులో అత్తింట్లో అడుగుపెట్టిన జయలక్ష్మి ఇంటి బాధ్యతలను సక్రమంగా నిర్వర్తించారు. ఇద్దరు ఆడపడుచులు, అత్తమామలు, వచ్చే పోయే బంధువులతో జయలక్ష్మికి క్షణం తీరిక ఉండేది కాదు. పైగా విశ్వనాథ్ చేసినవి ఎక్కువగా రిస్కీ ప్రాజెక్ట్స్ కాబట్టి నిర్మాతల దగ్గర పారితోషికం ఇంత కావాలని డిమాండ్ చేయలేకపోయారు. పెద్ద స్థాయిలో పారితోషికం కూడా వచ్చేది కాదు. దీంతో దర్శకుడిగా మారిన పదేళ్ల తర్వాతే కారు కొనగలిగారు. అలాగే ఫలానా నగ బాగుందని భర్తతో జస్ట్ అనేవారు కానీ ఏనాడూ నాకిది కావాలని జయలక్ష్మి అడిగింది లేదు. 'ప్రతి మగాడి విజయం వెనక ఓ స్త్రీ ఉంటుందంటుటారు. నా విజయం వెనక నా భార్య జయలక్ష్మి ఉంది. సినిమా పనులతో నేను బిజీగా ఉన్నప్పటికీ కుటుంబ బాధ్యతలను తనే చూసుకుంది. ఒక్కమాటలో చెప్పాలంటే నా తరపు బంధువులందరూ నాకన్నా ఎక్కువగా తననే అభిమానిస్తుంటారు. అంత ఆప్యాయంగా జయలక్ష్మి వారిని చూసుకుంటుంది' అని భార్య గొప్పతనం గురించి పలు సందర్భాల్లో చెప్పారు విశ్వనాథ్. భర్తని అర్థం చేసుకున్న జయలక్ష్మి, భార్యని అర్థం చేసుకున్న భర్తగా ఈ దంపతుల వైవాహిక జీవితం ఆనందంగా సాగింది.

కె. విశ్వనాథ్ తెరకెక్కించిన చిత్రాల్లో కొన్ని టైటిల్స్‌తో ఆయన వ్యక్తిగత జీవిత విశేషాలు ఈ విధంగా...

శంకరాభరణం



శంకరుడు అంటే శివుడు అని ప్రత్యేకంగా చెప్పక్కర్లేదు. విశ్వనాథ్ సినిమాల్లో దాదాపు శివుడి మీద ఏదో ఒక పాట ఉంటుంది. మరి.. విశ్వనాథుడు శివభక్తుడా? అంటే... ఆయనకు దైవభక్తి ఎక్కువే. ఏదో ఒక పవర్ ఉంటుందనే నమ్మకం ఆయనది. విశ్వనాథ్ సినిమాల్లోకి వచ్చాక శివుడి పాట ఉండటం అనేది యాదృచ్ఛికంగా జరిగినదే. అనుకోకుండా ఆ సినిమాలో శివుడికి సంబంధించిన పదమో, సందర్భమో రావడం అనేది భగవదేచ్ఛ అని, కావాలని ప్రయత్నించినది కాదని విశ్వనాథ్ ఓ సందర్భంలో పేర్కొన్నారు. అంతెందుకు 'ఉండమ్మా బొట్టుపెడతా' సినిమాలో మొట్టమొదటి పాటను 'శ్రీ'తో మొదలుపెట్టమని దేవులపల్లి కృష్ణశాస్త్రిని విశ్వనాథ్ అడిగారు. దేవులపల్లి ఏమో 'శ్రీశైలం మల్లన్న, శిరసొంచెనా, చేనంతాగంగమ్మ వాన' అని రాశారు. విశ్వనాథ్ 'శ్రీ'తో రాయమని అడిగారే తప్ప శివుడి మీద రాయమని అడగలేదు. అయినా శివుడి మీద పాట వచ్చేసింది. ఇక చిన్నప్పుడు శివాలయానికి వెళ్లేవారు విశ్వనాథ్. ఆ సమయంలో ఒక వ్యక్తి మాస్కు వేసుకుని జడిపిస్తే, మూడు రోజులు జ్వరంతో పడుకున్నారు. అలా తెలిసీ తెలియని వయసు నుంచీ సినిమాల్లోకి వచ్చాక, ఆ తర్వాత కూడా విశ్వనాథ్ జీవితంలో శివుడు ఉన్నాడని అర్థమవుతోంది.

అమ్మ మనసు

తల్లిదండ్రులను మించిన దైవం లేదంటారు. విశ్వనాథ్‌ది కూడా సేమ్ ఫీలింగ్. ఇష్ట దైవం ఎవరంటే తన తల్లిదండ్రుల గురించి చెప్పేవారు. అమ్మానాన్నలు చేసిన పుణ్యం, పూజలే ఫలించాయని, కాపాడాయన్నది విశ్వనాథ్ నమ్మకం. కళాతపస్వి తండ్రి కాశీనాథుని సుబ్రహ్మణ్యంకు జ్యోతిష్యం బాగా వచ్చు. అయితే కొడుకు తీసిన ఏ సినిమాకీ ముహూర్తం పెట్టలేదాయన. సినిమా అనేది ఊహకందని వ్యాపారం కాబట్టి తానో ముహూర్తం పెట్టించి, సినిమా ఆడకపోతే 'ఆయన అనవసరంగా చెప్పారు' అంటారనే మాట అనిపించుకోవడం ఇష్టంలేక కొడుకు సినిమాలకు ముహూర్తం పెట్టలేదు. స్వతహాగా మితభాషి అయిన సుబ్రహ్మణ్యం తనయుడి విజయాలకు లోలోపల ఆనందించేవారు. తన పుస్తకాల్లో 'శంకరాభరణం ఈరోజున ఈ నక్షత్రం, ఈ ఘడియల్లో రష్ చూశాను. దీనికి ఈ యోగం ఉంది' అని రాసుకున్నారు. ఇలా తనయుడి సినిమాల గురించి రాసుకున్నారు. ఇక విశ్వనాథ్ తల్లి సరస్వతి అయితే తనయుడి విజయాలను ఆస్వాదించేవారు. సాధారణంగా కోడలు ఇంటికొచ్చాక ఇంటి పరిస్థితి కాస్త మారుతుంది. అయితే కొడుకు మనసు ఎరిగిన తల్లిగా సరస్వతి కోడలిని బాగా చూసుకున్నారు.

చెల్లెలి కాపురం

విశ్వనాథ్‌కి ఇద్దరు చెల్లెళ్లు. పెళ్లయి, చెన్నై వడపళనికి మకాం మార్చినప్పుడు తన తల్లిదండ్రులతో పాటు చెల్లెళ్లను కూడా తీసుకెళ్లారు విశ్వనాథ్. ఆ చెల్లెళ్లు తమకు పెళ్లయ్యేంత వరకూ అన్నా వదిన దగ్గరే ఉన్నారు. తోడబుట్టినవాళ్లను అత్తగారింటికి పంపించాక కూడా వారి బాగోగులను చూసుకున్నారు. వాళ్ల శ్రీమంతాలు, కాన్పులు కూడా చెన్నైలోనే. సోదరుడు తండ్రితో సమానం అంటారు. విశ్వనాథ్ తన చెల్లెళ్లకు ఒక తండ్రిలానే ఉన్నారు. అయితే ఆయన సతీమణి జయలక్ష్మి సహకారం లేకపోతే ఇది సాధ్యం అయ్యేది కాదు. విశ్వనాథ్ తన సినిమాలతో తీరిక లేకుండా ఉంటే.. ఆడపడుచులను చూసుకున్నారు జయలక్ష్మి. అలాగే చెల్లెళ్లనే కాదు.. తన మేనల్లుళ్లు, మేనకోడళ్లను కూడా బాగా చూసుకున్నారు విశ్వనాథ్. చివరికి వాళ్ల పిల్లలు కూడా వీళ్ల ఇంట్లోనే ఉండి, చదువుకోవడం విశేషం.

స్వాతిముత్యం

'స్వాతిముత్యం'లో శివయ్య (కమల్‌హాసన్ పాత్ర పేరు) అమాయకుడు. చిన్నపిల్లల మనస్తత్వం ఉన్నవాడు. మరి.. చిన్నప్పుడు విశ్వనాథ్ ఎలా ఉండేవారు అంటే.. మహా అల్లరి. విజయవాడలో చదువుతుండగా కాలువ దాటి స్కూల్‌కి వెళ్లాల్సి వచ్చేది. వీళ్ల ఇంటి ఎదురుగానే కాలువ ఉండేది. వేసవికాలం వచ్చేటప్పుడు కొంచెం నీళ్లే ఉండటంతో బ్రిడ్జి మీద నుంచి కాకుండా ఫ్రెండ్స్‌తో కలిసి, కాలువలోంచే నడుచుకుంటూ వెళ్లేవారు. అయితే ఇంట్లోవాళ్లకి చెబితే తిడతారని భయం. నిక్కర్లు పైకి మడుచుకుని కాలువలో దిగిన విశ్వనాథ్‌ని చూసిన ఆయన మేనమామ కూతురు ఇంట్లో విషయం చెప్పేసింది. అంతే.. విశ్వనాథ్ తండ్రి అక్కడికి వెళ్లి 'రేయ్' అని అరిచారు. ఆ భయానికి విశ్వనాథ్ చేసిన పనులన్నీ నీళ్లలోనే కలిసిపోయాయి (ఓ సందర్భంలో విశ్వనాథ్ నవ్వుతూ చెప్పిన విషయం). అంతే.. పరిగెత్తుకుంటూ లోపలికి వెళ్లిన కొడుకుని 'రాస్కెల్' అని, బట్టలు మార్చుకోమన్నారు విశ్వనాథ్ తండ్రి. ఇక ఆ తర్వాత ఆ కాలువ వైపు వెళ్లలేదు. అలాగే చిన్నప్పుడు తండ్రి మూడు చక్రాల సైకిలు కొనిపెడితే, దాన్నే మెర్సిడెస్ బెంజ్‌గా ఫీలయి, టింగుటింగుమంటూ బెల్లుకొట్టుకుంటూ వెళ్లేవారు విశ్వనాథ్.

స్వయంకృషి



కె. విశ్వనాథ్‌ను ఇంజినీర్ చేయాలనుకున్నారు ఆయన తల్లిదండ్రులు. ఆయనకు మాత్రం సంగీతం పై మక్కువ ఎక్కువ. బీఎస్సీ పూర్తి చేశాక తండ్రి అనుమతితో చెన్నై వాహినీ స్టూడియోలో సౌండ్ రికార్డిస్ట్‌గా చేరారు. ఇప్పటిలా అప్పట్లో ఎక్కువగా డబ్బింగ్ స్టూడియోలు ఉండేవి కావు. దీంతో లొకేషన్‌లోనే ఆర్టిస్టుల మాటలను రికార్డ్ చేయవలసి వచ్చేది. సంభాషణలు సరిగ్గా పలకడం తెలియని నటీనటులకు దగ్గరుండి డైలాగులు నేర్పించారు విశ్వనాథ్. 'సౌండ్ రికార్డిస్ట్'గా నిజాయతీగా చేసిన పని ఆయన్ను సెకండ్ యూనిట్ డైరెక్టర్‌గా ఎదిగేలా చేసింది. దర్శకుడు ఆదుర్తి సుబ్బారావు దగ్గర దర్శకత్వ శాఖలో చేసినప్పుడు విశ్వనాథ్ పని తీరు చాలామంది దృష్టిలో పడింది. అలా అక్కినేని నాగేశ్వర రావు 'ఆత్మగౌరవం'తో దర్శకుణ్ణి చేశారు. అప్పట్నుంచి చివరి సినిమా 'శుభప్రదం' వరకూ రాత్రీ పగలూ తేడా లేకుండా పని చేసిన రోజులే ఎక్కువ. ఆయన స్వయంకృషియే విశ్వనాథ్‌ని తెలుగు పరిశ్రమ శిఖరాగ్రాన నిలిచేలా చేసింది.

శుభప్రదం

దాదాపు 75 సంవత్సరాలు సినిమాలే లోకంగా జీవించారు విశ్వనాథ్. ఇక కుటుంబానికి సమయం కేటాయించాలని దర్శకుడిగా సినిమాలకు దూరంగా ఉండటం మొదలుపెట్టారు. అప్పుడప్పుడూ నటుడిగా మాత్రం చేశారు. సినిమాలు తగ్గించాక ఆయన లైఫ్‌స్టయిల్ ఎలా సాగిందంటే.. ఉదయాన్నే నిద్ర లేవడం.. అల్పాహారం, భార్యతో కబుర్లు చెప్పుకోవడం, గడిచిన జీవితంలోని మధుర జ్ఞాపకాలను ఓసారి స్ఫురణకు తెచ్చుకుని హ్యాపీగా ఫీలవ్వడం... ఇలానే విశ్వనాథ్ దినచర్య సాగుతుండేది. టీవీల్లో వచ్చే వంటల కార్యక్రమాలను చూసేందుకు ఇష్టపడేవారు విశ్వనాథ్. జయలక్ష్మికి ఏమో ప్రవచనాలు వినడం ఇష్టం. ఉదయం పదకొండు గంటల వరకూ ఆవిడ ఆ కార్యక్రమాలు చూసేవారు. ఆ తర్వాత రిమోట్ విశ్వనాథ్ చేతికి దక్కేది. ఇక అప్పుడు ఆయన వంటల ప్రోగ్రామ్స్ చూసేవారు. ఇలా కాలక్షేపం చేశారు. విశ్వనాథ్, జయలక్ష్మి దంపతులకు ఇద్దరు కుమారులు, ఒక కుమార్తె ఉన్నారు. పెద్ద కుమారుడికి ఇద్దరు అబ్బాయిలు కాగా, చిన్న కుమారుడికి ఇద్దరు అమ్మాయిలు. ఆయన అల్లుడు, కుమార్తె చెన్నైలో ఉంటారు. వీరికి ఓ పాప. మనవళ్లు, మనవరాళ్లతో హాయిగా గడిపారు విశ్వనాథ్. వయోభారం కారణంగా చిన్న చిన్న ఆరోగ్య సమస్యలు మినహా ఆయన పెద్దగా ఇబ్బంది పడిందిలేదు. విశ్వనాథ్ దర్శకత్వంలో వచ్చిన చివరి చిత్రం 'శుభప్రదం'. ఆయన వృత్తి జీవితం, వ్యక్తిగత జీవితం కూడా సంపూర్ణం.. శుభప్రదమే. ప్రశాంతంగా వెళ్లిపోయారు కళాతపస్వి.



మీ ఫ్యామిలీ బడ్జెట్ వేశారా?

ప్రతి సంవత్సరం ఫిబ్రవరి, మార్చి వచ్చే సరికి ప్రభుత్వాలు బడ్జెట్ పై కసరత్తు చేస్తుంటాయి. అది పెద్దస్థాయి కదా మనకెందుకులే అని వదిలేయద్దు. ఎందుకంటే, ఖర్చు ఎక్కడ పెట్టాలి..? ఎక్కడ తగ్గించుకోవాలి..? ఎంత మొత్తం పొదుపు చేయాలి..? వీటన్నింటికంటే ముందు ఆదాయం ఎంత? అన్న అంశాలపై అవగాహన ప్రతి కుటుంబానికీ కూడా ఉండాలి. అదే బడ్జెట్ ప్లానింగ్. మొన్న కేంద్ర బడ్జెట్ విడుదలైంది. ఇప్పుడు మన ఫ్యామిలీ బడ్జెట్ వంతు వచ్చింది. ఏమంటారు?

నెలవారీ జీతాలతో లేదా స్వయం ఉపాధితో జీవనం సాగించే వారికి నెలవారీ బడ్జెట్ ప్లానింగ్ అత్యవసరం. మనకు వచ్చేదెంత? అందులో మనం దేనికి, ఎంత ఖర్చుపెట్టాలి..? ఎక్కడ ఆదా చేయాలి..? అన్న అంశాలపై అవగాహన ఉంటే ఇంటి నిర్వహణ సులువు అవుతుంది. బడ్జెట్ ప్లానింగ్ ఉంటే మీ నెలవారీ ఖర్చులను సులభంగా నిర్వహించుకోవచ్చు.

అత్యవసర పరిస్థితి కోసం కొంత మొత్తం

జీవితంలో పరిస్థితులు ఎప్పుడు ఎలా ఉంటాయో తెలియదు. అందుకే కొంత మొత్తాన్ని అత్యవసర పరిస్థితుల్లో వినియోగించుకోవడానికి వీలుగా.. మీ చేతికి వస్తున్న సంపాదనలో 20 నుంచి 30 శాతం వరకూ పొదుపు చేయడం మంచిది. ఒకవేళ ఇంత మొత్తంలో చేయలేకపోయినా.. అవకాశం ఉన్న మేరకు పక్కన పెట్టాలని పెద్దల సలహా.

కుటుంబ సభ్యుల ఆమోదం:

ఫలానా దానికి ఇంత మొత్తం ఖర్చు పెట్టాలి అని మీరు ఒక గట్టి నిర్ణయం తీసుకున్న తర్వాత దానికి ఇంట్లోని ప్రతి ఒక్కరూ కట్టుబడి ఉండాలి. అలా ఉండాలంటే ముందుగా మీరు చేయాల్సింది... నెలవారీ బడ్జెట్ ప్లానింగ్ కోసం కుటుంబ సభ్యులందరినీ కూర్చోబెట్టి వివరించాలి. రాబడి, ఖర్చుల విషయాలను అందరితో చర్చించాలి. అప్పుడు వారికి కూడా అవగాహన ఏర్పడి, ఖర్చులు తగ్గించుకునే అవకాశం ఉంటుంది.

వృథాను అరికట్టాలి

మనం పొదుపు చేయాలి అంటే కుటుంబంలో అనవసర ఖర్చులను తగ్గించుకోవాలి. ఏది అవసరం, ఏది అనవసరం అనే అవగాహన ఉండాలి. ముఖ్యంగా వృథా ఖర్చులను తగ్గించాలి. సరుకులు లేదా వస్తు సామగ్రిని ఎక్కువెక్కువ తెచ్చుకోవడం, ఇష్టం వచ్చినంత వండటం, పారెయ్యటం వల్ల ఎంతో డబ్బు వృథా అవుతుంది. అందువల్ల అట్లాంటి వృథాకు అడ్డుకట్ట వేయాలి.

క్రెడిట్ కార్డుతో జాగ్రత్త..

క్రెడిట్ కార్డు ఉన్నది అత్యవసర సమయంలో ఉపయోగపడటానికి మాత్రమే అని గుర్తుంచుకోవాలి. చేతిలో కార్డు ఉంది కదా అని విచ్చలవిడిగా ఖర్చుపెట్టకూడదు. మీ నెలవారీ రాబడిని అంచనా వేసుకొని అప్పుడు మాత్రమే కార్డును వినియోగించాలి.

పొదుపు పథకాల్లో..

ఇలా ప్రతి నెలా బడ్జెట్ ప్లానింగ్ చేసుకొని ఆదా చేసిన సొమ్మును ఖతాలో అలా ఉంచకుండా.. మార్కెట్ రిస్క్ లేని పెట్టుబడి పథకాలు అంటే గోల్డ్, రియల్ ఎస్టేట్ వంటి వాటిల్లో పెట్టుబడులు పెట్టాలి. అప్పుడు దీర్ఘకాలంలో మంచి రాబడులు వచ్చే అవకాశం ఉంటుంది.

ఎప్పటికప్పుడు అప్‌డేట్ చేసుకోవాలి..

మీ బడ్జెట్‌ను నెలవారీ రివ్యూ చేసుకోవాలి. ఏమైనా మార్పులు అవసరం అయితే కచ్చితంగా ఆయా మార్పులు చేసుకోవాలి. ఇందుకోసం మీ కుటుంబ సభ్యుల అభిప్రాయం తీసుకోవాలి. కచ్చితంగా పెట్టవలసిన ఖర్చును పక్కన పెట్టి.. ఇంకా ఏమైనా ఆదా చేసుకునే మార్గం ఉందేమో చూడాలి.



పొదుపు ఎంత ఉండాలి?

ఇది కాస్త క్లిష్టమైన ప్రశ్నే. పొదుపు చేయాలంటే ముందు మన ఆదాయాన్ని అంచనా వేసుకోవాలి. ఎందుకంటే, ఆదాయాన్ని బట్టి పొదుపు శాతం పెరుగుతూ, తరుగుతూ ఉంటుంది. అయితే, ఆదాయంతో సంబంధం లేకుండా, సాధారణ కుటుంబ ఖర్చులు మినహా మరే విధమైన అదనపు ఖర్చులూ లేకుండా ఉంటే పొదుపు ఎంత ఉండాలో చెప్పడానికి కొన్ని సూత్రాలు...

ప్రతి మనిషి కనీసం ఆరునెలల జీతం లేదా ఆదాయాన్ని నగదు రూపంలో దాచుకోవాలి. ఒకవేళ ఒకేసారి అలా దాచుకోలేని వారు నెలనెలా కొంత పక్కన పెడుతూ ఎమర్జెన్సీ ఫండ్ ఏర్పాటు చేసుకోవాలి. కుటుంబ ఖర్చుకు సమానమైన ఆదాయం లేదా అంతకంటే తక్కువ ఆదాయం ఉన్న దిగువ మధ్యతరగతి వారు తమ ఆదాయంలో ఐదు నుంచి పది శాతం పొదుపు చేయాలి. పొదుపు చేయడానికి మిగలక పోయినా ఆదాయాన్ని పెంచుకోవడం ద్వారానో, ఖర్చును తగ్గించుకోవడం ద్వారానో కచ్చితంగా పొదుపు చేయాలి. నెలవారీ సగటు కుటుంబ ఖర్చు కంటే ఎక్కువ ఆదాయాన్ని ఆర్జించేవాళ్లు నెలనెలా 25 శాతం పొదుపు చేయాలి. ఒకవేళ భార్యాభర్తలిద్దరూ సంపాదిస్తుంటే భర్త ఇంటి ఖర్చులు పెడతారు కాబట్టి భార్య 50 శాతం పొదుపుచేయాలి. అధికాదాయ వర్గాలు అయితే కుటుంబ ఆదాయంలో సగం పొదుపుకు మళ్లించాలి. భవిష్యత్తులో ఆదాయం పొరపాటున తలకిందులైతే ఎలాంటి విపత్కర పరిస్థితి వచ్చినా ఇలా చేసిన పొదుపు ఆదుకుంటుంది.

పొదుపు మార్గాలు కొన్ని...

- అవసరం లేకుండా డిస్కౌంట్లలో వచ్చే వస్తువులు కొనద్దు.
- అవసరానికి ముందే ఏ వస్తువులనూ కొనుగోలు చేయకండి.
- నిర్దిష్ట తేదీల్లోపు బిల్లులు చెల్లించండి. దీని కోసం బిల్స్ పే క్యాలెండర్ తయారు చేసుకోవాలి.
- మీ బ్యాంకు ఖాతాలు ప్రతి నెల చివరన చూసుకోండి. వృథా ఖర్చులు తెలుస్తాయి. వృథా ఖర్చుల జాబితా రాయండి. ప్రతినెలా ఎంత వృథా పోతుందో తెలిస్తే ఆటోమేటిక్‌గా అప్రమత్తత పెరుగుతుంది.



- ఏ వస్తువు కొనాలన్నా ఇంటర్నెట్ ద్వారా వివిధ మాల్స్/దుకాణాల్లో వాటి ధరల తేడాలు చూసి ఎక్కడ తక్కువో అక్కడ కొనండి. ఎందుకంటే ప్రతి డీలరు వేర్వేరు ధరలపై వస్తువులను అమ్ముతారు.

చివరగా ఒక మాట... మీ బడ్జెట్ ఎంత పకడ్బందీగా ఉంటే భవిష్యత్తు అంత భద్రంగా ఉంటుందని గుర్తు పెట్టుకోండి. అదేవిధంగా మీ పిల్లలకు కూడా ఇప్పటినుంచే పొదుపు చేయడాన్ని అలవాటు చేయండి. వారికి ఇచ్చే పాకెట్ మనీతో వారికి కావలసిన వాటిని ఎలా కొనుక్కోవాలో నేర్పించండి. అప్పుడే మీరు పర్‌ఫెక్ట్ ఫైనాన్స్ మేనేజర్ లేదా నిపుణులైన హోమ్ మినిస్టర్ అవుతారు. ఇంతవరకు మీరు బడ్జెట్ వేసుకోకపోతే ఇప్పుడైనా వేయండి.

• ఒళ్లు నొప్పులు

పెయిన్ కిల్లర్స్ వద్దు.. ఇంటి చిట్కాలే ముద్దు



ఉరుకుల పరుగుల జీవితంలో మన జీవన శైలి సరిగ్గా లేకపోవడం, సరైన ఆహారపు అలవాట్లు లేకపోవడం, సమయపాలన పాటించకపోవడం వంటి అనేక కారణాలు మనల్ని అనేక రకాల అనారోగ్య సమస్యలకు గురిచేస్తున్నాయి. అందులో ఒళ్ళు నొప్పులు ఒకటి. ఉదయం నుంచి పని చేసి సాయంత్రం ఇంటికి వెళ్లేసరికి ఒళ్ళు నొప్పులు, కాళ్ల నొప్పులతో బాధపడే వాళ్లే ఎక్కువమంది ఉంటున్నారు. ఇక ఈ క్రమంలో ఒళ్ళు నొప్పులు, కాళ్ల నొప్పులకు పెయిన్ కిల్లర్స్ కాకుండా నేచురల్ రెమెడీస్ తో ఉపశమనం పొందడం ఎలాగో తెలుసుకుందాం.



ఒళ్ళు నొప్పులతో బాధపడే వాళ్ళు పసుపు, వేడి పాలు రాత్రి పడుకోబోయే ముందు ప్రతి రోజు తాగడం అలవాటు చేసుకుంటే ఉపశమనం దొరుకుతుందని పెద్దలు చెబుతున్నారు. పసుపు యాంటీబయాటిక్‌గా పనిచేస్తుంది. దీంతో ఒళ్ళు నొప్పులకు చెక్ పెట్టినట్టు అవుతుంది. అదేవిధంగా అంగుళం పొడవున్న అల్లం ముక్కను కడిగి, పొట్టు తీసి దంచాలి. దానిని నీళ్లలో వేసి మరిగించాలి. ఆ నీటిని వడకట్టి అందులో స్పూన్ తేనె కలుపుకుని తాగితే ఒళ్ళు నొప్పుల నుండి ఉపశమనం లభిస్తుందని అనుభవజ్ఞుల సలహా.



గ్లాసు గోరువెచ్చని నీటిలో చెంచాడు ఆపిల్ సైడర్ వెనిగర్ కలిపి, రుచికి తగ్గట్టు తేనె కలిపిన తర్వాత తాగితే నొప్పుల నుండి ఉపశమనం కలిగిస్తుందని వైద్యుల సలహా.

విపరీతంగా ఒళ్ళు నొప్పులు ఉన్నవాళ్లు బెల్లాన్ని తినడం వల్ల వ్యాధి నిరోధక శక్తి మెరుగుపడి నొప్పులు కాస్త తగ్గుతాయి.

ఇక ఉప్పును వేడి చేసి ఓ వస్త్రంలో ఉంచి నొప్పి ఉన్నచోట కాపడం పెట్టినా నొప్పి నుంచి ఉపశమనం లభిస్తుంది.

కప్పు ఆవనూనెలో నాలుగు లవంగాలు, వెల్లుల్లి వేసి మరిగించి, గోరువెచ్చగా అయాక నొప్పి ఉన్న ప్రదేశంలో ఆ నూనె రాసి మసాజ్ చేస్తే మంచి ఫలితం ఉంటుందని ఆయుర్వేదం చెబుతోంది.

పెయిన్ కిల్లర్స్ బదులు నాచురల్ రెమెడీస్ ఫాలో అయితే మంచిది. ఇతరత్రా అనారోగ్య సమస్యలు రాకుండా ఉంటాయని నిపుణులు, అనుభవజ్ఞులు చెబుతున్నారు.

• హెల్త్ టిప్స్

పొట్ట కొలెస్ట్రాల్, బెల్లీ ఫ్యాట్ సమస్యలతో బాధపడేవారు తప్పకుండా పెరుగును ఆహారంలో తీసుకోవాల్సి ఉంటుంది. ఎందుకంటే ఇందులో ఉండే గుణాలు శరీరంలో ప్రోబయోటిక్స్ పరిమాణాలను తగ్గించి అనారోగ్య సమస్యల నుంచి సులభంగా ఉపశమనం కలిగిస్తుంది.

ముఖ్యంగా శరీర బరువు సమస్యలతో బాధపడే వారు తప్పకుండా డైట్‌లో పెరుగును చేర్చుకోవాల్సి ఉంటుంది. ఓట్ మీల్‌ను కూడా ప్రతి రోజూ ఆహారంలో తీసుకుంటే సులభంగా బరువు తగ్గొచ్చని ఆరోగ్య నిపుణులు తెలుపుతున్నారు. ఇలా ప్రతి రోజూ డైట్‌ను అనుసరించడం వల్ల సులభంగా పొట్ట చుట్టూ కొలెస్ట్రాల్ సులభంగా తగ్గుతుంది. అంతే కాకుండా అనారోగ్య సమస్యల నుంచి సులభంగా ఉపశమనం లభిస్తుంది.





• మీకు తెలుసా

60 ఏళ్ల పైబడినవారు రోజూ 6 వేల నుంచి 9 వేల అడుగులు నడిస్తే గుండెకు మంచిదని అమెరికాలోని యూనివర్సిటీ ఆఫ్ మసాచుసెట్స్ పరిశోధకులు అధ్యయనంలో వెల్లడైంది. పక్షవాతం ముప్పు 40–50% తగ్గుతుందని తేలింది. 42 దేశాల్లోని 18 ఏళ్ల పైబడిన 20,152 మంది డేటాను వారు విశ్లేషించారు. ఆరేళ్లపాటు వీరు నడుస్తున్న దూరం, వారిలో కార్డియోవాస్కులార్ డీసీజ్, స్ట్రోక్, హార్ట్ ఫెయిల్యూర్ వంటి అంశాలను పరిశీలించి ఈ నివేదికను బయటపెట్టారు. అయితే పెద్దవాళ్లు ఒకేసారి అన్నేసి వేల అడుగులు నడవడం కష్టం కదా అనుకోవద్దు. ఎందుకంటే సుమారు కిలోమీటరు నడిస్తే చాలు మీరు ఐదారువేల అడుగులు వేసినట్లే. ఎక్కువ దూరాలు నడవలేనివారు కనీసం పెరట్లో లేదా బాల్కనీలో లేదా డాబా మీద అయినా నాలుగు అడుగులు వేస్తూ ఉండాలి.



కిడ్నీలో స్టోన్స్ రావటానికి ఆహార అలవాట్లతో పాటు నీరు తక్కువగా తాగడం ప్రధాన కారణం. అయితే అలా కిడ్నీలో రాళ్లు ఉన్నప్పుడు నాన్ వెజ్ జోలికి అస్సలు వెళ్లొద్దు. ఎందుకంటే దీనిలో ఉండే ప్యూరిన్ వల్ల శరీరంలో యూరిక్ యాసిడ్ స్థాయి పెరుగుతుంది. ఫలితంగా రాళ్ల పరిమాణం పెద్దగా అవుతుంది. అలాగే కాల్షియం అధికంగా ఉండే పాలకూర, టమాట తినవద్దు. పాల ఉత్పత్తులు, జంక్ ఫుడ్, కూల్ డ్రింక్స్‌కు దూరంగా ఉండాలి.

కళాతపస్వి కె.విశ్వనాథ్‌కి ప్రముఖుల నివాళి

కె. విశ్వనాథ్ భౌతిక కాయాన్ని పలువురు సినీ, రాజకీయ ప్రముఖులు సందర్శించి నివాళులు అర్పించారు. మరికొందరు సోషల్ మీడియా వేదికగా తమ సంతాపం తెలియజేశారు.



• వెంకయ్య నాయుడు, తలసాని శ్రీనివాస యాదవ్, కోట శ్రీనివాసరావు, చంద్రమోహన్, బ్రహ్మానందం, విశ్వనాథ్ పెద్ద కుమారుడు నాగేంద్రనాథ్, సురేష్‌బాబు, చిరంజీవి, ఏడిద రాజా, ఎస్పీ శ్రీరామ్, అల్లు అరవింద్, విశ్వనాథ్ అల్లుడు

కళాత్మక చిత్రాలకు చిరునామాగా నిలిచిన విశ్వనాథ్‌గారు రచయిత, దర్శకుడు, నటుడిగా బహుముఖ ప్రజ్ఞ ప్రదర్శించారు. అత్యున్నత దాదాసాహెబ్ ఫాల్కే అవార్డు, పద్మశ్రీ పురస్కారాలతోపాటు అనేక అవార్డులు సాధించిన ఆయన మృతి తెలుగు చిత్ర పరిశ్రమకు తీరని లోటు.
– విశ్వభూషణ్ హరిచందన్, ఆంధ్రప్రదేశ్ గవర్నర్

* * *

కళాతపస్వి కె. విశ్వనాథ్‌గారు పేరుకు తగ్గట్టే సినిమా కోసం తపస్సులాగా పని చేశారు. ఆయన తీసిన సినిమాలన్నీ భావితరాల వాళ్లు చూసి మన సంస్కృతి, సంప్రదాయాలు నేర్చుకునేలాగా ఉంటాయి. విశ్వనాథ్‌గారి దర్శకత్వంలో పని చేయక పోయినా, ఆయనతో కలిసి 'వజ్రం' సినిమాలో నటించాను.
– రోజా, ఆంధ్రప్రదేశ్ మంత్రి, నటి

* * *

ఇండియన్ ఫిల్మ్ హిస్టరీలో చాలా ముఖ్యమైన, ప్రధాన స్థానంలో ఉన్న డైరెక్టర్ కె. విశ్వనాథ్‌గారు. అలాంటి ఆయన దేవుని పాదాల సన్నిధికి వెళ్లారని తెలిసి నాకు బాధ కలిగింది. **– ఇళయరాజా**

* * *

స్వయానా మా పెదనాన్న కొడుకు ఆయన. మద్రాస్‌లో 25ఏళ్ల పాటు పక్కపక్కన ఇళ్లల్లో ఉన్నాం. నేను నటుడిగా ఎదగడానికి మైలురాయిగా నిలిచిన 'సిరి సిరి మువ్వ, సీతామాలక్ష్మి, శంకరాభరణం, శుభోదయం, ఓ సీత కథ' వంటి ఎన్నో సినిమాలు మా కాంబినేషన్‌లో చేసినందుకు గర్వంగా ఉంది. కజిన్స్ అయిన మా ముగ్గురిలో నేను నటుడిగా, ఎస్పీ బాలసుబ్రహ్మణ్యం గాయకునిగా, విశ్వనాథ్‌గారు డైరెక్టర్‌గా 1966లో ఇండస్ట్రీకి పరిచయమయ్యాం. ఆయన లేని లోటు చిత్ర పరిశ్రమకు, మా కుటుంబానికి తీరనిది.
– చంద్రమోహన్



• విశ్వనాథ్ సతీమణి జయలక్ష్మిని పరామర్శిస్తున్న చిరంజీవి

విశ్వనాథ్‌గారు జీవిత పరమార్థాన్ని, కళ సజీవమైనదని పూర్తిగా అర్థం చేసుకున్న గొప్ప వ్యక్తి. అందువల్లే జీవితకాలం దాటినా ఆయన కళకు గుర్తింపు ఉంటూనే ఉంటుంది. **– కమల్ హాసన్**

* * *

విశ్వనాథ్‌గారి దర్శకత్వంలో నటించడం నా అదృష్టం. 'ఇంద్ర' సమయంలో వారణాసికి పిలవడంతో వచ్చారు. ఆయన తన చేత్తో స్వయంగా అన్నం తినిపించిన గొప్ప వ్యక్తి. నాకు తండ్రిని పోగొట్టుకున్నంత బాధగా ఉంది. **– చిరంజీవి**

* * *

మరపురాని సినిమాలు, పాత్రలతో విశ్వనాథ్‌గారు చిరస్థాయిగా గుర్తుండిపోతారు. విశ్వనాథ్‌గారి వారసత్వం భవిష్యత్ తరాలకు ఎంతో స్ఫూర్తి. **– నాగార్జున**

* * *

పాత తరమే కాదు.. నేటి జనరేషన్ కూడా ఆయన చేసిన సేవల్ని గుర్తు చేసుకుంటాయి.
– వెంకటేశ్

* * *

విశ్వనాథ్‌గారి మరణ వార్త విని బాధపడ్డాను. ఆయన కుటుంబ సభ్యులకు నా ప్రగాఢ సానుభూతి. **– మోహన్‌బాబు**

* * *

ఈశ్వర్' సినిమా ('స్వాతిముత్యం' హిందీ రీమేక్) షూటింగ్ చేస్తున్నప్పుడు మీతో సెట్‌లో ఉండటాన్ని ఒక దేవాలయంలో ఉన్న అనుభూతి చెందాను. **– అనిల్ కపూర్**

* * *

మన సంస్కృతిని, సినిమాని అందంగా ఒకచోట చేర్చిన మేధావి కె. విశ్వనాథ్‌గారు. **– మహేశ్‌బాబు**

తెలుగు సినిమా ఖ్యాతిని ఖండాంతరాలుగా వ్యాపింపజేసిన వారిలో విశ్వనాథ్‌గారిది ఉన్నతమైన స్థానం. **– ఎన్టీఆర్**



• కె. విశ్వనాథ్ పార్థివ దేహం

* * *

మనం ఒక లెజెండ్‌ని కోల్పోయాం. మా అందరి హృదయాల్లో, కళల్లో మీరు ఎప్పటికీ నిలిచి ఉంటారు. **– రామ్‌చరణ్**

* * *

విశ్వనాథ్‌గారు మనల్ని వదిలి వెళ్లినా ఆయన మాస్టర్ పీసెస్ ఎప్పటికీ నిలిచి ఉంటాయి..
– అల్లు అర్జున్

* * *

విశ్వనాథ్‌గారి సినిమాల్లో నేను నటించాను. భారతీయ చలన చిత్రాల్లో విరబూసిన కమలం ఆయన. **– బ్రహ్మానందం**

* * *

ప్రపంచంలో ఎవరైనా 'మీ తెలుగు సినిమా గొప్పదనం ఏంటి?' అని అడిగితే.. మాకు కె. విశ్వనాథ్‌గారు ఉన్నారని గర్వంగా చెప్పుకుంటాం. తెలుగు చిత్ర పరిశ్రమ మిమ్మల్ని ఎప్పటికీ మర్చిపోలేదు. సినిమా గ్రామర్‌లో మీరు నేర్పిన పాత్రలకు జీవితాంతం రుణపడి ఉంటాం సార్.
– ఎస్ఎస్ రాజమౌళి

* * *

విశ్వనాథ్‌గారు ప్రతి సినిమా చివరిలో కళ కొనసాగుతూనే ఉంటుందంటారు. అలాగే ఆయన మరణం కూడా ముగింపు కాదు. ఆయన తాలూకు కళావారసత్వానికి కొనసాగింపు అనుకుంటున్నాను. **– త్రివిక్రమ్**

ఓ గురువుగా 'సిరి సిరి మువ్వ' నుంచి 'సాగర సంగమం' వరకు నాకు నటనలో నడక నేర్పించారు. తెలుగు జాతి గర్వించేలా 'స్వాతిముత్యం, స్వాతి కిరణం, సిరి సిరి మువ్వ, సాగర సంగమం' వంటి ఎన్నో ఆణిముత్యాల్లాంటి సినిమాలు తీశారాయన.
– రాధిక

* * *

రెండేళ్ల క్రితం ఒక బ్రదర్‌ని (ఎస్పీ బాలసుబ్రహ్మణ్యం) పోగొట్టుకున్నా.. ఇప్పుడు మరో బ్రదర్‌ని (విశ్వనాథ్) పోగొట్టుకున్నా. మంచి విషయాలు, తెలియని విషయాలు చెప్పే పెద్దవాళ్లు ఎవరూ మాకు ఇప్పుడు లేరు. విశ్వనాథ్‌గారు నాతో అద్భుతమైన పాటలు పాడించారు. మేమంతా చెన్నైలో పక్కపక్కన ఇళ్లల్లోనే ఉండేవాళ్లం. ప్రతిరోజూ ఆయన వాకింగ్ చేసుకుంటూ మా ఇంటికి వచ్చి, కాఫీ తాగి వెళ్లేవారు.
– ఎస్పీ శైలజ

* * *

గత ఏడాది సినీ రంగం నుంచి విశ్వనాథ్‌గారికి, నాకు 'వైఎస్ఆర్ జీవిత సాఫల్య పురస్కారం'ను సీఎం జగన్ మోహన్ రెడ్డిగారు అందించారు. విశ్వనాథ్‌గారు దర్శకత్వం వహించిన 'నేరము శిక్ష' చిత్రంలో జూనియర్ ఆర్టిస్ట్‌గా చేసిన నేను ఆయనతో పాటు అవార్డు అందుకోవడం అదృష్టంగా భావిస్తున్నాను.
– ఆర్. నారాయణమూర్తి

విశ్వనాథ్‌గారు తన చిత్రాల ద్వారా సామాజిక మార్పుకోసం ప్రయత్నించడం ఆయన గొప్పతనాన్ని తెలుపుతాయి.
– కేతిరెడ్డి జగదీశ్వరరెడ్డి



• రాజమౌళి, కీరవాణి, ఎ.కోదండరామిరెడ్డి, ఆర్. నారాయణమూర్తి, వెంకటేశ్, జీవిత, రాజశేఖర్, రాధిక

సినిమా


వివిధ సందర్భాల్లో 'సాక్షి'కి కె. విశ్వనాథ్ ప్రత్యేక ఇంటర్వ్యూలు ఇచ్చారు. ఆ ఇంటర్వ్యూల్లోని కొన్ని పదనిసలు ఈ విధంగా...

■ **సినిమా టైటిల్స్‌లో 'ఎస్' సెంటిమెంట్ ఎందుకు?**

విశ్వనాథ్: సినిమా వాళ్ళం పిరికి వాళ్ళమండీ! కోట్ల రూపాయలతో వ్యాపారం చేస్తాం కదా... భయాలు, సెంటిమెంట్లు ఎక్కువ! 'ఎస్'తో పెట్టిన రెండు సినిమాలు వరుసగా హిట్ కావడంతో అలా పెట్టుకుంటూ వచ్చాను.

■ **మరి 'ఆపద్బాంధవుడు' దగ్గర ఆ రిస్క్ ఎందుకు తీసుకున్నారు?**

బాగా గుర్తు... ఓరోజు 'ఏ టైటిల్ అయితే బావుంటుంది ఈ సినిమాకు?' అనుకుంటుండగా... క్యారెక్టర్‌కి తగ్గట్టుగా అయితే 'ఆపద్బాంధవుడు' బాగుంటుందన్నాను. అందరూ ఓకే అన్నారు. మరి ఎందుకని ఆ రోజు ఆ 'ఎస్' సెంటిమెంట్ మైండ్ నుంచీ స్లిప్ అయిందో నాకిప్పటికీ అర్థం కావట్లేదు.



■ **మీరు పాటలు కూడా రాసేవారట...**

సందర్భం వచ్చింది కాబట్టి చెబితే తప్పులేదేమో! నేను స్క్రిప్ట్ రాస్తున్నప్పుడే సిట్యుయేషన్‌కి తగ్గ పాట–లిరిక్ రాసుకుంటాను. దానికి నేను 'అబద్ధపు సాహిత్యం' అని పేరుపెట్టాను. అలా ఫ్లోలో రాసి, తర్వాత సినిమాలో ఉంచేసిన పల్లవులెన్నో – 'స్వాతిముత్యం'లో 'వటపత్రసాయికి...', 'శ్రుతిలయలు'లో 'తెలవారదేమో స్వామీ...', 'స్వాతికిరణం'లో 'తెలిమంచు కరిగింది...' – అలా... చాలానే ఉన్నాయి.

■ **మరి పాటంతా మీరే రాయొచ్చుగా?**

కొన్ని రాశాను... 'స్వరాభిషేకం'లో 'కుడి కన్ను అదిరెను...' పాట పూర్తిగా నేనే రాశాను. అయితే పేరు వేసుకోలేదు.

■ **రాసింది చెప్పుకోవడంలో తప్పేముందండీ**

ఏమో, చెప్తే నమ్ముతారో లేదో జనాలు!

■ **మిమ్మల్ని నమ్మకపోవడమా!**

అలా అని కాదు... నాకసలు పబ్లిసిటీ ఇచ్చుకోవడం ఇష్టం ఉండదు. (నవ్వుతూ) ఏదో పెళ్ళిచూపులకెళ్తే 'ఆయన పెట్టుకున్న ఉంగరం కూడా నాదే!' అని ఎవరో అన్నట్టు... 'ఫలానా సినిమాలో ఫలానా పాటకు పల్లవి నేనే రాశాను' అని ఏం చెప్పుకుంటాను చెప్పండి?

■ **మీ కుటుంబం నుంచి ఎవ్వరూ సినిమా ఫీల్డ్‌కి రాకపోవడానికి కారణం?**

నేనే ప్రోత్సహించలేదు. వాళ్లు ఇక్కడ రాణిస్తారనే నమ్మకం నాకు లేదు. ఈ రోజుల్లో పైకి రావడమంటే చాలా కష్టం. మా రోజులు వేరు. ప్రతిభను గుర్తించే మనుషులు అప్పుడు చాలామంది ఉండేవారు. డబ్బుల విషయంలోనూ, పేరు ప్రఖ్యాతుల విషయంలోనూ ఇక్కడో అనిశ్చితి ఉంది. అందుకే మా పిల్లల్ని బాగా చదివించి వేరే రంగాల్లో స్థిరపడేలా చేశాను.

■ **విశ్వనాథ్ వారసులుగానైనా ఓ గుర్తింపు వచ్చేదేమో?**

నా గౌరవ మర్యాదలన్నీ నా బిడ్డలకు ట్రాన్స్‌ఫర్ కావాలనే రూలేమీ లేదిక్కడ. ఎవరికి వాళ్లే ప్రూవ్ చేసుకోవాలి. నాలాగా మా పిల్లల్ని కూడా డైరెక్టర్లు చేయాలనుకుని నేను సొంతంగా డబ్బులు పెట్టి సినిమాలు తీయలేను కదా. అంత డబ్బు కూడా నేను సంపాదించలేదు. మా పిల్లలు ఫలానా కంపెనీలో మేనేజర్లుగా పని చేస్తున్నారని నేను గర్వంగానే చెప్పుకోగలను.

■ **మ్యారేజ్ డే లాంటివి జరుపుకుంటారా?**

భార్యాభర్తల మధ్య తప్పనిసరిగా ఉండాల్సింది పరస్పర నమ్మకం. ప్రేమ, గౌరవం మన హృదయాంతరాళంలో నుంచి రావాలి. అంతేకాని, ప్రత్యేకించి ఫాదర్స్ డే, మదర్స్ డే, ప్రేమికులదినం, వైవాహిక దినం – అని ఏడాదికి ఒకరోజే మొక్కుబడిగా చేసుకోవడంలో అర్థం లేదు.

■ **ఒక్కోసారి భోజనం కూడా మరచిపోయేవారట కదా?**

సినిమా రూపకల్పనలో ఉండగా ఒక్కొక్కప్పుడు గాఢంగా సంగీత, సాహిత్య చర్చల్లో మునిగిపోతే – అసలు టైమే తెలిసేది కాదు. భోజన వేళ దాటిపోతోందని ఎవరైనా గుర్తు చేస్తే కానీ గుర్తొచ్చేది కాదు.

■ **సినిమా ఇండస్ట్రీ అంతా ఓ పోకడలో కొట్టుకుపోతూ, ప్రవాహంలో వెళ్తున్న టైమ్‌లో అడ్డుకట్ట వేసి మళ్లీ మీరు దాన్ని వెనక్కి తెచ్చారనే భావన మీ అభిమానుల్లో ఉంది...**

నిజమే. 'పాశ్చాత్య సంగీతపు పెను తుఫానులో రెపరెపలాడుతున్న సత్సంప్రదాయ సంగీతపుజ్యోతిని కాపు కాయడానికి తన చేతులు అడ్డు పెట్టినవారందరికీ పాదాభివందనం చేస్తున్నా' అని 'శంకరాభరణం'లో శంకరశాస్త్రి డైలాగ్ చెబుతాడు. నేను అలా చేశానని నాకు పాదాభివందనం చేయమని కాదు. అభిమానుల అభిప్రాయాన్ని నేను ఒప్పుకుంటాను. ఇప్పటికీ ఒప్పుకోకపోతే నేను మూగవాణ్ణి అయిపోతా. నా బుద్ధి మేరకు నేను నిజంగానే చేశాను. క్లాసికల్ మ్యూజిక్, డ్యాన్స్ పెట్టి సినిమాలు చేస్తే ఎవరు ఆదరిస్తారు? ఇది కమర్షియల్ ఆర్ట్ కదా? మీ సినిమాలకు డబ్బు వస్తుందా? నిర్మాత ఏమవుతాడు? అన్నదానికి విరుద్ధంగా ప్రజలు ఇచ్చిన తీర్పు చాలా గొప్పది. దాని ఫలితమే నాకు వచ్చిన అవార్డులు... ఈ రోజు (దాదా ఫాల్కే వచ్చిన సందర్భంగా..) వచ్చిన దాదా సాహెబ్ ఫాల్కే అవార్డు కూడా!

సాక్షి బిజినెస్
శనివారం
4-2-2023

స్టాక్ మార్కెట్లు

దేశీ సూచీలు		
సెన్సెక్స్ ▲	910	60,842
నిఫ్టీ ▲	244	17,854

మరిన్ని బిజినెస్ వార్తల కోసం 'సాక్షి ప్లస్' చూడండి

విదేశీ సూచీలు (శుక్రవారం రాత్రి 11.30 గంటలకు)			
నాస్‌డాక్	12,168	▽	32
డోజోన్స్	34,117	▲	63
ఎఫ్‌టీఎస్‌ఈ 100	7,902	▲	82
డాక్స్	15,477	▽	33
షాంఘై	3,263	▽	22
నికాయ్	27,509	▲	107

•అమెరికా •బ్రిటన్ •జర్మనీ •చైనా •జపాన్

బులియన్ రూ.ల్లో

ముంబై	
బంగారం (24 క్యారట్)	56,730
బంగారం (22 క్యారట్)	54,030
వెండి (కిలో)	76,000

ఫారెక్స్ రేట్లు రూ.ల్లో

			కొనుగోలు	అమ్మకం
$	యూఎస్ డాలర్	ఒకటికి	81.41	83.08
£	బ్రిటన్ పౌండ్	ఒకటికి	88.03	91.16
€	యూరో	ఒకటికి	98.76	102.13
¥	జపాన్ ఎన్ (100)	ఒకటికి	62.98	65.05
AUS$	ఆస్ట్రేలియా డాలర్	ఒకటికి	56.94	59.33
S$	సింగపూర్ డాలర్	ఒకటికి	61.69	63.75
SAR	సౌదీ రియాల్	ఇంటర్‌బ్యాంక్	20.24	22.01
UAE D	యూఏఈ దిర్హామ్	ఇంటర్‌బ్యాంక్	21.31	23.07
¥	చైనా యువాన్	ఇంటర్‌బ్యాంక్	10.26	12.85

జోయాలుక్కాస్ వాలెంటైన్స్‌డే ఆఫర్

హైదరాబాద్: వాలెంటైన్స్ డే సందర్భంగా ప్రముఖ వజ్రాభరణాల సంస్థ జోయాలుక్కాస్ జ్యువెలరీ ప్రత్యేక ఆఫర్లు ప్రకటించింది. తన సుప్రసిద్ధ ''బీ మెయిన్'' కలెక్షన్ పరంపరలో కొత్త శ్రేణి డిజైన్లను మార్కెట్లోకి విడుదల చేసింది. రోజ్ గోల్డ్, ఎల్లో గోల్డ్, డైమండ్‌తో రూపొందించిన హార్ట్-థీమ్‌డ్ జ్యువెలరీ రింగులు, లాకెట్లు, పెండెంట్లు, బ్రాస్‌లెట్లను అందుబాటులో ఉంచింది. ఆఫర్‌లో భాగంగా వజ్రాలపై 25% డిస్కౌంట్‌ను పొందవచ్చు. ఫిబ్రవరి మూడో తేదీన మొదలైన ఈ ప్రత్యేక ఆఫర్ 14వ తేదీ వరకు కొనసాగుతుంది. కస్టమర్లంతా ఈ అవకాశాన్ని సద్వినియోగపరుచుకోవాలని గ్రూప్ ఎండీ జాయ్ అలుక్కాస్ తెలిపారు.

పర్యావరణ పరిరక్షణకు వీమార్ట్ శ్రీకారం

ముంబై: ప్రముఖ ఫ్యాషన్ రిటైలర్ వీమార్ట్ దేశవ్యాప్తంగా 20 లక్షల మొక్కలు నాటే కార్యక్రమానికి శ్రీకారం చుట్టింది. తమ ఉత్పత్తులు, ప్రక్రియలు, సాంకేతికత రూపంలో పర్యావరణ పరిరక్షణకు కట్టుబడి ఉన్నట్లు తెలిపింది. సీఎస్ఆర్ కార్యక్రమం కింద పర్యావరణ పరిరక్షణ, సామాజికాభివృద్ధిపై ప్రధాన దృష్టి సారించామని పేర్కొంది. వాతావరణ మార్పుల సమస్యలకు దీర్ఘకాలం పాటు పెద్ద మొత్తంలో మొక్కలు నాటడం పరిష్కారమని కంపెనీ ఎండీ లలిత్ అగర్వాల్ తెలిపారు.

కోడిగుడ్లు (హోల్‌సేల్-నెక్ / 100కు రూ.ల్లో)

4-2-2023	
విశాఖ	460-00
చిత్తూరు	473-00
ఈస్ట్, వెస్ట్ గోదావరి	445-00
విజయవాడ	445-00
రిటైల్ ధర (డజను)	72.00
3-2-2023 ఫామ్ ధర...	
హైదరాబాద్	426-00
వరంగల్	428-00
రిటైల్ ధర	4.85

వారాంతాన భారీ లాభాలు

- ఒడిదుడుకుల ట్రేడింగ్ నుంచి ఉపశమనం
- బ్యాంకింగ్, ఫైనాన్స్, ఆటో షేర్ల మద్దతు
- ఒకటిన్నర శాతం ర్యాలీ చేసిన సూచీలు
- సెన్సెక్స్ 973 పాయింట్లు ప్లస్
- 17,850 స్థాయిపైకి నిఫ్టీ



ముంబై: కొంతకాలంగా తీవ్ర ఒడిదుడుకులకు లోనైన స్టాక్ సూచీలు ఎట్టకేలకు శుక్రవారం భారీ లాభాలను ఆర్జించగలిగాయి. బ్యాంకింగ్, ఫైనాన్స్, ఆటో షేర్లు రాణించడంతో ఒకటిన్నర శాతం లాభపడ్డాయి. సెన్సెక్స్ ఉదయం 418 పాయింట్లు పెరిగి 60,350 వద్ద మొదలైంది. నిఫ్టీ 112 పాయింట్లు పెరిగి 17,722 వద్ద ట్రేడింగ్‌ను ప్రారంభించాయి. ఉదయమే ఉత్సాహంగా ప్రారంభమైన సూచీలు మిడ్ సెషన్ తర్వాత మరింత జోరును కనబరిచాయి. ఒక దశలో 973 పాయింట్లు బలపడి 60,905 వద్ద, నిఫ్టీ 244 పాయింట్లు దూసుకెళ్లి 17,854 వద్ద ఇంట్రాడే కనిష్టాలను నమోదు చేశాయి. చివరికి సెన్సెక్స్ 910 పాయింట్ల లాభంతో 60,842 వద్ద, నిఫ్టీ 244 పాయింట్లు పెరిగి 17,854 వద్ద స్థిరపడ్డాయి. ఫార్మా, రియల్టీ, మెటల్, మీడియా షేర్లు అమ్మకాల ఒత్తిడికి లోనయ్యాయి. బ్యాంకింగ్ వ్యవస్థ పటిష్టంగా ఉందంటూ కేంద్ర మంత్రి వ్యాఖ్యలతో ప్రభుత్వ, ప్రైవేట్ రంగ బ్యాంక్ షేర్లకు డిమాండ్ నెలకొంది. విదేశీ ఇన్వెస్టర్లు రూ.932 కోట్ల షేర్లను అమ్మేయగా, సంస్థాగత ఇన్వెస్టర్లు రూ.1265 కోట్ల షేర్లను కొన్నారు. డాలర్ మారకంలో రూపాయి విలువ 34 పైసలు బలపడి 81.86 స్థాయి వద్ద స్థిరపడింది. ప్రపంచ మార్కెట్లు లాభాల్లో ట్రేడయ్యాయి. సూచీలు 1.5% లాభంతో బీఎస్ఈలో రూ.1.లక్షకోట్ల సంపద సృష్టి జరిగింది. దీంతో బీఎస్ఈ కంపెనీల మొత్తం మార్కెట్ విలువ రూ.266.73 లక్షల కోట్లకు చేరింది.

లాభాలు ఎందుకంటే...: అదానీ గ్రూప్ గురించి కొన్ని సానుకూల సంకేతాలు రావడంతో ఇన్వెస్టర్లకు ఊరటనిచ్చింది. ఫెడ్ రిజర్వ్ వడ్డీరేట్ల సైకిల్ ఈ ఏడాదితో ముగియవచ్చనే అంచనాలు ప్రపంచ ఈక్విటీ మార్కెట్లలో సానుకూలతలు నింపాయి. భారతీయ ఫైనాన్షియల్ మార్కెట్‌కు ఢోకా లేదని ఆర్థిక మంత్రి సీతారామన్ వ్యాఖ్యలు మార్కెట్ వర్గాలకు ఉత్సాహాన్నిచ్చాయి.

అదానీ గ్రూప్‌లో 4 కంపెనీల షేర్లు అప్

ఫ్రెంచ్ ఎనర్జీ దిగ్గజం టోటల్ ఎనర్జీ సంస్థ సానుకూల సపోర్టుతో అదానీ గ్రూప్‌లోని పది కంపెనీలకు గానూ 4 కంపెనీల షేర్లు లాభాలతో గట్టెక్కాయి. ఇంట్రాడేలో 35 శాతం నష్టపోయిన ఏడాది కనిష్టానికి(రూ.1,017) పతనమైన అదానీ ఎంటర్‌ప్రైజెస్ షేరు కోలుకుని 1.25% లాభంతో 1,584 వద్ద స్థిరపడింది. అదానీ పోర్ట్స్ 14.51%% నష్టపోయి రూ.395 వద్ద 52 వారాల కనిష్టాన్ని తాకింది. బౌన్స్‌బ్యాక్ ర్యాలీతో ఎనిమిదిశాతం లాభపడి రూ.499 వద్ద నిలిచింది. అంబుజా సిమెంట్స్, ఏసీసీ సిమెంట్స్ షేర్లు వరుసగా 6%, 4% చొప్పున లాభపడ్డాయి. అదానీ ట్రాన్స్‌మిషన్స్(10%), అదానీ గ్రీన్ ఎనర్జీ(10%), అదానీ పవర్(10%), అదానీ విల్మార్(5%), అదానీ టోటల్(5%), ఎన్‌డీటీవీ(5%) షేర్లు లోయర్ సర్క్యూట్ తాకాయి.

ఎస్‌బీఐ లాభం జూమ్

- క్యూ3లో రూ. 15,477 కోట్లు
- అదానీ రుణాలతో సమస్యల్లేవు

న్యూఢిల్లీ: ప్రభుత్వ రంగ దిగ్గజం స్టేట్ బ్యాంక్ ఆఫ్ ఇండియా(ఎస్‌బీఐ) ప్రస్తుత ఆర్థిక సంవత్సరం (2022-23) మూడో త్రైమాసికంలో ప్రోత్సాహకర ఫలితాలు సాధించింది. కన్సాలిడేటెడ్ ప్రాతిపదికన అక్టోబర్- డిసెంబర్(క్యూ3)లో నికర లాభం 62 శాతం జంప్‌చేసి రూ. 15,477 కోట్లను తాకింది. స్టాండెలోన్ నికర లాభం సైతం రూ. 8,432 కోట్ల నుంచి రూ. 14,205 కోట్లకు ఎగసింది. రుణ నాణ్యతతోపాటు, వడ్డీ ఆదాయం మెరుగుపడటం ఇందుకు సహకరించింది. మొత్తం ఆదాయం రూ. 78,351 కోట్ల నుంచి రూ. 98,084 కోట్లకు పురోగమించింది. అయితే నిర్వహణ వ్యయాలు రూ. 20,839 కోట్ల నుంచి రూ. 24,317 కోట్లకు పెరిగాయి. మొండి రుణాలకు ప్రొవిజన్లు సగానికి తగ్గి రూ. 1,586 కోట్లకు పరిమితమయ్యాయి.

ఎన్‌పీఏలు తగ్గాయ్

క్యూ3లో ఎస్‌బీఐ స్థూల మొండిబకాయిలు(ఎన్‌పీఏలు) 4.50 శాతం నుంచి 3.14 శాతానికి తగ్గాయి. నికర వడ్డీ ఆదాయం 24 శాతం పుంజుకుని రూ. 38,069 కోట్లయ్యింది. ఇతర ఆదాయం రూ. 8,673 కోట్ల నుంచి రూ. 11,468 కోట్లకు ఎగసింది. నికర వడ్డీ మార్జిన్లు 0.35 శాతం బలపడి 3.5 శాతానికి చేరాయి. దాదాపు 19 శాతం రుణ వృద్ధి నమోదైంది. అదానీ గ్రూప్‌నకు రూ. 27,000 కోట్ల రుణాలిచ్చినట్లు వెల్లడించింది. అయితే రుణ చెల్లింపుల్లో ఎలాంటి సమస్యలూ తలెత్తలేదని స్పష్టం చేసింది. తాజా స్లిప్పేజీలు రూ. 2,334 కోట్ల నుంచి రూ. 3,098 కోట్లకు పెరిగాయి. కనీస మూలధన నిష్పత్తి 13.27 శాతంగా నమోదైంది.




డిపాజిట్ల సమీకరణలో తీవ్రపోటీ నేపథ్యంలో 8 శాతం వృద్ధిని సాధించాం. డిపాజిట్లను పెంచుకునేందుకు పలు చర్యలను తీసుకున్నాం. రూ. 3 లక్షల కోట్లకుపైగా విలువైన ప్రభుత్వ సెక్యూరిటీలను కలిగి ఉన్న నేపథ్యంలో రేట్ల పోటీకి తెరతీయబోము. – దినేష్ ఖారా, చైర్మన్, ఎస్‌బీఐ.

ఫలితాల నేపథ్యంలో ఎస్‌బీఐ షేరు బీఎస్‌ఈలో 3.2 శాతం జంప్‌చేసి రూ. 544 వద్ద ముగిసింది.

ఐటీసీ లాభం రూ. 5,070 కోట్లు

షేరుకి రూ. 6 డివిడెండు



న్యూఢిల్లీ: ఎఫ్ఎంసీజీ, డైవర్సిఫైడ్ దిగ్గజం ఐటీసీ లిమిటెడ్ ప్రస్తుత ఆర్థిక సంవత్సరం(2022-23) మూడో త్రైమాసికంలో పటిష్ట ఫలితాలు సాధించింది. కన్సాలిడేటెడ్ ప్రాతిపదికన అక్టోబర్-డిసెంబర్(క్యూ3)లో నికర లాభం 23 శాతం జంప్‌చేసి రూ. 5,070 కోట్లను అధిగమించింది. గతేడాది(2021-22) ఇదే కాలంలో రూ. 4,119 కోట్లు మాత్రమే ఆర్జించింది. మొత్తం ఆదాయం దాదాపు 4 శాతం వృద్ధితో రూ. 19,021 కోట్లకు చేరింది. గత క్యూ3లో రూ. 18,366 కోట్ల టర్నోవర్ ప్రకటించింది. అయితే మొత్తం వ్యయాలు 3 శాతంపైగా తగ్గి రూ. 12,772 కోట్లకు పరిమితమయ్యాయి. వాటాదారులకు షేరుకి రూ. 6 చొప్పున మధ్యంతర డివిడెండు ప్రకటించింది.

విభాగాలవారీగా..

క్యూ3లో సిగరెట్లుసహా మొత్తం ఎఫ్ఎంసీజీ విభాగం టర్నోవర్ 17 శాతం వృద్ధితో రూ. 12,935 కోట్లకు చేరింది. దీనిలో సిగరెట్ల ఆదాయం 16 శాతం ఎగసి రూ. 8,086 కోట్లను తాకింది. ఇతర ఎఫ్ఎంసీజీ నుంచి 18 శాతం అధికంగా రూ. 4,849 కోట్లు సమకూరింది. హోటళ్ల ఆదాయం 49 శాతం జంప్‌చేసి రూ. 739 కోట్లను దాటగా, గోధుమలు, బియ్యం ఎగుమతులపై ఆంక్షల కారణంగా అగ్రిబిజినెస్ 36 శాతం క్షీణించి రూ. 3,305 కోట్లకు పరిమితమైంది. పేపర్ బోర్డ్స్, ప్యాకేజింగ్ టర్నోవర్ 13 శాతం పుంజుకుని రూ. 2,306 కోట్లు కాగా.. ఇతర విభాగాల నుంచి రూ. 857 కోట్లు సమకూరింది. ఇది 18 శాతం అధికం.

ఫలితాల నేపథ్యంలో ఐటీసీ షేరు బీఎస్ఈలో 0.5 శాతం బలపడి రూ. 381 వద్ద ముగిసింది.

బీవోబీ లాభం హైజంప్

క్యూ3లో రూ. 4,306 కోట్లు

న్యూఢిల్లీ: ప్రభుత్వ రంగ దిగ్గజం బ్యాంక్ ఆఫ్ బరోడా(బీవోబీ) ప్రస్తుత ఆర్థిక సంవత్సరం (2022-23) మూడో త్రైమాసికంలో ప్రోత్సాహకర ఫలితాలు సాధించింది. కన్సాలిడేటెడ్ ప్రాతిపదికన అక్టోబర్- డిసెంబర్(క్యూ3)లో నికర లాభం 75 శాతం జంప్‌చేసి రూ. 4,306 కోట్లకు చేరింది. స్టాండెలోన్ నికర లాభం సైతం 75 శాతం పైగా ఎగసి రూ. 3,853 కోట్లను తాకింది. రుణ నాణ్యతతోపాటు, వడ్డీ ఆదాయం మెరుగుపడటం ఇందుకు సహకరించింది. నికర వడ్డీ ఆదాయం 27 శాతం పుంజుకుని రూ. 10,818 కోట్లయ్యింది. నికర వడ్డీ మార్జిన్లు 0.24 శాతం బలపడి 3.37 శాతానికి చేరాయి. స్థూల మొండిబకాయిలు(ఎన్‌పీఏలు) 7.25 శాతం నుంచి 4.53 శాతానికి దిగివచ్చాయి.



ఫలితాల నేపథ్యంలో బీవోబీ షేరు 6.2 శాతం జంప్‌చేసి రూ. 164 వద్ద ముగిసింది.

నియంత్రణ సంస్థలు పక్కాగా ఉన్నాయి

- చక్కని నిర్వహణతో కొనసాగుతాయి
- కేంద్ర ఆర్థిక మంత్రి సీతారామన్

న్యూఢిల్లీ: భారత నియంత్రణ సంస్థలు ఎంతో కచ్చితత్వంతో, కఠినంగా పనిచేస్తుంటాయని కేంద్ర ఆర్థిక మంత్రి నిర్మలా సీతారామన్ స్పష్టం చేశారు. ప్రస్తుతం మార్కెట్లలో నెలకొన్న పరిణామాలు అంతర్జాతీయ ఇన్వెస్టర్లలో అనిశ్చితికి దారితీశాయా? అంటూ గౌతమ్ అదానీ గ్రూప్ షేర్ల పతనం గురించి ఓ వార్తా సంస్థ అడిగిన ప్రశ్నకు మంత్రి స్పందించారు. దశాబ్దాలుగా ఎన్నో పాఠాలు నేర్చుకున్నామని చెబుతూ.. నియంత్రణ సంస్థలు మన మార్కెట్‌ను చక్కని, సరైన స్థితిలో నిలబెట్టినట్లు పేర్కొన్నారు. ముందున్నట్టే భారత్ ఇకమీదటా చక్కని నియంత్రణలతో కూడిన ఫైనాన్షియల్ మార్కెట్‌గా కొనసాగుతుందన్నారు. ''అంతర్జాతీయంగా ఎక్కువగా చర్చించుకుంటున్న ఓ సంఘటన భారత మార్కెట్లు ఎంత గొప్పగా నిర్వహించబడతాయనే దానికి నిదర్శనం కాబోదు''అని మంత్రి పేర్కొన్నారు. అమెరికాకు చెందిన హిండెన్‌బర్గ్ సంస్థ అదానీ గ్రూప్ కంపెనీలు, షేర్లపై ఆరోపణలతో ఓ నివేదిక విడుదల చేయడం తెలిసిందే. ఈ నివేదిక తర్వాత అదానీ గ్రూప్ కంపెనీలు ఈ వారంలో ఊహించని విధంగా భారీ నష్టాలు చూశాయి. దీంతో ఆర్థిక మంత్రి దీనిపై స్పష్టత ఇచ్చారు.



మెరుగ్గా బ్యాంకింగ్ వ్యవస్థ

భారత బ్యాంకింగ్ వ్యవస్థ నేడు ఎంతో సౌకర్యంగా ఉందని మంత్రి సీతారామన్ స్పష్టం చేశారు. నికర నిరర్థక రుణాలు (ఎన్‌పీఏలు) చాలా కనిష్ట స్థాయికి దిగొచ్చినట్టు చెప్పారు. ప్రభుత్వరంగ సంస్థల ప్రైవేటీకరణకు ప్రభుత్వం కట్టుబడి ఉన్నట్టు మంత్రి నిర్మలా సీతారామన్ చెప్పారు. కేబినెట్ ఆమోదం పొందిన పెట్టుబడుల ఉపసంహరణ, ఆస్తుల నగదీకరణను ముందుకు తీసుకెళతామని ప్రకటించారు.

సాక్షి స్పోర్ట్స్

పోరాడి ఓడిన సాయిప్రణీత్

థాయ్‌లాండ్ ఓపెన్ సూపర్-300 బ్యాడ్మింటన్ టోర్నమెంట్‌లో భారత క్రీడాకారుల పోరాటం ముగిసింది. భారత్ నుంచి బరిలో మిగిలిన ఏకైక ప్లేయర్ భమిడిపాటి సాయిప్రణీత్ క్వార్టర్ ఫైనల్లో వెనుదిరిగాడు. బ్యాంకాక్‌లో శుక్రవారం జరిగిన పురుషుల సింగిల్స్ క్వార్టర్ ఫైనల్లో హైదరాబాద్‌కు చెందిన ప్రపంచ 49వ ర్యాంకర్ సాయిప్రణీత్ 17-21, 23-21, 18-21తో ప్రపంచ 23వ ర్యాంకర్, ఆరో సీడ్ లీ షి ఫెంగ్ (చైనా) చేతిలో పోరాడి ఓడిపోయాడు. 84 నిమిషాలపాటు జరిగిన ఈ మ్యాచ్‌లో నిర్ణాయక మూడో గేమ్‌లో సాయిప్రణీత్ స్కోరు 12-12 వద్ద ఉన్నపుడు తడబడి వరుసగా ఆరు పాయింట్లు సమర్పించుకోవడం టర్నింగ్ పాయింట్ అయింది. సాయిప్రణీత్‌కు 1,260 డాలర్ల (రూ. 1 లక్ష 3 వేలు) ప్రైజ్‌మనీతోపాటు 3,850 ర్యాంకింగ్ పాయింట్లు లభించాయి.



'జెయింట్స్' హెడ్ కోచ్‌గా రేచల్ హేన్స్

బౌలింగ్ కోచ్‌గా నూషీన్ అల్ ఖదీర్ నియామకం


రేచల్


నూషీన్

ముంబై: మహిళల ప్రీమియర్ లీగ్ (డబ్ల్యూపీఎల్) టి20 క్రికెట్ టోర్నీలో అత్యధిక మొత్తంతో టీమ్‌ను సొంతం చేసుకున్న అహ్మదాబాద్ యాజమాన్యం అందరికంటే వేగంగా, చురుగ్గా టీమ్ నిర్మాణంపై దృష్టి పెట్టింది. ఈ టీమ్ 'గుజరాత్ జెయింట్స్'కు భారత మాజీ కెప్టెన్ మిథాలీ రాజ్‌ను ఇటీవలే మెంటార్‌గా ఎంపిక చేయగా, ఇప్పుడు టీమ్ హెడ్ కోచ్‌ను ప్రకటించింది. ఆస్ట్రేలియా మాజీ స్టార్ ప్లేయర్ రేచల్ హేన్స్ 'జెయింట్స్'కు హెడ్ కోచ్‌గా వ్యవహరించనుంది. గత ఏడాదే ఆటకు గుడ్‌బై చెప్పిన హేన్స్ ఆసీస్ తరఫున ఆరు ప్రపంచకప్ విజయాల్లో భాగంగా ఉండటం విశేషం. ఆస్ట్రేలియా తరఫున ఆమె 6 టెస్టులు, 77 వన్డేలు, 84 టి20ల్లో ప్రాతినిధ్యం వహించింది. దీంతో పాటు మరో రెండు నియామకాలను కూడా అహ్మదాబాద్ ఫ్రాంచైజీ ప్రకటించింది. ఇటీవలే వరల్డ్‌కప్ నెగ్గిన భారత మహిళల అండర్-19 టీమ్‌కు కోచ్‌గా వ్యవహరించిన నూషీన్ అల్ ఖదీర్‌ను బౌలింగ్ కోచ్‌గా... తుషార్ అరోథేను బ్యాటింగ్ కోచ్‌గా ఎంపిక చేశారు. గత ఏడాది మహిళల టి20 చాలెంజ్ టోర్నీ నెగ్గిన 'సూపర్ నోవాస్'కు కోచ్‌గా పని చేసిన అనుభవం నూషీన్‌కు ఉండగా, బరోడా మాజీ క్రికెటర్ తుషార్ భారత సీనియర్ మహిళల టీమ్‌కు కోచ్‌గా బాధ్యతలు నిర్వర్తించాడు.

అంబానీ X అదానీ

తొలి మ్యాచ్‌లో ముంబైతో అహ్మదాబాద్ 'ఢీ'

డబ్ల్యూపీఎల్‌లో అన్ని మ్యాచ్‌లు ముంబైలోనే జరుగుతాయి. నగరంలోని బ్రబోర్న్, డీవై పాటిల్ స్టేడియంలను టోర్నీ వేదికలుగా ఎంపిక చేశారు. షెడ్యూల్‌పై బోర్డు ఇంకా అధికారిక ప్రకటన ఇవ్వకపోయినా... మార్చి 4న తొలి మ్యాచ్ జరుగుతుందని బీసీసీఐ వర్గాలు వెల్లడించాయి. భారత కార్పొరేట్ దిగ్గజాలు ముకేశ్ అంబానీ, గౌతమ్ అదానీలకు చెందిన ముంబై, అహ్మదాబాద్ టీమ్‌లు ఈ పోరులో తలపడే అవకాశం ఉంది. ముంబైలోని ప్రధాన స్టేడియం వాంఖడేను ఐపీఎల్ కోసం మాత్రమే వినియోగిస్తారు. మొత్తం 22 మ్యాచ్‌లు ఉండే ఈ టోర్నీ ఫైనల్ మార్చి 26న జరుగుతుంది. ఐదు జట్లు పాల్గొంటున్న డబ్ల్యూపీఎల్‌లో మూడు టీమ్‌లు ప్లే ఆఫ్స్‌కు అర్హత సాధిస్తాయి. లీగ్ దశలో ఒక్కో టీమ్ ఇతర నాలుగు జట్లతో (మొత్తం 8 మ్యాచ్‌లు) తలపడుతుంది. అత్యధిక పాయింట్ల జట్టు ఫైనల్‌కు చేరితే... మరో ఫైనలిస్ట్ కోసం తర్వాతి రెండు టీమ్‌ల మధ్య ఎలిమినేటర్ నిర్వహిస్తారు. ఫ్రాంచైజీ ఒప్పందాలు ఖరారు చేసేందుకు శుక్రవారం ఐదు టీమ్‌ల యాజమాన్యాలతో బీసీసీఐ సమావేశమైంది.

డోపింగ్‌లో పట్టుబడ్డ దీపా కర్మాకర్‌పై వేటు

భారత జిమ్నాస్ట్‌పై 21 నెలలు నిషేధం

న్యూఢిల్లీ: రియో ఒలింపిక్స్‌లో భారత మెరికగా అందరి దృష్టిని విశేషంగా ఆకర్షించిన స్టార్ జిమ్నాస్ట్ దీపా కర్మాకర్ డోపింగ్‌లో పట్టుబడింది. నిషిద్ధ ఉత్ప్రేరకాలు తీసుకున్నట్లు పరీక్షల్లో తేలడంతో ఆమెపై అంతర్జాతీయ టెస్టింగ్ ఏజెన్సీ (ఐటీఏ) 21 నెలల నిషేధం విధించింది. 2016లో 'రియో' విశ్వవేదికపై ప్రమాదకరమైన 'ప్రొడునోవా' విన్యాసంతో దీప ఆకట్టుకుంది. ప్రదర్శన ముగిసి ల్యాండింగ్ సమస్యతో త్రుటిలో ఆమె కాంస్య పతకాన్ని కోల్పోయి చివరకు నాలుగో స్థానంతో తృప్తి పడింది. అయితే భారత విశ్లేషకులు, క్రీడాభిమానులంతా ఆమె ప్రదర్శనను ఆకాశానికెత్తారు. తదనంతరం గాయాల బెడదతో మరే మెగా ఈవెంట్‌లోనూ ఆమె పాల్గొనలేకపోయింది. నిజానికి 2021 అక్టోబర్‌లోనే ఆమె డోపింగ్‌లో పట్టుబడింది. కానీ ఈ విషయాన్ని ఇప్పుడు బహిర్గతం చేశారు. అప్పటి నుంచి శిక్షాకాలం అమలు కావడంతో ఈ ఏడాది జూలై 10వ తేదీతోనే నిషేధం ముగుస్తుంది.



వాలీబాల్ లీగ్‌కు వేళాయె...


ట్రోఫీతో ఎనిమిది జట్ల కెప్టెన్‌లు

- నేడు బెంగళూరులో ప్రారంభం
- బరిలో ఎనిమిది జట్లు
- హైదరాబాద్, కొచ్చిలోనూ మ్యాచ్‌లు
- మార్చి 5న టైటిల్ పోరు

బెంగళూరు: గత ఏడాది వాలీబాల్ ప్రియుల్ని అలరించిన ప్రైమ్ వాలీబాల్ లీగ్ (పీవీఎల్) ఇప్పుడు రెండో సీజన్‌తో మరింత ప్రేక్షకాదరణ పొందాలని ఆశిస్తోంది. నేటి నుంచి ప్రారంభమయ్యే సీజన్-2 పోటీల్లో ఎనిమిది ఫ్రాంచైజీ జట్లు కోల్‌కతా థండర్‌బోల్ట్స్, హైదరాబాద్ బ్లాక్‌హాక్స్, కొచ్చి బ్లూ స్పైకర్స్, కాలికట్ హీరోస్, అహ్మదాబాద్ డిఫెండర్స్, బెంగళూరు టార్పెడోస్, చెన్నై బ్లిట్జ్, ముంబై మిటియోర్స్ 'ఢీ'కి రెడీ అయ్యాయి. డిఫెండింగ్ చాంపియన్స్ కోల్‌కతా థండర్‌బోల్ట్స్ తమ జోరు ఈ సీజన్‌లోనూ కొనసాగించేందుకు ఉత్సాహంగా ఉంది. ముందుగా శనివారం నుంచి లీగ్ దశలో 28 మ్యాచ్‌లు జరుగుతాయి. పాయింట్ల పట్టికలో తొలి నాలుగు స్థానాల్లో నిలిచిన జట్ల మధ్య మార్చి 3, 4 తేదీల్లో సెమీఫైనల్స్ పోటీలు నిర్వహిస్తారు. 5న విజేతను తేల్చే ఫైనల్ పోరుతో టోర్నీ ముగుస్తుంది. బెంగళూరులో నేడు కోల్‌కతా థండర్‌బోల్ట్స్, బెంగళూరు టార్పెడోస్‌ల మధ్య ఆరంభ మ్యాచ్ జరుగుతుంది. ఈ నెల 12 నుంచి 21 వరకు హైదరాబాద్ వేదికగా 11 మ్యాచ్‌లు జరుగుతాయి. అనంతరం మిగిలిన లీగ్ దశ సహా సెమీస్, ఫైనల్ దాకా కొచ్చిలోనే మ్యాచ్‌ల్ని నిర్వహిస్తారు. రాత్రి 7 గంటలకు మొదలయ్యే మ్యాచ్‌లను సోనీ స్పోర్ట్స్ నెట్‌వర్క్ ప్రత్యక్ష ప్రసారం చేయనుంది. ఈ టోర్నీలో విజేతగా నిలిచే జట్టుకు క్లబ్ వాలీబాల్ ప్రపంచ చాంపియన్‌షిప్‌లో పాల్గొనే అవకాశం కల్పించారు. ఈసారి, వచ్చే ఏడాది క్లబ్ వాలీబాల్ ప్రపంచ చాంపియన్‌షిప్ భారత్‌లోనే జరుగనుండటంతో మరో విశేషం.

తొలి సింగిల్స్‌లో యూకీ బాంబ్రీ ఓటమి

హిలెరాడ్ (డెన్మార్క్): భారత్‌తో జరుగుతున్న డేవిస్ కప్ టెన్నిస్ వరల్డ్ గ్రూప్-1 ప్లే ఆఫ్స్ తొలి రౌండ్ పోటీలో డెన్మార్క్ శుభారంభం చేసింది. శుక్రవారం జరిగిన తొలి సింగిల్స్ మ్యాచ్‌లో ప్రపంచ తొమ్మిదో ర్యాంకర్ హోల్గర్ రూన్ 6-2, 6-2తో యూకీ బాంబ్రీని ఓడించాడు. కేవలం 58 నిమిషాల్లో ముగిసిన ఈ మ్యాచ్‌లో 19 ఏళ్ల రూన్ తన ప్రత్యర్థి సర్వీస్‌ను నాలుగుసార్లు బ్రేక్ చేశాడు. ఏటీపీ ప్రొఫెషనల్ సర్క్యూట్‌లో సింగిల్స్ మ్యాచ్‌లు ఆడటం మానేసిన యూకీ ఈ మ్యాచ్‌లో ఒక్క ఏస్ కూడా కొట్టలేకపోయాడు. నాలుగు డబుల్ ఫాల్ట్‌లు చేసిన యూకీ ఒక్కసారి కూడా ప్రత్యర్థి సర్వీస్‌లో బ్రేక్ పాయింట్ అవకాశం సంపాదించలేకపోయాడు.



ఆంధ్రపై గెలుపుతో సెమీస్‌లో మధ్యప్రదేశ్

- 245 పరుగుల లక్ష్యాన్ని ఛేదించిన డిఫెండింగ్ చాంపియన్
- కర్ణాటక, బెంగాల్ కూడా సెమీస్‌కు


ఆంధ్ర జట్టు

ఇండోర్: రంజీ ట్రోఫీ క్రికెట్ టోర్నీలో తొలిసారి సెమీఫైనల్ చేరుకునే అవకాశాన్ని ఆంధ్ర జట్టు వృథా చేసుకుంది. డిఫెండింగ్ చాంపియన్ మధ్యప్రదేశ్‌తో జరిగిన క్వార్టర్ ఫైనల్లో ఆంధ్ర జట్టు ఐదు వికెట్ల తేడాతో ఓడిపోయింది. 245 పరుగుల విజయలక్ష్యాన్ని మధ్యప్రదేశ్ 77 ఓవర్లలో ఐదు వికెట్లు కోల్పోయి ఛేదించి సెమీఫైనల్ బెర్త్‌ను దక్కించుకుంది. ఓవర్‌నైట్ స్కోరు 58/0తో నాలుగో రోజు రెండో ఇన్నింగ్స్ కొనసాగించిన మధ్యప్రదేశ్ అదే స్కోరు వద్ద ఓపెనర్ హిమాన్షు మంత్రి (31; 3 ఫోర్లు) వికెట్‌ను కోల్పోయింది. అనంతరం యశ్ దూబే (58; 6 ఫోర్లు), శుభమ్ శర్మ (40; 3 ఫోర్లు) రెండో వికెట్‌కు 62 పరుగులు జోడించారు. యశ్ దూబే అవుటయ్యాక వచ్చిన రజత్ పాటిదార్ (76 బంతుల్లో 55; 5 ఫోర్లు, 1 సిక్స్) ధాటిగా ఆడి అర్ధ సెంచరీ సాధించాడు. శుభమ్‌తో మూడో వికెట్‌కు 38 పరుగులు, నాలుగో వికెట్‌కు సారాంశ్ జైన్ (28 నాటౌట్; 1 ఫోర్)తో 49 పరుగులు జోడించాక పాటిదార్ అవుటయ్యాడు. కెప్టెన్ ఆదిత్య శ్రీవాస్తవ (2) తక్కువ స్కోరుకే వెనుదిరిగినా... హర్ష్ గావ్లి (18 నాటౌట్; 3 ఫోర్లు)తో కలిసి సారాంశ్ మధ్యప్రదేశ్‌ను విజయతీరానికి చేర్చాడు. ఆంధ్ర బౌలర్లలో లలిత్ మోహన్, పృథ్వీరాజ్ రెండు వికెట్ల చొప్పున తీయగా... నితీశ్ కుమార్ రెడ్డికి ఒక వికెట్ దక్కింది. ఆంధ్రకు 151 పరుగుల భారీ తొలి ఇన్నింగ్స్ ఆధిక్యం లభించినా రెండో ఇన్నింగ్స్‌లో ఆ జట్టు 93 పరుగులకే కుప్పకూలడం... రెండో ఇన్నింగ్స్‌లో మధ్యప్రదేశ్ బ్యాటర్లను కట్టడి చేయడంలో బౌలర్లు విఫలంకావడంతో మరోసారి క్వార్టర్ ఫైనల్ దాటి ముందుకెళ్లలేకపోయింది.

కోల్‌కతాలో జార్ఖండ్‌తో జరిగిన క్వార్టర్ ఫైనల్లో బెంగాల్ తొమ్మిది వికెట్ల తేడాతో... బెంగళూరులో ఉత్తరాఖండ్‌తో జరిగిన మరో క్వార్టర్ ఫైనల్లో కర్ణాటక ఇన్నింగ్స్ 281 పరుగుల ఆధిక్యంతో కర్ణాటక గెలుపొంది సెమీఫైనల్లోకి ప్రవేశించాయి. రాజ్‌కోట్‌లో సౌరాష్ట్రతో జరుగుతున్న మరో క్వార్టర్ ఫైనల్లో పంజాబ్ 252 పరుగుల లక్ష్యంతో బరిలోకి దిగిన పంజాబ్ నాలుగో రోజు ఆట ముగిసే సమయానికి 52 పరుగులకు రెండు వికెట్లు కోల్పోయింది. పంజాబ్ విజయం సాధించాలంటే చివరిరోజు ఆ జట్టు మరో 200 పరుగులు సాధించాలి.

క్రికెట్‌కు జోగీందర్ శర్మ 'గుడ్‌బై'



న్యూఢిల్లీ: అతను వేసిన చివరి బంతి భారత క్రికెట్ రాతను మార్చింది... అతను తీసిన ఆ వికెట్ టి20 క్రికెట్‌లో కొత్త విప్లవాన్ని తెచ్చింది... ఆ ఒక్క ప్రదర్శనతోనే అతను చరిత్రలో తన పేరును ఘనంగా లిఖించుకున్నాడు. 2007 టి20 వరల్డ్ కప్ హీరో, టీమిండియా టైటిల్ అందుకోవడంలో కీలక పాత్ర పోషించిన పేసర్ జోగీందర్ శర్మ ఇప్పుడు ఆట నుంచి పూర్తిగా తప్పుకున్నాడు. 2017 విజయ్ హజారే ట్రోఫీలోనే హరియాణా తరఫున తన చివరి మ్యాచ్ ఆడినా... 39 ఏళ్ల జోగీందర్ ఇన్నేళ్ల తర్వాత అధికారికంగా రిటైర్మెంట్ ప్రకటించాడు. పాకిస్తాన్‌తో జరిగిన 2007 టి20 వరల్డ్ కప్ ఫైనల్లో ఆఖరి ఓవర్ వేసిన జోగీందర్... శ్రీశాంత్ పట్టిన క్యాచ్ ద్వారా మిస్బావుల్ హక్‌ను అవుట్ చేయడంతోనే ట్రోఫీ భారత్ చేతుల్లో చేరింది. ఆ క్షణం అతని కెరీర్‌ను చిరస్మరణీయం చేసింది. అయితే దురదృష్టవశాత్తూ ఆ మ్యాచ్ తర్వాత జోగీందర్‌కు భారత్ తరఫున ఒక్క మ్యాచ్ ఆడే అవకాశం కూడా రాలేదు! ఫలితంగా వరల్డ్ కప్ విజయాన్నే తన ఆఖరి అంతర్జాతీయ మ్యాచ్‌గా మార్చుకున్న ఏకైక భారత క్రికెటర్‌గా అతను నిలిచాడు. అయితే ఐపీఎల్‌లో చెన్నై సూపర్ కింగ్స్ తరఫున జోగీందర్ నాలుగు సీజన్లు ఆడాడు. టి20 వరల్డ్ కప్‌కు ముందే 4 వన్డేలు ఆడిన అతను ఒకటే వికెట్ పడగొట్టాడు. దేశవాళీలో 77 ఫస్ట్‌క్లాస్ మ్యాచ్‌లలో 297 వికెట్లు తీసిన జోగీందర్ శర్మ గత సెప్టెంబర్‌లో లెజెండ్స్ లీగ్‌లో కూడా పాల్గొన్నాడు. ప్రస్తుతం అతను హరియాణా రాష్ట్ర ప్రభుత్వంలో డిప్యూటీ సూపరింటెండెంట్ ఆఫ్ పోలీస్ (డీఎస్పీ)గా పని చేస్తున్నాడు.

క్లుప్తంగా...

'ఎకో ఇండియా'తో వైద్య, ఆరోగ్య శాఖ ఎంవోయూ



ఎంవోయూ పత్రాలు మార్చుకుంటున్న సీఎఫ్‌డబ్ల్యూ నివాస్, ఎకో ఇండియా ప్రతినిధులు

సాక్షి, అమరావతి: రాష్ట్రంలో వైద్య, ఆరోగ్య వ్యవస్థను మరింత బలోపేతం చేసేందుకు, ఆరోగ్య కార్యకర్తల సామర్థ్యం పెంపొందించేందుకు అవసరమైన కార్యక్రమాల అమలు కోసం ఏపీ నేషనల్ హెల్త్ మిషన్(న్యూఢిల్లీ)కు చెందిన ఎకో ఇండియా సంస్థతో రాష్ట్రం వైద్య, ఆరోగ్య శాఖ ఎంవోయూ కుదుర్చుకుంది. మంగళగిరిలోని వైద్య శాఖ కార్యాలయంలో శుక్రవారం ఆరోగ్య, కుటుంబ సంక్షేమ శాఖ కమిషనర్ జె.నివాస్, ఎకో ఇండియా అసోసియేట్ వైస్ ప్రెసిడెంట్ డాక్టర్ సందీప్ భల్లా, డిప్యూటీ జనరల్ మేనేజర్ దీపా ఝా ఎంవోయూ పత్రాలపై సంతకాలు చేశారు. డాక్టర్ సందీప్ భల్లా మాట్లాడుతూ వివిధ అంశాలపై వైద్య సిబ్బందికి వర్చువల్ విధానంలో శిక్షణ కార్యక్రమాలు నిర్వహిస్తామన్నారు. ఎంవోయూ అనంతరం రాష్ట్ర వైద్య, ఆరోగ్య శాఖ ముఖ్య కార్యదర్శి ఎంటీ కృష్ణబాబుతో ఎకో ఇండియా బృందం భేటీ అయ్యింది.

కృష్ణా జలాలపై కొత్త ట్రిబ్యునల్ అసాధ్యమే

తేల్చి చెబుతున్న న్యాయ నిపుణులు

సాక్షి, అమరావతి: ఉమ్మడి రాష్ట్రానికి కేటాయించిన కృష్ణా జలాలను రెండు రాష్ట్రాలకు పంపిణీ చేయడానికి అంతర్రాష్ట్ర నదీ వివాదాల చట్టం (ఐఎస్ఆర్‌డబ్ల్యూటీ)–1956 సెక్షన్‌–3 ప్రకారం కొత్త ట్రిబ్యునల్ ఏర్పాటు నిబంధనల ప్రకారం అసాధ్యమని న్యాయ నిపుణులు చెబుతున్నారు. కొత్త ట్రిబ్యునల్ ఏర్పాటు చేయాలంటే కృష్ణా నదీ పరివాహక ప్రాంతం (బేసిన్)లోని అన్ని రాష్ట్రాలు అంటే మహారాష్ట్ర, కర్ణాటక, ఆంధ్రప్రదేశ్, తెలంగాణ అంగీకరించాలని చెబుతున్నారు. బ్రిజేష్‌కుమార్ ట్రిబ్యునల్ తీర్పును నోటిఫై చేసేలా కేంద్రాన్ని ఆదేశించాలని సుప్రీం కోర్టులో మహారాష్ట్ర, కర్ణాటక ఎస్సెల్పీ (స్పెషల్ లీవ్ పిటిషన్)లు దాఖలు చేశాయి. ఆ ట్రిబ్యునల్ కేటాయింపులను రద్దు చేసి, పునఃపంపిణీ చేయాలని ఆంధ్రప్రదేశ్ ఎస్సెల్పీ దాఖలు చేసింది. ఈ నేపథ్యంలో తెలంగాణ ప్రతిపాదించిన మేరకు కొత్త ట్రిబ్యునల్ ఏర్పాటు సాధ్యం కాదని తేల్చిచెబుతున్నారు. అందుకే కృష్ణా కొత్త ట్రిబ్యునల్ ఏర్పాటు అవసరం లేదని కేంద్ర జల్ శక్తి శాఖకు కేంద్ర న్యాయ శాఖ తెలిపిందని, ప్రస్తుతం ఉన్న బ్రిజేష్‌కుమార్ ట్రిబ్యునల్‌తో విచారిస్తే సరిపోతుందని సూచించిందని వివరిస్తున్నారు. ఈ వ్యవహారంపై కేంద్ర జల్ శక్తి శాఖ శుక్రవారం సొలిసిటర్ జనరల్ తుషార్ మెహతా అభిప్రాయాన్ని కోరింది.

న్యాయ విద్యార్థులకు నైపుణ్యాలు తప్పనిసరి

రాష్ట్ర ఉన్నత విద్యామండలి వైస్ చైర్మన్ ప్రొఫెసర్ కె.రామమోహన్‌రావు



గుంటూరు ఎడ్యుకేషన్: న్యాయ విద్యను అభ్యసిస్తున్న విద్యార్థులు చట్టాలపై అవగాహన పెంచుకుని నైపుణ్యాలను మెరుగుపరుచుకోవాలని రాష్ట్ర ఉన్నత విద్యామండలి వైస్ చైర్మన్ ప్రొఫెసర్ కె.రామమోహనరావు సూచించారు. గుంటూరులోని జేసీ లా కళాశాలలో రెండవ జాతీయ స్థాయి మూట్ కోర్టు పోటీలను శుక్రవారం ఆయన ప్రారంభించారు. కె.రామమోహనరావు మాట్లాడుతూ యువ న్యాయవాదులుగా రాణించేందుకు విద్యార్థులకు విస్తృత అవకాశాలు ఉన్నాయని చెప్పారు. విద్యార్థులకు భావ వ్యక్తీకరణ నైపుణ్యాలు, నైతిక విలువలు ఎంతో ముఖ్యమని చెప్పారు.

ముస్లింలకు అండగా టీడీపీ

చంద్రబాబు



సాక్షి, అమరావతి: ముస్లింలకు తమ పార్టీ అండగా ఉంటుందని టీడీపీ అధినేత చంద్రబాబు చెప్పారు. వైఎస్సార్‌సీపీ అధికారంలోకి వచ్చిన తరువాత ముస్లిం వర్గం తీవ్రంగా నష్టపోయిందని.. ఈ ప్రభుత్వం కచ్చితంగా అందుకు మూల్యం చెల్లిస్తుందన్నారు. మంగళగిరి టీడీపీ కార్యాలయంలో గురువారం ఆయన మైనారిటీ హక్కుల పరిరక్షణ సమితి నేతలతో సమావేశమయ్యారు. ఈ సందర్భంగా చంద్రబాబు మాట్లాడుతూ.. ముస్లిం మహిళపై దేశద్రోహం కింద కేసు పెట్టడం, వక్ఫ్ బోర్డు ఆస్తులను కాపాడేందుకు ప్రయత్నించిన మున్వర్‌ను ఉద్యోగం నుంచి తొలగించడం దారుణమన్నారు. మండలి మాజీ చైర్మన్ అహ్మద్ షరీఫ్, మాజీమంత్రి ఎన్ఎండీ ఫరూక్, మాజీ ఎమ్మెల్యేలు జలీల్ ఖాన్, అత్తర్ చాంద్‌బాషా తదితరులు పాల్గొన్నారు.

ఇన్‌చార్జిల నియామకం..

మరోవైపు.. చంద్రబాబు శుక్రవారం పలు నియోజకవర్గాలకు ఇన్‌చార్జిలను నియమించారు. తుని నియోజకవర్గ ఇన్‌చార్జిగా యనమల దివ్య, నెల్లిమర్ల ఇన్‌చార్జ్‌గా కర్రోతు బంగార్రాజు, సత్యవేడు నియోజకవర్గ ఇన్‌చార్జ్‌గా హెలెన్‌ను నియమించారు. పి.గన్నవరం నియోజకవర్గానికి కన్వీనర్‌గా గంటి హరీశ్ మాథుర్, కో–కన్వీనర్‌గా నామన రాంబాబును నియమించారు.



చిత్తూరు జిల్లా చార్వకానిపల్లెలో ఉచిత బియ్యం నాణ్యతను పరిశీలిస్తున్న ఉపముఖ్యమంత్రి నారాయణస్వామి



ఏలూరు జిల్లా చింతంపల్లిలో సంక్షేమ పథకాల లబ్ధిని వివరిస్తున్న ఎమ్మెల్యే ఎలీజా



కృష్ణాజిల్లా గూడూరు మండలం మల్లవోలులో వృద్ధురాలి యోగ క్షేమాలు అడిగి తెలుసుకుంటున్న మంత్రి జోగి రమేష్

ఏపీ హక్కుల కోసం ప్రైవేటు మెంబరు బిల్లులు

- హోదా, విభజన హామీలపై పోరాడతాం
- వైఎస్సార్‌సీపీ ఎంపీలు రంగయ్య, బోస్, రెడ్డెప్ప

సాక్షి, న్యూఢిల్లీ: ఆంధ్రప్రదేశ్ హక్కుల కోసం పార్లమెంటులో ప్రైవేటు మెంబరు బిల్లులు ప్రవేశపెడతామని వైఎస్సార్‌సీపీ ఎంపీలు తలారి రంగయ్య, పిల్లి సుభాష్‌చంద్రబోస్, ఎన్.రెడ్డెప్ప చెప్పారు. ప్రత్యేక హోదా, విభజనహామీల అమలు కోసం ప్రైవేటు మెంబరు బిల్లులు పెట్టి కేంద్రాన్ని నిలదీస్తామని తెలిపారు. ప్రత్యేకహోదా అనేది ముగిసిన అధ్యాయం కాదని, పార్లమెంటు సాక్షిగా ఇచ్చిన హామీ అని గుర్తుచేశారు. వారు శుక్రవారం ఢిల్లీలోని ఏపీ భవన్‌లో మీడియాతో మాట్లాడారు. ప్రత్యేకహోదా ఇవ్వబోమని, అది ముగిసిన అధ్యాయం అంటూ బీజేపీ పదేపదే చెప్పినప్పటికీ తమ పోరాటం ఆగదని తలారి రంగయ్య స్పష్టం చేశారు. విభజన చట్టంలో ప్రతిపాదించి ఇప్పటివరకు అమలు కాని అంశాలపైనా ప్రైవేటు మెంబరు బిల్లు పెడతామన్నారు. శుక్రవారం ప్రైవేటు మెంబరు బిల్లు ప్రవేశపెట్టాల్సి ఉందని, సభ జరగకపోవడంతో అది సాధ్యం కాలేదని చెప్పారు. అన్ని పార్టీల మద్దతు కూడగట్టుకుని ఈసారి ఓటింగ్‌కి వచ్చేలా కృషిచేస్తామన్నారు. మద్రాసు రాష్ట్రంలో ఉన్నప్పటి నుంచి ఏపీ ప్రాంతానికి అన్యాయమే జరుగుతోందని ఆవేదన వ్యక్తం చేశారు. రాజస్థాన్, గుజరాత్‌లతో సమంగా జనాభా ఉన్నప్పటికీ ఏపీకి అన్ని మెడికల్ కాలేజీలు మంజూరు చేయడం లేదన్నారు. రాష్ట్రానికి జరిగిన అన్యాయంపై మాట్లాడడానికే ప్రైవేటు మెంబరు బిల్లులు ప్రవేశపెడతామని తెలిపారు.

సమాఖ్యస్ఫూర్తికి విఘాతం కలుగుతుందని ప్రధాని గుర్తించాలి

ఎంపీ పిల్లి సుభాష్‌చంద్రబోస్ మాట్లాడుతూ ఏపీ విభజన సందర్భంగా ఇచ్చిన హామీలు నెరవేర్చలేని దుస్థితిలో కేంద్రం ఉందన్నారు. పార్లమెంటులో ఇచ్చిన హామీ నెరవేర్చకపోతే సమాఖ్యస్ఫూర్తికి విఘాతం కలుగుతుందని ప్రధాని గుర్తించాలని కోరారు. బడ్జెట్‌లో ప్రత్యేకహోదా, విశాఖ రైల్వే జోన్ వంటి అంశాలు లేకపోవడం బాధాకరమన్నారు. మంగళగిరి ఎయిమ్స్‌కు మరిన్ని నిధులు కేటాయించాలని కోరారు. చంద్రబాబు ఇచ్చిన 600కు పైగా హామీల్లో 10 శాతం కూడా అమలు చేయలేదని, ఇలాంటి రాజకీయ పార్టీలపై ప్రజల్లో ఎందుకు విశ్వాసం ఉంటుందని ప్రశ్నించారు. హామీ ఇచ్చామంటే కచ్చితంగా అమలు చేయాలని ఏపీ ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి మొదటిరోజు నుంచే కృషి చేస్తున్నారని చెప్పారు.

బడ్జెట్‌లో ఏపీకి మొండిచేయి

ఎంపీ ఎన్.రెడ్డెప్ప మాట్లాడుతూ బడ్జెట్‌లో ఏపీకి కేంద్రం మొండిచేయి చూపిందని విమర్శించారు. ప్రత్యేకహోదా ఇవ్వాలని ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి పలుసార్లు కేంద్రాన్ని కోరారని గుర్తుచేశారు. ప్రత్యక్ష, పరోక్ష పోరాటాలు చేస్తున్నప్పటికీ కేంద్రంలో కదలిక లేదన్నారు. ఈ నేపథ్యంలోనే ప్రైవేటు మెంబరు బిల్లు ప్రవేశపెట్టనున్నట్లు తెలిపారు. రాష్ట్రాన్ని విడగొట్టింది చంద్రబాబేనని, ప్రత్యేకహోదా, నిధులు రానివ్వకుండా చేసిన ఘనత దక్కించుకున్న చంద్రబాబు వైఎస్సార్‌సీపీని తప్పుపట్టడం సరికాదని చెప్పారు. కుప్పంలో లోకేశ్‌కు కనీసం వెయ్యిమంది కూడా రాలేదన్నారు. లోకేశ్ పాదయాత్ర పులిని చూసి నక్క వాతలు పెట్టుకున్నట్లు యుందని ఆయన విమర్శించారు.

రాష్ట్ర ప్రగతి పరుగులు పెట్టేలా..

- త్వరలో 2023–28 పారిశ్రామిక పాలసీ విడుదల
- పారిశ్రామికవేత్తల అభిప్రాయాలకు పెద్దపీట వేస్తూ రూపకల్పన
- ఎంఎస్ఎంఈలు, ఎస్సీ, ఎస్టీలపై ప్రత్యేక దృష్టి
- పారిశ్రామిక సంఘాలతో మంత్రి గుడివాడ అమర్‌నాథ్ భేటీ



సాక్షి, అమరావతి: ప్రస్తుతం రాష్ట్రంలో ఉన్న పరిశ్రమలతో పాటు కొత్త పరిశ్రమలకు చేయూత అందించేలా నూతన పారిశ్రామిక విధానాన్ని తీసుకొస్తున్నట్లు రాష్ట్ర పరిశ్రమల శాఖ మంత్రి గుడివాడ అమర్‌నాథ్ వెల్లడించారు. రాష్ట్ర భవిష్యత్తు, పారిశ్రామిక ప్రగతిని ప్రోత్సహించే విధంగా 2023–28 పారిశ్రామిక పాలసీని రూపొందిస్తున్నట్లు తెలిపారు. కొత్త పాలసీలో తీసుకోవాల్సిన నిర్ణయాలపై పారిశ్రామికవేత్తల అభిప్రాయాలను తెలుసుకోవడానికి శుక్రవారం ఏపీఐఐసీ ప్రధాన కార్యాలయంలో ఆయన వివిధ పారిశ్రామిక సంఘాలతో సమావేశమయ్యారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. ప్రస్తుతమున్న 2020–23 పారిశ్రామిక పాలసీలో రెండున్నరేళ్లు కోవిడ్ సంక్షోభంతోనే సరిపోయిందని, ఈ సమయంలో రాష్ట్రంలోని పరిశ్రమలను ఆదుకోవడానికి సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి చేయూతనందించారన్నారు. పెట్టుబడి విలువ తక్కువగా ఉన్నా అత్యధిక మందికి ఉపాధి కల్పించే ఎంఎస్ఎంఈ రంగానికి జీవితకాలం చేయూతనందించాలని అప్పుడే రాష్ట్ర ఆర్థికవ్యవస్థ నిలబడటంతో పాటు యువతకు ఉపాధి లభిస్తుందన్నది ముఖ్యమంత్రి బలమైన విశ్వాసమన్నారు. దీనికి అనుగుణంగా.. ఎంఎస్ఎంఈ రంగంతో పాటు ఎస్సీ, ఎస్టీ పారిశ్రామికవేత్తలకు పెద్దఎత్తున చేయూతనందించేలా కూడా కొత్త పాలసీని రూపొందిస్తున్నట్లు ఆయన తెలిపారు. పెద్ద పరిశ్రమలకు వారు కల్పించే ఉపాధి ఆధారంగా టైలర్ మేడ్ ప్రోత్సాహకాలతో పాటు వివాదాల్లేని భూమి, మౌలిక వసతులు, విద్యుత్, నీరు కల్పించడానికి ప్రాధాన్యత ఇవ్వనున్నట్లు అమర్‌నాథ్ తెలిపారు.

మార్చి 3–4 తేదీల్లో విడుదల

ఇక మార్చి 3–4 తేదీల్లో విశాఖలో జరిగే గ్లోబల్ ఇన్వెస్టర్ సమ్మిట్ సమయంలో కొత్త పాలసీని విడుదల చేయడం అదృష్టంగా భావిస్తున్నట్లు మంత్రి తెలిపారు. సుమారు రెండున్నర గంటలకుపైగా జరిగిన ఈ సమావేశంలో సీఐఐ, ఫ్యాప్సీ, ఏపీ చాంబర్స్, ఫిక్కీ, డిక్కీలతోపాటు 11కుపైగా పారిశ్రామిక సంఘాలు, 75కు పైగా పారిశ్రామిక ప్రతినిధులు పాల్గొన్నారు. వీరిచ్చిన సూచనలు, సలహాలను నమోదు చేసుకున్నామని, వీటిని తప్పకుండా కొత్త పాలసీలో చేరుస్తామని మంత్రి హామీ ఇచ్చారు. పరిశ్రమల శాఖ ప్రత్యేక ప్రధాన కార్యదర్శి కరికల్ వలవన్, పరిశ్రమల శాఖ డైరెక్టర్, ఏపీఐఐసీ వీసీఎండీ జి. సృజన, చేనేత, టెక్స్‌టైల్స్ ముఖ్య కార్యదర్శి కె. సునీత, పరిశ్రమల శాఖ అడిషనల్ డైరెక్టర్ ఏపీ పాటిల్ తదితరులు పాల్గొన్నారు.

జాతీయ రహదారిపై లోకేశ్ సభ

- పోలీసులు అడ్డుకోవడంతో మిద్దెక్కి ప్రసంగం
- స్తంభించిన రాకపోకలు
- వాహనాలు సీజ్ చేసిన పోలీసులు
- టీడీపీ నేతల రాద్ధాంతం



బంగారుపాళెంలో మిద్దె పైకెక్కి ప్రసంగిస్తున్న లోకేశ్

బంగారుపాళెం(చిత్తూరు): పాదయాత్ర చేస్తున్న టీడీపీ ప్రధాన కార్యదర్శి నారా లోకేశ్ నిబంధనలను పట్టించుకోకుండా శుక్రవారం సాయంత్రం చిత్తూరు జిల్లా బంగారుపాళెం జాతీయ రహదారిపై సభ పెట్టారు. నడిరోడ్డుపై ప్రసంగించేందుకు పోలీసులు అనుమతించకపోవడంతో కొద్దిసేపు రాద్ధాంతం చేశారు. దాంతో లోకేశ్ పక్కనే ఉన్న టీడీపీ నాయకుని ఇంటి మిద్దె ఎక్కి ప్రసంగించారు. రాష్ట్రంలో రాక్షస పాలన సాగుతోందని, అభివృద్ధి లేదంటూ ఊగిపోయారు. ధరలు పెరిగి పోయాయని, యువతకు ఉపాధి లేదని అన్నారు. జగన్‌మోహన్‌రెడ్డి క్రిమినల్ అంటూ అనుచిత వ్యాఖ్యలు చేశారు. చిత్తూరు జిల్లాలో మంత్రి పెద్దిరెడ్డి రామచంద్రారెడ్డి క్రిమినల్ అని, ఆయనకి పూతలపట్టు ఎమ్మెల్యే ఎంఎస్ బాబు బినామీ అంటూ విమర్శించారు. లా అండ్ ఆర్డర్ పేరుతో పలమనేరు డీఎస్పీ సుధాకర్‌రెడ్డి తన పాదయాత్రను అడ్డుకుంటున్నాడన్నారు. లోకేశ్ సభతో జాతీయ రహదారిపై వాహనాలు నిలిచిపోయాయి. జాతీయ రహదారిపై వాహనాలు నిలిపి ప్రజలకు ఇబ్బంది కలిగించినందుకు టీడీపీ ప్రచార వాహనాలను డీఎస్పీ సుధాకర్‌రెడ్డి సీజ్ చేశారు. ఈ సందర్భంగా తమ కార్యకర్త గాయపడ్డారంటూ టీడీపీ నేతలు కొద్దిసేపు హడావుడి చేసి, వెళ్లిపోయారు. పాదయాత్రలో భాగంగా లోకేశ్ బంగారుపాళెం మండలం శేషాపురంలో మహిళలతో మాట్లాడారు. గంతూరుకు చెందిన టీడీపీ మహిళా కార్యకర్త పుష్ప మాత్రం 'మనలో మార్పు రావాలి. మన జగనన్న గెలవాలి. మనం ధైర్యంగా పోరాడాలి' అని గట్టిగా చెప్పడంతో అందరూ అవాక్కయ్యారు.

ఏపీ ఇన్ పార్లమెంట్

రాజ్యసభ

ప్రజా ఉద్యమంగా చిరుధాన్యాలకు ప్రోత్సాహం

వైఎస్సార్‌సీపీ ఎంపీ విజయసాయిరెడ్డి ప్రశ్నకు కేంద్రం సమాధానం



సాక్షి, న్యూఢిల్లీ: ఐక్యరాజ్యసమితి జనరల్ అసెంబ్లీ ఈ ఏడాదిని అంతర్జాతీయ చిరుధాన్యాల సంవత్సరంగా ప్రకటించినందున దీన్ని ఒక ప్రజా ఉద్యమంగా ముందుకు తీసుకెళ్లాలని ప్రభుత్వం నిర్ణయించుకున్నట్లు కేంద్ర వ్యవసాయశాఖ మంత్రి నరేంద్రసింగ్ తోమర్ చెప్పారు. రాజ్యసభలో శుక్రవారం వైఎస్సార్‌సీపీ ఎంపీ విజయసాయిరెడ్డి ప్రశ్నకు మంత్రి జవాబిచ్చారు. బలవర్థకమైన తృణధాన్యాలు దైనందిన ఆహారంలో భాగంగా మార్చేందుకు వాటితో కలిగే లాభాలు, ప్రయోజనాలు ప్రచారం చేయనున్నట్లు తెలిపారు. చిరుధాన్యాలు ఆరోగ్యానికి ఏ విధంగా మేలుచేస్తాయో వివరిస్తూ వాటి వినియోగం పెంచేలా బ్రాండింగ్ చేసేందుకు, ఎగుమతులను ప్రోత్సహించేందుకు ప్రభుత్వం అనేక చర్యలు తీసుకుంటున్నట్లు చెప్పారు. జాతీయ ఆహార భద్రత మిషన్‌లో చిరుధాన్యాలను కూడా భాగం చేసి 14 రాష్ట్రాల్లోని 212 జిల్లాల్లో ఈ కార్యక్రమాన్ని అమలు చేస్తున్నట్లు తెలిపారు. ఆంధ్రప్రదేశ్‌లో గత ఐదేళ్లలో 2,150.39 టన్నుల చిరుధాన్యాలను ఉత్పత్తి చేసినట్టు తెలిపారు. దేశవ్యాప్తంగా పలు రాష్ట్రాల్లో గత ఐదేళ్లలో 81,350.25 టన్నుల చిరుధాన్యాలు ఉత్పత్తి చేసినట్లు చెప్పారు. చిరుధాన్యాల ఉత్పత్తిని ప్రోత్సహించేందుకు జాతీయ ఆహార భద్రత మిషన్ కింద వ్యవసాయ, రైతు సంక్షేమశాఖ ఒక ఉపమిషన్‌ను అమలు చేస్తోందని చెప్పారు.

ఏపీలో స్టార్టప్స్‌కు రూ.11 కోట్లు

ఫండ్ ఆఫ్ ఫండ్స్ ఫర్ స్టార్టప్స్ పథకంలో భాగంగా ఆంధ్రప్రదేశ్‌లోని స్టార్టప్‌లకు రూ.11 కోట్లు విడుదల చేసినట్లు కేంద్ర వాణిజ్య, పరిశ్రమలు శాఖ సహాయమంత్రి సోంప్రకాశ్.. వైఎస్సార్‌సీపీ ఎంపీ వేమిరెడ్డి ప్రభాకర్‌రెడ్డి ప్రశ్నకు జవాబిచ్చారు.

లోక్‌సభ

ముందస్తు అధ్యయనం పూర్తయితేనే పీసీపీఐఆర్

సాక్షి, న్యూఢిల్లీ: విశాఖపట్నం–కాకినాడ ప్రాంతంలో ఏర్పాటు చేయాల్సిన పెట్రోలియం, కెమికల్స్, పెట్రోకెమికల్ ఇన్వెస్ట్‌మెంట్ రీజియన్ (పీసీపీఐఆర్)కు సంబంధించి హెచ్‌పీసీఎల్, గెయిల్ చేసిన ముందస్తు సాధ్యత అధ్యయనం పూర్తికాలేదని కేంద్ర రసాయనాలు, ఎరువులశాఖ సహాయమంత్రి భగవంత్ ఖుబా తెలిపారు. లోక్‌సభలో శుక్రవారం వైఎస్సార్‌సీపీ ఎంపీలు మార్గాని భరత్‌రామ్, బి.వి.సత్యవతి ప్రశ్నకు మంత్రి జవాబిచ్చారు. ముందస్తు అధ్యయనం పూర్తయితేనే ప్రాజెక్టు వేగవంతం అవుతుందని పేర్కొన్నారు.

ఏపీలో 143 పీఎంబీజేకేలు

ఆంధ్రప్రదేశ్‌లో 143 ప్రధానమంత్రి భారతీయ జన ఔషధి కేంద్రాలు (పీఎంబీజేకేలు) పనిచేస్తున్నాయని కేంద్ర ఎరువులు, రసాయనాలశాఖ సహాయమంత్రి భగవంత్ ఖుబా చెప్పారు. వైఎస్సార్‌సీపీ ఎంపీలు పోచ బ్రహ్మానందరెడ్డి, మాగుంట శ్రీనివాసులురెడ్డి, మద్దిళ్ల గురుమూర్తి ప్రశ్నలకు మంత్రి జవాబిచ్చారు. ఆకాంక్ష జిల్లాలైన విశాఖపట్నం, విజయనగరం, వైఎస్సార్ జిల్లాల్లో ఇవి పనిచేస్తున్నాయన్నారు. నంద్యాల మినహా ఏపీలోని అన్ని జిల్లాల నుంచి పీఎంబీజేకేల ఏర్పాటుకు దరఖాస్తులు ఆహ్వానించామని తెలిపారు.

ఈ-లోక్‌అదాలత్ ద్వారా 15,714 కేసులు పరిష్కారం

ఆంధ్రప్రదేశ్‌లో 2020లో ఈ–లోక్‌అదాలత్ ద్వారా 22,733 కేసులు చేపట్టి 15,714 కేసుల్ని పరిష్కరించినట్లు కేంద్ర న్యాయశాఖ మంత్రి కిరణ్ రిజిజు తెలిపారు. వైఎస్సార్‌సీపీ ఎంపీ మార్గాని భరత్‌రామ్ ప్రశ్నకు మంత్రి జవాబిస్తూ.. ఈ ఏడాది ఫిబ్రవరి 11, మే 13, సెప్టెంబర్ 9, డిసెంబర్ 9ల్లో నల్సా జాతీయ లోక్‌అదాలత్‌లు నిర్వహించనున్నట్లు వివరించారు.

ఏపీలో 11 వైద్య మొక్కల గుర్తింపు

ఆంధ్రప్రదేశ్‌లో బొటానికల్ సర్వే ఆఫ్ ఇండియా (బీఎస్ఐ) సర్వేలో 11 రకాల వైద్య మొక్కల్ని గుర్తించినట్లు ఆయుష్ మంత్రి సర్బానంద సోనోవాల్.. వైఎస్సార్‌సీపీ ఎంపీలు బి.వి.సత్యవతి, బెల్లాన చంద్రశేఖర్, గోరంట్ల మాధవ్, చింతా అనూరాధ, ఎం.వి.వి.సత్యనారాయణ ప్రశ్నకు జవాబిచ్చారు.

అంతర్రాష్ట్ర సైబర్ నేరగాడు అరెస్ట్

- ఆధార్, వేలిముద్రలతో అకౌంట్లలోని నగదు చోరీ
- దేశవ్యాప్తంగా నేరాలకు పాల్పడిన వైనం..



వివరాలు వెల్లడిస్తున్న ఎస్పీ కేకేఎన్ అన్బురాజన్

కడప అర్బన్: ఆధార్ ఆధారిత చెల్లింపుల వ్యవస్థ(ఏఈపీఎస్) ద్వారా దేశంలోని పలు రాష్ట్రాల్లో నేరాలకు పాల్పడుతున్న అంతర్రాష్ట్ర నేరగాడు శేషనాథ్ విశ్వకర్మను వైఎస్సార్ జిల్లా చిన్నచౌక్ పోలీసులు అరెస్ట్ చేశారు. ఈ నేరాలకు పాల్పడుతున్న ముఠాలోని మరో ఇద్దరిని త్వరలోనే పట్టుకుంటామని ఎస్పీ కేకేఎన్ అన్బురాజన్ శుక్రవారం మీడియాకు తెలిపారు. ఉత్తరప్రదేశ్ రాష్ట్రం గోరఖ్‌పూర్‌కు చెందిన విశ్వకర్మపై దేశవ్యాప్తంగా 128, తెలంగాణలో 107 కేసులు చొప్పున నమోదయ్యాయని చెప్పారు. నిందితుడి వద్ద నుంచి ఆధార్ నంబర్లు, ఫింగర్ ప్రింట్లు వున్న హార్డ్ డిస్క్‌తోపాటు స్కానర్, రెండు మొబైల్స్, ఫింగర్‌ప్రింట్ డివైస్, ఒక మానిటర్ స్వాధీనం చేసుకున్నట్లు తెలిపారు. దేశవ్యాప్తంగా ఇలాంటి నేరాలకు పాల్పడటం ద్వారా కోటి రూపాయలకుపైగా పలువురి అకౌంట్లలో నుంచి కొట్టేసినట్టు చెప్పారు. తన అకౌంట్ నుంచి తెలియకుండానే నగదు మాయమవుతుండటంపై కడప చిన్నచౌక్ పోలీస్‌స్టేషన్ పరిధిలో పక్కీర్‌పల్లికి చెందిన సానపురెడ్డి రాజశేఖర్‌రెడ్డి ఇచ్చిన ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి ప్రత్యేక బృందం విచారణ చేపట్టగా ఈ మొత్తం వ్యవహారం బహిర్గతమైందన్నారు. శేషనాథ్ విశ్వకర్మ, వికాస్, అక్షయ యాదవ్‌లు కలిసి హెచ్‌డీఎఫ్‌సీ బ్యాంకులో అకౌంట్లు ఓపెన్ చేసి తమ పేరుతో కస్టమర్ సర్వీస్ పాయింట్ అనుమతి పొంది తద్వారా మోసాలకు తెరలేపారని వివరించారు. ఇతర రాష్ట్రాలకు చెందిన వ్యక్తుల ఆధార్ సమాచారాన్ని దొంగచాటుగా సేకరించి వాటి ద్వారా వేలిముద్రలు తయారుచేసి మోసాలకు పాల్పడినట్లు తెలిపారు. ఇప్పటివరకు దేశవ్యాప్తంగా సుమారు 440 మంది వేలిముద్రలు సేకరించారని, తదుపరి వాటికి నకిలీ వేలిముద్రలు తయారుచేసి వారి బ్యాంకు ఖాతాల నుంచి రూ.కోటికిపైగా దొంగిలించినట్టు గుర్తించామని వివరించారు.

రాష్ట్రంలో 75 పులులు

శ్రీశైలం బయోడైవర్సిటీ రేంజర్ మహ్మద్ హయత్



మాట్లాడుతున్న శ్రీశైలం బయోడైవర్సిటీ రేంజర్ మహ్మద్ హయత్

సిద్దవటం: ఆంధ్రప్రదేశ్‌లో ప్రస్తుతం 75 పులులున్నాయని, పులుల గణనలో ఈ సంఖ్య పెరగవచ్చునని శ్రీశైలం బయోడైవర్సిటీ రేంజర్ మహ్మద్ హయత్ తెలిపారు. వైఎస్సార్ జిల్లా సిద్దవటం అటవీశాఖ కార్యాలయంలో శుక్రవారం సాయంత్రం భారత దేశం పులుల గణన ఫేస్–4 కెమెరాల ఏర్పాటుపై వైఎస్సార్, చిత్తూరు ఉమ్మడి జిల్లాల్లోని అటవీశాఖ సిబ్బందికి శిక్షణ నిర్వహించారు. రేంజర్ మహ్మద్ హయత్ మాట్లాడుతూ పోరుమామిళ్ల నుంచి తిరుమల వరకు టైగర్ కారిడార్ ఉందన్నారు. ఈ పరిధిలో పులుల గణన కోసం కెమెరాలను ఏర్పాటు చేయాల్సిన పాయింట్లను సిబ్బందికి తెలియజేశామన్నారు. ఈ నెల 20వ తేదీన కెమెరాలను అమర్చాలని తెలిపారు. ఎక్కువగా వేసవి కాలంలో నీరు నిల్వ ఉన్న ప్రదేశాల్లో కెమెరాలను ఏర్పాటు చేయాలన్నారు. మార్చి 11వ తేదీన కెమెరాలను తీసి అందులో ఉన్న చిప్‌లో నుంచి డేటాను కలెక్ట్ చేసుకోవాలని సూచించారు. మరలా కెమెరాలను అమర్చి తిరిగి మార్చి 31వ తేదీన కెమెరాలోని డేటాను మరోసారి తీసుకుని ఎన్ని పులులు ఉన్నాయనే విషయాన్ని తెలుసుకోవచ్చునన్నారు. సిద్దవటం రేంజర్ ప్రసాద్, ముద్దనూరు రేంజర్ దినేష్‌కుమార్‌రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

Published and printed by V. Murali on behalf of Jagati Publications Limited, Published from Vishnu Motor Plaza, 2nd Floor, 31-A, Jawaharlal Nehru Road, Ekkattuthangal, Chennai -600 032 and Printed Jagati Publications Limited, Survey No.172, Vegata Village, Jadigenalhalli, Hoskote Taluk,Bangaluru Rural Dist, MNS Printers Private Limited, Survey no. 76/1, Noombal Village, Velappanchavadi, Poonamallee High Road, Chennai - 600 077. Impression Printing & Packaging Limited, C-18-19-20, Sector -59, Noida, Uttar Pradesh-201 301, Dangat Media Pvt Ltd.,22 Dighe MIDC, Navi Mumbai, Maharashtra- 400708. Editor: V. Murali, (Responsible for selection of News under the PRB Act)
RNI No:TNTEL/2008/25943 Reproduction in whole or in part without written permission of the publisher is prohibited.